ఆంధ్రజ్యోతి

పేజీలు: 16+4+20 | వెల: రూ. 5.00 | సంపుటి: 58 | సంచిక: 288

శుక్రవారం | 2-2-2018

శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: విదియ మ. 12.54 తదుపరి తదియ; నక్షత్రం: మఖ మ. 12.59 తదుపరి పుబ్బ; వర్జ్యం: రా. 8.27-9.57; దుర్ముహూర్తం: ఉ. 9.07-9.52, మ. 12.52-1.37; అమృతఘడియలు: ఉ. 10.48-12.16, సా. 5.26-6.56; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.51; సూర్యాస్తమయం: 6.08 | విజయవాడ సిటీ

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai



అదృష్టం.. ఇంకా ఒక్క ఏడాదే!



"నాలుగేళ్లు గడిచిపోయాయి. మంచి ధరపై రైతులకు ఇప్పటికీ హామీ ఇస్తూనే ఉన్నారు. నాలుగేళ్లు గడిచిపోయాయి. తగిన బడ్జెట్ లేకుండా తళుకుబెళుకు పథకాలు ప్రకటిస్తున్నారు. నాలుగేళ్లు గడిచి పోయాయి. మన యువతకు ఉద్యోగాలు లేవు. అదృష్టం ఏంటంటే.. (మోదీ సర్కారు పదవీకాలం పూర్త వడానికి) ఇంకా ఒక సంవత్సరమే ఉంది.

\- కాంగ్రెస్ సారథి రాహుల్ గాంధీ

'ఆరోగ్యమస్తు' అని ప్రజలను ఆశీర్వదించారు! 'ఆహారమస్తు' అని రైతు మంత్రం జపించారు. 'అభివృద్ధి సిద్ధిరస్తు' అని అందరికీ శుభం పలికారు. 'పునఃఅధికార ప్రాప్తిరస్తు' అని అందరి చేతా ఆశీర్వాదం పొందాలని ప్రధాని నరేంద్ర మోదీ భావించారు. ఎన్నికలకు ముందు సంధించిన చివరి పూర్తిస్థాయి బడ్జెట్‌కు 'జనరంజకం' అనే పూత పూశారు. కానీ... తరచి చూస్తే ఎన్నో మాయలు! పైపైనే వరాలు! లోపల మాత్రం భారాలు! విభజన తర్వాత అష్టకష్టాలు పడుతున్న నవ్యాంధ్రకు మరింత అన్యాయం చేశారు. చేయూతనందించడం మరిచారు. విభజన హామీలను విస్మరించారు. ఈ వైఖరిపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా ఆగ్రహించారు. బీజేపీ వైఖరిపై ఏపీ జనం మండిపడుతున్నారు.

మోసం గురూ!

బడ్జెట్‌లో ఏపీకి మొండి చెయ్యి



పేదలు
- 10 కోట్ల పేద కుటుంబాలకు
- రూ. 5 లక్షల ఆరోగ్య బీమా

రైతులు
- రైతుకు ఒకటిన్నర రెట్ల మద్దతు
- మరో లక్ష కోట్ల పంట రుణాలు

ఉద్యోగులు
- మధ్యతరగతికి తీవ్ర నిరాశ
- నామమాత్రపు 'స్టాండర్డ్ డిడక్షన్'

మార్కెట్
- క్యాపిటల్ గెయిన్స్‌పై బాదుడు
- లాభం లక్ష దాటితే 10% పన్ను

- పెరగని ఆదాయ పన్ను మినహాయింపు.. స్లాబ్‌లలో మార్పు లేదు
- అదనంగా ఒక శాతం సెస్సు పెంపు.. కొత్తగా 'సంక్షేమ సెస్సు' వాత
- పెట్రో ధరలపై మాయా జాలం.. లీటరుకు రూ.8 ఎక్సైజ్ డ్యూటీ తగ్గింపు
- అంతే మొత్తం రోడ్డు సెస్ విధింపు.. పెట్రో ధరల్లో ఎలాంటి మార్పు లేదు
- బీటెక్ విద్యార్థులకు ప్రోత్సాహం.. ఐఐటీలు, ఐఐఎస్సీల్లో అడ్మిషన్లు, ఫెలోషిప్
- టీచర్ల శిక్షణకు ఇంటిగ్రేటెడ్ బీఈడీ.. గిరిజనులకు 'ఏకలవ్య' పాఠశాలలు
- ఏడాదిలో 4వేల కిలోమీటర్ల కొత్త ట్రాక్..600 ప్రధాన రైల్వేస్టేషన్ల అభివృద్ధి
- రైల్వే స్టేషన్లలో ఎస్కలేటర్లు.. దశల వారీగా అన్ని రైళ్లలో వైఫై, సీసీటీవీలు
- రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, గవర్నర్ల జీతాలు పెంపు.. ఎంపీలకు ఐదేళ్లకోసారి
- విమానాశ్రయాలు ఐదురెట్లు పెంపు.. క్రిప్టో కరెన్సీ లావాదేవీలు చెల్లవు

పెరిగేవి ఎక్కువ.. తగ్గేవి తక్కువ 9



- బైకులు, టీవీలు, మొబైల్స్, చెప్పులు బంగారం, వెండి ధరల పెరుగుదల
- రేట్లు తగ్గేవాటి జాబితాలో జీడిపప్పు

ఇంత అన్యాయమా?



- హామీలు మరిచారా?.. చిన్నరాష్ట్రమని చిన్న చూపా!
- వదిలి పెట్టే సమస్యే లేదు.. గరిష్ఠ స్థాయిలో ఒత్తిడి తెస్తాం!
- అయినా పట్టించుకోకుంటే ఒక దండం పెట్టి వచ్చేద్దాం
- చివరి బడ్జెట్‌లోనూ ఇంతేనా?.. ప్రజలకేం చెబుతాం?
- సీఎం తీవ్ర ఆగ్రహం.. మంత్రులు, అధికారులతో సమీక్ష

అమరావతి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): "విభజన చట్టంలో అనేక హామీలిచ్చారు. వాటిలో అనేకం ఇంకా పరిష్కారానికి నోచుకోలేదు. కానీ... వాటి గురించి బడ్జెట్‌లో ఒక్క మాటైనా ప్రస్తావించలేదు. రాష్ట్రానికి ఏమిటీ దురదృష్టం?" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్‌పై మంత్రులతో ఆయన సమావేశమయ్యారు. బడ్జెట్‌లో జరిగిన అన్యాయంపై తన బాధ, ఆవేదన, అసంతృప్తిని వ్యక్తం చేశారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం... "ఇప్పటికే అభివృద్ధి చెందిన అహ్మదాబాద్, ముంబై, బెంగుళూరు నగరాలకు నిర్దిష్ట కేటాయింపులు చేశారు. రాజధాని నగరం లేకుండా ఏర్పడిన నవ్యాంధ్ర గురించి పట్టించుకోలేదు. అమరావతికి 2

మిగతా 12వ పేజీలో...




టీడీపీ విమర్శలకు భయపడొద్దు

- రాష్ట్రానికి అన్నీ ఇస్తున్నాం కదా!
- పరిశీలనలోనే రైల్వేజోన్
- వారి ఆరోపణలకు బదులివ్వండి
- పార్టీ విస్తరణపై దృష్టి పెట్టండి
- పార్టీ నేతలకు షా ఆదేశం
- కలిసే ఉన్నాం: హరిబాబు

2

ఆర్భాటమే మహాభాగ్యం

- 2016-17 బడ్జెట్లోనే బీమాపై కేంద్రం ప్రకటన
- ఇప్పటికీ అమలు కాని వైనం
- తాజాగా మరో భారీ పథకం
- మద్దతు ధరలోనూ మతలబు



పేదలందరికీ ఆరోగ్య బీమా అంటూ 2016-17 బడ్జెట్‌లో చేసిన ప్రకటన

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): "పది కోట్ల పేద కుటుంబాలకు లబ్ధి కలిగించేలా అతి భారీ జాతీయ ఆరోగ్య బీమా పథకాన్ని ప్రారంభిస్తాం. ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.5 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పిస్తాం. దీనివల్ల సుమారు 50 కోట్ల మంది ప్రజలకు మేలు కలుగుతుంది" అని

మిగతా 13వ పేజీలో...

బీజేపీకి భారీ షాక్

- రాజస్థాన్ ఉప ఎన్నికల్లో పరాజయం.. 3 సిటింగ్ సీట్లలో ఓటమి
- 2 లోక్‌సభ, ఒక అసెంబ్లీ స్థానం కాంగ్రెస్‌కే

5

గ్రూప్-1 ఫలితాలు విడుదల

మార్చి 12 నుంచి ఇంటర్వ్యూలు 2



ముక్తి కంటే భక్తి గొప్పది



తల్లి దేవహూతి నిమిత్తంగా లోకానికి సాంఖ్యశాస్త్రం (తత్వ జ్ఞానం) బోధించడానికి.. దేవహూతి, కర్దమ దంపతులకు భగవానుడు 'కపిల' నామంతో పుత్రుడిగా అవతరించాడు. కపిలుడు ఆత్మధర్మాన్ని రక్షించడానికి ఆవిర్భవించిన జ్ఞానావతారం. షట్ దర్శనాల్లోని సాంఖ్య దర్శనం ప్రవచించిన కపిలుడు వేరు. ఆ కపిలుని సాంఖ్యం నిరీశ్వరం. కపిల భగవానుని సాంఖ్యం (శుద్ధ ఆత్మ తత్వ విజ్ఞానం) భక్తి ప్రధానం, భక్తివర్ధకం కూడా(ప్రోవాచ వై భక్తి వితాన యోగం). ఈ తత్వ విజ్ఞానాన్ని బోధించాలని తల్లి దేవహూతి శరణాగతి చెయ్యగా కపిలుడు.. 'అమ్మా, అంతిమంగా ముక్తినిచ్చేది అధ్యాత్మ యోగమే. కర్మోపాసనలు కావు. సంసారంలోని స్వజనులతో పెట్టుకునే మమత్వమే బంధనం. అట్టి ఆసక్తినే సుజనులందు (సాధుసంతులు) చూపితే మోక్ష ద్వారం తెరుచుకుంటుంది. దృశ్యాలన్నీ ప్రకృతి, దానికి పరమై వెలుగునిచ్చే చైతన్యస్వరూపుడే పురుషుడు. చైతన్యం స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలకు అతీతం. వాసనారహితం. అట్టి చైతన్య రూప ఆత్మను భక్తి, జ్ఞాన, వైరాగ్యాల ద్వారా దర్శించు. భక్తి జ్ఞాన వైరాగ్య జనని. భగవదర్పితమైన భక్తి మార్గమే ఉత్తమోత్తమం. సహజమూ నిష్కామమూ అయిన భగవత్సేవా రూప భక్తి ముక్తి కంటే గొప్పది. 'అనిమిత్తా భాగవత్ భక్తిః సిద్ధేర్గరీయసీ'.. ఫలాపేక్ష లేకపోవడమే భక్తి సుఖం. ఫలాకాంక్ష ఉంటే ప్రేమ లేదని అర్థం. ఉన్నా అది దేవుని యందు కాక తానాశించిన ఫలమందే ఉంది. భగవదారాధన ఆ ఫలప్రాప్తికి ఒక ద్వారం మాత్రమే. ఇది శుద్ధ భక్తి కాదు. నిష్కామ భక్తే భాగవత భక్తి. పరాభక్తి. మహాశక్తిమంతం. తిన్న అన్నాన్ని జఠరాగ్ని అప్రయత్నంగా జీర్ణింపజేసినట్లుగా ఈ భక్తి లింగ శరీరాన్ని, మనసును.. అనగా పుణ్యాపుణ్య కర్మవాసనా కోశమును భస్మంగావిస్తుంది. జననీ, నా ఏకాంత (అనన్య) భక్తులు సాయుజ్యముక్తిని కూడా తృణప్రాయంగా భావిస్తారు. అట్టివారికే నేను నా సుందర సురుచిర రూపాన్ని చూపుతాను. వారి మృత్యుభయాన్ని తొలగిస్తాను' అని బోధించాడు. అనంతరం అచిరకాలంలోనే దేవహూతి ఆత్మసాక్షాత్కారం పొంది జీవన్ముక్తురాలైంది. ఆ తల్లి మోక్షం పొందిన క్షేత్రమే 'సిద్ధపదం'గా.. 'మాతృగయ'గా ప్రసిద్ధిగాంచింది.

- తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ

Paramjyothi పరంజ్యోతి



ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
హైదరాబాద్	12.8	32.3
చిత్తూరు	13.0	33.0
విశాఖపట్నం	15.8	32.0
రాజమండ్రి	17.0	36.0
విజయవాడ	17.2	34.6

కొనసాగిన చలి

విశాఖపట్నం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో చలి కొనసాగింది. చలి గాలులతో రాత్రి సమయాల్లో ప్రజలు వణికారు. ప్రధానంగా ఖమ్మం, ఆదిలాబాద్‌లలో తీవ్రమైన చలిగాలులు వీచాయి. రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఐదు నుంచి తొమ్మిది డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. ఆదిలాబాద్‌లో ఆరు డిగ్రీలు నమోదైంది. కాగా రానున్న ఇరవై నాలుగు గంటల్లో తెలంగాణలో పలుచోట్ల చలి తీవ్రత కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. కోస్తా, రాయలసీమల్లో చలి కొనసాగినా రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం వుందని తెలిపింది. అయితే రాత్రి చలి నెలకొన్నా పగటిపూట ఎండ తీవ్రత పెరిగింది.

టీటీడీ చైర్మన్‌గా సుధాకర్ ఖరారు



▸ రెండు రోజుల్లో అధికారిక ప్రకటన

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) పాలక మండలి చైర్మన్ పదవికి కడప జిల్లాకు చెందిన టీడీపీ నేత పుట్టా సుధాకర్ యాదవ్ పేరు ఖరారైనట్లు టీడీపీ వర్గాలు గురువారం తెలిపాయి. పాలక మండలి మొత్తం వివరాలు ఒకటి రెండు రోజుల్లో అధికారికంగా ప్రకటించే అవకాశముంది. సుధాకర్ యాదవ్ విషయంలో ఆర్ఎస్ఎస్ నుంచి గతంలో కొంత అభ్యంతరం వ్యక్తమైంది. కానీ, తర్వాత ఉభయపక్షాల మధ్య చర్చలతో అభ్యంతరం పరిష్కారమైందని చెప్తున్నారు.

గ్రూప్-1 ఫలితాలు విడుదల

▸ మార్చి 12 నుంచి ఇంటర్వ్యూలు

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 సర్వీసెస్(నోటిఫికేషన్ నెం.36/2016)కు గతేడాది ఆగస్టులో నిర్వహించిన మెయిన్స్ ఫలితాలను ఏపీపీఎస్సీ గురువారం విడుదల చేసింది. 78 పోస్టులకు గాను 151 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు అర్హత సాధించారు. వీరికి మార్చి 12 నుంచి 23 వరకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. విజయవాడ (ఎంజీ రోడ్డు)లోని ఏపీపీఎస్సీ కార్యాలయంలో తొలి రోజు 16 మందికి, ఆ తర్వాత అన్ని పనిదినాల్లోనూ రోజుకు 15 మంది చొప్పున అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తారు. అర్హులైన అభ్యర్థులకు వ్యక్తిగతంగా మెమోలను త్వరలో పంపుతారు. సంబంధిత అభ్యర్థులు ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌ను గమనిస్తూ ఉండాలని కమిషన్ కార్యదర్శి సాయి సూచించారు.

▸ ట్రాన్స్‌కోలో 382పోస్టుల భర్తీ

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఏపీ ట్రాన్స్‌కోలోని వివిధ కేటగిరిల్లో 382 పోస్టుల భర్తీకి అనుమతి ఇస్తూ ఆర్థికశాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ఎలక్ట్రికల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ 1, ఎలక్ట్రికల్ డివిజనల్ ఇంజనీర్ 19, ఎలక్ట్రికల్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ 163, ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజనీర్ 171, సివిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ 1, సివిల్ ఈఈ 10, సివిల్ డీఈ 11, డిప్యూటీ సీసీఏ 1, ఎస్ఏవో 5 పోస్టులు ఉన్నాయి.

▸ 'దేవదాయ'గా పేరు మారుస్తూ ఉత్తర్వులు

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): దేవాదాయ ధర్మాదాయశాఖ పేరును మారుస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. శాఖ పేరులో ఆదాయం అనే అర్థం రాకుండా 'దేవదాయ ధర్మదాయ' శాఖగా మార్పులు చేసింది. ఈ మేరకు బోర్డులు, పరిపాలన వ్యవహారాల్లో పేరు మార్చాలని కమిషనర్‌ను ఆదేశించింది.

▸ ఉద్యోగులకు ఉచిత వసతి పొడిగింపు

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన నేపథ్యంలో హైదరాబాద్ నుంచి అమరావతికి వచ్చి పనిచేస్తున్న సచివాలయ, అసెంబ్లీ ఉద్యోగులు, శాఖాధిపతుల కార్యాలయాల ఉద్యోగుల ఉచిత వసతిని ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించింది. విజయవాడ, అమరావతి సమీపంలోని పలుచోట్ల 750 మందికి ఉచిత వసతి కల్పించారు. ఉద్యోగ సంఘాల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం తాజా ఉత్తర్వులు జారీచేసింది.

▸ ఎక్సైజ్‌లో బదిలీలు, పదోన్నతులు

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ సూపరింటెండెంట్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. కొందరు ఏఈఎస్‌లకు ఈఎస్‌లుగా పదోన్నతి కల్పించింది. ఏలూరు ఈఎస్‌గా వై.శ్రీనివాస చౌదరి, స్టేట్ టాస్క్‌ఫోర్స్ ఈఎస్‌గా కె.శ్రీనివాసచారి, కృష్ణాజిల్లా నిడమానూరు ఏపీబీసీఎల్ డిపో మేనేజర్‌గా ఎం.జయరాజు, కమిషనర్ కార్యాలయంలో అసిస్టెంట్ సెక్రటరీ(లేబుల్స్)గా వై.భీమ్‌రెడ్డి, స్టేట్ టాస్క్‌ఫోర్స్ ఈఎస్‌గా ఆర్.నాగేంద్రరావు, కడప ఈఎస్‌గా జి.మునుస్వామి, గుంటూరు ఏపీబీసీఎల్ డిపో మేనేజర్‌గా కె.శ్రీదేవి, చిత్తూరు ఈఎస్‌గా సీహెచ్.మధుమోహనరావు, నరసరావుపేట డిపో మేనేజర్‌గా కె.రాజ్యలక్ష్మి, అనకాపల్లి డిపో మేనేజర్‌గా ఎన్.వి.రమణలను నియమించింది.

▸ నేడు రాష్ట్ర కేబినెట్ సమావేశం

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గ సమావేశం సీఎం చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం జరగనుంది. రాష్ట్రంలో నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రపంచబ్యాంకు రుణం తీసుకోవడం నుంచి... డీజీపీ నియామకం ఆర్డినెన్స్ వరకూ పలు అంశాలపై రాష్ట్ర మంత్రివర్గం చర్చించనుంది.

జగన్ పాదయాత్రకు విరామం

▸ రేపు తిరిగి ప్రారంభం

పొదలకూరు(చేజర్ల), ఫిబ్రవరి 1: వైసీపీ రాష్ట్ర అధ్యక్షుడు జగన్... ప్రజా సంకల్పయాత్రకు గురువారం మధ్యాహ్నం నుంచి విరామం ప్రకటించారు. నెల్లూరు జిల్లాలో 77వ రోజు పొదలకూరు శివారు నుంచి ప్రారంభమైన యాత్ర సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్వగ్రామమైన తోడేరు, చాటగుట్ల, మరుపూరు మీదుగా సాగింది. మరుపూరు సమీపంలో యాత్రను ముగించారు. జగన్ శుక్రవారం హైదరాబాద్ సీబీఐ కోర్టుకు హాజరుకావాల్సి ఉన్నందున పాదయాత్రకు విరామం ప్రకటించారు. తిరిగి శనివారం మరుపూరు నుంచి యాత్రను కొనసాగిస్తారు.

▸ ఐఏఎస్ ఆదిత్యనాథ్ దాస్‌కు ఊరట

హైదరాబాద్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): సీనియర్ ఐఏఎస్ అధికారి ఆదిత్యనాథ్ దాస్‌కు హైకోర్టులో ఊరట లభించింది. జగన్ అక్రమాస్తుల కేసులో ఈడీ(సీబీఐ) ప్రత్యేక కోర్టులో ఆయనకు వ్యక్తిగత హాజరుకు మినహాయింపు నివ్వడంతోపాటు 4 వారాలపాటు అభియోగాల నమోదు ప్రక్రియను నిలిపివేయాలంటూ ఉత్తర్వులు జారీచేసింది.

▸ రబీలో ఒక్క సెంటూ ఎండకూడదు: సీఎం

రబీలో ఒక్క సెంటు భూమీ ఎండేందుకు వీల్లేదని, పగటి పూటే ఏడు గంటల పాటు నిరంతరాయంగా వ్యవసాయ విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలని ఇంధనశాఖ ఉన్నతాధికారులను సీఎం ఆదేశించారు. వేసవి వస్తున్నందున విద్యుత్ సరఫరా తీరును సమీక్షించుకోవాలని ఆ శాఖ ఉన్నతాధికారులకు గురువారం టెలికాన్ఫరెన్సులో సూచించారు. దీంతో, ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి అజయ్‌జైన్, ట్రాన్స్‌కో జేఎండీ పరుచూరి దినేశ్, సలహాదారు రంగనాథం, డిస్కమ్‌ల సీఎండీలు ఎం.ఎం.నాయక్, హెచ్‌వై దొర తదితరులు విద్యుత్ సౌధలో సమావేశమై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

▸ ఆక్వాఫీడ్‌లో పెట్టుబడులకు పిలుపు

ఆక్వా దాణా తయారీ రంగంలో పెట్టుబడులు పెట్టాలని ఆస్ట్రియన్ కంపెనీ 'ఆండ్రిచ్'ను ముఖ్యమంత్రి కోరారు. ఆండ్రిచ్ సేల్స్ డైరెక్టర్ రిచర్డ్ హికీ బృందం గురువారం సచివాలయంలో చంద్రబాబుతో భేటీ అయింది. ఈ సందర్భంగా సంస్థ కార్యకలాపాలను వివరించింది. రాష్ట్రంలో పశుదాణా, పునరుత్పాదక విద్యుత్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నామని హికీ చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులపై ఈ నెలలో జరిగే పారిశ్రామిక భాగస్వామ్య సదస్సులో ఒప్పందాలు చేసుకుందామని అన్నారు.

ఆరోగ్య ఆంధ్రే లక్ష్యం

అంధత్వ నివారణకు కృషి

▸ రాష్ట్రవ్యాప్తంగా 115 'సీఎం ఈ-ఐ కేంద్రాలు'

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ఆంధ్రప్రదేశే లక్ష్యమని, అందుకే ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తున్నామని సీఎం చంద్రబాబు చెప్పారు. 'ఆంధ్రప్రదేశ్‌లో 2006-07 లెక్కల ప్రకారం ఒక శాతం మంది కంటి చూపులేని వారు ఉన్నారు. 2020 నాటికి 0.3 శాతానికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ మేరకు దేశంలోనే తొలిసారిగా ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాలను ప్రారంభిస్తున్నాం' అని ప్రకటించారు. గురువారం సీఎం నివాసం వద్ద ఉన్న గ్రీవెన్స్ హాలులో 'ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాల'ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఎస్ఎన్‌సీయూ(శిశు సంరక్షణ) కేంద్రాలతో పాటు 'తల్లి సురక్ష యాప్'ను కూడా సీఎం ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో కంటి సమస్యలతో బాధపడే వారికి ఉచిత వైద్య పరీక్షలతో పాటు కళ్లజోడు కూడా ప్రభుత్వమే ఉచితంగా అందిస్తుందని ప్రకటించారు. రోగుల హెల్త్ రికార్డులు కూడా స్టోర్ చేస్తామన్నారు. ఇదే సమయంలో పాఠశాలలు, కళాశాల విద్యార్థులందరికీ కంటి పరీక్షలు నిర్వహించాలని ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు.

28 కేంద్రాలు.. 24 గంటలూ..

ఏజెన్సీ ప్రాంతాల్లో మాతా శిశుమరణాలు, పౌష్టికాహారలోపాల నివారణకు ఎస్ఎన్‌సీయూ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని సీఎం చెప్పారు. రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో 28 కేంద్రాలను ఏర్పాటు చేసి 24 గంటల పాటు చిన్నారులకు వైద్యసేవలు అందిస్తామని చెప్పారు. విద్య, వైద్యం గ్రామీణులకు అందుబాటులోకి రావాలనే ఉద్దేశంతో 12వేల మంది మెడికల్ విద్యార్థులను గ్రామాలకు పంపిస్తున్నామని వివరించారు. ఎస్ఎన్‌సీయూలకు నాలెడ్జ్ పార్టనర్‌గా యునిసెఫ్ ఉంటుందని, ఏజెన్సీ ప్రాంతాల్లో ఎంఎంఆర్, ఐఎంఆర్‌పై దృష్టి పెడుతుందని చెప్పారు. దీనికోసం ప్రత్యేకంగా తల్లి సురక్ష యాప్‌ను, డిజిటల్ లాకర్‌తో నాలెడ్జ్ కమాండ్ సెంటర్‌ను తీసుకువచ్చామన్నారు. రాష్ట్రంలో సాంకేతికత బాగా పెరిగిందని, భవిష్యత్తులో 15 ఎంబీపీఎస్ స్పీడ్‌తో నెట్‌ను అందిస్తామని సీఎం ప్రకటించారు. రోగులు ఇంటి వద్దే ఉండి ఆన్‌లైన్‌లో వీడియో కాల్ ద్వారా వైద్యులను సంప్రదించే అవకాశం ఉంటుందన్నారు. ఏపీని హెల్త్ హబ్‌గా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సీఎం చంద్రబాబు చెప్పారు.



ఉండవల్లిలోని తన నివాసం వద్ద ఈ-ఐ కేంద్రాన్ని ప్రారంభించి.. కంటి పరీక్ష చేయించుకుంటున్న సీఎం చంద్రబాబు

రోజూ సైకిల్ తొక్కండి

రాష్ట్రంలో ఆరోగ్యశాఖను పటిష్ఠం చేస్తూనే, ప్రజారోగ్యం కోసం మరో సూచన చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ప్రజలందరూ రోజూ కనీసం అరగంట సైకిల్ తొక్కాలని, కొంతసేపు వ్యాయామం చేయాలని సూచించారు. అందుకే క్రీడా సాంస్కృతిక కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు.

దురాశ వల్ల నష్టమే!

'రాష్ట్రంలో అందరూ ఆనందంగా ఉండాలి. ఎక్కువ ఆశ పెట్టుకున్న చాలా మంది జైలుకుపోయే పరిస్థితిని చూస్తున్నాం. ప్రతి శుక్రవారం కోర్టుకు వెళ్లాల్సి ఉంటుంది.. ఏ పనిచేసినా నీతీనిజాయతీలతో చేయాలి. పద్ధతి ప్రకారం సమర్థంగా పని చేస్తే ఏదైనా సాధించవచ్చు'.. అని సీఎం వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో ఆరోగ్యశాఖ శ్రీనివాస్, ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఓ స్మార్ట్‌సిటీని అభివృద్ధి చేస్తాం

రాష్ట్రంలో స్మార్ట్‌సిటీ అభివృద్ధి, ఇతర పెట్టుబడి అవకాశాలపై దక్షిణ కొరియా ప్రతినిధులు సీఎం చంద్రబాబుతో చర్చలు జరిపారు. అమరావతి నిర్మాణంలో పాలుపంచుకోవాలనుకుంటున్నామని చెప్పారు. కేవలం నిధుల ద్వారానే అలా చేయాలనుకోవడం లేదని, మౌలిక వసతుల కల్పనకు అవసరమైన సహాయాన్ని అందించడానికి వివిధ రంగాల్లో పేరొందిన పలు సంస్థలను రాష్ట్రానికి రప్పిద్దామనుకుంటున్నామని వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... అమరావతిలో 9 థీమ్‌సిటీలు, 27 టౌన్‌షిప్పులను నిర్మించనున్నామన్నారు. నిర్దిష్టమైన ప్రతిపాదనలతో వస్తే 15 రోజుల్లోపే అనుమతులను ఇస్తామని హామీ ఇచ్చారు.



ఆధ్యాత్మిక నగరిగా అమరావతి

▸ బ్రహ్మకుమారీస్ రిట్రీట్ సెంటర్‌కు సీఎం శంకుస్థాపన

గుంటూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిని ఆధ్యాత్మిక నగరిగా రూపుదిద్దుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ప్రజాపిత 'బ్రహ్మకుమారీస్ యూనివర్సల్ పీస్ రిట్రీట్ సెంటర్'కు గురువారం రాజధాని అమరావతి పరిధిలోని నెక్కల్లు గ్రామంలో ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సీఎం మాట్లాడుతూ ప్రపంచ శాంతికోసం పవిత్ర సందేశమిస్తూ, 147 దేశాల్లో 9వేల కేంద్రాల్లో సేవలందిస్తున్న బ్రహ్మకుమారీస్ సంస్థ ఉన్న ప్రతి ప్రాంతమూ ప్రశాంతంగా ఉంటుందని కొనియాడారు. అందుకే అమరావతి పరిధిలో ఈ సంస్థకు 10 ఎకరాలు మంజూరు చేశామన్నారు. అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు మాట్లాడుతూ సమాజానికి మంచి సందేశాన్నిస్తూ, శిక్షణ ఇస్తున్న బ్రహ్మకుమారీస్ సంస్థ ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయడం శుభసూచికమన్నారు. రాజయోగిని జానకీ దాదీజీ, మంత్రులు అయ్యన్నపాత్రుడు, పుల్లారావు, ఆనందబాబు, నారాయణ, ఎమ్మెల్యేలు, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


టీడీపీ విమర్శలకు భయపడొద్దు

▸ రాష్ట్రానికి అన్నీ ఇస్తున్నాం కదా!

▸ పార్టీ విస్తరణపై దృష్టి పెట్టండి

▸ బీజేపీ రాష్ట్ర నేతలకు అమిత్‌షా ఆదేశం

▸ టీడీపీతో కలిసే ఉన్నాం: హరిబాబు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కేంద్రంపై టీడీపీ చేస్తున్న విమర్శలకు భయపడాల్సిన పని లేదని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా స్పష్టం చేశారు. విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ఏర్పాటు ఇప్పటికీ కేంద్రం పరిశీలనలో ఉందన్నారు. నిపుణుల అభిప్రాయం దీనికి వ్యతిరేకంగా ఉన్నా కేంద్రం మాత్రం సానుకూలంగా పరిశీలిస్తోందని పార్టీ రాష్ట్ర నేతలకు తెలిపారు. ఏపీ బీజేపీ అధ్యక్షుడు హరిబాబు, శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్‌రాజు, పురందేశ్వరి, కన్నా లక్ష్మీనారాయణ తదితరులతో అమిత్‌షా ఢిల్లీలో గురువారం ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. అసెంబ్లీ సీట్ల పెంపు విషయం ఏం చేద్దామని అమిత్ షా ప్రశ్నించగా... 'మీరే తుది నిర్ణయం తీసుకోవాలి' అని నేతలు బదులిచ్చారు. కొద్ది రోజులుగా టీడీపీ అనుసరిస్తున్న వైఖరిని, బడ్జెట్ తర్వాత ఆ పార్టీ చేస్తున్న విమర్శల్ని బీజేపీ నేతలు పార్టీ చీఫ్‌కు వివరించారు. 'అదేమిటీ.. మనం రాష్ట్రానికి అడిగినవన్నీ ఇస్తున్నాము కదా!' అని షా అన్నారు. 'ఇలాంటి వ్యాఖ్యలకు మీరేమీ భయపడనక్కర్లేదు!' అని ఆయన చెప్పినట్లు పురందేశ్వరి వివరించారు. "బూత్ స్థాయి నుంచీ పార్టీని బలోపేతం చేయండి. కేంద్రంపై టీడీపీ చేస్తున్న విమర్శలకు జవాబివ్వండి. రాష్ట్రానికి మోదీ సర్కారు చేస్తున్న సహాయం గురించి ప్రజలకు వివరించండి" అని అమిత్‌షా సూచించినట్లు తెలిసింది. ఇక... రాజధాని నిర్మాణానికి వివరణాత్మక నివేదిక (డీపీఆర్) ఇవ్వనప్పటికీ ఏదో ఒక ఖాతాలో నిధులు ఇస్తున్నామని, ఏపీ నుంచి నివేదికలు రాకపోతే తామేమి చేయగలమని అమిత్‌షా అన్నట్లు రాష్ట్ర నాయకులు తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు మాట్లాడుతూ... సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయడంపైనే అధికంగా చర్చలు జరిగాయని తెలిపారు. పార్లమెంటరీ నియోజకవర్గాలను మూడు క్లస్టర్లుగా విభజించి వాటికి ఇన్‌చార్జిలను నియమించినట్లు తెలిపారు. ఉత్తరాంధ్రలో నియోజకవర్గాలకు మురళీధర్‌రావును, మధ్యాంధ్రలో ఉన్న నియోజకవర్గాలకు విద్యుత్ శాఖ మంత్రి ఆర్కే సింగ్‌ను, రాయలసీమలో నాలుగు నియోజకవర్గాలకు మహారాష్ట్ర మంత్రి వినోద్ తావ్డేను ఇప్పటికే బాధ్యులుగా నియమించగా, వారు ఆయా ప్రాంతాల్లో పర్యటించి బూత్‌స్థాయిలో పరిస్థితులను పార్టీ సారథికి తెలిపారన్నారు. గతంలో రాజమహేంద్రవరం, తాడేపల్లిగూడెంలో తాను పర్యటించానని ఈసారి రాయలసీమలో పర్యటిస్తానని అమిత్‌షా చెప్పినట్లు తెలిపారు. బూత్‌స్థాయిలో ఎక్కువ మంది కార్యకర్తలను తయారు చేసి పార్టీ ని విస్తరించాలని సూచించారన్నారు. బీజేపీ, టీడీపీ ఇప్పటికీ మిత్రపక్షాలుగా కలిసి పనిచేస్తున్నాయని, తాము కలిసే ఉన్నామని, తమ మధ్య ఎటువంటి ఇబ్బందులు లేవని హరిబాబు అన్నారు. ఏదైనా ఉన్నా పార్టీ పెద్దలు చర్చించి పరిష్కరించుకుంటారన్నారు. చిటపటలు ఒక్క నిమిషంలో పోతాయని ఆయన పేర్కొన్నారు.


వేగంగా ఆన్‌లైన్ బిల్డింగ్ పర్మిషన్లు

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థలు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఉడా)ల్లో ఆన్‌లైన్ బిల్డింగ్ పర్మిషన్ల ప్రక్రియ వేగం పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆ దరఖాస్తులను పరిశీలించి, పరిష్కరించే బాధ్యతలను ఏఏ అధికారులు చూడాలో నిర్దేశిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రక్రియలో కీలకమైన పోస్ట్ అప్రూవల్ కన్ఫర్మేషన్‌ను ఏ స్థాయి అధికారులు ఇవ్వాలో స్పష్టంగా పేర్కొంది. 100 చదరపు మీటర్ల వరకు ఉన్న స్థలాల్లో నిర్మించిన భవనాలకు టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, 100-200 చ.మీ. భవనాలకు(టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ హోదా కలిగిన) అసిస్టెంట్ సిటీ ప్లానర్, 200-300 చ.మీ.కు (టౌన్ ప్లానింగ్ డిప్యూటీ డైరెక్టర్ హోదా ఉన్న) డిప్యూటీ సిటీ ప్లానర్, 300-500 చ.మీ.కు (టౌన్ ప్లానింగ్ జాయింట్ డైరెక్టర్ హోదా కలిగిన) సిటీ ప్లానర్, 500-4000 చ.మీ.కు (హైరైజ్ బిల్డింగులు మినహా) (డీటీసీపీ హోదా కలిగిన) చీఫ్ సిటీ ప్లానర్ పోస్ట్ అప్రూవల్ నిర్ధారించాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ నిర్మాణాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లను కూడా ఆ అధికారులే ఇవ్వాలని స్పష్టం చేసింది. అనుమతి లేని నిర్మాణాలు, అనుమతి పొందిన ప్లాన్లకు విరుద్ధంగా జరిపిన కట్టడాలకు షోకాజ్ నోటీసులు, ప్రొవిజనల్ ఆర్డర్లను టీపీబీవో-జేపీవో, ఆపై స్థాయి అధికారులు ఇవ్వవచ్చునని పేర్కొంది. అనుమతి లేని నిర్మాణాల కూల్చివేత ఆదేశాలను ఏసీపీ, ఆ పై స్థాయి అధికారులు జారీ చేయవచ్చని తెలిపింది.

రూ. 65 లక్షలకు మెడికల్ సీటు

▸ తెలుగు రాష్ట్రాల్లో 21 మంది బాధితులు.. ఇద్దరి అరెస్ట్

గద్వాలక్రైం, ఫిబ్రవరి 1:మెడికల్ సీట్ల పేరుతో భారీమొత్తంలో డబ్బులు వసూలు చేస్తూ మోసాలకు పాల్పడుతున్న ఓ అంతర్‌రాష్ట్ర ముఠాకు చెందిన ఇద్దరు సభ్యులను గద్వాల పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముఠా బెంగళూరు, నందిగామ, హైదరాబాద్‌తోపాటు.. పలు ప్రాంతాల్లో మెడికల్ సీటు ఆశించిన విద్యార్థుల తల్లిదండ్రులను మోసగించినట్లు పోలీసులు గుర్తించారు. హైదరాబాద్ షాదాన్ వైద్య కళాశాల ఫ్యాకల్టీ డాక్టర్ లలిత, బండ్లగూడ ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ శిరీష్ కొహెకర్, బ్యాంకు భవన యజమాని రవూఫ్‌ఖాన్, ఖాలిద్, కడపకు చెందిన సీఎం ధర్మారెడ్డి, మల్లారెడ్డి, బెంగళూరుకు చెందిన రఫత్ మాలిక్, తమిళనాడుకు చెందిన సోదరులు సెల్వకుమార్, విజయ్‌కుమార్‌లు ఒక ముఠాగా ఏర్పడి.. మెడికల్ సీట్లు ఇప్పిస్తామంటూ మోసాలకు తెరలేపారు. రూ. 65 లక్షలకు సీటు ఇప్పిస్తామంటూ.. తొలుత తమ ఖాతాల్లో రూ. 5 లక్షలు, ఆపైన జమచేయాలని సూచిస్తారు. ఆ తర్వాత.. బాధితులకు సీటు గానీ, వారు చెల్లించిన డబ్బు కానీ తిరిగి రావు. గద్వాలకు చెందిన మహ్మద్‌పాషాను.. ఈ ముఠా ఇదే క్రమంలో మోసగించింది. లలిత, రవూఫ్‌ఖాన్‌లను గురువారం అరెస్టు చేశారు. ఈ ముఠా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన 21 మందిని మోసగించి, రూ. 3.89 కోట్లు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు.



శాస్త్రవేత్తల మాట రాజకీయనేతలు వినాలి

సైన్స్ ప్రాధాన్యం గురించి రాజకీయ నేతలకు అర్థమయ్యేలా చెప్పడమే నా జీవితాశయం. శాస్త్రవేత్తల సూచనలను తప్పకుండా వారు ఆలకించాలి. సైన్స్‌ను వ్యతిరేకించే ప్రజల మాటలను పట్టించుకోరాదు.

- నోబెల్ గ్రహీత, బ్రిటన్ శాస్త్రవేత్త రిచర్డ్



కాంగ్రెస్ కూటమిలో చేరేది లేదు

జాతీయ స్థాయిలో కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమిలో చేరే ప్రశ్నే లేదు. ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేయాలని ఇప్పటికే పార్టీ జాతీయ కార్యవర్గభేటీలో నిర్ణయించాం. ఏ కూటమితోనూ పొత్తు పెట్టుకోబోం.

- శివసేన అధికార ప్రతినిధి సంజయ్‌రౌత్

సర్వదర్శనానికి 4 గంటలు

తిరుమలలో గురువారం భక్తుల రద్దీ తక్కువగా ఉంది. దాదాపు 60వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సర్వదర్శనానికి సుమారు 4 గంటలు, దివ్యదర్శనానికి 2 గంటలు పడుతోంది. శనివారం సేవలకు సంబంధించి విజయాబ్యాంకులో శుక్రవారం లాటరీ ద్వారా జారీచేసే టికెట్లు సుప్రభాతం:50, కల్యాణోత్సవం:80, డోలోత్సవం:25. ఆన్‌లైన్‌లో రూ.300 టికెట్లు పొందడానికి w w లో సంప్రదించాలి.

- ఆంధ్రజ్యోతి, తిరుమల



రక్తపరీక్షతో ముందుగానే అల్జీమర్స్ గుర్తింపు

మెల్‌బోర్న్, ఫిబ్రవరి 1: అల్జీమర్స్‌ను ముందుగానే గుర్తించే రక్తపరీక్ష అందుబాటులోకి రానుంది. జపాన్, ఆస్ట్రేలియా శాస్త్రవేత్తలు ఈ దిశగా ఉమ్మడిగా చేసిన పరిశోధనలు సత్ఫలితాలు ఇస్తున్నాయని యూనివర్సిటీ ఆఫ్ మెల్‌బోర్న్ ప్రొఫెసరు కోలిన్ మాస్టర్స్ తెలిపారు. ఈ అడ్వాన్స్‌డ్ రక్తపరీక్ష ద్వారా అల్జీమర్స్ వచ్చే ప్రమాదం ఎంత ఉందో 90 శాతం వరకూ ముందుగానే తెలుసుకోవచ్చు. ఒకవేళ ఆ లక్షణాలు కనిపిస్తే వెంటనే చికిత్స ప్రారంభించి మెదడు పనితనాన్ని చురుగ్గా ఉంచుకునే అవకాశం కలుగుతుందని కోలిన్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ రక్తపరీక్ష పరిశోధనల్లో భాగంగానే చేస్తున్నారు. ప్రజలకు అందుబాటులోకి రావడానికి ఇంకాస్త సమయం పడుతుంది.

ఏపీలో.. వర్క్ ఫ్రమ్ హోం

- పైలట్ ప్రాజెక్టుకు 'ఫస్ట్ అమెరికన్' ఓకే
- ఏపీలో పనిచేసేందుకు సిద్ధం: జనరల్ క్యాటలిస్ట్
- రాష్ట్రంలో కూచిపూడి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్: లోకేశ్



సతీశ్ వేమనతో మంత్రి లోకేశ్

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఫైబర్‌గ్రిడ్ ప్రాజెక్టును ఉపయోగించుకుని కొన్ని గ్రామాల్లో 'వర్క్ ఫ్రమ్ హోమ్' పైలెట్ ప్రాజెక్టును అమలుచేసేందుకు 'ఫస్ట్ అమెరికన్' కంపెనీ సంసిద్ధత వ్యక్తం చేసింది. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ అమెరికా పర్యటన సందర్భంగా గురువారం శాన్‌ఫ్రాన్సిస్కోలో పర్యటించారు. పలు కంపెనీల సీఈవోలు, ప్రతినిధులతో భేటీ అయ్యారు. ఫస్ట్ అమెరికన్ కంపెనీ సీఈవో డెన్నిస్ జె గిల్మోర్, ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడు మార్క్‌తో సమావేశమయ్యారు. టైటిల్, బీమా సర్వీసులు, మోర్టగేజ్ హోమ్ వారంటీ సర్వీసులను ఈ కంపెనీ అందిస్తోంది. తమ రాష్ట్రంలో భూ రికార్డులన్నీ డిజిటలైజ్ చేస్తున్నామని, ట్యాంపరింగ్ చేసే అవకాశం లేకుండా ల్యాండ్ రికార్డులు అన్నీ బ్లాక్‌చైన్ టెక్నాలజీ వేదికపైకి తీసుకొస్తున్నామని లోకేశ్ వివరించారు. దీనివల్ల రైతులు తక్కువ సమయంలో టైటిల్ ఇన్సూరెన్స్, రుణాలు పొందే వీలు కలిగిందన్నారు. ఫైబర్‌గ్రిడ్ సేవల గురించి చెప్పారు. ఫస్ట్ అమెరికన్ కంపెనీ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ల్యాండ్ రికార్డులను డిజిటలైజ్ చేసే పైలెట్ ప్రాజెక్టును చేస్తోందని, దీనిలో మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. ఫైబర్‌గ్రిడ్‌ను ఉపయోగించుకుని గ్రామాల్లో యువతీ, యువకులు వారి ఇంటి నుంచే పని చేసుకునేలా ఒక మోడల్ పైలట్ ప్రాజెక్టు చేయాలని కోరారు. ఇందుకు ఆ కంపెనీ సీఈవో అంగీకరించారు. త్వరలోనే ఆంధ్రప్రదేశ్‌కు వస్తామని, అక్కడ జరుగుతున్న అభివృద్ధిని స్వయంగా చూస్తామన్నారు. కోవలెంట్ వెంచర్స్ సీఈవో రాం యలమంచిలి, జనరల్ క్యాటలిస్ట్ కంపెనీ ఎండీ హేమంత్ తనేజాతోనూ లోకేశ్ చర్చించారు. ఆయన విజ్ఞప్తి మేరకు ఏపీలో కలిసి పని చేసేందుకు వారు సుముఖత వ్యక్తం చేశారు. స్టాన్‌ఫోర్డ్ బిజినెస్ స్కూల్ డీన్ జొనాథన్ లెవిన్‌తోనూ లోకేశ్ భేటీ అయ్యారు. కాగా, లోకేశ్ సియాటెల్‌లో ఉన్నప్పుడు తానా అధ్యక్షుడు సతీశ్ వేమన కలిశారు. ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో తానా తరఫున తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తామని ఈ సందర్భంగా సతీశ్ చెప్పారు. సిలికాన్ ఆంధ్రా విశ్వవిద్యాలయం ప్రథమ వార్షికోత్సవంలో లోకేశ్ పాల్గొన్నారు. తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలను మర్చిపోతే గుర్తింపు, భవిష్యత్తు ఉండవన్నారు. అమెరికా వస్తే మన భాష, సంస్కృతి, సంప్రదాయాలను మర్చిపోయారని అనుకున్నాను, కానీ ఇక్కడ అన్నీ గుర్తుపెట్టుకుంటున్నారని, భారత్‌లోనే మర్చిపోతున్నారని లోకేశ్ వ్యాఖ్యానించారు. కూచిపూడి నృత్యాన్ని ప్రపంచస్థాయికి తీసుకెళ్లేందుకు ఆంధ్రప్రదేశ్‌లో కూచిపూడి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటుచేయాలనే ఆలోచన ఉందని, దీనికి సిలికాన్ ఆంధ్రా సహకరించాలని లోకేశ్ కోరారు.



కర్నూలులో హైకోర్టు కోసం స్థానిక న్యాయవాదులు చేస్తున్న రిలే దీక్షలు గురువారానికి 12వ రోజుకు చేరుకోగా సంఘీభావంగా విద్యార్థులు తరగతులను బహిష్కరించి భారీ ర్యాలీ నిర్వహించారు. - కర్నూలు(లీగల్)

వచ్చే వారంలో సమ్మె నోటీసు: అశోక్‌బాబు

అమలాపురం, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్‌జీవోలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ వచ్చే వారంలో ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇస్తున్నామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌బాబు తెలిపారు. రెండో దశ ఉద్యమంలో భాగంగా ఫిబ్రవరి 10న అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద నిరసన కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చామన్నారు. తూర్పుగోదావరి జిల్లా అమలాపురం అంబేద్కర్ కమ్యూనిటీ హాలులో గురువారం ఎన్‌జీవో సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. 11వ పీఆర్సీ కమిషన్ నియమించాలని, సీపీఎస్ విధానం రద్దుచేయాలని తదితర డిమాండ్లను పేర్కొన్నారు.

రైతులు, మహిళల ఆదాయ పెంపే లక్ష్యం

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రైతులు, డ్వాక్రా మహిళా సంఘాల సభ్యుల ఆదాయం పెంపుదలే ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) దినేశ్‌కుమార్ స్పష్టం చేశారు. వెలగపూడి సచివాలయంలో ఏపీ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఆధ్వర్యంలో అమలవుతున్న గ్రామీణ సమ్మిళిత అభివృద్ధి పథకం(ఏపీఆర్ఐజీపీ) అమలు తీరుతెన్నులపై ప్రపంచ బ్యాంకు ప్రతినిధులతో గురువారం ఆయన సమావేశమయ్యారు.

మార్చి 31లోగా ఈ-ఆఫీసులు: సీఎస్

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మార్చి 31లోగా ఈ-ఆఫీస్ (కాగిత రహిత) విధానం అమలుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం వెలగపూడి సచివాలయంలో ప్రభుత్వ ఐటీ సలహాదారు జె.సత్యనారాయణతో కలిసి ఈ-ఆఫీస్, ఆధార్ అనుసంధానిత బయోమెట్రిక్ హాజరు తదితర కార్యక్రమాల అమలుపై సమావేశమయ్యారు. ఇప్పటికే సచివాలయంతోపాటు రాష్ట్ర స్థాయి ప్రధాన కార్యాలయాలు, జిల్లా కార్యాలయాల్లో ఈ- ఆఫీస్, బయోమెట్రిక్ విధానం అమలవుతోందని చెప్పారు. ఐటీ సలహాదారు సత్యనారాయణ మాట్లాడుతూ.. ఈ ఆఫీస్, బయోమెట్రిక్ విధానంతో ప్రజలకు పారదర్శక సేవలతోపాటు, ప్రభుత్వ ఉద్యోగులపై పనిభారం తగ్గుతుందన్నారు. సాధారణ పరిపాలనశాఖ కార్యదర్శి ఎన్.శ్రీకాంత్ మాట్లాడుతూ.. 86 ప్రభుత్వ శాఖాధిపతుల ద్వారా మొత్తం 214 సేవలను ప్రజలకు అందిస్తున్నామన్నారు. ప్రతి శాఖకు కోడింగ్ ఇచ్చే ప్రక్రియను వారంలో పూర్తి చేస్తామన్నారు. రాష్ట్రంలోని 1.20 లక్షల కార్యాలయాలకు, ప్రతి ఉద్యోగికీ కోడ్ ఇస్తామన్నారు.

జేఎన్టీయూకే ప్రొఫెసర్ అరెస్టు

సర్పవరం జంక్షన్ (కాకినాడ), ఫిబ్రవరి 1: లైంగిక వేధింపుల కేసులో తూర్పు గోదావరి జిల్లా కాకినాడ జేఎన్టీయూ ప్రొఫెసర్ కె.బాబులును బుధవారం సాయంత్రం రాజమహేంద్రవరంలో అరెస్టు చేసినట్టు కాకినాడ ఎస్‌డీపీవో రవివర్మ తెలిపారు. స్పెషల్ మొబైల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా 15 రోజుల రిమాండ్ విధించినట్టు ఎస్‌డీపీవో తెలిపారు.

'ఇండిట్రేడ్'లో ఐదుగురికి నోటీసులు

సంతకవిటి, ఫిబ్రవరి 1: శ్రీకాకుళం జిల్లాలో అధికవడ్డీల ఆశ చూపి.. బోర్డు తిప్పేసిన 'ఇండిట్రేడ్' సంస్థ కేసు విచారణను సీఐడీ అధికారులు వేగవంతం చేశారు. ఐదుగురికి నోటీసులు జారీ చేసి ఈ నెల 3వ తేదీన విశాఖలోని సీఐడీ కార్యాలయానికి రావాలని సమాచారం పంపించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయం, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

రేఖా నం. సి1/19/2018 తేది: 31.01.2018

ఫారం నెం.VI (ఎ)

(2013వ సంవత్సరం 30వ చట్టము వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్-11 (1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 19, సబ్‌రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువ షెడ్యూలులో చూపబడిన పశ్చిమగోదావరి జిల్లా జీలుగుమిల్లి మండలం లంకాలపల్లి గ్రామం నందలి భూమి ప్రజాహిత కార్యాలకు అనగా చింతలపూడి ఎత్తిపోతలపథకం అనగా జల్లేరు రిజర్వాయర్ నిర్మాణ నిమిత్తం ముంపునకు గురి అయ్యే నిమిత్తం అవసరమైనట్లు స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం తూర్పు గోదావరి జిల్లా వారు భావించినందున, భూసేకరణ, నష్ట పరిహారం, పునరావాస, పునరుపాధి కల్పన చట్టము-2013 నందలి 11వ విభాగపు 1వ ఉప విభాగములోని నిబంధనలననుసరించి ఈ విషయం గురించి ఇందుకు సంబంధించిన యావన్మందికీ ఎరుక నిమిత్తము ఇందు మూలముగా నోటీసు జారీచేయబడినది.

పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, సంబంధించి పర్యావరణం ప్రభావం మదింపు (ఇఐఎ) క్లియరెన్స్ భారత ప్రభుత్వం వారి అటవీ మరియు పర్యావరణ మంత్రిత్వశాఖ వారి లేఖ నెం.జె-12011/74/2005-1ఎ1, తేది: 25-10-2005 ప్రకారం జారీ చేయబడినది.

ఈ ప్రాజెక్టు వలన పైన పేర్కొన్న గ్రామం ముంపునకు గురికాబడుటవలన అందలి 76 కుటుంబాలు నిర్వాసితులగుచున్నారు.

చట్టంలోని విభాగం 43(1) క్రింద ప్రాజెక్టు అధికారి, సంయుక్త కలెక్టరు, పశ్చిమగోదావరి జిల్లా వారిని బాధిత కుటుంబాలకు పునరావాస పునరుపాధి కల్పన కల్పించు నిమిత్తం కార్య నిర్వాహకునిగా నియమించుచు ప్రభుత్వ జి.ఓ.ఎం.ఎస్.నెం.1, ఇరిగేషన్-సి.ఎ.డి. (పిఐ ఆర్-ఆర్-ఎ-2) డిపార్టుమెంటు, తేది: 2-01-2015 నందు ప్రకటించబడినది.

స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు చట్టంలోని విభాగము 12 క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించేందుకు ప్రత్యేక కలెక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం/స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ) పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ యూనిట్-1 కొవ్వూరు వారికి, వారి సిబ్బందికి, పనివారికి ఇందుమూలంగా అధికారము ఇవ్వబడినది.

పై చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేదీ నుంచి ప్రత్యేక కలెక్టరు పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం / స్పెషల్ డిప్యూటీ కలెక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ యూనిట్-1 కొవ్వూరు వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని ఏ విధమైన అమ్మకం/కొనుగోలు క్రయ, విక్రయాలు లేదా ఏ విధమైన లావాదేవీలు జరపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలో సెక్షన్ 15 ననుసరించి భూసేకరణ పై ఏమైనా అభ్యంతరములు / ఆక్షేపణలు ఉన్న యెడల సంబంధించిన వ్యక్తి / వ్యక్తులు ఈ ప్రకటనలు ప్రచురించబడిన తేదీ నుండి 60 (అరువది) దినములలోగా ప్రత్యేక కలెక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం / స్పెషల్ డిప్యూటీ కలెక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ యూనిట్-1, కొవ్వూరు వారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

జిల్లా : ప.గో. మండలం : జీలుగుమిల్లి గ్రామం : లంకాలపల్లి

క్రమ సంఖ్య	సర్వే నెం/ స.డి. నెం	ప్లాట్ నెం	సంబంధిత ఆసామీ పేరు మరియు చిరునామా	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు మరియు కట్టడముల వివరాలు	
1	2	3	5	6ఎ	6బి	6సి	6డి	7	
1	1/3	1	మడకం దుర్గమ్మ భర్త వెంకటేశ్వరరావు	Road	Plot No.3	Road	Plot No.2	బొప్పాయి-1, కొబ్బరి-1, పనస-1	డాబా, బాత్ రూమ్-1, తాటాకు పెంక-1, కుళాయి-1
2	1/3	2	ముత్యం రామతులసి తండ్రి ముత్యాలరావు (లేటు)	Road	Plot No.4	Plot No.1	Vacant	నిద్ర గన్నేరు-1, టేకు-1, మామిడి-1	డాబా, బాత్ రూమ్-1, తాటాకు పెంక-1
3	1/3	3	తల్లే చిట్టెమ్మ భర్త దుర్గారావు	Plot No.1	Plot No.5	Road	Plot No.4	జామ-1, కొబ్బరి-1	డాబా, ఆర్.సి.పెంక-1, కుళాయి
4	1/3	4	తల్లే నాగరాజు తండ్రి దుర్గారావు	Plot No.2	Vacant	Plot No.3	Vacant	--	డాబా, ఆర్.సి.పెంక-1, బాత్‌రూమ్-1, కుళాయి-1
5	1/3	5	తల్లే ముత్యాలు తండ్రి స్వామి	Plot No.3	Plot No.6	Road	Vacant	బొప్పాయి-1, జామ-3, నేరేడు-1, నిమ్మ-3	డాబాపార్టు, ఆర్.సి.సి. పెంక-1, బాత్‌రూమ్-1
6	1/3	6	తాటి వెంకటేశ్వరరావు తండ్రి ముత్యాలు	Plot No.5	Plot No.9	Road	Vacant	--	డాబాపార్టు, ఆర్.సి.సి. పెంక-1, పాక-1
7	1/3	7	కురసా నాగమ్మ భర్త నాగేశ్వరరావు	Vacant	Plot No.8	Plot No.9	Vacant	సీతాఫలం-3, టేకుమొక్కలు-3, మామిడి-1, జామ-2	డాబా, ఆర్.సి.సి. పెంక-1, బాత్‌రూమ్-1
8	1/3	8	తాటి పోతురాజు తండ్రి ముత్యాలు	Plot No.7,9	Vacant	Road	Vacant	జామ-1, ఇరుగుడు చేవ-1	తాటాకు పాక
9	1/3	9	కాకా నాగేశ్వరరావు తండ్రి చిన వెంకయ్య	Plot No.6	Plot No.8	Road	Plot No.7	మామిడి-2, కొబ్బరి-1	డాబా, ఆర్.సి.సి పెంక-1, బాత్‌రూమ్-1, కుళాయి-1
10	1/3	10	కుంజా బాలాజీరావు తండ్రి బజారు	Road	Plot No.13	Plot No.11	Road	--	--
11	1/3	11	కురసా గంగరాజు తండ్రి అర్జున్	Road	Plot No.12	Road	Plot No.10	మామిడి-3, కొబ్బరి-1, సీతాఫలం-2, బొప్పాయి-2	ఆర్.సి.సి. పెంక-1, డాబా పార్టు
12	1/3	12	కురసా అర్జున్ తండ్రి గంగరాజు	Plot No.11	Plot No.13	Road	Plot No.10	--	ఆర్.సి.సి. పెంక-1, డాబా పార్టు
13	1/3	13	కుంజా సీత భర్త సత్తిబాబు	Plot No.10,12	Plot No.14	Road	Road	మామిడి-1, కొబ్బరి-2, సీతాఫలం-2, జామ-2	డాబా, తాటాకు పెంక-1, బాత్‌రూమ్-1
14	1/3	14	కుంజా కన్నమ్మ భర్త కన్నపరాజు	Plot No.13	Plot No.16	Road	Road	మామిడి-2, కొబ్బరి-1, చింత-1, నిమ్మ-2, బొప్పాయి-1, కరివేపాకు-1	తాటాకు పెంక-1, బాత్‌రూమ్-1, డాబా
15	1/3	15	తాటి గంగారత్నం భర్త రాజారావు	Plot No.14	Plot No.17	Road	Plot No.16	మామిడి-1, బొప్పాయి-1	డాబా, తాటాకు పెంక-1, బాత్‌రూమ్-1, కుళాయి-1
16	1/3	16	ఉయిక ముత్తమ్మ భర్త కన్నపరాజు	Plot No.14	Plot No.17	Plot No.15	Road	--	తాటాకుపాక
17	1/3	17	తాటి పాపారావు తండ్రి స్వామి	Plot No.15,16	Vacant	Road	Road	మామిడి-3, నిమ్మ-4, కొబ్బరి-3	డాబా, తాటాకుల పందిరి, బాత్‌రూమ్ పునాది-1
18	1/3	18	తాటి పాపారావు తండ్రి స్వామి	Plot No.25	Vacant	Plot No.26	Road	కొబ్బరి-1, దానిమ్మ-1, బాదాం-1	రేకుల ఇల్లు
19	1/3	19	బుద్దాల దుర్గారావు తండ్రి వెంకటేశ్వరరావు	Plot No.20	Plot No.25	Plot No.24	Road	--	తాటాకు పాక
20	1/3	20	కోరసా మాలతి భర్త ప్రసాద్	Plot No.21	Plot No.19	Plot No.24	Road	సీతాఫలం-2	డాబా, ఆర్.సి.సి. పెంక, బాత్‌రూమ్
21	1/3	21	కమ్యూనిటీ హాల్	Road	Plot No.20	Plot No.22	Road	--	ఆర్.సి.సి. డాబా
22	1/3	22	గుజ్జా మారయ్య తండ్రి వెంకయ్య	Road	Plot No.24	Plot No.23	Plot No.21	మామిడి-2, కుళాయి-1	డాబా, తాటాకు పెంక, బాత్‌రూమ్
23	1/3	23	కొరసా మహాలక్ష్మి భర్త అర్జున్	Road	Plot No.24	Road	Plot No.22	జామ-1, సీతాఫలం-1, మామిడి-1, బొప్పాయి-1, కుళాయి-1	డాబా, బాత్‌రూమ్
24	1/3	24	గీగా వెంకమ్మ భర్త దుర్గారావు	Plot No.22,23	Plot No.25	Road	Plot No.19,20	కొబ్బరి-2, మామిడి-1, కరివేపాకు-1, జామ-1, కుళాయి-1	డాబా, ఆర్.సి.సి. పెంక, బాత్‌రూమ్
25	1/3	25	కూరం గణేష్ తండ్రి సుబ్బారావు	Plot No.19,24	Plot No.18,26	Road	Road	కొబ్బరి-1, మామిడి-1, బొప్పాయి-2, దానిమ్మ-1	కుళాయి-1, డాబా పార్టు, రేకుల పెంక, బాత్‌రూమ్
26	1/3	26	కూరం దుర్గమ్మ భర్త బాబూరావు	Plot No.25	Plot No.27	Road	Plot No.18	--	--
27	1/3	27	కురసా పాపమ్మ భర్త నాగేశ్వరరావు	Plot No.26	Vacant	Road	Vacant	జామాయిల్-4	తాటాకుల ఇల్లు
28	1/3	28	కురసా ముత్తమ్మ భర్త సుబ్బారావు	Road	Plot No.29,30	Road	Road	కొబ్బరి-3, మామిడి-1, కుళాయి-1	డాబా, ఆర్.సి.సి.పెంక, బాత్‌రూమ్
29	1/3	29	పూనెం వీరమ్మ భర్త శ్రీనివాసరావు	Plot No.28	Plot No.31	Plot No.30	Road	కొబ్బరి-1	డాబా, ఆర్.సి.సి.పెంక, బాత్‌రూమ్
30	1/3	30	పూనెం వెంకమ్మ తండ్రి నాగులు	Plot No.28	Plot No.31	Road	Plot No.29	--	పాక, కుళాయి-1
31	1/3	31	మడకం మంగతాయారు భర్త పాపారావు	Plot No.29,30	Plot No.32,33	Road	Road	మామిడి-1, జామ-1, పనస-1, కొబ్బరి-1, సీతాఫలం-1, టేకు-1, కుళాయి-1, బొప్పాయి-1	డాబా, ఆర్.సిసి పెంక బాత్‌రూమ్
32	1/3	32	మడకం పోతమ్మ భర్త కన్నపరాజు	Plot No.31	Vacant	Road	Plot No.33	వేప-1, మామిడి-1, సీతాఫలం-1	బాత్‌రూమ్, పునాది ఇల్లు
33	1/3	33	గీగా కుమారి భర్త లక్ష్మణరావు	Plot No.31	Plot No.34	Plot No.32	Road	వేప మొక్కలు-4, కరివేపాకు-1, సీతాఫలం-1, జామ-1, రేగి-1	డాబా, బాత్‌రూమ్
34	1/3	34	కొరసా చిరంజీవి తండ్రి పెదదుర్గారావు	Plot No.33	Plot No.35	Vacant	Road	మామిడి-1, వేప-1, జామ-2	డాబాపార్టు, తాటాకు పెంక, కుళాయి-1
35	1/3	35	కొరసా బుల్లెమ్మ భర్త పెదదుర్గారావు	Plot No.34	Plot No.36	Vacant	Road	జామ-1, కొబ్బరి-1, సీతాఫలం-5	డాబాపార్టు, తాటాకు పెంక
36	1/3	36	పాయం వెంటమ్మ భర్త మల్లయ్య (లేటు)	Plot No.35	Vacant	Vacant	Road	--	తాటి ఆకుల ఇల్లు, పాక
37	1/3	37	కొరసా రజని భర్త మోహనరావు	Vacant	Vacant	Road	Vacant	జామ-1, కొబ్బరి-1, కరివేపాకు-1, వేప-1, బొప్పాయి-1, రేగి-1	డాబా, తాటాకు పెంక, బాత్‌రూమ్
38	1/3	38	కుంజ దుర్గారావు తండ్రి పాపారావు	Road	Plot No.40	Road	Plot No.39	కరివేపాకు-1, మామిడి-1, బొప్పాయి-1	డాబా పార్టు, తాటాకు పెంక
39	1/3	39	కుంజా చిన్నమ్మ భర్త పాపారావు	Road	Plot No.40	Plot No.38	Road	సపోటా-1, ములగ-1, కొబ్బరి-2	డాబా పార్టు, తాటాకు పెంక
40	1/3	40	దాట్ల సరస్వతి భర్త వెంకటస్వామి	Plot No.38,39	Plot No.41	Road	Road	జామాయిల్-7, సీతాఫలం-1, వేప-1, జామ-1, బొప్పాయి-1	డాబా పార్టు, తాటాకు పెంక, బాత్‌రూమ్
41	1/3	41	వాడే రామారావు	Plot No.40	Plot No.42	Road	Road	టేకు-3, వేప-1, మామిడి-2, సపోటా-1, కొబ్బరి-2, బత్తాయి-1, కరివేపాకు-1, సీతాఫలం-1	తాటి ఆకుల ఇల్లు, పాక, పునాది, బాత్‌రూమ్, కుళాయి-1
42	1/3	42	కొర్స వెంకటలక్ష్మి భర్త కామేశ్వరరావు	Plot No.41	Plot No.43,44	Road	Road	వేప-1, బొప్పాయి-2, సీతాఫలం-1, జామ-1, మామిడి-1, కరివేపాకు-1	డాబా, ఆర్. సిసి పెంక, బాత్‌రూమ్
43	1/3	43	కూరం సూరిబాబు తండ్రి బొజ్జయ్య	Plot No.42	Plot No.45	Plot No.44	Road	జామ-1, వేప-2, కొబ్బరి-1, నిమ్మ-1, సీతాఫలం-1, కరివేపాకు-1	డాబా, తాటాకు పెంక
44	1/3	44	కడిమి సత్యనారాయణ తండ్రి నారాయుడు	Plot No.42	Plot No.45	Road	Road	సీతాఫలం-4, కరివేపాకు-1, మామిడి-1	తాటి ఆకుల ఇల్లు, పాక
45	1/3	45	కూరం పోతమ్మ భర్త పోతురాజు	Plot No. 43,44	Vacant	Road	Road	వేప-1, నిమ్మ-2, జీడిమామిడి-1, మామిడి-2, బొప్పాయి-2, జామాయిల్-1, కొబ్బరి-4, కరివేపాకు-1, సపోటా-1	డాబా, తాటాకు పెంక, బాత్‌రూమ్
46	1/3	46	మండల ప్రజా పరిషత్ స్కూల్	Road	Vacant	Road	Road	టేకు-5, కొబ్బరి-3, సీమచింత-4	బిల్డింగ్, వంటగది (ఆర్ సిసి షెడ్), బాత్‌రూమ్, డాబా-2, కుళాయి-1
47	1/3	47	దాట్ల సీతమ్మ భర్త లక్ష్మణరావు	Vacant	Road	Vacant	Vacant	సపోటా-1, నిమ్మ-1, మామిడి-3, వేప-1	బిల్డింగ్, పెంకుటిల్లు
48	1/3	48	మడకం పోలమ్మదేవి భర్త దుర్గారావు	Vacant	Vacant	Vacant	Road	--	డాబా, తాటాకుపెంక
49	1/3	49	మడకం పాపారావు తండ్రి భీముడు, దాట్ల సూరిబాబు తండ్రి సుబ్బారావు	Vacant	Road	Plot No.60	Vacant	కొబ్బరి-1, టేకు-1	ఖాళీ
50	1/3	50	కూరం మంగరాజు తండ్రి చిన్నరాముడు	Plot No.51	Road	Plot No.52	Plot No.49	సీతాఫలం-1, గానుగ-1	ఆర్ సిసి ఇల్లు
51	1/3	51	గీగా గంగరాజు తండ్రి వెంకన్న	Vacant	Plot No.60	Plot No.52	Vacant	బొప్పాయి-1, నేరేడు-1, జామ-1, కొబ్బరి-1, మామిడి-1	పెంకుటిల్లు, పాక, బాత్‌రూమ్
52	1/3	52	గుజ్జ మంగ భర్త దుర్గారావు	Vacant	Road	Plot No.53, Vacant	Plot No.50, 51	మామిడి-1, కొబ్బరి-2, ఉసిరి-1, బత్తాయి-1	పాక, బాత్‌రూమ్, స్లాబ్ లేని డాబా
53	1/3	53	పైదా ఆదిలక్ష్మి భర్త కృష్ణ	Vacant	Road	Plot No.54	Plot No.52	జామ-1, నిమ్మ-1, బత్తాయి-1, కొబ్బరి-1, మామిడి-2	తాటి ఆకుల ఇల్లు, బాత్‌రూమ్
54	1/3	54	పైదా సుజాత భర్త వెంకటేశ్వరరావు	Vacant	Road	Plot No.55	Plot No.53	--	డాబా
55	1/3	55	కురసం శివసూర్యనారాయణ తండ్రి వెంకటేశ్వరరావు కురసం వెంకటదుర్గ తండ్రి వెంకటేశ్వరరావు	Vacant	Road	Vacant	Plot No.53	సీతాఫలం-1, జామ-1	పెంకుటిల్లు
56	1/3	56	అంగన్ వాడీ కేంద్రము	Road	Vacant	Road	Plot No.46	జామ-1, టేకు-3	డాబా, బాత్‌రూమ్, బోరింగ్-1
57	1/3	57	ప్రయాణికుల విశ్రాంతి భవనం	Vacant	Road	Road	Plot No.58	--	డాబా
58	1/3	58	కీరం దుర్గమ్మ తండ్రి వెంకయ్య	Vacant	Road	Plot No.57	Vacant	కొబ్బరి-2	ఖాళీ
59	1/3	59	కోర్సా మహాలక్ష్మి భర్త పెద్దరాయుడు	Vacant	Vacant	Vacant	Road	నేరేడు-1	డాబా, తాటాకు పెంక
60	1/3	60	మొడియం లక్ష్మీకాంతం భర్త ఆకాశరావు	Vacant	Vacant	Vacant	Road	ఉసిరి-1, కొబ్బరి-2, జామ-2, మామిడి-7, ఎర్రచందనం-6, పనస-1, సపోటా-1, బత్తాయి-1, నేరేడు-3	పెంకుటిల్లు, ఆర్ సిసి పెంక, వంట స్లాబ్, బాత్‌రూమ్
61	1/3	61	పంతుల గంగాభవాని భర్త శ్రీనివాసరావు	Vacant	Plot No.62	Vacant	Vacant	నేరేడు-1, జామ-2, కొబ్బరి-1, ఎర్రచందనం-3, మామిడి-1, బొప్పాయి-1, సీతాఫలం-1, నిమ్మ-1	పాక
62	1/3	62	పంతుల వీరయ్య తండ్రి వీరాస్వామి	Plot No.61	Plot No.63	Road	Vacant	నేరేడు-1, బొప్పాయి-3, మామిడి-2, వేప-1, కొబ్బరి-1	పెంకుటిల్లు పార్టు, ఆర్ సిసి పెంక, బాత్‌రూమ్
63	1/3	63	పంతం వీరాస్వామి తండ్రి వీరయ్య	Plot No.62	Plot No.64	Road	Vacant	టేకు-1, సీతాఫలం-1, మామిడి-1	పెంకుటిల్లు పార్టు, ఆర్ సిసి పెంక
64	1/3	64	పంతుల సుబ్బలక్ష్మి భర్త శివకృష్ణ	Plot No.63	Plot No.65	Road	Vacant	నిమ్మ-1, దానిమ్మ-1, మామిడి-1	తాటి ఆకుల ఇల్లు
65	1/3	65	కూరం ముత్యాలు తండ్రి బాబ్జి	Plot No.64	Vacant	Road	Vacant	మామిడి-1, కొబ్బరి-1, కరివేపాకు-3, మునగ-1, వేప-1, జామ-2, బొప్పాయి-2	డాబా, ఆర్.సిసి పెంక
66	1/3	66	దాట్ల జోగప్ప తండ్రి పెదగప్ప	Road	Plot No.69	Vacant	Plot No.67	కొబ్బరి-1	డాబా, తాటాకు పెంక, బాత్‌రూమ్
67	1/3	67	దాట్ల భూదేవి భర్త వెంకటరావు	Road	Vacant	Plot No.66	Plot No.68	మామిడి-1	డాబా, తాటాకు పెంక, బాత్‌రూమ్
68	1/3	68	దాట్ల మంగ భర్త దుర్గారావు	Road	Vacant	Plot No.67	Vacant	జీడిమామిడి-1	డాబా, తాటాకు పెంక, బాత్‌రూమ్
69	1/3	69	దాట్ల గంగరాజు తండ్రి జోగప్ప	Plot No.66	Vacant	Vacant	Vacant	మామిడి మొక్క-1, వేపమొక్క-1, జామాయిల్-1	డాబా, తాటాకు పాక, పాక, బాత్‌రూమ్
70	1/3	70	కోర్స నాగమ్మ భర్త చిన్న దుర్గారావు	Vacant	Vacant	Vacant	Road	నిమ్మ-1, జామ-1, కొబ్బరి మొక్క-1	డాబా, పాక, బాత్‌రూమ్
71	1/3	71	కోర్స పాపారావు తండ్రి పోతన్న	Vacant	Vacant	Lane	Road	సీతాఫలం-3, జామ-1	డాబా, తాటాకు పెంక, కుళాయి-1
72	1/3	72	కోర్స పెంటయ్య తండ్రి పోతప్ప	Vacant	Vacant	Road	Vacant	కుళాయి-1, జీడిమామిడి-1, కొబ్బరి-1, జామ-4, తాడి-4	డాబా, తాటాకు పెంక
73	1/3	73	దాట్ల వెంకటేశ్వరరావు తండ్రి జోగప్ప	Vacant	Road	Vacant	Vacant	కొబ్బరి-1, తాడి-2	తాటాకు పెంక, బాత్‌రూమ్, డాబా
74	1/3	74	రామాలయం	Vacant	Vacant	Vacant	Vacant	--	ఆర్ సిసి
75	1/3	75	మంచినీళ్ళ ట్యాంక్	Vacant	Vacant	Vacant	Vacant	--	ఆర్ సిసి
76	1/3	76	మంచినీళ్ళ ట్యాంక్	Vacant	Vacant	Vacant	Vacant	--	ఆర్ సిసి

సం/- సి.హెచ్.భాను ప్రసాద్, స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూ.గో.జిల్లా

ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్

4వ అంతస్తు, D.No.40-15-9/13, నందమూరి రోడ్, బృందావన్ కాలనీ, లబ్బీపేట, విజయవాడ-10, ఫోన్: 2477762

రాష్ట్ర ఆర్థిక సంస్థల చట్టం, 1951లోని సెక్షన్ 29 క్రింద సంక్రమించిన అధికారాలను పూర్తిగా వినియోగించుకొని **'ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా'** ప్రాతిపదికపై దిగువ రుణం చెల్లించని సంబంధిత పరిశ్రమలకు చెందిన **ఆస్తుల అమ్మకం** సీల్డు టెండరు-సహిత-బిడ్ల కొరకు ఆహ్వానం.

క్ర. సం.	యాక్టివిటీ లైన్	సంబంధిత పరిశ్రమ పేరు & ప్రదేశం	విక్రయానికి ఆఫరు చేసిన ఆస్తి (L=భూమి, B=భవనాలు: P=ప్లాంట్ & M=మెషినరీ)	బయానా (రూ.లక్షలలో) a) మొత్తం ఆస్తులు b) మెషినరీ మాత్రమే
1	NPK గ్రాన్యులేటెడ్ ఫెర్టిలైజర్ మిక్సర్	M/s. శ్రీ సాయి సాగర్ ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, సర్వే నం.లు 15/1 & 2 లింగాల (గ్రా) వాత్సవాయి (మం), కృష్ణా జిల్లా.	ఫ్యాక్టరీ భూమి=ఎ.5.50 సెంట్లు PEB షెడ్ బిల్డింగ్స్ & ఇతర సివిల్ పనులు P&M : NPK మిక్సర్ ప్లాంట్.	a) 5.00 b) 5.00
2	NPK గ్రాన్యులేటెడ్ ఫెర్టిలైజర్ మిక్సర్	M/s. శ్రీ ప్రసన్నాంజనేయ రైతు మిత్ర ఫెర్టిలైజర్స్ & కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్. R.S. No.46/1B, దాములూరు (గ్రా) నందిగామ (మం), కృష్ణా జిల్లా	ఫ్యాక్టరీ భూమి=ఎ.5.00 సెంట్లు బిల్డింగ్స్ & ఇతర సివిల్ పనులు మెషినరీ అనగా మోటార్లు, డస్ట్‌బిన్ కలెక్టర్లు, ఎలివేటర్ భాగాలు వగైరా.	a) 5.00 b) 2.50

నియమ నిబంధనలు :

1) టెండరు ఫారాన్ని DD/రూ.300/-ల నగదు చెల్లింపుపై HO/శాఖ నుండి పొందవచ్చును. 2) పూర్తి చేసిన సీల్డు టెండరు ఫారాలను దిగువ సంతకందారుకు దాఖలు చేయవలెను. 3) a) మొత్తం ఆస్తులు b) మెషినరీ అవసరమైన బయానాను విజయవాడ వద్ద చెల్లింపయ్యేలా "APSFC" పేర తీసిన DD/పే ఆర్డర్ రూపంలో చెల్లించాలి. 4) ఈ ప్రకటన ఈ రోజు నుండి 90 రోజులు చెల్లుబాటులో ఉంటుంది. 5) **19.02.2018** నుండి ప్రారంభమయ్యే ప్రతి **సోమవారం** బిడ్డింగ్/నెగోషియేషన్స్ కొరకు టెండర్లు కోరబడుచున్నవి. 6) ఇంప్రూవ్డ్ ఆఫర్లు కోరిన 7 రోజులకు నోటీసు బోర్డులో సముచిత ఆఫర్లు ఉంచబడును. 7) ఈ 7 రోజుల కాలంలో టెండరులో వారు కోట్ చేసిన ఆఫరులో 15% అదనపు డిపాజిట్ మరియు అవసరమైన బయానాతో సీల్డు టెండరును కొత్త టెండరుదార్లు దాఖలు చేయవచ్చును. 8) తదుపరి బిడ్డింగ్/నెగోషియేషన్లు కొత్త టెండరుదార్లు/ప్రస్తుత టెండరుదారు మధ్య నిర్వహించబడును. 9) తక్కువ ఆఫర్లు తిరస్కరించబడును మరియు బయానా వాపసు ఇవ్వబడును. 10) ఒకసారి కృతార్థుడైన టెండరుదారు పేర కార్పొరేషన్‌చే అమ్మకం నిర్ధారించబడినచో, బయానా వాపసు ఇవ్వబడదు. 11) టెండరు ఫారంకు జతచేసిన అన్ని ఇతర నియమ నిబంధనలకు కట్టుబడి ఉండవలెను మరియు పాటించవలెను. 12) ఏ కారణాలు తమ సొంత విచక్షణ మేరకు చూపకనే టెండర్లు/బిడ్లు అంగీకరించు/తిరస్కరించు లేదా నియమ నిబంధనలను మార్చు హక్కును సంస్థ కలిగి ఉంది.

స్టేషన్ : విజయవాడ
తేది : 31.01.2018

అసిస్టెంట్ జనరల్ మేనేజర్

BHARAT SANCHAR NIGAM LIMITED
(A GOVERNMENT OF INDIA ENTERPRISES)
OFFICE OF THE GENERAL MANAGER, TELECOM, NELLORE
NOTICE INVITING TENDER
For UG Cable, OFC Works & Transportation of stores in Nellore SSA our Website:www.ap.bsnl.co.in.& https://apbsnl.etenders.in/
Last date :07-02-2018, 12-02-2018 &13-02-2018

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, ఆంధ్రప్రదేశ్, గుంటూరు

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, ఆంధ్రప్రదేశ్, గుంటూరు ప్రధాన కార్యాలయ అవసరార్థం (1) EPF మరియు ESI లను ప్రభుత్వము వారికి చెల్లించుటకు కమీషన్ ప్రాతిపదికన ప్రముఖ సంస్థల నుండి (2) CC Camera, Desk Top, Printer ల కొనుగోలు (3) diary, బుక్కులను ప్రింటింగ్ చేయుటకు E-Procurement/ Sealed Tender లను కోరబడుతున్నవి. వివరాలను www.apmepma.gov.in ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.

తేది: 02.02.2018 సం/- మిషన్ డైరెక్టర్

DIPR RO No. 597PP/CL/Advt/1/1/2017-18, Dt: 01.02.2018

ANDHRA UNIVERSITY
VISAKHAPATNAM

No. E-VII(Supdt.) 85th Covocation / 2018 Dt. 29.01.2018

CONVOCATION NOTIFICATION

The 85th Convocation of Andhra University will be held in March, 2018. Candidates who have passed UG and PG Degree/Diplomas during the academic year 2015-16 and also the candidates, who have been awarded Ph.D./M.Phil Degrees upto 24.02.2018 can apply on or before 28-02-2018. For further details, visit : AU Website : www.andhrauniversity.edu.in or www.aucoe.info

V.UMA MAHESWARA RAO,
REGISTRAR

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గ్రామీణ నీటి సరఫరా & పారిశుద్ధ్య శాఖ

ap ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన

No. 253 నుండి 264/2017-18 **తేది: 30-01-2018**

పనిపేరు : National Rurban Mission-CGF Grant క్రింద వెంకటాచలం మండలంలో 12 నివాస స్థలాలలో 100% హౌస్‌హోల్డ్ సర్వీస్ కనెక్షన్‌తో త్రాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయుట (12 పనులు). **అంచనా విలువ : 12 పనులకు రూ. 522.00 లక్షలు.** టెండర్ డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ ప్రారంభ తేదీ : 7-2-2018. బిడ్ల అప్‌లోడింగ్ కొరకు చివరి తేదీ: 22-02-2018. ఆర్థిక బిడ్ తెరుచు తేదీ : 23-02-2018. తదుపరి వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ www.apeprocurement.gov.in లో చూడవచ్చును.

సం/-సూపరింటెండింగ్ ఇంజనీర్, RWS & S సర్కిల్, SPSR నెల్లూరు

DIPR RO No. 3239/CL/Advt/1/1/2017-18. Dt. 01-02-2018

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
రహదారులు మరియు భవనముల శాఖ

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

నిట్ నం. 32/టి.ఓ/2017-18 **తేది: 30.01.2018**

కృష్ణా జిల్లాలోని (ర.భ) శాఖ విజయవాడ డివిజన్‌లో 5 రోడ్లకు రోడ్డు భద్రతా చర్యలు ఏర్పాటు గురించి మరియు అత్యవసర మరమ్మత్తులు చేయుటకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. 5 పనులకు **అంచనా విలువ:** రూ. 214.00 లక్షలు. **టెండర్లు స్వీకరించు తేదీలు:** 03.02.2018 నుండి 17.02.2018 మ॥ 3గం. వరకు. **బిడ్ సబ్మిషన్ క్లోసింగ్ తేదీ:** 17.02.2018 మ॥3.30గం.లకు. **బిడ్ తెరుచు తేదీ:** 17.02.2018 సా॥ 4గం.లకు. వివరములకు ఇ-మార్కెట్ ప్లేస్ www.apeprocurement.gov.in నందు చూడవచ్చును.

సం/- పర్యవేక్షక ఇంజనీరు (ర.భ) సర్కిల్, విజయవాడ

DIPR Ro. No. 3256/CL/ADVT/1/1/2017-18 Dt: 01.02.2018

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రనీటి పారుదల అభివృద్ధి సంస్థ

29-36-37, 3వ అంతస్తు, [illegible], విజయవాడ-520 002.

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్టు టెండరు నోటీసు నెం. 44/2017-18 తేది: 01-02-2018

పని పేరు : కృష్ణా జిల్లాలో కలిదిండి మండలంలోని ఉప్పుటేరు డ్రెయిన్ కుడి గట్టుపై కొండంగి-1 ఎత్తిపోతల పథకం మరియు కొండంగి-2 ఎత్తిపోతల పథకంలను టర్న్‌కీ ప్రాతిపదికపై నిర్మించి, కమీషన్ చేసి రెండు సంవత్సరములపాటు నిర్వహించుట. కాంట్రాక్టు అంచనా విలువ : రూ. 687.64 లక్షలు

ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ నుండి టెండరు షెడ్యూల్ తీసుకోవలసిన తేదీ	:	01-02-2018 సా॥ 6.00 గంటల నుండి 09-02-2018 మ॥ 3.00 గంటల వరకు
ఆన్‌లైన్ ద్వారా టెండరు స్వీకరించు చివరి తేదీ	:	09-02-2018 మ॥ 3.30 గంటల వరకు
టెండర్లు ఆహ్వానిస్తున్న అధికారి	:	జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్
సంప్రదించవలసిన ఫోన్ నెంబరు	:	0866-2434597

మిగిలిన వివరములు కొరకు www.apeprocurement.gov.in నందు లేదా జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, APSIDC. విజయవాడ వారి ఆఫీస్ నందు సంప్రదించగలరు. సం/- జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
అటవీ శాఖ

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన నం.4 నుండి 7/2017-18

RC.No.5152/2016/-TO తేది: 27.01.2018

పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరులోని పాపికొండ కమ్యూనిటీ బేస్డ్ ఎకో-టూరిజం సెంటర్‌లో ఎకో-ఫ్రెండ్లీ మిగతా 9 పనుల కొరకు అర్హతగల టెండరుదారుల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ఫ్లాట్‌ఫాం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. **అంచనా విలువ: 9 పనులకు రూ.130.00 లక్షలు.** టెండరు డాక్యుమెంట్లు డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 29.01.2018న మ.01.00 గం.నుండి. టెండర్ డాక్యుమెంట్ల డౌన్‌లోడ్ ముగింపు తేది: 08.02.2018న ఉ.11.15 గం.లోగా. టెక్నికల్ బిడ్: 08.02.2018న ఉ.11.45 గం.నుండి. ధర బిడ్ 08.02.2018న సా.04.00గం.నుండి. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ **www.apeprocurement.gov.in** వద్ద చూడవచ్చును. ఫోన్ నం.08812-230328

సం/- డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్, ఏలూరు డివిజన్, ఏలూరు

DIPR.Ro.No.3236/CL/ADVT/1/1/2017-18, Dt.01.02.2018

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుద్ధ్య శాఖ

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

TN. నం.18 నుండి 67/2017-18 **తేది:31.01.2018**

రూ.194.00 కోట్ల అంచనా వ్యయంతో సురక్షితమైన త్రాగునీరు సరఫరా చేయుటకు ఆం.ప్ర.లోని వివిధ జిల్లాలలో NTR సుజల క్లస్టర్ బేస్డ్ RO ప్లాంట్ల (Hub మరియు Spoke) ఏర్పాటుకు ఇ-ప్రొక్యూర్‌మెంట్‌లో ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. ఇ-మార్కెట్‌ప్లేస్ నుండి కాంట్రాక్టర్లు టెండరు షెడ్యూలును 09.02.18 నుండి 24.02.18న మ.3.00 గం. నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. టెండర్ల స్వీకరణకు ఆఖరి తేది:24.02.2018న లేదా ఆలోగా సా.4.00 గం. వరకు. సంబంధిత అధికారి: సూపరింటెండింగ్ ఇంజనీర్, RWS & S శాఖ, తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ http://www.apeprocurement.gov.in నుండి పొందవచ్చును.

సం/- చీఫ్ ఇంజనీర్-4, RWS & S శాఖ, ఆం.ప్ర. గొల్లపూడి, విజయవాడ

DIPR RO No. 3258/CL/ADVT/1/1/2017-18, తేది:01.02.2018

హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్

ఏవియానిక్స్ డివిజన్, హైదరాబాద్ - 500 042
ఫోన్: 040-23878281 ఎక్స్‌టెన్షన్: 4481/4453 ఫ్యాక్స్: 040-23878187, వెబ్‌సైట్: www.hal-india.com

దిగువ పని కోసం నిర్దిష్ట ఫారంలో ఆన్‌లైన్ ఇ- టెండర్లు కోరబడుచున్నవి:-

క్రమ సంఖ్య	పని వివరణ	టెండరు రిఫరెన్స్ నం. HAL/HD/	అంచనా విలువ రూ.
1	RLSU యాంటెన్నా టెస్టింగ్ ఫెసిలిటీ కోసం ఉపయోగించే తూర్పు వైపు రోడ్ వెడల్పు కోసం సివిల్ పనులు	CE/C/T/17-18/39	63.87 లక్షలు
2	HAL హైదరాబాద్‌లో కాంట్రాక్టు పద్ధతి మీద డ్రైవర్లను మరియు [illegible] వినియోగించుట కోసం సర్వీసులు కాంట్రాక్టు	MT/MT/17-18/04	227.90 లక్షలు

పూర్తి వివరాలు కోసం [illegible] www.hal-india.com కు "లింక్" → టెండర్స్ → హైదరాబాద్ డివిజన్ → టెండర్ → టెండర్ నోటీస్ నెం [illegible]. భవిష్యత్ అన్ని సవరణలు పైన వెబ్‌సైట్‌లో మాత్రమే అప్‌లోడ్ చేయబడుతాయి. [illegible]

CM (సివిల్) - HOD, హైదరాబాదు డివిజన్

జనాకర్షణ ఎంత?

ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ గురువారంనాడు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదనల్లో ఎలాంటి ప్రత్యేకతలు కనిపించడం లేదు. గత ఐదు బడ్జెట్‌లకంటే భిన్నంగా ఈసారి జైట్లీ బడ్జెట్ జనరంజకంగా, ఓటర్లను ఆకర్షించేట్టుగా ఉంటుందని అంతా భావించారు. ఈ ఏడాది కొన్ని రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే ఏడాది జరిగే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో ఇలాంటి అభిప్రాయాలు కలగడం సహజం. 2018–19 వార్షిక బడ్జెట్‌లో ప్రజాకర్షణను ప్రదర్శించే ప్రయత్నం జైట్లీ చేశారు కూడా. బడ్జెట్ ప్రసంగంలో గ్రామీణ ఆర్థిక రంగాలు, వ్యవసాయం, ప్రజారోగ్యం, విద్య గురించి ప్రధానంగా ప్రస్తావించడంతో ఇది ఎన్నికల బడ్జెట్ అన్న భావనే చాలా మందిలో కలిగింది. బడ్జెట్ ప్రతిపాదనలను లోతుగా చూస్తే ఈ భావన ఎక్కువ కాలం నిలబడే అవకాశం మాత్రం లేదు. నిజంగానే ఎన్నికలను లక్ష్యంగా చేసుకొని ఈ బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి జైట్లీ తయారు చేసి ఉంటే లక్ష్యాన్ని ఆయన సరిగ్గా కొట్టలేకపోయారనే చెప్పవచ్చు.

బడ్జెట్‌కు మూడు రోజుల ముందు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే గ్రామీణ రంగాలు, వ్యవసాయం, విద్య, వైద్యం, ఉపాధి కల్పన వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించింది. సర్వే సూచించిన ఈ అంశాలను బడ్జెట్ పరిగణనలోకి తీసుకుంది. అయితే సమగ్ర దృష్టితో దీర్ఘకాలిక ప్రాతిపదికపై కాకుండా ఎన్నికల సమయంలో ప్రయోగించే అస్త్రాలుగా స్వీకరించింది. దేశీయ వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభం కొత్తది కాదు. కొన్ని దశాబ్దాల ప్రభుత్వ విధానాల పర్యవసానంగా వ్యవసాయరంగం ఎదుర్కొంటున్న సమస్యలు సంక్లిష్టంగా మారాయి. దీర్ఘకాలిక ప్రాతిపదికన సమీకృత పరిష్కారాల కోసం అన్వేషించాల్సిన రంగంలో తాత్కాలిక ఉపశమన చర్యలు ఏ మాత్రం ప్రయోజనం ఇవ్వవు. వరుసగా ఐదోసారి బడ్జెట్ పెట్టిన ఆర్థిక మంత్రి జైట్లీకి ఐదో బడ్జెట్‌లో మాత్రమే కనిపించే చర్యలు సమస్యను పరిష్కరించవన్న విషయం తెలియకుండా ఉండదు.

దేశీయ ఆర్థిక రంగాన్ని డిమాండ్ లేమి తీవ్రంగా వేధిస్తోంది. డిమాండ్ ఉద్దీపన కోసం తీసుకునే చర్యల వల్ల ద్రవ్యలోటు పెరిగే అవకాశం ఉంది. ద్రవ్యోల్బణం భగ్గుమనే ప్రమాదం కూడా ఉంది. నిజ ఆర్థిక రంగంలో వేడి రాజుకోవాలంటే ఆ మాత్రం రిస్క్ తప్పదు. ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేస్తూ, ద్రవ్యలోటును అదుపు తప్పకుండా జాగ్రత్త వహిస్తూ డిమాండ్‌ను ప్రేరేపించడం సాధ్యం కాదు. ఆదాయ వ్యయాల్లో అంతరాన్ని సర్కారు ఆస్తులను తెగనమ్ముతూ పూడ్చుకోవడం అన్నివేళలా సాధ్యం కాదు. దేశీయంగా డిమాండ్ ఉద్దీపనకు తీసుకోవాల్సిన చర్యలపై బడ్జెట్ దృష్టి సారించనేలేదు. ఏళ్లుగా జిడిపి నిష్పత్తిలో చూస్తే ప్రభుత్వ వ్యయం తగ్గుతూ వస్తోంది. ప్రభుత్వ వ్యయాన్ని పెంచే ప్రయత్నం లేదు. ప్రైవేట్ పెట్టుబడులను ప్రేరేపించే ప్రోత్సాహం కూడా లేదు. అత్యంత విశేషంగా చెప్పుకుంటున్న జాతీయ ఆరోగ్య విధానం కూడా ప్రజలను ఎంత బాగా ఆకర్షిస్తుందో తెలియదు. పది కోట్ల కుటుంబాలు దాదాపు యాభై కోట్ల జనాభాకు మేలు చేసే విధంగా కొత్త ఆరోగ్య బీమా విధానాన్ని బడ్జెట్ తెరపైకి తెచ్చింది. ఈ మొత్తం వ్యవహారంలో గమనించాల్సిన విషయాలు రెండున్నాయి. ఒకటి దేశ జనాభాలో 50 కోట్ల మంది పేదలున్న విషయాన్ని ప్రభుత్వం అంగీకరించడం. రెండు ప్రజారోగ్యానికి సంబంధించి తన బాధ్యతలను విజయవంతంగా పక్కనబెట్టి ప్రైవేట్ ఆరోగ్య బీమా కంపెనీల చేతుల్లో పెట్టడం. ప్రజారోగ్య భద్రతకు అవసరమైన మౌలిక వసతులను పటిష్ఠంగా నిర్మించాల్సిన ప్రభుత్వం బీమా ప్రీమియం చెల్లింపుల ద్వారా బాధ్యతను పక్కనబెట్టే ప్రయత్నం చేస్తోంది. ఈ స్కీమ్ పట్టాలెక్కడానికి కనీసం మరో ఆరునెలలైనా పడుతుందని అధికారులు చెబుతున్నారు.

అసంఖ్యాక ప్రజలకు మేలు చేసే చర్యలను అధికార పార్టీలు కేవలం ఎన్నికల సమయంలోనే ప్రతిపాదిస్తాయన్న భావన ప్రజల్లో బలంగా పాతుకుపోయి ఉండటం. రాజకీయ పార్టీలు కూడా అందుకు అనుగుణంగా వ్యవహరిస్తుండటం ఆందోళన కలిగించే విషయం. ఈ తరహా ధోరణికి ప్రజల్లోనూ అసంకల్పితమైన ఆమోదం కనిపిస్తోంది. ప్రజాహితానికి ప్రభుత్వ పూచీ కేవలం ఎన్నికలతోనే ముడివడి ఉంటుందన్న భావన ప్రమాదకరమైనది. నిజ ఆర్థిక వ్యవస్థలోని సమస్యలను గుర్తించి దీర్ఘకాలిక ప్రాతిపదికపై విరుగుడు చర్యలను సిద్ధం చేయాల్సిన ప్రభుత్వాలు ఆ బాధ్యతను పక్కనబెడుతున్నాయి. ఎన్నికల సమయంలో మసిపూసి మారేడుకాయను చేసి ప్రజలను బుట్టలో వేసుకుంటే చాలన్న అభిప్రాయానికి వస్తున్నాయి. ఎన్నికల బడ్జెట్ అయితే ఎన్నికలు జరిగే లోపు బడ్జెట్ ప్రతిపాదనల ఫలితాలు ప్రజలకు చేరాలి. అప్పుడే ప్రజల్లో విశ్వాసం పాదుకొంటుంది.

■ కె.నరసింహమూర్తి



ఉపాధి కల్పనకు 14.3 లక్షల కోట్లతో ప్రకటించిన స్కీమ్ విషయంలో స్పష్టత లోపించింది. అంత భారీ మొత్తంలో నిధులు ఎక్కడ నుంచి సమకూర్చుకుంటారో చెప్పలేదు.

ఈసారి బడ్జెట్‌లో ప్రభుత్వం ఆరోగ్య, సంక్షేమ రంగాలకే పెద్ద పీట వేసింది. ప్రపంచంలోనే అతి పెద్దదైన సార్వత్రిక ఆరోగ్య పథకాన్ని ప్రకటించడం అత్యంత సాహసోపేతమైన సంస్కరణ. అయితే ఎగువ మధ్యతరగతికి, వేతన జీవులకు మాత్రం చెప్పుకోదగ్గ ప్రయోజనాలేవీ అందించలేదు. స్థూలంగా ఇది బడుగు జీవులు, గ్రామీణ ప్రాంతాలకు మేలు చేకూర్చే బడ్జెట్. దేశంలోని 10 కోట్ల నిరుపేద కుటుంబాల్లో ఒక్కొక్కరికీ సెకండరీ, టెర్షియరీ వైద్యఖర్చుల కోసం 5 లక్షల రూపాయల మొత్తం ఇవ్వాలని ప్రతిపాదించారు. ఒక్కో కుటుంబంలో ఐదుగురు ఉన్నారనుకున్నా 50 కోట్ల మంది జనాభాకు రక్షణ కల్పించే స్కీమ్ ఇది. అలాగే 100 కోట్ల రూపాయల వార్షిక టర్నోవర్ గల వ్యవసాయాధారిత పరిశ్రమలకు ఐదేళ్ల కాలానికి నూరు శాతం ఆదాయపు పన్ను మినహాయింపు ప్రకటించారు. ఇది ఉపాధికి ఊతం ఇచ్చే చర్య. అలాగే 80డి సెక్షన్ కింద ఆరోగ్య బీమా ప్రీమియం కింద చెల్లించే మొత్తంపై ఇస్తున్న 30 వేల రూపాయల మినహాయింపు పరిమితిని 50 వేలకు పెంచడం, తీవ్ర అనారోగ్యాల పాలైన వయోవృద్ధులు 80 డిడి (బి) సెక్షన్ కింద చికిత్స కోసం చేస్తున్న వ్యయంపై మినహాయింపును లక్ష రూపాయలకు పెంచడం సానుకూల చర్యలు. ప్రభుత్వం కృత్రిమ అవయవాల ధరలు నియంత్రించడం వల్ల ఇబ్బందులు ఎదు

ఆరోగ్య, సంక్షేమ బడ్జెట్



ర్కొంటున్న ఆరోగ్యబీమా, ఆరోగ్య సంరక్షణ విభాగాల్లోని కంపెనీలకు ఈ చర్య బాసటగా నిలుస్తుంది. ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని పెంచుతారన్న వేతన జీవుల ఆశ అడియాసే అయింది. 16డి కింద 40 వేల రూపాయల మినహాయింపు లభించేలా స్టాండర్డ్ డిడక్షన్‌ను తిరిగి ప్రవేశపెట్టడం తప్పితే వారికి ఒరిగిందేమీ లేదు. దీనివల్ల వారికి ఏటా 10 వేల రూపాయల వరకు ప్రయోజనం లభించవచ్చు. ఎంఎస్ఎంఇ రంగాన్ని ప్రోత్సహించేందుకు వాటికి ఆదాయపు పన్ను రేటు 25 శాతానికి తగ్గించారు. 2015–16 నుంచి అమలులో ఉన్న 50 కోట్ల టర్నోవర్ గరిష్ఠ పరిమితిని 250 కోట్ల రూపాయలకు పెంచారు. డీమానిటైజేషన్ అనంతరం మ్యూచువల్ ఫండ్లలోకి పెట్టుబడులు రావడంతో స్టాక్‌మార్కెట్లు దూసుకుపోయాయి. అలా సమకూరే ఈక్విటీ లాభాలపై పన్ను విధించి ఆదాయం సమకూర్చుకునేందుకు దీర్ఘకాలిక క్యాపిటల్ గెయిన్స్ టాక్స్ పునరుద్ధరించి పన్నురేటు 10 శాతంగా ప్రకటించారు. అలాగే మ్యూచువల్ ఫండ్ స్కీమ్‌లపై డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ పన్ను 10శాతానికి పెంచారు. దేశీయ తయారీ రంగానికి ఉత్తేజం ఇచ్చే లక్ష్యంతో మొబైల్ హ్యాండ్‌సెట్లు సహా కొన్ని రకాల దిగుమతులపై కస్టమ్స్ సుంకం పెంచారు. ఇలాంటి ప్రతికూలతలను పక్కన పెడితే వ్యవసాయ రంగం, చిన్న ఉత్పత్తుల రంగాలకు ఉత్తేజం ఇచ్చే చర్యలే ఎక్కువగా ఉన్నాయి. వ్యవసాయ ఉత్పత్తులపై ఉత్పాదక వ్యయం కన్నా ఒకటిన్నర రెట్లు అధికంగా కనీస మద్దతు ధర నిర్ణయిస్తామని ప్రకటించి రైతన్నలను బుజ్జగించే ప్రయత్నం జరిగింది. వ్యవసాయ రుణ కేటాయింపులను 8.50 లక్షల కోట్ల నుంచి 11 లక్షల కోట్ల రూపాయలకు పెంచారు. 86 శాతం రైతన్నలు తమ ఉత్పత్తులను విక్రయించేందుకు ఆధారంగా ఉన్న 22వేల గ్రామీణ వ్యవసాయ మార్కెట్లను అప్‌గ్రేడ్ చేస్తామని ప్రకటించారు. ధరల హెచ్చుతగ్గులు అధికంగా ఉండే బంగాళాదుంప, ఉల్లి, టమాటా రైతులను ఆదుకునేందుకు 'ఆపరేషన్ గ్రీన్' కింద ఒక స్కీమ్ ప్రకటించి ధరల రక్షణ నిధిని ఏర్పాటు చేశారు. మహిళా స్వయంసహాయక బృందాలకు ఇచ్చే రుణాలను 42,500 కోట్ల నుంచి 75 వేల కోట్ల రూపాయలకు పెంచారు. ఎనిమిది కోట్ల మంది గ్రామీణ మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఇవ్వడం, 5750 కోట్ల రూపాయలతో జాతీయ జీవనోపాధి స్కీమ్ ప్రకటించడం, ప్రతీ పొలానికి నీరందించేందుకు 2600 కోట్లతో 'హర్ ఖత్ కో పానీ' ప్రకటించడం వంటి చర్యలన్నీ ఆయా రంగాలపై ఆధారపడిన వారికి ప్రయోజనం చేకూర్చేవే. అయితే ఉపాధి కల్పనకు 14.3 లక్షల కోట్లతో ప్రకటించిన స్కీమ్ విషయంలో స్పష్టత లోపించింది. అంత భారీ మొత్తంలో నిధులు ఎక్కడ నుంచి సమకూర్చుకుంటారో చెప్పలేదు. జిఎస్‌టి ద్వారా నష్టపోయిన ఎంఎస్ఎంఇల కోసం 3700 కోట్ల రూపాయలతో రుణమద్దతు, పెట్టుబడి వడ్డీ సబ్సిడీ స్కీమ్ ప్రకటించారు. అది కూడా ఎలా ఉంటుందో వేచి చూడాలి. రైల్వేల అభివృద్ధికి 1,48,500 కోట్లరూపాయల పెట్టుబడి ప్రణాళిక ప్రకటించారు. విత్తలోటు లక్ష్యాన్ని జిడిపిలో 3.2 శాతంగా నిర్దేశించారు. ఈ ఏడాది పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా 72,500 కోట్ల రూపాయలు లక్ష్యంగా పెట్టుకుంటే, లక్ష కోట్ల వరకు వచ్చే ఆస్కారం ఉన్నదంటూ వచ్చే ఏడాదికి ఆ లక్ష్యాన్ని 80 వేల కోట్ల రూపాయలుగా నిర్దేశించారు. ఇది కొంతమేరకు విత్తలోటును అదుపు చేసుకునేందుకు ఉపయోగపడుతుంది. ఆదాయపుపన్ను రిటర్న్‌లు దాఖలు చేసిన వారి సంఖ్య 84.5 లక్షలకు పెరిగిందని, ఐటి ఆదాయం కూడా గణనీయంగా పెరిగిందనడం వెనుక జిఎస్‌టి వల్ల ఏర్పడిన ఆదాయం లోటును దీంతో భర్తీ చేయవచ్చుననే భరోసా కనిపించింది.

బడ్జెట్‌లో తెలుగు రాష్ట్రాలు రెండింటికీ కూడా దక్కిందేమీ లేదు. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్‌కి విభజన సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చే ప్రయత్నం ఏమీ జరగలేదు. ఆ రకంగా తెలుగు రాష్ట్రాలకు ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌కి అన్యాయం జరిగిందనే చెప్పాలి.

(వ్యాసకర్త ప్రముఖ ఆర్థిక విశ్లేషకుడు)

తీపి కబుర్లతో కడుపు నింపారు!

ఈ ఆఖరి పూర్తిస్థాయి బడ్జెట్ ఎన్నికల రిహార్సల్ వేసినట్టుంది తప్పితే ఖచ్చితమైన ఊరట ఎవరికీ ఇవ్వలేదు. 50శాతం పరోక్ష పన్నులు పెరిగి ఆర్థిక వ్యవస్థ పరుగులు తీస్తున్నట్టు సర్వే చెప్పినా, అందుకు అనుగుణమైన ఓదార్పు ప్రజలకు దొరకలేదు. హవాయి చెప్పులు వేసుకున్న ప్రతివారూ హవాయి యాత్ర చేసే విధంగా దేశీయ వాయుయానాన్ని ఐదురెట్లు అభివృద్ధి చేస్తామన్నారు ఆర్థిక మంత్రి. రైతులకు 2022 కల్లా ఆదాయం రెట్టింపు చేస్తామని భరోసా ఇచ్చారు. ప్రస్తుతానికైతే హవాయి చెప్పుల్లో కాళ్ళు దూర్చి విమానం కోసం మబ్బుల వైపు చూడాల్సిందే! రైతులు 2022 సంవత్సరం కోసం ఎదురుచూస్తూ బతకాలి. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల కనుగుణంగా అన్ని పంటలకూ పెట్టుబడికి ఒకటిన్నర రెట్ల కనీస మద్దతు ధర నిర్ణయిస్తున్నట్టు ప్రకటించడం బాగుంది. పరపతి సౌలభ్యం, గోదాముల నిర్మాణం, ఫ్యూచర్ ట్రేడింగ్ లాంటి స్వామినాథన్ ముఖ్య సిఫార్సులపై కార్యాచరణ లేదు. పర్యావరణ మార్పుల వల్ల 25శాతం నష్టం జరుగుతున్నదన్న అంచనాల మధ్య, అందుకు తగ్గ ప్రణాళికలు లేవు. సాగునీరు ఊసే లేదు. 30 బిలియన్ డాలర్ల వ్యవసాయ ఎగుమతుల్ని 100 బిలియన్ డాలర్ల మేరకు పెంచుతామన్నది ఆశావహ దృక్పథమే తప్ప వాస్తవ అంచనా కాదు. వ్యవసాయిక సంక్షోభానికి ఈ బడ్జెట్లో సరైన పరిష్కారం లేదు. 10 కోట్ల కుటుంబాలకు ఐదు లక్షల మేర ఆరోగ్య బీమా ప్రకటించారు. వైద్యులు,మందుల కొరతతో క్షీణించిన ప్రజారోగ్య రంగానికి జీడీపీలో కనీసం 5శాతం కేటాయిస్తే బాగుండేది. మధ్యతరగతి వేతన జీవులకు ఊరట లేదు కానీ, తక్షణ ఊరట లభించింది మాత్రం పార్లమెంటు సభ్యులకే! పన్నుల వడ్డింపులో ప్రజలపై జాలి చూపిస్తే బాగుండేది.

■ డి.వి.జి.శంకరరావు

ప్రధాన రంగాలకు పెద్దపీట

ఆరోగ్య భారత్‌ను నిర్మించే దిశగా అరుణ్ జైట్లీ బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్యమిచ్చారు. విద్య, వైద్య, వ్యవసాయ, మౌలిక రంగాలకు అధిక నిధులను కేటాయించారు. వ్యవసాయ రంగానికి అదనంగా లక్ష కోట్ల రుణాలను కేటాయించారు. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెంటింపు చేస్తామని మోదీ హామీ ఇచ్చిన నేపథ్యంలో ఈ కేటాయింపు జరిగింది. 10 కోట్ల కుటుంబాలకు హెల్త్ ఇన్సూరెన్స్, ప్రతి మూడు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో ఒక మెడికల్ కాలేజ్ ప్రకటించడం హర్షనీయం. 8 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ప్రకటించడం పేద మహిళా పక్షపాతాన్ని చాటిచెబుతోంది. విద్యారంగ అభివృద్ధికి భారీ కేటాయింపు వల్ల పాఠశాల నుండి యూనివర్సిటీల దాకా విద్యాసంస్థలు అభివృద్ధి చెంది, నైపుణ్యం గల విద్యార్థులను తయారవుతారు. ఇది ప్రజానుకూల బడ్జెట్.

■ చింత ఎల్లస్వామి

మౌలిక సదుపాయాల రంగంలో మదుపులకు సంబంధించినంతవరకు 2018–19 కేంద్ర బడ్జెట్ మంచి బడ్జెట్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ దేశ ప్రజలు కచ్చితంగా హైవేలపై పెద్ద పెద్ద ట్రక్కులను చూడగలుగుతారు. అయితే చేయడానికి వారికి చేతిలో ఎలాంటి పని ఉండదు.

■ భరత్ ఝున్‌ఝున్‌వాలా




ఉద్యోగ సహాయమేదీ?

ఇది మంచి బడ్జెట్. ఆర్థిక మంత్రి మూడు వనరుల నుంచి డబ్బుమొత్తాలను సమీకరించారు. ఒకటి– హెచ్చు విలువ కలిగిన కరెన్సీ నోట్ల రద్దు, వస్తు సేవల పన్ను(జీఎస్టీ)ని ప్రవేశపెట్టిన తరువాత ఆదాయపు పన్ను చెల్లింపుదారుల సంఖ్య పెరిగింది; రెండు– ప్రభుత్వ రంగ సంస్థలలో ప్రభుత్వ వాటాల విక్రయం ద్వారా సమకూరుతున్న రాబడి; మూడు– అధిక కస్టమ్స్ సుంకాలు, అదనపు పన్నులు ఆదాయాల పెరుగుదలకు దారితీస్తాయి. ప్రభుత్వ కోశాగారంలో ఇలా సంచితమవుతున్న డబ్బును మౌలిక సదుపాయాల అభివృద్ధికి–హైవేలు, గ్రామీణ రహదారులు, చిన్న పట్టణాలలో వైఫై, రైలు మార్గాల విస్తరణ, కొత్త విమానాశ్రయాలకు–గణనీయంగా వినియోగిస్తారు. అయితే ఈ చర్యలేవీ పలు సమస్యలతో సతమతమవుతోన్న దేశ ప్రజలకు ఉపశమనాన్ని కలిగించలేవు.

గ్రామీణ రహదారుల నిర్మాణానికి, నీటి పారుదల వసతుల మెరుగుదలకు పెద్ద మొత్తంలో వ్యయం చేస్తామని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ హామీ ఇచ్చారు. ఈ రెండు రంగాలలో అధిక వ్యయాలు ఉత్పత్తి పెరుగుదలకు దారితీస్తాయని నిశ్చితంగా చెప్పవచ్చు. అయితే పెరిగిన ఉత్పత్తి, పెరిగిన ఆదాయాల మధ్య చాలా పెద్ద అంతరం ఉన్నది. స్వాతంత్ర్యానంతరం వ్యవసాయ దిగుబడులు పెరుగుతూనేవున్నాయి. దిగుబడుల పెరుగుదలతో పాటు రైతుల ఆత్మహత్యల సంఖ్య కూడా పెరుగుతూనే ఉన్నది. కారణమేమిటి? దిగుబడుల పెరుగుదలతో పాటు ధరలు తగ్గిపోతున్నాయి. ఈ దుస్థితి వల్లే ఏడాది క్రితం ఇతోధికంగా దిగుబడి అయిన బంగాళాదుంపలను కిలో రూ.2కి కూడా రైతులు విక్రయించుకోలేక పోయారు. ధరలు పడిపోయినప్పుడు అధిక దిగుబడుల వల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనముండదు. ఈ కఠోర వాస్తవం రైతులను ఆత్మహత్యల వైపు నెడుతోంది.

ఉత్పత్తి వ్యయానికి ఒకటిన్నర రెట్లు (1.5) అధికంగా కనీస మద్దతుధరను నిర్ణయిస్తామని ఆర్థికమంత్రి చెప్పారు. అయితే మద్దతుధరని ఎప్పుడూ ఉత్పత్తి వ్యయం కంటే హెచ్చు స్థాయిలోనే నిర్ణయించడం జరుగుతోంది. ఇప్పుడు ఉత్పత్తి వ్యయానికి 1.2 రెట్లు అధికంగా కనీస మద్దతు ధరను నిర్ణయించారనుకోండి. తమ ఉత్పత్తులకు నిజంగా ఈ ధర లభ్యమయితే రైతులు హాయిగా ఊపిరి పీల్చుకుంటారు సుమా! ఉత్పత్తి వ్యయానికి ఒకటిన్నర రెట్లు అధిక ధర నిజంగా లభిస్తున్నా రైతులకు దురవస్థలు తొలగిపోవడం లేదు. ఎందుకని? ఉత్పత్తి వ్యయాన్ని సక్రమంగా గణించక పోవడమేనని చెప్పి తీరాలి. ఈ మౌలిక సమస్యను ఆర్థిక మంత్రి పరిష్కరించలేదు సక్రమంగా అంచనావేయని ఉత్పత్తి వ్యయానికి 1.2 బదులు 1.5 రెట్లు ఎక్కువగా కనీస మద్దతు ధర నిచ్చినప్పటికీ అసలు సమస్య పరిష్కారం కాదు. రైతు దురవస్థ తొలగిపోదు.

మన దేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయం ఒక నష్టదాయక కార్యకలాపంగా పరిణమించింది. వర్తమాన ప్రపంచపు చేదు వాస్తవాలలో ఇది ప్రముఖమైనది. వ్యావసాయక దిగుబడులు ఇతోధికంగా పెరుగుతూనే ఉన్నాయి. అయితే వాటి ధరల పెరుగుదల స్తంభించిపోయింది. ఖచ్చితంగా చెప్పాలంటే అవి అంతకంతకూ



పడిపోతున్నాయి. వ్యవసాయరంగంలో నెలకొన్న ఈ విపత్కర పరిణామం వల్ల అభివృద్ధి చెందిన దేశాలలో ప్రభుత్వాలు రైతులకు నేరుగా ఆదాయాన్ని సమకూర్చే విధానాన్ని అమలుపరుస్తున్నాయి. మన రైతులను ఆదుకోవడంలో సంపన్న దేశాలను ఆర్థిక మంత్రి ఆదర్శంగా తీసుకోవాలి. అక్కడ మాదిరిగానే ఇక్కడ కూడా రైతులకు నేరుగా ఆదాయాన్ని సమకూర్చాలి (డైరెక్ట్ ఇన్‌కమ్ ట్రాన్స్‌ఫర్స్). ఇది సాధ్యమా అని ఎవరూ సందేహించనవసరం లేదు. ఒక అంచనా ప్రకారం, కేంద్ర ప్రభుత్వం ఎరువుల, ఆహార, నీటి పారుదల సబ్సిడీలను సమకూర్చడానికి ప్రతి సంవత్సరమూ 5,00,000కోట్ల రూపాయలను వ్యయం చేస్తోంది. ఈ సబ్సిడీ పథకాలన్నిటినీ రద్దు చేసి ఆ భారీ మొత్తాన్ని ఆదా చేయాలి. ఆ సొమ్మును దేశంలోని పది కోట్లరైతు కుటుంబాలకు ఏటా ప్రతి కుటుంబ ఖాతాకు రూ.50,000 చొప్పున నేరుగా బదిలీ చేసేందుకు ఆర్థిక మంత్రి తగుచర్యలు చేపట్టాలి. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం నిర్వర్తించాల్సిన విధ్యుక్త ధర్మమిది. ఇటువంటి తోడ్పాటు వల్ల మాత్రమే రైతులకు నానా దురవస్థల నుంచి నిజమైన ఉపశమనం సమకూరుతుంది.

ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తన బడ్జెట్ ప్రసంగంలో అనేక సాంఘిక సంక్షేమ పథకాల గురించి ఏకరువు పెట్టారు. వీటిలో కొన్ని నిజంగా ప్రజలకు ఆవశ్యక సహాయాన్ని సమకూర్చుతున్నాయని అంగీకరించక తప్పదు. ఉదాహరణకు ఆహార సబ్సిడీ పథకాన్నే తీసుకుందాం. ఈ సంక్షేమ పథకం పేద ప్రజల జీవరేఖ. వారి మనుగడకు అది ఎంతగానో తోడ్పడుతోంది. ఈ సంక్షేమ పథకం ద్వారా పేదప్రజలకు ఆహార ధాన్యాలు అతి చౌకగా (కిలో రూ.1 లేదా రూ.2కు) సరఫరా చేయడం జరుగుతోంది.

తిండిగింజలు ఎలాగోలా లభిస్తున్నా ప్రజల అసలు సమస్య ఉద్యోగాలు. ప్రజలకు అవసరమైన ఉద్యోగాలను పెద్ద కంపెనీలు స్వాహా చేస్తున్నాయి. ఉద్యోగాలను హరించి వేస్తూ ఆహార ధాన్యాలను చౌకగా సమకూర్చడం లాంటి విచిత్ర పరిస్థితిని ఎలా అర్థం చేసుకోవాలి? ఒక డాక్టర్, రోగికి తెలియకుండా రహస్యంగా అతని మూత్రపిండాలను తొలగించి, ఆ తరువాత అతని ఆరోగ్యం మెరుగుదలకు పుష్టికరమైన ఆహారాన్ని ఇచ్చిన చందమే కాదా ఆ విచిత్ర పరిస్థితి?! మేక్ ఇన్ ఇండియా, ఉద్యోగాల సృష్టి మధ్య ఉన్న వైరుధ్యాన్ని ఎదుర్కోవడానికి ఆర్థిక మంత్రి తిరస్కరిస్తున్నారు.

చాలా సంక్షేమ పథకాలు వంచనాత్మకమైనవే. అవి ప్రజలను తప్పుదారిపట్టిస్తున్నాయి. ఉదాహరణకు ఎల్‌పిజి సిలిండర్లను సమకూరుస్తున్న పథకాన్నే తీసుకోండి. ఈ సహాయం కంటి తుడుపు చర్య మాత్రమే. ఎందుకని? ఆ సిలిండర్లను ఉచితంగా సరఫరా చేస్తున్నారు సరే, అదే సమయంలో ఎల్‌పిజి ధరను పెంచుతూపోతున్నారు కదా. జన్‌ధన్ విషయాన్ని కూడా చూద్దాం. ఈ పథకం కింద రుణంగా ఇస్తున్న మొత్తం ఆ పథకం ఖాతాలో జమచేసిన మొత్తంలో మూడో వంతు మాత్రమే. ఈ విధంగా పేదల సంపద ముంబై ద్రవ్య విపణికి చేరేందుకు జన్ ధన్ పథకం ఒక మార్గంగా ఉపయోగపడుతున్నది. ఇది మన ప్రజలకు తెలియని ఒక వాస్తవం. ప్రపంచ మార్కెట్ల నుంచి లబ్ధి పొందేలా మన యువజనులకు సహాయపడవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. ఇందుకు దేశ వ్యాప్తంగా ప్రతి జిల్లాలో ఒక 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లాంగ్వేజ్' నేర్పాటు చేయాలి. ఈ సంస్థ ద్వారా యువజనులకు అనువాద నైపుణ్యాలను సమకూర్చాలి, ఇటువంటి చర్యలకు చొరవ చూపడంలో ఆర్థిక మంత్రి విఫలమయ్యారు. ఉద్యోగాలకు సంబంధించి 2018–19 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్‌లో సానుకూల అంశం ఒకటి ఉన్నది. దేశ వ్యాప్తంగా చిన్న పట్టణాలలో బ్రాడ్‌బ్యాండ్, వైఫై సదుపాయలను సమకూర్చడానికి ప్రాధాన్యమివ్వడమే ఆ ప్రయోజనకర విషయం. దీని వల్ల యువజనులు ఇంటర్నెట్ సదుపాయాన్ని మరింత విస్తృతంగా ఉపయోగించుకోగలుగుతారు. అనువాదాలు, ఆన్‌లైన్ ట్యూటోరియల్స్ ఇత్యాది భాషా, బోధనా నైపుణ్యాల అంతర్జాతీయ విపణి వారికి మరింతగా అందుబాటులోకి వస్తుంది.

మౌలికసదుపాయాల రంగంలో మదుపులకు సంబంధించినంతవరకు ఇది మంచి బడ్జెట్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ దేశ ప్రజలు కచ్చితంగా హైవేలపై పెద్ద పెద్ద ట్రక్కులను చూడగలుగుతారు. అయితే చేయడానికి వారికి చేతిలో ఎలాంటి పని ఉండదు.

(వ్యాసకర్త ఆర్థికవేత్త, బెంగుళూరు ఐఐఎం రిటైర్డ్ ప్రొఫెసర్)

■ రాజ్‌దీప్ సర్దేశాయి



దీపశిఖ

బాధ్యత మరచిన బాలీవుడ్

ప్రజల ఆదరాభిమానాలను విశేషంగా పొందుతున్న వారు సమాజానికి హాని కల్గించే చర్యలను ఖండించకపోతే ఎలా? గురుగ్రామ్‌లో ఒక పాఠశాల బస్సుపై కర్ణిసేన కార్యకర్తలుగా భావింపబడుతున్న నిరసనకారులు కొందరు దాడి చేసిన రోజున నేను ఎన్నడూ లేని ఒక సమస్యను ఎదుర్కోవలసివచ్చింది. నేను నిర్వహిస్తున్న ప్రైమ్‌టైమ్ టీవీ న్యూస్ షో గెస్ట్ కో–ఆర్డినేటర్ నా వద్దకు వచ్చి 'కర్ణిసేనకు వ్యతిరేకంగా మాట్లాడడానికి చలనచిత్ర పరిశ్రమనుంచి ఎవరూ ముందుకు రావడం లేద'ని చెప్పారు. కర్ణిసేన దుశ్చర్యపై హిందీ చిత్ర పరిశ్రమ అభిప్రాయమేమిటో తెలియజేయాలని చాలా మందిని సంప్రదించి, చివరకు ఎలాగో దర్శకుడు అనుభవ్ సిన్హాను ఒప్పించాం. నిజానికి షబానా అజ్మీ, జావేద్ అఖ్తర్, అనురాగ్ కాశ్యప్, స్వర భాస్కర్ మినహా బాలీవుడ్ అతిరథ మహారథుల నుంచి ఈ విషయమై కనీసం సణుగుడు కూడా వినపడలేదు! 'పద్మావత్'ను లక్ష్యంగా చేసుకొని సంభవించిన హింసాకాండ గురించి తాము రవ్వంత కూడా పట్టించుకోవల్సిన అవసరం లేదన్నట్టుగా బాలీవుడ్ ప్రముఖులు వ్యవహరించారు. ఎందుకని? అది వారి 'సమస్య'కాదు కనుక! పలుకుబడి, అధికార ప్రాభవాలు ఉన్న వ్యక్తులు, విశాల సమాజంతో ముడివడివున్న వ్యవహారాల గురించి పట్టించుకొని 'తలనొప్పులు' తెచ్చుకోవడానికి నిరాకరిస్తున్న రోజులివి. కర్ణిసేన ఆగడాలపై చలనచిత్ర పరిశ్రమ ప్రముఖుల సంపూర్ణ మౌనం మన కాలం 'పెద్ద మనుషుల' ధోరణినే ప్రతిబింబిస్తోంది.

పగలంతా శ్రమించిన అనంతరం రాత్రి పూట మనలను వెండితెరపై తమ ఆటపాటలతో అలరించే తారలు, వారి అద్భుత నటనలకు ఒక రూపమిస్తున్న వ్యక్తులు నిజంగా ఎలాంటివారు? ఎవరికీ లభించని కీర్తికనకాలు, లోకుల గౌరవాదరాలను పొందుతూ తమ వ్యక్తిగత జీవితానికి ఆవల ఉన్న ప్రపంచపు యాతనలను పట్టించుకోవడంపై శ్రద్ధ చూపని స్వార్థ పరులు అంటే సత్యదూరం కాదేమో? కర్ణిసేన అరాచక కాండ సందర్భంలో హిందీ చలనచిత్ర పరిశ్రమ మొదటిసారి ఈ సత్యాన్ని నిరూపించింది.

అపురూప భోగభాగ్యాలు కలవారయినందునే, పదిహేను సెకండ్ల పాటు చిన్నతెరపై వెలుగొందడానికి ఏ సేనకైనా ఈ సినీ ప్రముఖులు లక్ష్యాలవుతున్నారు. కాదంటారా? అయితే కొన్ని సంవత్సరాల క్రితం 'అసహనం'పై అపాయకరం కాని వ్యాఖ్యలు చేసినందుకే షారుఖ్ ఖాన్, అమీర్ ఖాన్‌లకు వ్యతిరేకంగా కరడుగట్టిన మితవాద శక్తులు ఎలా బరి తెగించాయో గుర్తు చేసుకోండి. అలాగే ఉత్తరప్రదేశ్‌లో ఒక బాలికల కళాశాలను ప్రారంభించడానికి నిర్ణయించుకున్నందుకుగాను బాలీవుడ్ బాద్‌షా అమితాబ్ బచ్చన్ గృహంపై ఎమ్ఎన్ఎస్ కార్యకర్తలు దాడిచేయలేదా? అంతెందుకు,'పద్మావత్'లో తన పాత్రను సమర్థించుకున్నందుకు దీపికా పడుకొనేను చంపివేస్తామని మితవాద శక్తులు బెదిరించలేదా? ఏది ఏమైనా చలనచిత్ర పరిశ్రమ ప్రముఖులు సంఖ్యానేక ప్రజల హృదయాలు, మనస్సులను అపరిమితంగా ప్రభావితం చేస్తున్నారనేది తిరుగులేని వాస్తవం. సరిగ్గా ఈ కారణం వల్లే, ప్రజల నుంచి అమితాదరణ పొందే ఈ విలక్షణ వ్యక్తులు అందరికీ మేలు జరిగేలా సమాజ వ్యవహారాలనూ ప్రభావితం చేయవలసిన అవసరమున్నది. మరి స్వచ్ఛ భారత్, ఇన్‌క్రెడిబుల్ ఇండియా లాంటి ప్రభుత్వ ప్రాయోజిత కార్యక్రమాలకు బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరిస్తున్న వెండితెర నటీనటులు ఈ బాధ్యతను గుర్తించారా? అప్రకటిత రాజకీయ మద్దతుతో, స్వయం నియమిత నిఘాకారులు భావ ప్రకటనా స్వేచ్ఛను అణచివేస్తుంటే తమ పలుకుబడిని ఉపయోగించుకొని ఆ అప్రజాస్వామిక చర్యకు వ్యతిరేకంగా ఈ సినీ అభినేత్రీ అభినేత్రులు ఎందుకు మాట్లాడడం లేదు? ఈ విధ్యుక్త ధర్మ నిర్వహణలో వారిని అడ్డుకొంటున్నదేమిటి? పాలక వర్గాలను మరీ ముఖ్యంగా అధికారంలో ఉన్న రాజకీయ పక్ష నాయకులను తరచూ అమితంగా ప్రశంసించే ఈ తారలు ఆ నేతల పాలనలో ప్రజాహితంగాలేని వ్యవహారాలను ఎందుకు ఎత్తిచూపరు? బహిరంగంగా ఎందుకు విమర్శించరు?



రాజకీయ మలిన జలాల దరిదాపుల్లోకి వెళ్ళితే తమకు ఎన్నో చేదు అనుభవాలు ఎదురవుతాయని హిందీ సినిమా నటీనటులు సంజాయిషీపూర్వకంగా చెప్పడం కద్దు. మరి దక్షిణాది సినీ నట ప్రముఖుడు ప్రకాశ్ రాజ్ వ్యవహరించే తీరు బాలీవుడ్ తారల ధోరణికి పూర్తిగా భిన్నమైనది. విద్వేష, హింసాత్మక రాజకీయాలపై ఆయన పూర్తి స్థాయిలో ధ్వజమెత్తారు. తన స్నేహితురాలు గౌరీ లంకేష్‌ను హత్య చేసిన మతోన్మాద శక్తులను ఆయన తీవ్రంగా ఖండించారు. హిందూ ధర్మాన్ని పరిరక్షిస్తున్నామని చెప్పుకొనే గోరక్షకుల తీరుతెన్నులను ప్రకాశ్‌రాజ్ తీవ్రంగా దుయ్యబట్టారు. బాలీవుడ్ ఖాన్‌త్రయం– షారుఖ్, అమీర్, సల్మాన్–కు ఉన్న విధంగా ప్రకాశ్‌రాజ్‌కు ఆసేతు హిమాచలం సినీ ప్రేక్షకుల ఆదరణ లేకపోవచ్చు గానీ ఆయన తన నటనా ప్రతిభకు ఇప్పటికే పలు జాతీయ బహుమతులను పొందారు. దక్షిణ భారతావనికి చెందిన నాలుగు ప్రధాన భాషా సినిమాలలోనూ ఆయన ప్రముఖ నటుడుగా వెలుగొందుతున్నారు.

భారతీయ జనతాపార్టీకి, ముఖ్యంగా మోదీ సర్కార్‌కు వ్యతిరేకంగా తీవ్ర విమర్శనాత్మక వైఖరిని అనుసరిస్తున్నందుకుగాను ప్రకాశ్‌రాజ్ పలునిందలకు గురవుతున్నారు. 'జాతి వ్యతిరేక' వామపక్ష –ఉదారవాద శక్తుల అప్రకటిత మద్దతుతో రాజ్ ఒక రాజకీయ ఎజెండాను నిర్దేశించుకొని, దానికి అనుగుణంగా వ్యవహరిస్తున్నారని జాతీయ పాలక పక్షం వారు ఆరోపిస్తున్నారు. ప్రకాశ్‌రాజ్ తరచూ రెచ్చగొట్టే విధంగా చేసే వ్యాఖ్యలతో మీరు వాదించవచ్చు, లేదా వాటిని సవాల్ చేయవచ్చు. అయితే ఆయన్ని జాతి వ్యతిరేకి అనడం గర్హనీయం. పాలకుల విధానాలపై భిన్నాభిప్రాయాన్ని కలిగివుండడమే పెద్ద నేరమనే ధోరణి ఇటీవల మన సమాజంలో అంతకంతకూ పెరిగిపోతోంది. ప్రకాశ్ రాజ్‌ను 'జాతి వ్యతిరేకి'గా పరిగణించడం ఆ ధోరణినే స్పష్టంగా ఎత్తి చూపుతోంది. దక్షిణాది చలనచిత్ర నటీనటులకు ఒక విశిష్ట సంప్రదాయం ఉన్నది. దక్షిణాది సినీ నటీనటులు తమ స్టార్ హోదాను కాపాడుకోవడానికి పాలక వర్గంతో రాజీపడడం కాకుండా తమ రాజకీయ విశ్వాసాలను నిర్భయంగా ప్రకటిస్తారు. దక్షిణాది సినీ నటీనటుల ఈ సంప్రదాయానికి ప్రకాశ్ రాజ్ ప్రతినిధి. ఆయన్ని ఈ విధంగానే చూడాలి.

వెండితెర వేల్పులు సంఖ్యానేక ప్రజల హృదయాలు, మనస్సులను అపరిమితంగా ప్రభావితం చేస్తున్నారనేది ఒక తిరుగులేని వాస్తవం. సరిగ్గా ఈ కారణం వల్లే ఈ విలక్షణ వ్యక్తులు అందరికీ మేలు జరిగేలా సమాజ వ్యవహారాలనూ ప్రభావితం చేయవలసిన అవసరమున్నది. అప్రకటిత రాజకీయ మద్దతుతో, స్వయం నియమిత నిఘాకారులు భావ ప్రకటనా స్వేచ్ఛను అణచివేస్తుంటే ఆ అప్రజాస్వామిక చర్యకు వ్యతిరేకంగా హిందీ సినీ ప్రముఖులు ఎందుకు మాట్లాడడం లేదు?

1960 వ దశకంలో ఆంధ్రుల ఆత్మ గౌరవం నినాదంతో కాంగ్రెస్ పార్టీని ఎన్ .టి. రామారావు సవాల్ చేశారు. అజేయుడుగా నిలిచారు. అంతకు ముందు ఎమ్ జి ఆర్ ద్రవిడోద్యమంలో ఒక జానపద కథానాయకుడిగా వెలుగొందారు. తమ పార్టీ అధికారానికి రావడానికి విశేషంగా తోడ్పడ్డారు. పేదప్రజల ఆత్మ బంధువుగా పేరు పొందారు. ఇటీవల యువనటుడు విశాల్ చెన్నైలోని ఆర్‌కె నగర్ నియోజకవర్గం (దివంగత జయలలిత నియోజకవర్గం) నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయడానికి ప్రయత్నించారు. రాష్ట్ర రాజకీయాలు అవినీతిమయమైపోయాయని, వాటిని ప్రక్షళన చేసేందుకు తాను రాజకీయాలలోకి రావడానికి ప్రయత్నిస్తున్నానని విశాల్ అన్నారు. మరింత స్పష్టంగా చెప్పాలంటే యథాతథ పరిస్థితిని ఆమోదించకపోవడం దక్షిణాది నటీనటుల సంప్రదాయం. ఈ సంప్రదాయమే నేడు కమల్ హసన్‌ను తమిళనాడు రాజకీయాలోకి ప్రవేశించేందుకు పురిగొల్పుతోంది. సరే, రజనీకాంత్ ఇప్పటికే ప్రజాజీవితంలోకి 'ఆధ్యాత్మికయాత్ర' చేయడానికి పూనుకున్నారు.

బహుశా దక్షిణాది ప్రాంతీయ సినీ నటీనటులకు వారి వారి సొంత సంస్కృతులలో సుదృఢమైన మూలాలు ఉన్నాయని చెప్పవచ్చు. ఈ సాంస్కృతిక విలక్షణత వల్లే ప్రజలకు సంబంధించిన వ్యవహారాలను వారు పట్టించుకొంటున్నారని చెప్పవచ్చు. ప్రజల సమస్యల పరిష్కారానికి పూనుకొంటున్నారు. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే దక్షిణాది నిర్మాతలు, నటీనటులు చాలాకాలంగా తమ సామాజిక, రాజకీయ విశ్వాసాలను ప్రతిబింబించే సినిమాలను ఉద్దేశపూర్వకంగా నిర్మిస్తున్నారు. ఎంజీఆర్ సినిమాలలో హీరో సదా దుష్ట శక్తులకు వ్యతిరేకంగా పోరాడే ధీరోదాత్తుడుగా ఉంటాడు. ఈ కారణంగానే ఆయన తన రాజకీయ జీవితంలో అసాధారణ విజయాన్ని సాధించగలిగారు. అలాగే ఎన్.టి. రామారావు కూడా వెండితెరపై తన పాత్రలను రాజకీయ ప్రచారాస్త్రాలుగా ఉపయోగించుకున్నారు.

దక్షిణాది సినిమాకు భిన్నంగా హిందీ సినిమా, సామాన్యుల జీవితాలకు అంతకంతకూ దూరమవుతోన్న ప్రపంచంలోనే ఉండిపోయింది. ఆ ప్రపంచంలో తమ సినిమాలు ఎంత వసూలు చేశాయన్న లెక్కకు మాత్రమే పరిగణన ఉంటుంది. ఆర్థిక లాభాలకు మాత్రమే ప్రాధాన్యమిచ్చే ఈ సంకుచిత వైఖరి నుంచి హిందీనటీనటులు బయటపడవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. దుష్టులపై విజయం సాధించే సాహసోపేత వ్యక్తులుగా వెండితెరపై భాసిల్లే వారికి కర్ణిసేనను ఎదురొడ్డి నిలబడడం అసాధ్యమేమీ కాదని నిశ్చితంగా చెప్పవచ్చు.

తాజా కలం: ఫిల్మ్ సెన్సార్ బోర్డు ఛైర్మన్ ప్రసూన్ జోషీ ఇటీవల జైపూర్ లిటరరీ ఫెస్టివల్‌కు రాలేదు. కర్ణిసేన కార్యకర్తల ఆగ్రహానికి గురికావలసి వస్తుందన్న భయంతోనే. మన సినీ ప్రముఖులే ఇలా. ఆకతాయిలకు వ్యతిరేకంగా నిలబడలేకపోతే, మూక బెదిరింపులకు భయపడి మౌనంగా ఉండిపోయిన మన విశాల వక్షస్థలాల రాజకీయ నాయకుల మాటేమిటి?

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

సీనియర్లకు కీలక కేసులు

- సుప్రీంలో కొత్త రోస్టర్ విధానం!
- ఉత్తర్వులిచ్చిన ప్రధాన న్యాయమూర్తి
- పిల్స్ చూసేది జస్టిస్ దీపక్ మిశ్రాయే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు సుప్రీంకోర్టులో పని విభజన జరిగింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా గురువారం ఉన్నత న్యాయస్థానంలో న్యాయమూర్తులకు కొత్త రోస్టర్ విధానాన్ని ఖరారు చేశారు. జడ్జిలకు వివిధ అంశాలను కేటాయించారు. ఆ అంశాలకు సంబంధించిన కేసులు సదరు జడ్జికి కేటాయిస్తారు. అంశాల జాబితాను సుప్రీంకోర్టు చరిత్రలో తొలిసారిగా ప్రజలకు బహిరంగంగా విడుదల చేశారు. ప్రజా ప్రయోజన వ్యాజ్యాలను అన్నింటినీ తానే విచారించాలని ప్రధాన న్యాయమూర్తి నిర్ణయించారు. సోమవారం నుంచి కొత్త రోస్టర్ విధానం అమల్లోకి వస్తుంది. అంశాలను బట్టి చూస్తే సీనియర్లకు కేసుల కేటాయింపులో ప్రాధాన్యం లభించినట్లు స్పష్టమవుతోంది. కేసుల కేటాయింపులో పారదర్శకత లేదని జస్టిస్ చలమేశ్వర్ నేతృత్వంలో నలుగురు సీనియర్ న్యాయమూర్తులు అసాధారణమైన రీతిలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, ప్రధాన న్యాయమూర్తికి తాము రాసిన లేఖను విడుదల చేసిన నేపథ్యంలో ప్రధాన న్యాయమూర్తి నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆ నలుగురు లేవనెత్తిన వివాదం సమసిపోయినట్లేనని పరిశీలకులు భావిస్తున్నారు. ఈ జాబితా ప్రకారం న్యాయమూర్తులకు కేటాయించిన అంశాలు ఇలా ఉన్నాయి.



జస్టిస్ దీపక్ మిశ్రా: సర్వీస్ అంశాలు, ప్రజాప్రయోజన వ్యాజ్యాలు, సామాజిక న్యాయానికి సంబంధించిన అంశాలు, ఎన్నికల కేసులు, మధ్యవర్తిత్వ అంశాలు, హెబియస్ కార్పస్ అంశాలు, అన్ని క్రిమినల్ కేసులు, అన్నికోర్టు ధిక్కార కేసులు, అన్ని సాధారణ సివిల్ అంశాలు, రాజ్యాంగ నియామకాలు, చట్టబద్ధమైన, న్యాయాధికారుల నియామకాలు, విచారణ కమిషన్ అంశాలు.

జస్టిస్ చలమేశ్వర్: కార్మిక సమస్యలు, ప్రత్యక్ష పన్నుల కేసులు, భూసేకరణ కేసులు, నష్టపరిహార కేసులు, క్రిమినల్ కేసులు, సాధారణ సివిల్ అంశాలు, సాధారణ ద్రవ్య, తనఖా అంశాలు, న్యాయ అధికారులకు సంబంధించిన అంశాలు, సుప్రీంకోర్టు, హైకోర్టు, జిల్లా కోర్టు, ట్రైబ్యునల్స్, స్వతంత్ర న్యాయవ్యవస్థల ఉద్యోగులకు సంబంధించిన అంశాలు, ప్రభుత్వ భవనాల నుంచి తొలగింపు కేసులు, భూచట్టాలు, వ్యవసాయ కౌలు అంశాలు, మారిటైమ్ చట్టాలు, వినియోగదారుల సంరక్షణ.

జస్టిస్ రంజన్ గొగోయ్: మత చట్టాలు, మత, దాతృత్వ సంస్థలు, మర్కంటైల్ చట్టాలు, బ్యాంకులు, ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు ఇచ్చే కాంట్రాక్టులు, ఎక్సైజ్.

జస్టిస్ ఎన్.వి.రమణ: నష్టపరిహార అంశాలు, క్రిమినల్ అంశాలు, కుటుంబ చట్టాలకు సంబంధించిన అంశాలు, సాధారణ సివిల్ అంశాలు, పర్సనల్ లా అంశాలు, మత, దాతృత్వ సంస్థల అంశాలు, ప్రభుత్వ ఆస్తుల నుంచి తొలగింపు కేసులు, అన్ని భూ, వ్యవసాయ కౌలు అంశాలు, వినియోగదారుల పరిరక్షణ.

జస్టిస్ మదన్ బి.లోకూర్: పర్యావరణం, వినియోగదారుల పరిరక్షణ, గనులు, ఖనిజ వనరులు, వ్యక్తిగత చట్టాలు, సాయుధ దళాలు, పారామిలటరీ దళాలు.

జస్టిస్ కురియన్: కార్మిక అంశాలు, నేరాలు, కుటుంబ న్యాయ అంశాలు.

ఇతర సీనియర్ న్యాయమూర్తుల కేసుల విభజన జరిగింది. ఉన్నత న్యాయస్థానంలో న్యాయమూర్తుల నియామకాలు జరిగే పద్ధతిని నిర్దేశించే మెమోరాండం ఆఫ్ ప్రొసీజర్(ఎంఓపీ) పై కూడా ప్రభుత్వం త్వరలో ఒక నిర్ణయానికి రానున్నట్లు తెలిసింది.

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ రాధాకృష్ణన్

- పది హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు ఖరారు
- సుప్రీంకు జస్టిస్ జోసెఫ్, ఇందు మల్హోత్రాలు కూడా



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: సుప్రీంకోర్టుకు ఎంపిక చేసిన న్యాయమూర్తులు, పది రాష్ట్రాల హైకోర్టులకు ఎంపిక చేసిన ప్రధాన న్యాయమూర్తుల జాబితాను సుప్రీంకోర్టు కొలీజియం ప్రకటించింది. అందులో హైదరాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఎంపిక చేసిన జస్టిస్ టి.బి.రాధాకృష్ణన్ కూడా ఉన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా ఎంపికైన జస్టిస్ కె.ఎం.జోసెఫ్, న్యాయవాది ఇందు మల్హోత్రాలపై కేంద్రం అభ్యంతరం వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. ఆ వార్తలను కేంద్రమే ఖండించింది. ఈ నేపథ్యంలో వారి పేర్లను కొలీజియం అధికారికంగా వెల్లడించింది. కలకత్తా, కేరళ హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తులుగా ప్రతిపాదించిన ఇద్దరూ స్థానికులే కావడంతో వారి పేర్లపై కేంద్రానికి అభ్యంతరాలు ఉన్నాయి. కేంద్రం అభ్యంతరం చెప్పినా సుప్రీంకోర్టు మళ్లీ పంపితే ఆమోదించాల్సిందేనన్న నిబంధన విధానపత్రంలో ఉంది. ఆ నిబంధనను ప్రస్తావిస్తూ ఆ ఇద్దరి పేర్లను కూడా సుప్రీంకోర్టు ఖరారు చేసింది.

పోలవరం ఇంప్రెస్ట్ మొత్తం పెంపు

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు ఇంప్రెస్ట్ మొత్తాన్ని రూ.150 కోట్ల నుంచి 160 కోట్లకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. ప్రధాన కాంట్రాక్టు సంస్థతో సహా ఉప కాంట్రాక్టు సంస్థలకు రోజువారీ పనులు నిర్వర్తించేందుకు వీలుగా ఈ మొత్తాన్ని కేటాయించారు. ఈ నిధులను ప్రాజెక్టు ఎస్ఈ ఎప్పటికప్పుడు విడుదల చేయాలని ఉత్తర్వులో పేర్కొంది.

ఏడుగురు సీఈలకు పోస్టింగులు

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): జల వనరుల శాఖలో ఏడుగురు చీఫ్ ఇంజనీర్లకు పోస్టింగులు ఇస్తూ ఆ శాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వు జారీ చేశారు. కె.శ్రీనివాస్‌ను విజయవాడ సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్‌కు, వి.శ్రీధర్‌ను క్వాలిటీ కంట్రోల్‌కు, ఆర్.సతీశ్‌కుమార్‌ను కృష్ణా డెల్టా సిస్టమ్స్‌కు, ఏజీ మల్లికార్జునరెడ్డిని విజయవాడ మైనర్ ఇరిగేషన్, వి.విక్టర్‌బాబును సెక్రటేరియల్ జల వనరులశాఖకు, కె.వరదరాజును విజయవాడ హెచ్ఆర్‌డీకి, మఖ్బూల్ అహ్మద్‌ను కడపకు సీఈలుగా బదిలీ చేశారు.

కాళ్లు కట్టేసి.. సిగరెట్లతో కాల్చి..

- బాలికకు రెండేళ్లు నరకం..

ఫరీదాబాద్‌లో దారుణం

ఫరీదాబాద్, ఫిబ్రవరి 1: ఢిల్లీలో మరో దారుణం. పదిహేనేళ్ల గిరిజన బాలిక.. రెండేళ్లపాటు మృగాళ్ల కామాగ్నికి బలైంది. ఎట్టకేలకు ఆ కామాంధుల నుంచి తప్పించుకొన్న బాలిక ఫరీదాబాద్‌లోని బీకే ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వివరాల్లోకి వెళితే.. జార్ఖండ్‌లోని గొడ్డా జిల్లాకు చెందిన బాలిక (15) రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయింది. దీంతో.. బాలిక అమ్మమ్మ ఆమెను తనతో తీసుకెళ్లింది. ఆమెను ఢిల్లీకి చెందిన సురేందర్ అనే వ్యక్తికి రూ. 4వేలకు అమ్మేసింది. సురేందర్ ఇంట్లో అడుగుపెట్టిన తొలిరోజే ఆమె అత్యాచారానికి గురైంది. ఆ తర్వాత ఆమెను తన స్నేహితుడు మణి మిశ్రా వద్ద పనికి పెట్టాడు. మిశ్రా ఆమెపై తొలిరోజు నుంచే లైంగిక దాడికి పాల్పడ్డాడు. కాళ్లను కట్టేసి, సిగరెట్లతో కాల్చి కామదాహం తీర్చుకున్నాడు. బాలిక ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. నిందితుల కోసం గాలిస్తున్నారు.

కశ్మీర్‌పై బాంబుల వాన..

నౌషేరా, ఫిబ్రవరి 1: జమ్ముకశ్మీర్‌లోని రాజౌరి జిల్లా నౌషేరా సెక్టార్‌లో గురువారం అనేక గ్రామాలపై కాల్పులకు తెగబడింది. కంపల, పుఖేర్ని, లాం, అన్వస్, భందర్, రట్టల్, బసలి, పీబీ గ్రామాలపైకి విచక్షణా రహితంగా కాల్పులు జరిపింది. భారీగా షెల్స్ పడుతుండటంతో 71 స్కూళ్లను మూసివేశారు. కాగా తంగ్‌దర్ సెక్టార్ వద్ద భారత్‌లోకి చొరబడేందుకు యత్నించిన ఉగ్రవాదులను సైన్యం తరిమికొట్టింది.

టీటీడీ నోటీసులు రద్దు చేయండి

- హైకోర్టుకు హిందూయేతర ఉద్యోగుల వినతి

హైదరాబాద్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): టీటీడీ పరిధిలోని ఆలయాల్లో ఉద్యోగాలు చేయరాదంటూ జారీ చేసిన షోకాజ్ నోటీసులు రద్దు చేయాలని కోరుతూ పలువురు హిందూయేతర ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు. హిందూ సంస్థల ఒత్తిడి మేరకు తమతో పాటు 42మంది ఉద్యోగులకు ఆలయ అధికారులు షోకాజ్ నోటీసులు జారీచేసి, విధుల నుంచి తొలగించాలని చూస్తున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు.

'సిట్టింగ్'లో మట్టి కరిచారు

- రాజస్థాన్‌లో బీజేపీకి భారీ షాక్
- రెండు లోక్‌సభ, ఒక అసెంబ్లీ కాంగ్రెస్ కైవసం
- బెంగాల్‌పై సడలని తృణమూల్ పట్టు



రాజస్థాన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల సంబరాలు

ఢిల్లీ, ఫిబ్రవరి 1: బీజేపీ ఒక పక్క సమరోత్సాహంతో ఎన్నికల బడ్జెట్ ప్రవేశపెడుతుంటే.. మరో పక్క రాజస్థాన్‌లో ఆ పార్టీకి ఘోర పరాభవం సంభవించింది. అజ్మీర్, అల్వాల్ లోక్‌సభ, మండల్‌గఢ్ అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు బీజేపీకి గట్టి షాక్ ఇచ్చాయి. బీజేపీకే చెందిన ఆ మూడు సీట్లను కాంగ్రెస్ భారీ మెజారిటీతో ఎగరేసుకుపోయింది. ముఖ్యమంత్రి వసుంధర రాజెకు మొహం చెల్లని పరిస్థితి ఏర్పడింది. గెలిచిన మూడు సీట్లూ కాంగ్రెస్ దిగ్గజాలు సచిన్ పైలట్, సీపీ జోషి, జితేంద్రసింగ్ బన్వర్‌లకు పట్టున్న నియోజకవర్గాలు. పద్మావత్ సినిమా వివాదంలో బీజేపీ రాజ్‌పుట్‌ల వైపు నిలిచినా.. వారి ప్రాబల్యం ఉన్నచోట కాంగ్రెస్ విజయం సాధించడం గమనార్హం. రాజస్థాన్ కాంగ్రెస్ నేతలను రాహుల్‌గాంధీ అభినందించారు. అటు.. పశ్చిమ బెంగాల్‌పై అధికార తృణమూల్ కాంగ్రెస్ పట్టు ఏ మాత్రం సడలలేదు. ఉలుబెరియా లోక్‌సభ స్థానాన్ని ఆ పార్టీ నిలబెట్టుకొంది. నౌపరా శాసనసభ స్థానంలో కాంగ్రెస్‌ను మట్టి కరిపించింది. రెండు స్థానాల్లోనూ తృణమూల్ భారీ ఆధిక్యాన్ని సాధించింది. రెండుచోట్లా బీజేపీ రెండో స్థానంలో నిలిచింది.

సర్కారుకు వత్తాసు పలకను

- అలా అని ఎన్జీవో వైపు మొగ్గను: జస్టిస్ చంద్రచూడ్
- ఆధార్ కేసులో.. సీనియర్ లాయర్ దివాన్‌కు చీవాట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: ఆధార్‌పై సుప్రీంకోర్టులో గురువారం విచారణ జరుగుతుండగా ఒక దశలో న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సహనం కోల్పోయి ఆగ్రహంతో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సీనియర్ న్యాయవాది శ్యాం దివాన్ వైఖరిపై అసహనం వ్యక్తం చేశారు. 'మేము ప్రభుత్వాన్ని సమర్థించడం లేదు. అలా అని స్వచ్ఛంద సంస్థవైపు మొగ్గు చూపడం లేదు' అని వ్యాఖ్యానించారు. ఆధార్‌ను వ్యతిరేకిస్తూ వ్యాజ్యాలు దాఖలు చేసిన పిటిషనర్ల తరపున శ్యాం దివాన్ వాదనలు వినిపిస్తుండగా ఈ పరిస్థితి ఎదురైంది. 'రాజ్యాంగానికి బద్ధుడైన ఒక జాతీయ జడ్జిగా నేను గుర్తింపు పొందాలనుకుంటున్నాను. ఆధార్ జడ్జిగా కాదు' అని ఆగ్రహంతో వ్యాఖ్యానించారు. పదే పదే ప్రశ్నించినా దివాన్ నుంచి సంతృప్తికరమైన సమాధానం రాకపోవడంతో ఆ జడ్జికి కోపం వచ్చింది. ప్రపంచ బ్యాంకు నివేదికను ఉటంకిస్తూ కేంద్రం జారీ చేసిన అఫిడవిట్‌ను దివాన్ ప్రస్తావించారు. దీంతో ఇద్దరి మధ్య మాటమాట పెరిగింది. 'మీరు కేసు వాదించాల్సిన పద్ధతి ఇది కాదు' అని జడ్జి హితవు చెప్పడంతో.. దివాన్ వెంటనే క్షమాపణ కోరారు.

అన్ని మున్సిపాలిటీల్లో మెప్మా బజార్లు: నారాయణ

నరసరావుపేట, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): అన్ని పురపాలక సంఘాలలో మెప్మా బజార్లు ఏర్పాటు చేయనున్నట్టు మునిసిపల్ శాఖ మంత్రి పీ నారాయణ తెలిపారు. తొలి విడతగా నెల్లూరుసహా పది మునిసిపాలిటీలలో వీటి నిర్మాణం చేపట్టనున్నట్టు చెప్పారు. గుంటూరు జిల్లా నరసరావుపేటలో వివిధ ప్రగతి పనులకు గురువారం ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు స్పీకర్ కోడెల శివప్రసాదరావుతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ మునిసిపల్ శాఖలో ఫైళ్ల క్లియరెన్స్‌ను వేగవంతం చేశామన్నారు. ఫైళ్ల క్లియరెన్స్ సగటు 1.37 గంటలు అని తెలిపారు. మార్చి 31 కల్లా అన్ని పురపాలక సంఘాలల్లో ఫైళ్ల క్లియరెన్స్ మూడు గంటల్లో పూర్తి చేయాలని, ప్రిన్సిపల్ సెక్రటరీ వద్ద ఫైళ్ల క్లియరెన్స్ గంటలో పూర్తి చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. పురపాలక సంఘాలలో భవనాల ప్లాన్‌ల అనుమతి ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా 52వేల మంది పొందారని తెలిపారు. అలాగే స్థలాల లే అవుట్‌లకు అనుమతి కూడా ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారానే పొందవచ్చుని చెప్పారు. ఎల్ఈడీ లైట్ల ఏర్పాటులో రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని, ఓడీఎఫ్ అమలు 2016 అక్టోబరు 2 కల్లా అన్ని మునిసిపాలిటీలలో జరిగిందని చెప్పారు. సభలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో మంత్రి నారాయణకు పౌర సన్మానం ఘనంగా జరిగింది.

పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యం రూ.80,000 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ సంస్థల్లో వాటాలు విక్రయించడం ద్వారా వచ్చే ఆర్థిక సంవత్సరం (2018-19)లో 80,000 కోట్ల రూపాయలు సమీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. వాస్తవానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సమీకరించిన (లక్ష కోట్ల రూపాయలు) మొత్తంకన్నా ఇది తక్కువే. 2017-18 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం నిర్దేశించుకున్న పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యం 72,500 కోట్ల రూపాయలు. ఈ లక్ష్యాన్ని అధిగమించడమేకాకుండా లక్ష కోట్ల రూపాయల మైలురాయిని చేరుకున్నట్టు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారు. 40 సిపిఎస్ఇలు, 24 వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణలు జరగనున్నాయని, వీటిలో ఎయిర్ ఇండియా కూడా ఉన్నట్టు ఆయన చెప్పారు.

మోదీ జమానా.. వ్యాపార రంగం



అర్థవంతమైన వృద్ధికి బాట

దేశానికి వెన్నెముక అయిన రైతులతోపాటు పది కోట్ల కుటుంబాలు, వయోజనులు, ఇంకా పలు వర్గాలకు లబ్ధి చేకూర్చే సమగ్ర బడ్జెట్ ఇది. నేషనల్ గోల్డ్ పాలసీ, జిఎస్‌టిఎన్ నెట్‌వర్క్‌తో ట్రెడ్స్ ప్లాట్‌ఫాం అనుసంధానం వంటి పలు విధానపరమైన చర్యలు ఆర్థిక వ్యవస్థ పరివర్తనకు తోడ్పడనున్నాయి. మొత్తంగా చూస్తే.. వచ్చే ఆర్థిక సంవత్సరంలో అర్థవంతమైన వృద్ధి సాధనకు బడ్జెట్ చర్యలు బాగా తోడ్పడనున్నాయి.

– రజనీష్ కుమార్, ఎస్‌బిఐ చైర్మన్





గ్రామీణ ఆర్థికానికి జవసత్వాలు

ఈసారి బడ్జెట్‌లో ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూనే సమాజంలోని ప్రధాన అవసరాలను తీర్చగలిగే చర్యలు చేపట్టారు. అలాగే మౌలిక వసతుల అభివృద్ధికి స్పష్టమైన ప్రణాళికను ప్రకటించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో జవసత్వాలు నింపేందుకు చేపట్టిన చర్యలతో పల్లె జీవి ఆదాయం స్థాయి పుంజుకోవడతోపాటు ఉద్యోగావకాశాలు పెరగనున్నాయి. మొత్తంగా చూస్తే భవిష్యత్‌లో గరిష్ఠ స్థాయి వృద్ధి సాధనతోపాటు సామాజిక సాధికారతను పెంచేలా బడ్జెట్ నిర్ణయాలున్నాయి.

– చందా కొచ్చార్, ఐసిఐసిఐ బ్యాంక్ ఎండి, సిఇఒ

ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూనే

ప్రధాన అవసరాలు తీర్చే ప్రయత్నం

» బడ్జెట్ నిర్ణయాలపై ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ



న్యూఢిల్లీ: బడ్జెట్ నిర్ణయాలను ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సమర్థించుకున్నారు. ఒకవైపు క్రమశిక్షణ పాటిస్తూనే ప్రస్తుతం ఆర్థిక వ్యవస్థలోని ప్రధాన అవసరాలు తీర్చగలిగేలా బడ్జెట్‌ను రూపొందించామన్నారు. "ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటును జిడిపిలో 3.2 శాతానికి కట్టడి చేయాలని తొలుత లక్ష్యం నిర్దేశించుకున్నాం. కానీ ఈ ఆర్థిక సంవత్సరంలో చోటు చేసుకున్న వరుస పరిణామాల వల్ల లక్ష్యం అదుపు తప్పింది. ఒక నెల జిఎస్‌టి వసూళ్లు తగ్గడం అందులో ఒకటి. ఫిబ్రవరి వరకు అందుబాటులో ఉన్న కలెక్షన్లతోనే అంచనాల మదింపు జరిగింది. మార్చి వసూళ్ల వివరాలు ఏప్రిల్‌లో అందుబాటులోకి వస్తాయి" అని బడ్జెట్ అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జైట్లీ పేర్కొన్నారు. "ఈ మధ్యకాలంలో చేపట్టిన వ్యవస్థాగత సంస్కరణలు కూడా సర్కారు ఖజానాపై ప్రభావం చూపాయి. దాంతో ఆర్‌బిఐ, ప్రభుత్వ సంస్థల నుంచి డివిడెండ్ ఆదాయం తగ్గింది. ఆర్థిక ఒత్తిడి కారణంగా స్పెక్ట్రమ్ చార్జీల వసూళ్లు తగ్గాయి" అని అన్నారు. భారీగా పుంజుకున్న ప్రత్యక్ష పన్నుల ఆదాయంతో లోటును కొంత వరకు పూడ్చుకోగలిగినప్పటికీ లక్ష్యానికి అనుగుణంగా ద్రవ్యలోటును కట్టడి చేయలేకపోయామన్నారు. ఈసారి ద్రవ్యలోటు జిడిపిలో 3.5 శాతంగా ఉండనుందన్న జైట్లీ.. వచ్చే ఆర్థిక సంవత్సరం(2018-19)లో 3.3 శాతానికి కట్టడి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. బడ్జెట్‌లో అగ్రి, హెల్త్, రూరల్ ఎకానమీకి పెద్దపీట వేయడంపై జైట్లీ స్పందిస్తూ.. ఈసారి ప్రభుత్వ మద్దతు అవసరమైన రంగాలేవని చూడగా వ్యవసాయం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ముందు వరుసలో నిలిచాయన్నారు.

ఎంఎస్ఎంఇలకు ఊరట

రూ.250 కోట్ల టర్నోవర్ వరకు 25 శాతమే పన్ను

న్యూఢిల్లీ: పన్ను చెల్లింపుల విషయంలో ఎంఎస్ఎంఇలకు కేంద్రం మరింత ఊరట కల్పించింది. గతసారి బడ్జెట్‌లో రూ.50 కోట్ల వరకు వార్షిక టర్నోవర్ కలిగిన ఎంఎస్ఎంఇలకు కార్పొరేట్ టాక్స్‌ను 25 శాతానికి తగ్గించిన జైట్లీ.. ఈసారి పన్ను తగ్గింపు ప్రయోజనం వర్తించే టర్నోవర్ పరిమితిని రూ.250 కోట్లకు పెంచారు. తద్వారా దేశంలో రిటర్నులు దాఖలు చేస్తున్న 99 శాతం ఎంఎస్ఎంఇలకు కార్పొరేట్ పన్ను భారం తగ్గింపు ప్రయోజనం లభిస్తుంది. ఎంఎస్ఎంఇ రంగంలో మొండిబకాయిలు (ఎన్‌పిఎ), ఒత్తిడిలో ఉన్న ఆస్తుల విలువ గణనీయంగా పెరిగిన నేపథ్యంలో ఈ సమస్యను పరిష్కరించేందుకు సమర్థవంతమైన చర్యలు చేపట్టనున్నట్లు జైట్లీ ప్రకటించారు.

వచ్చే ఏడాది విత్త లోటు లక్ష్యం 3.3 శాతం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న విత్త లోటు లక్ష్యం చేజారనుంది. విత్త లోటు లక్ష్యం 3.2 శాతం ఉండగా.. ఇది 3.5 శాతానికి పెరిగే అవకాశం ఉంది. ఈ పరిణామాన్ని దృష్టిలో ఉంచుకుని వచ్చే ఆర్థిక సంవత్సరానికి విత్త లోటు లక్ష్యాన్ని 3.3 శాతంగా ప్రభుత్వం నిర్దేశించింది. 2014-15 ఆర్థిక సంవత్సరంలో విత్త లోటు 4.1 శాతంగా ఉంది. తర్వాతి ఆర్థిక సంవత్సరంలో ఇది 3.9 శాతానికి, ఆ తర్వాతి సంవత్సరం (2016-17)లో 3.5 శాతానికి తగ్గింది.

నల్లధన కట్టడికి మరిన్ని చర్యలు

దేశంలో నల్లధన కట్టడికి తీసుకువచ్చిన పలు పథకాలు మంచి ఫలితాలను ఇచ్చిన నేపథ్యంలో రానున్నకాలంలో మరిన్ని చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. పన్ను ఎగవేతలను కట్టడి చేసే చర్యలు చేపట్టడం వల్ల గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో 90,000 కోట్ల రూపాయలు వసూలయినట్టు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారు. ఆర్థిక వ్యవస్థలో నగదు చలామణిని తగ్గించడంతోపాటు పన్ను పరిధిలోకి మరింత ఎక్కువ మందిని తీసుకురావడం వల్ల మంచి ఫలితాలు కనిపించాయని జైట్లీ పేర్కొన్నారు. గత ఏడాది ప్రత్యక్ష పన్ను వసూళ్లలో 12.6 శాతం వృద్ధి నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జనవరి 15నాటికి వృద్ధి 18.7 శాతంగా ఉంది.

లగ్జరీ కార్లు, బైక్‌లు మరింత ప్రియం



విదేశాల నుంచి దిగుమతి చేసుకునే కార్లు, మోటార్‌సైకిళ్లతో పాటు ట్రక్కులు, బస్సులు రానున్న కాలంలో మరింత ప్రియం కానున్నాయి. విదేశీ మార్కెట్ల నుంచి దిగుమతి చేసుకునే విడిభాగాలపై కస్టమ్స్ సుంకాన్ని ప్రభుత్వం పెంచిన నేపథ్యంలో ఆయా వాహనాల ధరలు కూడా అదే స్థాయిలో పెరిగిపోనున్నాయి. మోటార్ సైకిళ్ళ, మోటార్ కార్లు, మోటార్ సైకిళ్లకు సంబంధించిన సికెడి దిగుమతులపై కస్టమ్స్ సుంకాన్ని ప్రభుత్వం 10 శాతం నుంచి 15 శాతానికి పెంచింది. అంతేకాకుండా ట్రక్కులు, బస్సులకు సంబంధించిన సిబియు దిగుమతులపై సుంకాన్ని 20 శాతం నుంచి 25 శాతానికి పెంచారు. మోటార్ వాహనాలు, మోటార్ కార్లు, మోటార్‌సైకిళ్లకు సంబంధించిన కొన్ని విడిభాగాలు/యాక్సెసరీలపై కస్టమ్స్ సుంకాన్ని 7.5 శాతం నుంచి 15 శాతానికి పెంచిన విషయం తెలిసిందే. ట్రక్, బస్ రేడియల్ టైర్లపైనా దిగుమతి సుంకాన్ని 10 శాతం నుంచి 15 శాతానికి పెంచారు. ఈ నేపథ్యంలో వీటన్నింటి ధరలు దేశీయ మార్కెట్లో పెరగనున్నాయి. మేక్ ఇన్ ఇండియాను ప్రోత్సహిస్తూ దేశీయంగా ఉపాధి కల్పనను పెంచేందుకు కస్టమ్స్ సుంకాన్ని పెంచుతున్నట్టు జైట్లీ పేర్కొన్నారు.

ఇన్‌ఫ్రాకు

రూ.5.97 లక్షల కోట్లు

వసతుల అభివృద్ధికి 10 వేల కోట్ల రూపాయలు కేటాయించినట్టు జైట్లీ ప్రకటించారు. 2019 మార్చి నాటికి రెండున్నర లక్షల గ్రామ పంచాయతీలను భారత్ నెట్ ప్రాజెక్టు కింద అనుసంధానం చేయను

ఏ రంగానికి ఎంత?

న్యూఢిల్లీ : ఆర్థిక రంగానికి చోదక శక్తి మౌలిక వసతులేనని ప్రకటించిన జైట్లీ ఆ రంగానికి 5.97 లక్షల కోట్ల రూపాయలు కేటాయించారు. ఈ ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఇది లక్ష కోట్ల రూపాయలు అధికం. దేశ ఇన్‌ఫ్రా అవసరాలు భారీగా ఉన్నాయని, రోడ్లు, విమానాశ్రయాలు, రైల్వే, అంతర్గత జలవనరుల రంగాలను సమీకృతం చేసి ప్రజలకు మెరుగైన వసతులు అందుబాటులో ఉంచేందుకు 50 లక్షల కోట్ల రూపాయల భారీ పెట్టుబడులు అవసరమని జైట్లీ అన్నారు. తొమ్మిది వేల కిలోమీటర్లకన్నా పైన నిడివి గల జాతీయ రహదారులను 2018-19 సంవత్సరంలో పూర్తి చేస్తామని చెప్పారు. దేశవ్యాప్తంగా ఎలాంటి అవరోధాలు లేని కనెక్టివిటీ కల్పించేందుకు భారత్ మాల ప్రాజెక్టును ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని, ఈ ప్రాజెక్టు మొదటి దశలో 5.35 లక్షల కోట్ల రూపాయల వ్యయంతో 35 వేల కిలోమీటర్ల రహదారుల నిర్మాణం జరుగుతుందని జైట్లీ తెలిపారు. ప్రధాని మౌలిక వసతుల రంగంలో పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, ఆన్‌లైన్‌లో పర్యవేక్షించే విధానం ప్రగతి కింద 9.46 లక్షల కోట్ల రూపాయల ప్రాజెక్టులను ఫాస్ట్‌ట్రాక్ చేశారని చెప్పారు. రైల్వే, రోడ్డు రంగాలకు ప్రభుత్వం చారిత్రక గరిష్ఠ స్థాయిలో కేటాయింపులు చేసిందని ఆయన అన్నారు. నగరాలకు అత్యాధునిక మౌలిక వసతులు కల్పించేందుకు 99 నగరాలను 2.04 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడితో స్మార్ట్ సిటీలుగా అభివృద్ధి చేస్తున్నట్టు ఆర్థికమంత్రి చెప్పారు.

టెలికాం ఇన్‌ఫ్రాకు రూ.10 వేల కోట్లు

వివిధ ప్రభుత్వ ప్రాజెక్టుల కింద టెలికాం మౌలిక



న్నట్టు చెప్పారు. ఈ ప్రాజెక్టు తొలి దశలో భాగంగా లక్ష గ్రామ పంచాయతీలకు ఇప్పటికే హైస్పీడ్ ఆప్టిక్ ఫైబర్ నెట్‌వర్క్ నిర్మించినట్టు తెలిపారు. ఐదు కోట్ల మంది గ్రామీణ పౌరులకు బ్రాడ్‌బ్యాండ్ అందుబాటులోకి తేవడానికి 5 లక్షల వైఫై హాట్‌స్పాట్‌లు ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. ఆధునిక టెక్నాలజీలను ఉపయోగించుకోవడానికి ప్రధానంగా ఐదో తరం సాంకేతిక పరిజ్ఞానాలను ఆచరణీయం చేయడానికి ఐఐటీ-చెన్నై సహాయంతో 5జి సెంటర్ల ఏర్పాటుకు టెలికాం శాఖ మద్దతు ఇస్తుందని ఆయన అన్నారు.

- కృత్రిమ మేధస్సు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మెషీన్ లెర్నింగ్ వంటి డిజిటల్ టెక్నాలజీలను అమలులోకి తీసుకురావడానికి సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖకు 3,073 కోట్ల రూపాయలు కేటాయించారు. ఈ మూడు విభాగాలతో పాటు డిజిటల్ మాన్యుఫాక్చరింగ్, బిగ్ డేటా ఇంటెలిజెన్స్, క్వాంటమ్ కమ్యూనికేషన్స్, ఆర్ట్ ఆఫ్ థింగ్స్ విభాగాల్లో శిక్షణ, నైపుణ్యాల అభివృద్ధికి ఆ శాఖ ఒక బృహత్ కార్యక్రమం ప్రారంభిస్తుందని ఆయన చెప్పారు.
- టెలికాం స్పెక్ట్రమ్ అమ్మకం ద్వారా కొత్త ఆర్థిక సంవత్సరంలో 48661,42 కోట్ల రూపాయలు సమకూరగలవని ఆశిస్తున్నట్టు జైట్లీ చెప్పారు. స్పెక్ట్రమ్ వేలం ద్వారా ఖజానాకు అధిక మొత్తంలో ఆదాయం వస్తోంది. బిడ్‌లు దాఖలు చేయడానికి తమకు కొంత వ్యవధి కావాలని టెలికా కంపెనీలు కోరినందు వల్ల ఈ ఆర్థిక సంవత్సరంలో వేలం చేపట్టలేదు. మొబైల్ సర్వీసులకు ఉపయోగించే స్పెక్ట్రమ్ ధరను, వేలం వేసేందుకు అనుకూలమైన సమయాన్ని సూచించాలని టెలికాం శాఖ ట్రాయ్‌ని కోరింది. ఈ సిఫారసులకు అనగుణంగానే 2018-19 ఆర్థిక సంవత్సరంలో స్పెక్ట్రమ్ వేలం జరుగుతుంది.

సిబిఇసి పేరు మార్పు


పరోక్ష పన్నులన్నీ జిఎస్‌టిలో కలిసిపోయినందు వల్ల కేంద్ర ఎక్సైజ్, కస్టమ్స్ బోర్డు పేరును కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డుగా మార్చుతున్నట్టు జైట్లీ ప్రకటించారు.

పౌర విమానయానానికి రూ.6,602 కోట్లు

పౌరవిమానయాన మంత్రిత్వ శాఖకు 6,602.86 కోట్ల రూపాయలు కేటాయించారు. అత్యంత ప్రముఖుల కోసం రెండు విమానాల కొనుగోలుకు ఇందులో 4,469.50 కోట్ల రూపాయలు కేటాయిస్తారు. ఈ ఆర్థిక సంవత్సరం కేటాయింపుల కన్నా ఇది మూడు రెట్లు అధికం.

- ప్రాంతీయ కనెక్టివిటీ లేదా ఉడాన్ పథకానికి కేటాయింపులు 1014.09 కోట్ల రూపాయలకు పెంచారు. ఈ స్కీమ్ కింద ఇప్పటివరకు నిరుపయోగంగా ఉన్న 56 విమానాశ్రయాలు, 31 హెలీపాడ్‌లను రాకపోకలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తారు. ఏడాదికి వంద కోట్ల ట్రిప్‌లను నడపడానికి అనుగుణంగా విమానాశ్రయాల సామర్థ్యాలను విస్తరించనున్నట్టు జైట్లీ తెలిపారు. గత మూడేళ్లలో విమాన ప్రయాణికులు 18 శాతం పెరిగారని, విమానయాన రంగంలోని కంపెనీలు 900 విమానాలకు ఆర్డర్లు ఇచ్చాయని ఆయన చెప్పారు.
- పెట్టుబడుల ఉపసంహరణ జాబితాలో ఉన్న ఎయిరిండియాకు ఈ బడ్జెట్‌లో 650 కోట్ల రూపాయలు కేటాయించారు. గత ఏడాది కేటాయింపులు 1800 కోట్ల రూపాయల కన్నా ఇది చాలా తక్కువ.

ప్రజాకర్షక బడ్జెట్



జైట్లీ బడ్జెట్ కార్పొరేట్ సంస్థలకు ఏ మాత్రం ప్రోత్సాహకరంగా లేదు. ఆరోగ్య శ్రీని పెద్ద స్థాయిలో విస్తరించి ఆయుష్మాన్ భారత్ స్కీమ్‌ను ప్రతిపాదించారు. 50 కోట్ల మంది ప్రజలకు మేలు చేసే విధంగా ఉన్న ఈ ప్రతిపాదనను ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ముందుకు తెచ్చారు. వ్యక్తిగత ఆదాయం పన్ను చెల్లింపుదారులకు సంబంధించి బడ్జెట్ ఏ మాత్రం ఊరటనివ్వలేదు. కొత్తగా 40వేల రూపాయల స్టాండర్డ్ డిడక్షన్‌ను ప్రవేశపెట్టినా, ఇప్పటి వరకు 15 వేల రూపాయల వరకు వైద్య బిల్లులు, 19,200 రూపాయల రవాణా ఖర్చులకు సంబంధించిన అమల్లో ఉన్న పన్ను మినహాయింపులను తీసివేశారు. స్టాండర్డ్ డిడక్షన్ వల్ల అదనంగా ఒనగూరే ప్రయోజనం 5,800 రూపాయలు మాత్రమే. పైగా సెస్‌ను 3 నుంచి 4 శాతానికి పెంచారు. దీనివల్ల పడే అదనపు భారంతో పోలిస్తే స్టాండర్డ్ డిడక్షన్ వల్ల కలిగే లాభం ఏమీలేదు. ఈక్విటీలపై దీర్ఘకాలిక కాపిటల్ గెయిన్స్‌ను విధించడం మార్కెట్లకు ప్రతికూలంగా ఉంటుంది. సీనియర్ సిటిజన్స్ విషయంలో కొన్ని వెసులుబాట్లు ఇచ్చారు. స్థూలంగా చూస్తే ఎన్నికల కారణంగా ప్రజాకర్షకంగా తయారు చేయాలన్న భావనే బడ్జెట్‌లో ఉంది.

– దాట్ల ప్రసాదరాజు, చార్టర్డ్ అకౌంటెంట్

ఇన్వెస్టర్లూ జాగ్రత్త



స్టాక్ మార్కెట్లకు ప్రస్తుత బడ్జెట్ ఏమాత్రం ప్రోత్సాహకరంగా లేదు. సెక్యూరిటీస్ లావాదేవీల పన్నును కొనసాగిస్తూనే ఇప్పుడు 10 శాతం దీర్ఘకాలిక కాపిటల్ గెయిన్స్ విధించడం సరైనది కాదు. చిన్నమధ్య తరహా పరిశ్రమలకు కార్పొరేట్ పన్నును 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గించడం మాత్రం ఆహ్వానించదగింది. గతేడాది స్టాక్‌మార్కెట్లో కాపిటల్ గెయిన్స్ బుకింగ్ 3.5లక్షల కోట్ల రూపాయల మేర ఉన్నట్టు వెల్లడికావడమే ప్రభుత్వం కాపిటల్ గెయిన్ పన్ను విధించడానికి కారణమని చెబుతున్నారు. ఇన్వెస్టర్లు ప్రతి ఏడాది ఆ స్థాయిలో లాభాలను స్వీకరించే పరిస్థితి ఉండదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో మార్కెట్ నిలదొక్కుకోవాలంటే మ్యూచువల్ ఫండ్స్ దగ్గర ఉన్న ఫండ్స్ చాలా కీలకం. కొత్తగా వస్తున్న ఐపిఒల వల్ల ఎంఎఫ్‌లోకి ఫండ్స్ ప్రవాహం తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతమున్న పరిస్థితుల్లో ఇన్వెస్టర్లు జాగ్రత్తగా మంచి స్టాక్స్‌ను, లేదా కొన్ని ఎంపిక చేసిన రంగాలను దృష్టిలో ఉంచుకొని పెట్టుబడి పెట్టాలి. దూకుడు నిర్ణయాలు తీసుకోవద్దు. కరెక్షన్ అవకాశాలనే ఏమాత్రం తోసిపుచ్చలేము.

ఎఎస్ఎస్ఎన్ రాజు, మార్కెట్ ఎనలిస్ట్

ఇక కంపెనీలకూ ఆధార్!

» ప్రతి సంస్థకు విశిష్ఠ గుర్తింపు నంబరు



న్యూఢిల్లీ: ఆధార్ కార్డుల జారీ ద్వారా దేశ ప్రజలందరికీ విశిష్ఠ గుర్తింపునిస్తున్న కేంద్ర ప్రభుత్వం.. ఇకపై వ్యాపార సంస్థలకు సైతం ఇదే తరహా గుర్తింపు కల్పించాలనుకుంటోంది. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా దేశంలోని కంపెనీలన్నింటికీ విశిష్ఠ గుర్తింపు నంబర్ కేటాయించేందుకు త్వరలో ఓ ప్రాజెక్టును చేపట్టాలనుకుంటున్నట్లు బడ్జెట్ ప్రజెంటేషన్‌లో అరుణ్ జైట్లీ ప్రకటించారు. ఇప్పటివరకు దేశంలో 119 కోట్ల మందికి ఆధార్ కార్డులు జారీ అయ్యాయి. ప్రభుత్వంతోపాటు ప్రైవేట్ పథకాలు, ఇతర అవసరాలకు వ్యక్తిగత ధ్రువీకరణగా ఆధార్‌ను తప్పనిసరి చేశారు. ఉదాహరణకు మొబైల్ సిమ్ కావాలన్నా.. పాన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నా వినియోగదారులు తప్పక ఆధార్ వివరాలు సమర్పించాల్సిందే. వ్యక్తిగత వివరాల భద్రత దృష్ట్యా ఈమధ్యే కేంద్రం ఆధార్ నంబరుకు బదులుగా వర్చువల్ ఐడిని సమర్పించే వెసులుబాటు కల్పించింది.

మార్కెట్ రుణాలు రూ.4 లక్షల కోట్లు

వచ్చే ఆర్థిక సంవత్సరం (2018-19)లో ప్రభుత్వం మార్కెట్ నుంచి 4.07 లక్షల కోట్ల రూపాయల రుణాలు సమీకరించనుంది. ఈ మొత్తం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంకన్నా 73,000 కోట్ల రూపాయలు తక్కువ.

ఎఫ్‌సిఐ మూలధన పునర్వ్యవస్థీకరణ

ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సిఐ) మూలధనాన్ని పునర్వ్యస్థీకరించనున్నట్లు కేంద్రం తెలిపింది. తద్వారా ప్రభుత్వ ఈక్విటీ వాటా పెరగడంతోపాటు నిర్వహణ మూలధనం అవసరాలకు అనుగుణంగా సంస్థ నిధులు సేకరించేందుకు వీలుపడనుంది. ఎఫ్‌సిఐ ప్రభుత్వం తరపున ఆహార ధాన్యాలు కొనుగోలు, సరఫరా చేసే ఏజెన్సీ.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశ ఎగుమతులు 15 శాతం వృద్ధిని నమోదు చేసుకునే అవకాశం ఉందని అరుణ్ జైట్లీ పేర్కొన్నారు. 2017 డిసెంబరు నాటికి ఎగుమతులు 12.36 శాతం మేర పెరిగి 2,703 కోట్ల డాలర్లకు చేరుకున్నాయి. ఏప్రిల్-డిసెంబరు మధ్యకాలంలో ఎగుమతులు 12.05 శాతం వృద్ధితో 22,351.2 కోట్ల డాలర్లకు చేరాయి.

వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల వృద్ధికి చర్యలు

రానున్న కాలంలో వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు 10,000 కోట్ల డాలర్లకు చేరుకునే అవకాశం ఉంది. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోనుంది.

ఎగుమతుల్లో 15 శాతం వృద్ధి



ప్రస్తుతం మన దేశం నుంచి వ్యవసాయ ఎగుమతులు 3,000 కోట్ల డాలర్లుగా ఉన్నాయి. 10,000 కోట్ల డాలర్లకు ఈ ఎగుమతులు చేరుకునేందుకుగా ప్రభుత్వం కొన్ని సరళతర నిర్ణయాలు తీసుకోనుంది. అత్యాధునిక సదుపాయాలతో కూడిన 42 మెగా ఫుడ్ పార్కులను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది.

పరిశ్రమకు నిరాశ



ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం పరిశ్రమకు మొండి చేయి చూపింది. ఇది పూర్తిగా ఎన్నికల బడ్జెట్. ప్రజాకర్షక బడ్జెట్. అయితే వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, మౌలిక సదుపాయాలు, గ్రామీణ అభివృద్ధి, ఆరోగ్యం, విద్యకు ప్రభుత్వం పెద్ద పీట వేయడం స్వాగతించదగినదే. బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ప్రయోజనం కలిగే ప్రకటనలు వెలువడకపోవడం నిరాశపరిచింది. నాలుగేళ్ల కాలంలో కార్పొరేట్ పన్నును 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గించనున్నట్టు ఇంతకు ముందు అరుణ్ జైట్లీ ప్రకటించారు. కానీ ఈ మేరకు తగ్గించడం లేదు. 250 కోట్ల రూపాయల వరకు టర్నోవర్‌ను నమోదు చేసే కంపెనీలకు పన్ను ప్రయోజనం కల్పించారు. ఇది ఎంఎస్ఎంఇలకు లబ్ధి చేకూర్చే అంశం.

– గౌర శ్రీనివాస్, ప్రెసిడెంట్, ఎఫ్‌టాప్సీ

టెక్నాలజీకి పెద్దపీట



ఎమర్జింగ్ టెక్నాలజీకు అత్యంత ప్రాధాన్యతనివ్వటంతో భారత్ డిజిటల్ సొసైటీగా మారేందుకు అవకాశం లభించింది. ఎఐ, రోబోటిక్స్, డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్, ఐఒటిల్లో పరిశోధన, శిక్షణ విభాగాల్లో పెట్టుబడులతో కొత్త ఉద్యోగాల కల్పన సాధ్యంకానుంది. 2020 నాటికి 50 లక్షల మంది యువతకు విద్య, నైపుణ్యాల శిక్షణ, ప్రముఖ ఇనిస్టిట్యూట్లలో 1000 మంది అత్యుత్తమ ఇంజనీర్లకు పరిశోధన సదుపాయాలు కల్పించటం ముదావహం.

– బివిఆర్ మోహన్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ చైర్మన్, సైయెంట్

కొత్త వ్యాపారాలకు బాటలు

దేశంలో కొత్త వ్యాపారాలకు బాటలు వేసేదిగా ఉంది. మొబైల్ ఫోన్లపై బేసిక్ కస్టమ్స్ సుంకాలను 20 శాతానికి పెంచటం స్థానిక తయారీకి ఊతమిచ్చే విధంగా ఉంది. పలు అంతర్జాతీయ బ్రాండ్లు భారత్‌లో తయారీకి మొగ్గు చూపే విధంగా బడ్జెట్ బాటలు వేసింది. గ్లోబల్ ఇన్నోవేషన్‌లో ఒఇఎం, ఐఒటిల్లో భారత్ బ్రాండ్‌ను మరింత పటిష్ఠం చేసేదిగా ఉంది.

– మహేష్ లింగారెడ్డి, చైర్మన్, స్మాట్రాన్

'ఆయుష్మాన్ భారత్' అద్భుత పథకం

స్వస్థ భారత్‌ను సృష్టించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకం ప్రారంభించడం హర్షణీయం. ఇలాంటి ఆలోచనలు, పథకాలు ప్రస్తుతం దేశానికి ఎంతో అవసరం.

– ప్రతాప్ సి రెడ్డి, చైర్మన్, అపోలో హాస్పిటల్స్

ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య సంరక్షణ పథకం. ఈ పథకం ద్వారా ప్రభుత్వం ఆరోగ్య సంరక్షణను అందుబాటు ధరల్లో అందరికీ అందుబాటులోకి తెచ్చింది.

– సునీతా రెడ్డి, ఎండి, అపోలో హాస్పిటల్స్

ప్రధాని మోదీ ప్రకటించిన డిజిటల్ ఇండియా స్వప్నం నెరవేర్చడంలో టెలికాం రంగానిదే కీలక పాత్ర. అయితే ఆర్థిక మంత్రి బడ్జెట్‌లో కనీసం మాట మాత్రంగా కూడా మా సమస్యలను ప్రస్తావించకపోవడం తీవ్ర నిరాశ కలిగిస్తోంది.

– రాజన్ మాథ్యూస్, డైరెక్టర్ జనరల్, సిఒఎఐ

బడ్జెట్ .. నిరుత్సాహపరిచింది

బడ్జెట్ తీవ్రంగా నిరుత్సాహపరిచింది. అమరావతి రాజధానికి కేటాయింపులు లేవు. అమరావతి నుంచి అనంతపురం హై వేకు నిధులు కేటాయిస్తారనుకుంటే ఎలాంటి కేటాయింపులు చేయలేదు. ఎయిమ్స్‌కు నామమాత్రపు కేటాయింపులు చేశారు. పోలవరం ప్రాజెక్టుకు ఆర్థిక సహాయం చేస్తున్నట్టు చెప్పలేదు. విజయవాడకు రైల్వే జోన్ వస్తుందనుకుంటే అదీ లేదు. ప్రత్యేక ప్యాకేజీ కింద సహాయం చేస్తామని ఇంతకు ముందు కేంద్రం చెప్పింది. ఇప్పటి వరకు ఆ దిశగా సాయం లేదు. పోనీ, బడ్జెట్‌లో అయినా రాయితీలు ఇస్తారా అంటే అదీ లేదు. ఎంఎస్ఎంఇ రంగానికి కార్పొరేట్ టాక్స్‌ను 30 నుంచి 25 శాతానికి తగ్గించారు. ఇదొక్కటే స్వాగతించాల్సిన విషయం. ఇంతకు మించి పారిశ్రామిక రంగానికి ఎటువంటి ఊతం లేదు. ఆక్వా రంగానికి రూ. 10 వేల కోట్లు కేటాయించినా ముఖ్యమైన ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి ఎలాంటి కంటితుడుపు కేటాయింపులు చేశారు.

– పొట్లూరి భాస్కరరావు, ఎపి చాంబర్ ఆఫ్ కామర్స్

బడ్జెట్ సమతూకం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విశాఖపట్నం రైల్వే జోన్‌ను ప్రకటించక పోవడం మినహా వ్యాపార వర్గాలకు, వ్యవసాయరంగానికి భారీగా కేటాయింపులు చేయడం ఆహ్వానించదగినది. దీర్ఘకాలిక, స్వల్పకాలిక ప్రయోజనాలను బ్యాలెన్స్ చేసుకుంటూ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ప్రధానంగా ఎంఎస్ఎంఇ, ముద్రా లోన్లకు, రోడ్డు డెవలప్‌మెంట్‌కు భారీ కేటాయింపులు చేశారు. దీంతో పాటు ప్రధానంగా వ్యవసాయరంగానికి పెద్దపీట వేశారు. ఆక్వా రంగానికి రూ. 10 వేల కోట్లు, ఫుడ్ ప్రాసెసింగ్‌కు రూ. 1,400 కోట్లు, అగ్రికల్చరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు రూ. 2,000 కోట్లు, ఫార్మ్ క్రెడిట్‌కు రూ. 11 లక్షల కోట్లు, 42 మెగా ఫుడ్‌పార్కుల ఏర్పాటు చేయడానికి సంకల్పించారు. అందులో ఎపిలో 13 ఫుడ్‌పార్కులను ఏర్పాటు చేయనుండడం ఆహ్వానించదగిన పరిణామం. వ్యాపార, పారిశ్రామిక రంగాలకు ఈ బడ్జెట్ అనుకూలంగా ఉంది.

– ఎపి ఛాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ జి సాంబశివరావు

డిజిటల్ ఇండియాకు దన్ను



డిజిటల్ ఇండియాను మరింత చేరువ చేసేదిగా బడ్జెట్ ఉంది. ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ (ఎఐ), మెషిన్ లెర్నింగ్, రోబోటిక్స్, డేటా సైన్సెస్‌లో ఆర్ అండ్ డి, శిక్షణ, నైపుణ్యాల శిక్షణ కోసం నిధులు కేటాయించటం స్వాగతించదగిన పరిణామం. బ్లాక్‌చెయిన్, డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్, ఐఒటి, క్వాంటమ్ కంప్యూటింగ్, బిగ్ డేటా వంటి వాటిపై దృష్టి పెట్టడం ముదావహం.

– సుమన్ రెడ్డి, ఎండి, పెగా సిస్టమ్స్

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం	వెండి	రూపాయి డాలర్	ముడి చమురు
35906.66	11016.90	30450	39335	64.02	69.47
↓ 58.36	↓ 10.80	↑ 60	↑ 165	↓	↑

ముంబై - 10 గ్రాములు (99.9 స్వచ్ఛత)

మూడు సాధారణ బీమా కంపెనీల విలీనం

» స్టాక్ మార్కెట్లో నమోదు



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణలో భాగంగా సర్కారు మరో ముందడుగు వేస్తోంది. ఇందులో భాగంగా మూడు సాధారణ బీమా కంపెనీలను విలీనం చేసి ఒక సంస్థగా ఏర్పాటు చేయనుంది. తదనంతరం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేయనుంది. ఈ మూడు ప్రభుత్వరంగ కంపెనీల్లో నేషనల్ ఇన్సూరెన్స్, యునైటెడ్ ఇండియా అష్యూరెన్స్, ఓరియెంటల్ ఇండియా ఇన్సూరెన్స్ ఉన్నాయి. 24 ప్రభుత్వరంగ కంపెనీల్లో వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణను సర్కారు ప్రారంభించింది. వీటిలో ఎయిర్ ఇండియా కూడా ఉంది.

ఈక్విటీపై పన్ను పోటు



ఏటా రూ.20,000 కోట్ల ఆదాయం! ఎస్‌టిటి ఉండగానే ఇప్పుడు ఎల్‌టిసిజి

ముంబై : భయపడిందే జరిగింది. స్టాక్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్‌లో పథకాలపై ఆర్జించే దీర్ఘకాలిక లాభాలపైనా ఆర్థిక మంత్రి పన్నుల భారం మోపారు. ప్రస్తుతం ఏదైనా లిస్టెడ్ కంపెనీ షేర్లు లేదా మ్యూచువల్ ఫండ్ సంస్థల ఈక్విటీ పథకాల యూనిట్లను కొని ఏడాది కంటే తక్కువ కాలంలో అమ్మితే వచ్చే లాభాలపైనే 15 శాతం చొప్పున స్వల్పకాలిక మూలధన లాభాల (ఎస్‌టిజిసి) పన్ను విధిస్తున్నారు. ఏడాది తర్వాత అమ్ముకుంటే వచ్చే లాభాలపై ఎలాంటి పన్ను లేదు. ఇప్పుడు ఈ వార్షిక లాభం రూ.లక్షకు మించితే 10 శాతం ఎల్‌టిజిసి పన్ను చెల్లించాలి. అయితే గడచిన జనవరి 31 వరకు అమ్ముకున్న షేర్లపై వచ్చే దీర్ఘకాలిక లాభాలకు ఇది వర్తించదు. ప్రస్తుతం స్టాక్ మార్కెట్ మంచి లాభాలు పంచుతున్నందున ఈ లాభాలపై ఎల్‌టిజిసి విధించాల్సిన సమయం ఆసన్నమైందని జైట్లీ చెప్పారు. ఈ విషయం ప్రకటించడంతోనే సెన్సెక్స్ 400 పాయింట్ల వరకు నష్టపోయింది. ఆ వెంటనే కోలుకుని స్వల్ప నష్టాలతో ముగిసింది. ఎల్‌టిసిజి ద్వారా తొలి ఏడాదే ప్రభుత్వానికి రూ.20,000 కోట్ల వరకు ఆదాయం సమకూరుతుందని అంచనా. ముందుముందు ఈ ఆదాయం మరింత పెరుగుతుందని ప్రభుత్వ అంచనా వేస్తోంది. సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ టాక్స్ (ఎస్‌టిటి) రద్దు చేయకుండా ఈక్విటీ మార్కెట్లపై ఎల్‌టిసిజి విధించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

'జనవరి 31 వరకు వచ్చిన దీర్ఘకాలిక మూలధన లాభాలను పన్ను నుంచి మినహాయించారు. ఇది చాలా సమతూకంతో తీసుకున్న చర్య.
- రాకేశ్ నంజియా, మేనేజింగ్ పార్టనర్, నంజియా అండ్ కంపెనీ

ప్రపంచంలో మన దేశంలో తప్ప మరెక్కడా ఒకేసారి ఈక్విటీ మార్కెట్‌పై ఎల్‌టిసిజి, ఎస్‌టిటి లేదు. ఈ చర్య తప్పనిసరిగా మార్కెట్ సెంటిమెంట్‌ని దెబ్బతీస్తుంది.
- బి గోపకుమార్, సిఇఒ, రిలయన్స్ సెక్యూరిటీస్

'ఇది ఈక్విటీ మార్కెట్‌లో ఇన్వెస్ట్ చేసే మదుపరులను తీవ్రంగా దెబ్బతీస్తుంది. ఈ చర్యతో పెట్టుబడుల కోసం మళ్లీ బంగారం, స్థిరాస్తులకు డిమాండ్ పెరిగే అవకాశం ఉంది.
- అమిత్ మహేశ్వరి, పార్టనర్, అశోక్ మహేశ్వరి అండ్ అసోసియేట్స్

మ్యూచువల్ ఫండ్స్‌కు దెబ్బ

ఈ బడ్జెట్‌లో మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) ఈక్విటీ పథకాల ఇన్వెస్టర్లకు దెబ్బ మీద దెబ్బ పడింది. ఎల్‌టిసిజితోపాటు ఈ పథకాల కింద మ్యూచువల్ ఫండ్ సంస్థలు ఇన్వెస్టర్లకు ఏదైనా ఆదాయం పంపిణీ చేస్తే మ్యూచువల్ ఫండ్ సంస్థలు 10 శాతం పన్ను చెల్లించాలని ఆర్థిక మంత్రి ప్రతిపాదించారు. ఈ సంవత్సరం ఏప్రిల్ 1 నుంచే ఈ నిర్ణయం అమలులోకి వస్తోంది. దీనికి తోడు ఏడాదికి ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడుల అమ్మకాలపై వచ్చే లాభం రూ.లక్షకు మించి ఉన్నా దీర్ఘ కాలిక మూలధన లాభాల(ఎల్‌టిసిజి) కింద మరో 10 శాతం పన్ను చెల్లించాలని ఆర్థిక మంత్రి జైట్లీ ప్రతిపాదించారు. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ ద్వారా పెద్ద మొత్తంలో పెట్టుబడులు స్టాక్ మార్కెట్‌కు వస్తున్న సమయంలో ఆర్థిక మంత్రి ఈ నిర్ణయాలు తీసుకోవడం విశేషం. పథకాల పనితీరును బట్టి మ్యూచువల్ ఫండ్ సంస్థలు సాధారణంగా డివిడెండ్ రూపంలో ఇలా ఆదాయాన్ని పంపిణీ చేస్తుంటాయి. ప్రస్తుతం ఇలాంటి ఆదాయంపై ఎలాంటి పన్ను పోటు లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని కొంత రిస్క్ తీసుకోగలిగిన ఇన్వెస్టర్లు మంచి రాబడులు ఇచ్చే ఈక్విటీ పథకాల్లో ఇన్వెస్ట్ చేస్తుంటారు. తాజా పన్ను పోటుతో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు తగ్గే ప్రమాదం ఉందని భావిస్తున్నారు.



'ప్రస్తుతం చాలా మంది ఇన్వెస్టర్లు మ్యూచువల్ ఫండ్ పథకాల ద్వారా స్టాక్ మార్కెట్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నారు. ఈ చర్య వారి నమ్మకాన్ని దెబ్బతీసే అవకాశం ఉంది.
- దీపక్ పరేఖ్, చైర్మన్, హెచ్‌డిఎఫ్‌సి ఏఎంసి



కాపిటల్ గెయిన్స్‌తో గడగడ

ఇంట్రాడేలో సెన్సెక్స్ భారీ ఆటుపోట్లు

ముంబై : మార్కెట్ ఆశలను బడ్జెట్ ఘోరంగా దెబ్బతీసింది. జైట్లీ బడ్జెట్‌పై భారీ అంచనాలతో గురువారం ప్రారంభం నుంచే లాభాల్లో ఉన్న కీలకసూచీలు, దీర్ఘకాలిక కాపిటల్ గెయిన్స్ టాక్స్ తెరపైకిరావడంతో ఒక్కసారిగా కుప్పకూలాయి. బడ్జెట్‌లోని పలు ప్రతికూల అంశాలు మార్కెట్ సెంటిమెంట్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి. ద్రవ్య లోటు టార్గెట్ మార్కెట్‌ను తీవ్రంగా నిరుత్సాహపర్చింది. ట్రేడింగ్ చివరలో దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు భారీ స్థాయిలో జరిపిన కొనుగోళ్లతో మార్కెట్ నష్టాలనుంచి కొంతమేర బయటపడినప్పటికీ నెగిటివ్ సెంటిమెంటే మార్కెట్‌ను డామినేట్ చేసింది. జైట్లీ ప్రసంగం సాగిన రెండు గంటలపాటు మార్కెట్లు తీవ్రమైన ఆటుపోట్లతో ఇన్వెస్టర్లను ఉక్కిరిబిక్కిరి చేశాయి. ఆఖరులో వచ్చిన సానుకూల సమీక్షలు మార్కెట్ మూడ్‌ను మార్చాయి. ఇన్‌ఫ్రా, ఫుడ్‌ప్రాసెసింగ్, కాపిటల్ గూడ్స్, మెటల్ షేర్లు లాభాల్లోకి వచ్చాయి.

గురువారం ఏం జరిగిదంటే...

ఆర్థిక మంత్రి జైట్లీ పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రసంగం ప్రారంభించే సమయానికి మార్కెట్లు లాభాల్లో ఉన్నాయి. ఉదయం 11 గంటలకు పార్లమెంట్‌లో జైట్లీ బడ్జెట్ ప్రసంగం ప్రారంభం కావడం, ఆరంభ వాక్యాలు ఆశాజనకంగా ఉండటంతో మార్కెట్లు దూసుకుపోయాయి. స్వల్ప ఆటుపోట్లతో 12 గంటల వరకు 36000 పాయింట్ల ఎగువనే ట్రేడవుతూ వచ్చిన సెన్సెక్స్... జైట్లీ బడ్జెట్ ప్రసంగంలో పన్నుల ప్రస్తావన వచ్చేసరికి అప్రమత్తమయింది. దీర్ఘకాలిక కాపిటల్ గెయిన్స్ ప్రతిపాదనతో ఒక్కసారిగా కుప్పకూలింది. ఉదయం ట్రేడింగ్ సెషన్‌లో 36200 పాయింట్ల స్థాయిలో ఉన్న సెన్సెక్స్ ఒక్కసారిగా 35501 పాయింట్ల కనిష్ఠ స్థాయికి పతనమైంది. ఈ దెబ్బతో ఇన్వెస్టర్లు బెంబేలెత్తిపోయారు. ఈ దశలో దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు జోక్యం చేసుకొని ఎంపిక చేసిన షేర్లలో కొనుగోళ్లు ప్రారంభించడంతో మళ్లీ 36256 పాయింట్ల గరిష్ఠ స్థాయికి దూసుకుపోయింది. ఇన్వెస్టర్లు ఊపిరిపీల్చుకునే లోపలే మరో విడత అమ్మకాల జోరు మొదలైంది. సెన్సెక్స్ మళ్లీ నష్టాల్లోకి జారుకొని నికరంగా 58 పాయింట్ల నష్టంతో 35906 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా తీవ్రమైన ఆటుపోట్ల నడుమ 10 పాయింట్ల నష్టంతో 11016 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో నిఫ్టీ 11117-10878 పాయింట్ల మధ్య ఆటుపోట్లను చవిచూసింది.



అదే జైట్లీ.. అదే బడ్జెట్ మార్కెట్ స్పందన మాత్రం మారింది. గతేడాది బడ్జెట్ రోజు సెన్సెక్స్ 485 పాయింట్లు పెరగ్గా.. నిఫ్టీ 155 పాయింట్లు దూసుకుపోయింది. గత బడ్జెట్ నుంచి ఈ బడ్జెట్ వరకు సెన్సెక్స్ 7765 పాయింట్లు, నిఫ్టీ 2300 పాయింట్లు పెరిగాయి.

- కాపిటల్ గెయిన్స్ దెబ్బతో బ్రోకింగ్ సంస్థల షేర్లు 5 శాతం వరకు నష్టపోయాయి. రెలిగేర్ ఎంటర్‌ప్రైజెస్, ఆదిత్య బిర్లా మనీ, మోతీలాల్ ఓస్వాల్ నష్టాలతో ముగిశాయి.
- బడ్జెట్‌లో ప్రభుత్వం భారీగా కేటాయింపులు పెంచడంతో ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి చెందిన షేర్లు దూసుకుపోయాయి. అవంతీ ఫీడ్స్ షేరు ధర 15 శాతం పెరిగింది. శీతల్ కూల్ ప్రాడక్ట్స్ 9 శాతం, గోద్రెజ్ అగ్రోవెట్ 7 శాతం, ఫ్రెష్‌ట్రాప్ ఫ్రూట్స్ 7 శాతం లాభపడ్డాయి.
- వ్యవసాయాధార పరిశ్రమల షేర్లు భగ్గుమన్నాయి. ఎన్‌ఎసిఎల్ ఇండస్ట్రీస్ షేరు 10 శాతం పెరిగింది. పిఐ ఇండస్ట్రీస్ 6.5 శాతం, శక్తిపంప్స్ ఇండియా 6 శాతం, యాక్షన్ కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ 5.7 శాతం, మోన్‌శాంటో 5 శాతం లాబపడ్డాయి. కావేరీ సీడ్స్, ధనూకా అగ్రిటెక్, యుపిఎల్‌లో కొనుగోళ్లు భారీగా జరిగాయి.
- సెన్సెక్స్ షేర్లలో సన్ ఫార్మా, ఒఎన్‌జిసి, డాక్టర్ రెడ్డీస్ లాబొరెటరీస్, ఎస్‌బిఐ, ఐసిఐసిఐ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా స్టీల్ నష్టాలతో ముగిశాయి.
- ఎం అండ్ ఎం, ఎల్ అండ్ టి, బజాజ్ ఆటో, ఏషియన్ పెయింట్స్, ఐటిసి, యస్ బ్యాంక్, టిసిఎస్ లాభపడ్డాయి.

ఇది చాలా అన్యాయం గురూ

దీర్ఘకాలిక కాపిటల్ గెయిన్స్ టాక్స్‌కు మార్కెట్ విముఖంగా ఉంది. ఆర్థిక మంత్రి మరోసారి ఎల్‌టిసిజిని ఇన్వెస్టర్లపై రుద్దే అవకాశం ఉందని మార్కెట్‌వర్గాలు ఊహించలేదు. చాలా మంది బ్రోకర్లు ఈ ప్రతిపాదనను వ్యతిరేకించినా కొందరు మాత్రం ఆహ్వానించారు. స్థూలంగా చూస్తే ఈ చర్య సరైనదేనని వారు పేర్కొన్నారు. పైగా లక్షల రూపాయల పైబడిన కాపిటల్ గెయిన్స్‌పైనే 10 శాతం పన్ను వేసినందున సాధారణ ఇన్వెస్టర్లు చాలా మంది ఈ పన్ను పరిధిలోకి వచ్చే అవకాశం లేదన్న అభిప్రాయాన్ని కొందరు బ్రోకర్లు వ్యక్తం చేశారు. మార్కెట్ల తక్షణ స్పందన వ్యతిరేకంగా ఉన్నా ఆ తర్వాత సర్దుబాటు అవుతుందని జెరోధా డాట్ కామ్ వ్యవస్థాపకులు నితిన్ కామత్ అన్నారు. కాపిటల్ గెయిన్స్ విషయంలో మార్కెట్లు కినుకగా ఉన్నా వాస్తవానికి ఎంఎస్‌ఎంఇలకు కార్పొరేట్ పన్ను ను తగ్గించడం మంచి సంకేతమని అరిహంత్ కాపిటల్ హోల్‌టైమ్ డైరెక్టర్ అనితా గాంధీ చెప్పారు. వాస్తవానికి గ్రామీణ ప్రాంతాలకు కేటాయింపులు పెంచడం, పన్నుల వసూళ్లలో వృద్ధి అంచనాలు, ఇన్‌ఫ్రాపై వ్యయం పెంచడం, 250 కోట్ల రూపాయలలోపు టర్నోవర్ ఉన్న సంస్థలకు కార్పొరేట్ పన్నును 30 నుంచి 25 శాతానికి తగ్గించడం దీర్ఘకాలంలో మార్కెట్లకు మేలు అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రతినిధి వినోద్ నాయర్ చెప్పారు.

డిసెంబరునాటికి సెన్సెక్స్ 32000

బొఫా-ఎంఎల్ హెచ్చరిక

ముంబై : బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ వచ్చే డిసెంబరునాటికి 32000 పాయింట్లకు దిగజారే అవకాశం ఉందని బ్యాంక్ ఆఫ్ అమెరికా మెరిల్‌లించ్ (బొఫా-ఎంఎల్) హెచ్చరిస్తోంది. బడ్జెట్‌లో ఈక్విటీ పెట్టుబడులపై లాంగ్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ (ఎల్‌టిసిజి) టాక్స్‌ను విధిస్తున్న నేపథ్యంలో సెన్సెక్స్‌పై ప్రభావం ఉంటుందని తెలిపింది.



బడ్జెట్ తాము అంచనా వేసిన స్థాయిలో ఉన్నట్టు పేర్కొంది. దేశీయ స్టాక్ మార్కెట్ ఇప్పటికే గరిష్ఠ స్థాయిలకు చేరుకుందని ఈ బడ్జెట్ ద్వారా మరింత పెరగడానికి అవకాశం లేకుండా పోయిందని తెలిపింది. "సెన్సెక్స్ విషయంలో తాము అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నామని, డిసెంబరు నాటికి ఇది 32000 పాయింట్లకు చేరుకునే అవకాశం ఉంది" అని బొఫా-ఎంఎల్ స్పష్టం చేసింది. 2004 సంవత్సరంలో లాంగ్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్ టాక్స్‌ను తొలగించారు. ఇప్పుడు మోదీ ప్రభుత్వం మళ్లీ అమల్లోకి తెస్తోంది.

రూపాయి బలహీనం

ముంబై : డాలర్‌తో రూపాయి మారకం విలువ గురువారం మరింతగా తగ్గిపోయింది. ఒకే రోజు రూపాయి విలువ 44 పైసలు పడిపోయి 64.02 వద్ద ముగిసింది. కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి జైట్లీ ప్రవేశపెట్టిన దీర్ఘకాలిక మూలధన లాభాల (ఎల్‌టిసిజి) పన్ను, ద్రవ్య లోటు మరింత పెరుగుతుందనే అంచనాలు ఫారెక్స్ మార్కెట్‌లో రూపాయిపై సెంటిమెంట్‌ని దెబ్బతీశాయి. దీంతో కంపెనీలు, దిగుమతిదారులు డాలర్ల కోసం ఎగబడ్డారు. అమెరికాలో వడ్డీ రేట్లు మరింత పెరుగుతాయనే వార్తలు, ముడి చమురు ధర మరింత పెరగడం కూడా రూపాయి మారకం రేటును బలహీన పరిచాయి. గత రెండు వారాల్లో డాలర్‌తో రూపాయి మారకం రేటు ఇంత కనిష్ఠ స్థాయిలో ముగియడం ఇదే మొదటిసారి.

లాభం.. నష్టం..





జైట్లీ బడ్జెట్ ప్రతిపాదనలు కొన్ని రంగాలకు అనుకూలంగా మరికొన్ని రంగాలకు ప్రతికూలంగా ఉన్నాయి. ఏయే రంగాలకు లాభం, ఏయే రంగాలకు నష్టం కలిగిస్తుందో ఇన్వెస్టర్లు దృష్టిలో ఉంచుకోవడం మంచిది.

వ్యవసాయ రంగం

వ్యవసాయ రంగానికి బడ్జెట్ పెద్దపీట వేసింది. కనీస మద్దతు ధరల పెంపు, మార్కెట్లను పటిష్ఠం చేయడం, ఇరిగేషన్ ప్రాజెక్టులకు ప్రాధాన్యం.. వగైరా ప్రతిపాదనల వల్ల వ్యవసాయంతో ముడివడి ఉన్న పరిశ్రమలు లాభపడే అవకాశం ఉంది. శక్తి పంప్స్, జైన్ ఇరిగేషన్ సిస్టమ్స్, కెఎస్‌బి పంప్స్, కిర్లోస్కర్ బ్రదర్స్, అవంతి ఫీడ్స్, వాటర్ బేస్, జెకె అగ్రి జెనెటిక్స్, పిఐ ఇండస్ట్రీస్‌కు ప్రతిపాదనలు అనుకూలంగా ఉంటాయి.

వైద్య, ఆరోగ్య సర్వీసులు

ఆయుష్మాన్ భారత్ స్కీమ్ వల్ల అపోలో హాస్పిటల్స్, ఫోర్టిస్ హెల్త్‌కేర్ లాభపడతాయి.

ఇన్‌ఫ్రా, రవాణా

మౌలిక వసతులపై భారీ ఎత్తున వ్యయం చేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటించడంతో రైల్వే, ఇన్‌ఫ్రా, నిర్మాణం, ఇంజినీరింగ్ సంస్థలు లాభపడే అవకాశం ఉంది. ఎల్ అండ్ టి, ఎన్‌సిసి, హిందుస్తాన్ కన్‌స్ట్రక్షన్, ఐఆర్‌బి ఇన్‌ఫ్రా, దిలీప్ బిల్డ్‌కాన్, టిటాగర్ వ్యాగన్, సిమ్కోపై దృష్టి పెట్టొచ్చు.

వినియోగ వస్తువుల రంగం

గ్రామీణ రంగంలపై ప్రభుత్వ వ్యయం పెరగడం వల్ల డిమాండ్ రాజుకుంటుంది. దీని ప్రభావం వల్ల ఎఫ్‌ఎంసిజి రంగంలోని హిందుస్తాన్ యూనిలీవర్, బ్రిటానియా, మారికో లాభపడే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో మార్కెట్లు ఉన్న హీరో మోటో కార్ప్, ఎం అండ్ ఎం, ఎల్ అండ్ టికి కూడా బడ్జెట్ అనుకూలంగా ఉంది.

ఆభరణాల వ్యాపారానికి...

గ్రామీణ ప్రాంతాల నుంచి బంగారానికి ఉన్న డిమాండ్ వల్ల ఆభరణాల వ్యాపారంలోని సంస్థలకు లాభం కలుగుతుంది. టైటాన్, త్రిభువన్‌దాస్ భీమ్‌జీ జవేరీ, పిసి జువెలర్స్.. లాభపడతాయి.

ఎయిర్‌పోర్టులు, విమానయానం

ఇన్‌ఫ్రాకు, విమానయానానికి ఇస్తున్న ప్రాధాన్యం వల్ల జిఎంఆర్ ఇన్‌ఫ్రా, జివికె వంటి సంస్థలు లాభపడతాయి.

వీరికి కొంచెం కష్టమే..

బాండ్ ఇన్వెస్టర్లు : ద్రవ్యలోటు టార్గెట్‌ను జిడిపిలో 3.2 శాతం నుంచి 3.5 శాతానికి పెంచడంతో బాండ్‌ల రాబడులపై దీని ప్రభావం ఉంటుంది. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఎస్‌బిఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంకులపై దీని ప్రభావం ఉంటుంది.


కాపిటల్ గెయిన్స్ దెబ్బ : కాపిటల్ గెయిన్స్ ప్రభావం వల్ల ఫైనాన్షియల్ సర్వీసుల రంగంలోని ఐడిఎఫ్‌సి, రిలయన్స్ కాపిటల్, ఆదిత్య బిర్లా కాపిటల్, ఐసిఐసిఐ ప్రుడెన్షియల్, హెచ్‌డిఎఫ్‌సి స్టాండర్డ్ లైఫ్ ప్రభావితం అయ్యే అవకాశం ఉంది.

బులియన్



బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	31,200	31,000	31,380	30,800	30,380
క్రితం ముగింపు	31,340	---	31,240	30,800	30,450
22 క్యారెట్లు	28,890	28,800	28,860	28,550	28,930
క్రితం ముగింపు	29,020	---	28,740	28,550	29,000
వెండి (కిలో)	40,400	41,000	40,500	40,400	42,400
క్రితం ముగింపు	40,200	---	40,300	40,400	42,400

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	74.00	విజయవాడ	80.00
కరీంనగర్	75.00	గుంటూరు	80.00
వరంగల్	74.00	ఒంగోలు	82.00
మహబూబ్‌నగర్	74.00	చిత్తూరు	70.00
కర్నూలు	74.00	నెల్లూరు	80.00
విశాఖపట్నం	75.00	అనంతపురం	73.00
గోదావరి	80.00		

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.20 — నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	360.00	చిత్తూరు	383.00
వరంగల్	362.00	చెన్నై	390.00
విజయవాడ	360.00	నమక్కల్	375.00
గోదావరి	360.00	బెంగళూరు	380.00
విశాఖపట్నం	365.00	ముంబై	415.00

ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో..)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	57.94	67.19
పౌండ్	82.27	95.42
యూరో	71.96	83.47
ఆస్ట్రేలియా డాలర్	46.64	53.98
బహ్రెయిన్ దినార్	156.91	179.82
కువైట్ దినార్	175.80	218.85
ఒమని రియాల్	153.66	175.80
సౌదీ రియాల్	15.40	18.26
సింగపూర్ డాలర్	44.16	52.31
యుఎఇ దిరమ్	15.77	18.43

మరింత కన్సాలిడేషన్ అవకాశం

టెక్ వ్యూ

నిఫ్టీ మరింత బలహీనతలో ప్రారంభమై 10900 వరకు దిగజారినా రికవరీ బాట పట్టింది. కాని నిరోధ స్థాయి 11100కన్నా పైన నిలదొక్కుకోలేక తక్షణ అప్‌ట్రెండ్‌ను ప్రదర్శించలేకపోయింది. డే గరిష్ఠ, కనిష్ఠ స్థాయిల్లో క్లోజ్ కావడం మరింత కన్సాలిడేషన్ అవసరం అనేందుకు సంకేతం. కాని స్వల్పకాలిక మద్దతు స్థాయి 11000కన్నా పైనే క్లోజ్ కావడంతో తక్షణ డౌన్‌ట్రెండ్‌ను నివారించుకుంది.

శుక్రవారం స్థాయిలివే...
నిరోధం : 11100 **మద్దతు** : 11000

- ట్రెండ్‌లో సానుకూలత కోసం 11100 పాయింట్ల కన్నా పైన బలంగా క్లోజ్ కావాలి. ఆ పైన మాత్రమే స్వల్పకాలిక అప్‌ట్రెండ్ ఉంటుంది. మార్కెట్ ఇప్పటికీ 20 డిఎంఏ కన్నా పైనే ఉండడం సానుకూల సంకేతం.
- తక్షణ అప్‌ట్రెండ్ ఆశలు నిలబెట్టుకోవాలంటే ప్రధాన మద్దతు స్థాయి 11000 పాయింట్ల వద్ద రికవరీ తప్పనిసరి. అంతకన్నా దిగువన క్లోజయితే స్వల్పకాలిక కరెక్షన్‌లో ప్రవేశిస్తుంది.
- బ్యాంక్ నిఫ్టీ మద్దతు స్థాయి 27000కన్నా పైన క్లోజ్ అయింది.

■ వి.సుందర్ రాజా

సాధారణంగా మెరుగు

ఆస్ట్రో వ్యూ

తిథి : మాఘ బహుళ విదియ **నక్షత్రం** : మఖ, పుబ్బ రోహిణి, హస్త, శ్రవణ (ఉదయం), మృగశిర, చిత్త, ధనిష్ట నక్షత్ర జాతకులు, కన్య, మకర రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.
నిఫ్టీ : 11016.00 (-10.80) **ట్రెండ్ మార్పు వేళలు** : 12.57
ధోరణి : గ్రహగతులను బట్టి నిలకడగా ప్రారంభమై 9.40 నుంచి 11.20 మధ్యలో మెరుగ్గా ట్రేడవుతూ 11.30 నుంచి 1.30 మధ్యన నిస్తేజంగామారి తదుపరి 1.40 నుంచి చివరి వరకు మెరుగ్గా మారవచ్చు.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 9.45 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 11.15 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 1.45 తర్వాత తిరిగి ఎటిపికన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని 3.15 సమయంలో క్లోజ్ చేసుకోవచ్చు.

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

నిరోధ స్థాయిలు : 11060, 11095
మద్దతు స్థాయిలు : 10975, 10940
గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి www.thefinanciala strologer.blogspot.in

బిఎస్ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు

ADITYA SPIN. 8.76(8.8)862
AGRO TECH FO 654.3(649.1)3360
AISHWARYA TE 8.6(8.6)39286
ALPHAGEO (I) 893.85(910)5314
ALU FLUORIDE 119.35(122.8)32059
AMAR RAJA BA 804.05(807.75)31445
ANDHRA BANK 51.25(52.6)376339
ANDHRA CEMEN 13.2(13.03)21376
ANDHRA PETRO 67.05(70.45)149253
ANJANI PORTL 225(225.1)2854
ASTRA MICRO 112.7(114.3)126875
AUROB.PHARMA 612.8(629.5)173318
AVANTEL LTD 537.5(538.9)13160
AVANTI FEEDS 2400.8(2223.95)74909
B.N.RATHI SE 41.05(42.6)3785
BALAJI AMINE 675.7(656.4)17027
BAMBINO AGRO 271(272.65)2288
BARTRONICSIN 13.78(14.04)21445
BHAGIRA.CHEM 289(299.15)1920
BHAGYA INL 41.1(41.55)4167
BHARATFIN 1065(1050.75)119439
BNR UDYOG 32.5(31.5)5
CAMBRIDGE 83.4(84.8)15312
CCHHL 16(16.25)18131
CCL PRODUCTS 294.6(294.8)8366
CELESTIAL 18.05(18.05)17140
CIL SECURITS 33.85(33.9)1051
COROM INTER 544.8(552.5)34230
CUBEX TUBING 26.4(26.45)4206
CYBERMATE 3.51(3.67)102640
CYIENT 640.85(642.45)27944
DANLAW TECH. 87(89.3)3092
DECAN CEMENT 575.7(574.2)491
DHAN ROTO SP 42.5(40.5)1073
DIAMONPOWER 18.35(18.35)47619
DIVI'S LAB. 1040.95(1036.45)28848
DIVYA.GRANIT 115(112.05)1798
DQ ENT 17.25(17.15)10690
DR.REDDY'S 2156.95(2225.25)137221
EMPEE SUGARS 4.65(4.57)2875
EVEREST ORG. 143.1(144)1113
FACOR ALLOYS 3.81(3.8)131292
FIRSTOBJ 16.3(16.45)8187
GATI LTD. 128.15(130.55)272085
GAYATRI PROJ 211.1(207.65)17842
GENNEX LAB 4.65(4.68)170189
GMR INFRASTR 22.75(21.75)8679006
GODAVARI DRU 37.8(36.25)431
GOLDST INFRA 222.15(224.6)44543
GOLDSTONE EN 15(15.1)11282
GRANULES (I) 128(132.2)237927
GVK POWERINF 21.55(20.55)869565
HBL P SYS 62.25(61.1)196685
HERITGFOOD 751.4(758.55)5851
HIND.FLUROCA 14.2(14.2)1772
HINDUSTN BIO .7(.7)5850
I.C.S.A. IND 4.5(4.29)32064
IKF TECHNO 1.14(1.04)714738
INCAP LTD. 105(103.2)757
IPAPPM 325.4(348.8)25698
IVRCL LTD 5.25(5.31)84610
KAKATIYA CEM 373.55(366.45)19409
KALLAM SPG. 22.7(22.15)10836
KAVERI SEED 507.55(515.45)213710
KCP LTD 140.45(145.7)45136
KERNEX MICRO 51.9(54.4)26084
KNR CONST 305.2(307.45)25980
KREBS BIOCHM 141.05(143.95)731
LANCO INFRA 1.56(1.6)5805771
LOKESH MACH 69(69.25)89337
LOTUS CHOC 51.7(52.1)4623
MADHUCON PRJ 32.1(32)38865
MOLD-TEK TEC 68.9(67.65)675
MOSCHIP SEMI 36.9(36.9)65619
MSR INDIA 36.55(36.65)5795
N C L IND. 270.95(274.85)17540
NACLIND 57(55.45)98104
NATCO PHARM 942.6(944.3)18462
NCC 124.5(122.6)746237
NEHA INTER. 7.58(7.73)25163
NETTLINX LTD 92.1(91.65)21376
NEULAND LAB. 820.9(836.65)1019
NIHAR INFO 14.5(14.5)1587
NILE LTD. 917.35(907.2)2886
NTL 4.33(4.55)5494
OIL COUNTRY 50.55(50.7)9039
PADMALAYA TE 5.3(5.54)17559
PALRED 98.65(98.95)5238
PANYAM CEMEN 57.5(57.15)7647
PENNAR STEEL 60.95(61.15)73490
PFL INFOTECH 11(11)3279
PHYTOCHEM I. 70.95(71.1)8967
PITTI LAMIN. 85.65(86.25)7769
POKARNA LTD 221.25(219.35)5691
PRAJAY ENGS. 16.2(15.45)208695
PREMIER EXPL 426.05(424.15)1158
PRISM CEMENT 134.65(138.45)147225
RAIN 362.85(380.9)579508
RAJ PACKAGIN 38.9(39.45)4622
REG.CERAMIC 6.52(6.6)1964
RESTILE CER. 8.6(7.34)7113
SAGAR CEM. 1004.6(992.3)1845
SAMKRG PIST. 320.85(313)4634
SAMPRE NUTRI 68.2(69.05)6046
SANGHI IND. 124.75(124.35)20453
SATVAH.ISPAT 25.8(27.75)28208
SAVEN TECHNO 22(22.15)7135
SIBAR AUTO 21.55(20.54)18091
SMPL 1.5(1.57)16874
SMS PHARMACE 97.4(97.7)19440
SREE RAYALA 188.6(186.75)3896
STEEL EXCH 33.1(32.6)19137
SUJANA INDUS 1.17(1.12)111213
SURANATP 5.93(5.94)1250
SURYACHAKRA 1.68(1.67)36885
SURYAMBA SP 73.15(71.3)2200
SURYAVA SPIN 7.82(7.46)300
SURYLAK.COTT 89(90.25)3012
SUVEN LIFE S 209.45(214.3)228605
TAJ GVK HOTL 174.55(176.35)10130
TANLA 33.35(33.95)155845
TCI INDUS. 952(951)1
TRANSCORP IN 42(42.1)6247
TRANSGENE BI 2.34(2.3)12690
TRANSPORT CO 281.6(278.4)4848
USHER AGRO 7.9(7.95)8335
VICEROY HOTE 17.2(17.5)79806
VIJAY TEXTIL 59.45(59.2)1918
VIMTA LABS 214.2(209.55)56680
VIRAT CRANE 46.15(47.55)7570
VIRINCHI 133.4(127.4)148181
VISAKA IND. 761.95(743.6)13058
VISTA PHARMA 42.3(41.7)19163
VIVIMED LABS 85.1(86.15)300002
VST INDUS. 3352.05(3250.05)164
WATERBASE 287.3(273.65)250287
XLENERGY 3.82(3.81)7506
YBRANTDIGI 6.01(6.11)153591
ZEN TECH 119.85(120.7)35652
ZENOTECH 46.05(46)10025

మోదీ జమానా.. వ్యవసాయం



ధీమా ఇవ్వని ఫసల్ బీమా

కేంద్రం రైతుల కోసం, వ్యవసాయం బాగు కోసం చాలా చేస్తున్నట్టు చెప్పుకొంటోంది. కానీ, అవేవీ మా దాకా రావడం లేదు. మేమంతా ఫసల్‌బీమాలో చేరాం. వరదలకు మా పంటలు పోయినా, ఈ బీమాను అమలు చేయడం లేదు. పరిహారం ఇవ్వడంలేదు.

-ఎస్ లక్ష్మి, నగరం, విశాఖపట్నం జిల్లా





రసాయనిక ఎరువులకు చెక్

కేంద్ర బడ్జెట్‌లో ఎరువుల పంపిణీని ఆధార్‌కు అనుసంధానం చేశారు. దీని వల్ల రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గిస్తారు. ప్రస్తుతం విచ్చల విడిగా రసాయనిక ఎరువులు ఉపయోగించడం వల్ల భూములు గుల్లబారిపోతున్నాయి. వ్యవసాయ ఖర్చులు పెరిగి ఆదాయం తగ్గుతోంది. కేంద్రం నిర్ణయంతో ఈ పరిస్థితిలో మార్పు రానుంది.

- బండారు శ్రీనివాసరావు జాతీయ ఉత్తమ రైతు అవార్డు గ్రహీత, గుంటూరు

ఆర్థికం ఉరకలు

నోట్ల రద్దు కాదు... నిజాయితీ మహోత్సవం

బడ్జెట్ ప్రసంగంలో జైట్లీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: పెద్ద నోట్ల రద్దు గానీ, జీఎస్టీ గానీ, బ్యాంకింగ్ రంగ సంస్కరణలు గానీ... అన్ని వ్యవస్థాగత మార్పుల పరమోద్దేశం పేదలకు లబ్ధి చేకూర్చడమేనని ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ తన ప్రసంగ ప్రారంభంలోనే పేర్కొన్నారు. పెద్ద నోట్ల రద్దు చర్యని ఆయన నిజాయితీకి కట్టిన పట్టంగా, ఓ మహోత్సవంగా అభివర్ణించారు. ఒక పెద్ద మార్పును లక్షిస్తూ తీసుకున్న ఈ నిర్ణయం సత్ఫలితాలను ఇచ్చిందని, దేశంలో పన్ను చెల్లింపుదారులు పెరిగారని, నల్ల ధనం అరికట్టామని ఆయన చెప్పుకొచ్చారు. "ఈ విజయం మాకు ఎంతో ఉత్సాహాన్నిచ్చింది. ఇలాంటి మరిన్ని చర్యలు మున్ముందు తీసుకుంటాం" అని ఆయన ప్రకటించారు.

ఆయన అన్న మాటలు కొన్ని ఇవీ..

- నాలుగేళ్ళుగా ఆర్థిక సంస్కరణలు అమలు చేస్తున్నాం.. ఈ ప్రయాణంలో అనేక సవాళ్ళు ఎదుర్కొన్నాం...కొన్ని విజయాలూ సాధించాం
- సంస్కరణల అమలు వల్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పెరిగాయి.
- సహజ వనరులను ఇపుడు పారదర్శకంగా, నిజాయితీగా కేటాయిస్తున్నాం
- ఒకప్పుడు అవినీతి అన్నది వ్యవస్థలో అంతర్భాగం.. కానీ ఇపుడు ప్రజలు- ముఖ్యంగా యువత- నిజాయితీగా బతుకు సాగాలనుకుంటున్నారు.
- పెద్ద నోట్ల రద్దు వల్ల నిజాయితీ పరులైన పన్ను చెల్లింపుదారులకు గౌరవం దక్కింది. టాక్స్ రిటర్న్లు దాఖలు చేసే వారి సంఖ్య పెరిగింది. కొత్తగా 85 లక్షల టాక్స్‌పేయర్స్ చేరారు.
- జీఎస్టీ ని ప్రవేశపెట్టడంతో పరోక్ష పన్నుల వ్యవస్థ మరింత సరళంగా మారింది.
- డిజిటల్ టెక్నాలజీ ద్వారా పేదలకు లబ్ధి చేకూర్చే పథకాలు సక్రమంగా చేరవేయగలుగుతున్నాం
- పెద్ద నోట్ల రద్దు వల్ల నగదు వినియోగం, చలామణీ తగ్గాయి..పన్ను చెల్లింపుదారుల సంఖ్య పెరిగింది
- ఇన్‌సాల్వెన్సీ కోడ్ వల్ల రుణదాత- గ్రహీత ల మధ్య బంధం ఆరోగ్యకరంగా మారింది
- బ్యాంకింగ్ వ్యవస్థ పునర్వ్యవస్థీకరణ వల్ల వృద్ధికి ఆస్కారమేర్పడింది.. మా ప్రభుత్వం వచ్చాక -గత మూడేళ్ళలో 7.5 శాతం వృద్ధి నమోదైంది.
- ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థ రెండున్నర లక్షల కోట్ల డాలర్లకు విస్తరించింది. ప్రపంచంలోనే ఏడో అతి పెద్ద ఆర్థికవ్యవస్థ ఇది.. త్వరలోనే ఐదో పెద్దవ్యవస్థ కానుంది. పవర్ పర్చేజింగ్ పేరిటీ (పీపీపీ) ప్రకారం మనది మూడో అతి పెద్ద ఆర్థికవ్యవస్థ.
- తయారీ, సేవల రంగాల్లో మంచి పురోగతి కనబడుతోంది.. 8 శాతానికి పైగా వృద్ధి నమోదయ్యే సూచనలున్నాయి
- సుపరిపాలన ముఖ్యమన్నది ప్రధాని మోదీ పదే పదే చెప్పే మాట. దీన్ని దృష్టిలో పెట్టుకుని విధాన నిర్ణయాల్లో పలు మార్పులు తెచ్చాం. వీటి ఫలితమే- సులభతర వ్యాపార నిర్వహణలో మూడు ర్యాంకులు పైకి వెళ్ళి- టాప్ 100లో తొలిసారిగా చోటు సంపాదించాం.
- ఇపుడు ఈ "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" ను - సామాన్య, మధ్య తరగతి ప్రజల సంక్షేమం నిమిత్తం "ఈజ్ ఆఫ్ లివింగ్" గా మార్చే కార్యక్రమం చేపట్టాం. సామాన్యుడి జీవితాల్లో ప్రభుత్వ జోక్యం తక్కువ చేసే పని ఇది.
- 8 కోట్ల పేద గ్రామీణ మహిళలకు వంటగ్యాస్ పథకం, 4 కోట్ల ఇళ్ళకు కరెంటు సౌకర్యం, 3 వేల జన ఔషధి దుకాణాల ద్వారా 800 రకాల మందులు తక్కువ ధరకే విక్రయం, పేదలకు ఉచితంగా డయాలసిస్ సౌకర్యం, అన్ని ప్రభుత్వ సేవల ఆన్‌లైన్, సర్టిఫికెట్ల ఎటెస్టేషన్ తప్పనిసరి కాదని నిర్ణయించడం, గ్రూప్ సీ, డీ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు తీసేయడం వల్ల పేదలకు, యువతకు ఎంతో లబ్ధి, టైము, డబ్బు ఆదా!
- సేవలను ప్రజల వద్దకే నేరుగా అందించడం వల్ల అవినీతి తగ్గింది- దళారుల బెడద అంతమయ్యింది.
- ప్రజలకే నేరుగా నగదు బదిలీ పథకం ప్రపంచంలోనే అతి పెద్దది.



లోక్‌సభలో సోనియా, ఖర్గే, రాహుల్ తదితరులు

ఊరికి 14 లక్షల కోట్లు!

న్యూఢిల్లీ: ఊరికి మహర్దశ పట్టనుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన, మౌలిక సదుపాయాల కల్పనకు వచ్చే ఏడాది ఏకంగా రూ.14.34 లక్షల కోట్లు ఖర్చు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. బడ్జెట్, బడ్జెటేతర వ్యయం రూ.11.98 లక్షల కోట్లు సహా వివిధ మంత్రిత్వ శాఖలు ఈ నిధులను ఖర్చు చేస్తాయని జైట్లీ తన బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు ఇచ్చే నిధులను భారీగా పెంచారు. గత ఆర్థిక సంవత్సరం (2016-17)లో వీటికి రూ.42,500 కోట్లు కేటాయించగా, 2018-19 ఆర్థిక సంవత్సరానికి రూ.75 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు జైట్లీ ప్రకటించారు. భారత్‌నెట్ పథకం ద్వారా ఫేజ్1లో లక్ష గ్రామ పంచాయతీలను హైస్పీడ్ ఫైబర్ నెట్‌వర్క్‌తో కనెక్ట్ చేశామని జైట్లీ చెప్పారు. తద్వారా 2.5 లక్షల గ్రామాల్లో 20 కోట్ల మంది గ్రామీణులకు బ్రాండ్‌బాండ్ అందుబాటులోకి వచ్చిందన్నారు. అలాగే, ఐదు కోట్ల మంది గ్రామీణులకు బ్రాడ్‌బ్యాండ్ అందుబాటులోకి వచ్చేలా 5 లక్షల వైఫై హాట్‌స్పాట్‌లను వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఏర్పాటు చేయనున్నామని ప్రకటించారు.




48

పారదర్శక బడ్జెట్‌లో భారత్ స్థానం

2 కోట్ల మరుగుదొడ్లు

వచ్చే ఆర్థిక సంవత్సరంలో (2018-19) స్వచ్ఛభారత్ కార్యక్రమం ద్వారా 2 కోట్ల మరుగుదొడ్లను నిర్మిస్తామని జైట్లీ తెలిపారు. గత నాలుగేళ్లలో 6 కోట్ల మరుగుదొడ్లను నిర్మించామన్నారు. మరోవైపు, గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు 'గోబర్-ధన్' (గాల్వనైజింగ్ ఆర్గానిక్ బయో-ఆగ్రో రిసోర్సెస్ ధన్) అనే నూతన పథకాన్ని ప్రవేశపెట్టారు.




నేను... నా ప్రభుత్వం!


జైట్లీ మాటల మంత్రం


కేంద్ర ఆర్థిక మంత్రిగా జైట్లీకి ఇది చివరి పూర్తిస్థాయి బడ్జెట్. వచ్చే ఏడాది ఎన్నికల నేపథ్యంలో ఆయన 'తాత్కాలిక బడ్జెట్'ను మాత్రమే ప్రవేశపెడతారు.

- గురువారం ఉదయం సరిగ్గా 11 గంటలకు జైట్లీ బడ్జెట్ ప్రసంగం మొదలైంది. ఆయన పలుమార్లు దగ్గుతూ... నీళ్లు తాగారు. ఎప్పట్లాగానే... కొద్దిసేపటి తర్వాత తన బడ్జెట్ ప్రసంగాన్ని కూర్చుని చదివారు.
- అనుబంధాలను మినహాయిస్తే... బడ్జెట్ ప్రసంగం 31 పేజీల్లో... గంటా యాభై నిమిషాలపాటు సాగింది. ఇది జైట్లీ చేసిన అతి సుదీర్ఘ ప్రసంగం.
- జైట్లీ తన బడ్జెట్ ప్రసంగాన్ని విపక్ష కాంగ్రెస్‌కు చురకలు అంటిస్తూ ప్రారంభించారు. 'మేం అధికారంలోకి వచ్చినప్పుడు దేశం అవినీతిలో, నిర్ణయాలు తీసుకోలేని అశక్తతలో చిక్కుకుంది. ప్రపంచంలోని ఐదు అతి బలహీన దేశాల్లో ఒకటిగా ఉండింది' అని వ్యాఖ్యానించారు.
- రాష్ట్రపతి, రాష్ట్రాల గవర్నర్లు మాత్రమే 'మై గవర్నమెంట్' అని పేర్కొనడం సంప్రదాయం. కానీ... జైట్లీ కూడా 'మై గవర్నమెంట్' అంటూ కొత్త ఒరవడికి తెరతీశారు. మొత్తం బడ్జెట్ ప్రసంగంలో 122సార్లు 'గవర్నమెంట్' అనే పదం వాడారు. ఆ తర్వాత... 111 పర్యాయాలు 'కోట్లు' అంటూ కలవరించారు. 96సార్లు 'ఇండియా' అనే పదం ప్రయోగించారు.
- ఇప్పటిదాకా ఆర్థిక మంత్రులంతా ఆంగ్లంలోనే బడ్జెట్ ప్రసంగాలు చేశారు. జైట్లీ కూడా అదే సంప్రదాయం పాటించారు. అయితే... ఈసారి 'బడ్జెట్‌లో గ్రామీణంపై దృష్టి' పెట్టిన జైట్లీ... తన ప్రసంగాన్ని గ్రామీణులను దృష్టిలో పెట్టుకుని 'హిందీ'లోనూ కొనసాగించారు. ఆయన హిందీలో మాట్లాడిన ప్రతిసారీ, 'అర్థం కాక' దక్షిణాది ఎంపీలు అభ్యంతరం వ్యక్తం చేశారు.
- 'సర్వే భవంతు సుఖినః సర్వే సంతు నిరామయః' (ప్రజలంతా సుఖంగా ఉండాలి. అందరూ ఆరోగ్యంగా ఉండాలి)... తమ ప్రభుత్వాన్ని నడిపించే సిద్ధాంతం ఇదేనని జైట్లీ తెలిపారు. 'ఆరోగ్య భారతమే... అభివృద్ధి భారతం' అవుతుందని సూత్రీకరించారు. 'ఆయుష్మాన్ భారత్' అంటూ ప్రజారోగ్య పరిరక్షణ దిశగా కొత్త నిర్ణయాలు ప్రకటించారు.
- నల్ల బంగారం అంటే బొగ్గు... తెల్ల బంగారం అంటే పత్తి! జైట్లీ ఇప్పుడు కొత్తగా వెదురును 'హరిత బంగారం'గా అభివర్ణించారు.
- పెద్ద నోట్ల రద్దును ప్రజలు స్వాగతించారని... ఇది 'నిజాయితీపరులకు దక్కిన గౌరవం'గా భావించారని జైట్లీ అన్నారు.
- అన్ని వర్గాలను కలుపుకొని వెళుతూ, వారి అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలతో 'సరికొత్త భారతం' ఆవిష్కృతమవుతుందంటూ... దశాబ్దాల కిందట స్వామీ వివేకానంద చేసిన వ్యాఖ్యలను జైట్లీ గుర్తు చేశారు. "అనంతమైన ఆకాశం నుంచి, కార్మికుల కుటీరం నుంచి, కర్షకుల నాగలి నుంచి, వణికుల దుకాణాల నుంచి, కర్మాగారాల చిమ్నీల నుంచి, పట్టణాల మార్కెట్ల నుంచి, పల్లెపట్టుల సంతల నుంచి, సమున్నత శిఖరాల నుంచి... నవ భారతం నిర్మితమవనీ" అంటూ బడ్జెట్ ప్రసంగాన్ని ముగించారు.









పార్లమెంట్‌లో రాష్ట్రపతి కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్య

రాష్ట్రపతి వేతనం 5 లక్షలకు పెంపు


ఉపరాష్ట్రపతికి 4లక్షలు, గవర్నర్‌లకు 3.5 లక్షలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: పార్లమెంటు సభ్యుల వేతనం త్వరలో రెట్టింపు కానుంది. ప్రస్తుతం నెలకు రూ.50 వేలుగా ఉన్న ఎంపీల వేతనం ఏప్రిల్ నుంచి రూ.1 లక్షకు పెరగనుంది. గురువారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఈ విషయాన్ని పేర్కొంది. ఎంపీలు తమ వేతనాలను తామే పెంచుకోవడమన్న విధానానికి స్వస్తి చెబుతూ.. నూతన చట్టాన్ని ప్రభుత్వం ప్రతిపాదించింది. దీని ప్రకారం ప్రతి ఐదేళ్లకోసారి ద్రవ్యోల్బణానికి అనుగుణంగా ఎంపీల వేతనాలను సవరించనున్నారు. అయితే రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, రాష్ట్రాల గవర్నర్‌ల వేతనాన్ని మాత్రం భారీగా పెంచుతున్నట్లు బడ్జెట్‌లో పేర్కొన్నారు. రాష్ట్రపతి వేతనం ఇప్పటిదాకా నెలకు రూ.1.51 లక్షలు ఉండగా.. దానిని రూ.5 లక్షలకు, ఉప రాష్ట్రపతి వేతనాన్ని రూ.1.25 లక్షల నుంచి రూ.4 లక్షలకు పెంచుతున్నట్లు తెలిపింది. గవర్నర్‌ల వేతనాలను రూ.1.10 లక్షల నుంచి రూ.3.5 లక్షలకు పెంచింది. కాగా ఎంపీలకు ప్రస్తుతం నెలకు రూ.50 వేల వేతనం ఉండగా.. దీంతోపాటు పలు రకాల అలవెన్సులనూ ప్రభుత్వం చెల్లిస్తోంది. ఇందులో నియోజకవర్గ నిధుల రూపంలో నెలకు రూ.45 వేలు, నెలవారీ సమావేశాల కోసం మరో రూ.45 వేలు ఉన్నాయి. కేబినెట్ మంత్రులు, సహాయ మంత్రులు, మాజీ ప్రధానమంత్రుల ప్రయాణ ఖర్చులు, ఇతర అలవెన్సుల్లో 29 శాతం కోత విధించింది. గత బడ్జెట్‌లో రూ.418.49 కోట్లు ఉన్న దీనిని.. ఈ సారి రూ.295.81 కోట్లకు పరిమితం చేసింది.

కాదంటే అవుననిలే...

జనాకర్షకం కాదన్న మోదీ.. కానీ ఎన్నికల దృష్టితోనే బడ్జెట్

- **గ్రామీణ ఓటు బ్యాంకుపై కన్ను**
- **కర్ణాటకకు మెట్రో నిధుల గాలం**



హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు, వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేంద్రం ప్రవేశపెడుతున్న చివరి బడ్జెట్ ఇదే కాబట్టి.. 2018-19 బడ్జెట్ పూర్తి జనాకర్షకంగా ఉండబోతోందని పలువురు రాజకీయ విశ్లేషకులు, ఆర్థికవేత్తలు అంచనా వేశారు. ఎన్నికల్లో గెలుపునకు బీజేపీ ఈ బడ్జెట్‌ను ఒక సోపానంగా ఉపయోగించుకుంటుందని జోస్యం చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఇదే ప్రశ్న అడిగితే ఆయన మాత్రం వచ్చేది జనాకర్షక బడ్జెట్ కానేకాదన్నారు. అయితే గురువారం ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ చూస్తే... 'మోదీ కాదంటే అవుననిలే' అనిపించింది. పూర్తిగా ఎన్నికల దృష్టితోనే ఈ బడ్జెట్‌ను రూపొందించినట్టు స్పష్టమైంది. తన సంప్రదాయ ఓటు బ్యాంకుకు తోడు, సరికొత్త ఓటు బ్యాంకును సృష్టించుకోవడానికి బీజేపీ తాపత్రయపడుతోందని స్పష్టమైంది. 2017లో అయిదు రాష్ట్రాల ఎన్నికలకు ముందు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సైతం బీజేపీ ప్రభుత్వం పెద్దగా జనాకర్షక పథకాలు, రాయితీలు ఏవీ ప్రకటించలేదు. అయితే లోక్‌సభ ఎన్నికలు, కొన్ని కీలక రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో బీజేపీలో అంతర్మథనం మొదలైంది. బీజేపీకి సీట్లు తగ్గవచ్చంటూ ఆరెస్సెస్ సహా పలు సంస్థల సర్వేలు కూడా తేల్చిచెప్పడంతో ఎక్కువమంది ప్రజలను తమవైపు తిప్పుకొనేలా ఏదో ఒకటి చేయకతప్పదనే ఆలోచనలో పడింది. బీజేపీకి మొదట్నుంచీ పట్టణ ప్రాంతాల్లోనే చెప్పుకోదగ్గ బలం ఉంది. గతంతో పోలిస్తే పార్టీ ఇప్పుడు అనేకరెట్లు బలపడినప్పటికీ పట్టణాలతో పోలిస్తే గ్రామాల్లో బీజేపీ బలం కొంత తక్కువగానే ఉంటూ వస్తోంది. తాజాగా జరిగిన గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కూడా ఇదే ధోరణి కనిపించింది. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి తాజా బడ్జెట్‌ను ఓ అస్త్రంగా కమలనాథులు మలచుకున్నారు. బీజేపీకి పట్టణ మధ్యతరగతి ఓటర్లు ఆది నుంచీ వెన్నుదన్నుగా ఉంటూ వచ్చారు. ఈ బడ్జెట్‌లో ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితి పెంచుతారని వారంతా ఆశగా ఎదురుచూశారు. కానీ మధ్యతరగతిని కాస్త నొప్పించి అయినా గ్రామీణ పేదల్ని మెప్పించాలని బీజేపీ సర్కారు భావించింది. ఆదాయపు పన్నుకు సంబంధించి ప్రస్తుత శ్లాబ్‌లనే కొనసాగిస్తున్నట్లు తేల్చేసిన జైట్లీ, కంటితుడుపుగా రూ.40 వేల స్టాండర్డ్ డిడక్షన్‌ను ప్రకటించారు. అదే సమయంలో పేదలు, అల్పాదాయ వర్గాలకు జైట్లీ భారీ వరాలు ఇచ్చారు. దేశంలో 10 కోట్ల కుటుంబాలకు ఏడాదికి రూ.5 లక్షల చొప్పున ఆరోగ్య బీమా కల్పిస్తామని సంచలన ప్రకటన చేశారు. ఈ పథకం వల్ల సుమారు 50 కోట్ల మందికి ప్రయోజనం కలుగుతుందని నొక్కి మరీ చెప్పారు. దక్షిణాదిలో తమ ఉనికి ఉన్న ఏకైక రాష్ట్రమైన కర్ణాటకలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న దృష్ట్యా బెంగళూరు మెట్రో రైలుకు రూ.17 వేల కోట్ల నిధులు కేటాయించారు. హవాయి చెప్పులు వేసుకునే వారిని హవాయీ జహాజ్ (విమానం) ఎక్కిస్తామని ఊరించారు. అంతర్జాతీయంగా చమురు ధరలు తక్కువగానే ఉన్నప్పటికీ, కొంత కాలంగా అడ్డూ అదుపూ లేకుండా పెట్రో ఉత్పత్తుల ధరలు పెరుగుతూ వస్తున్నాయి. వాటిపై కూడా పన్నును తగ్గించి సామాన్యుడిని ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేశారు. ఇలా తాము బలహీనంగా ఉన్న అన్ని వర్గాలు, ప్రాంతాల్లో బలం పుంజుకోవడమే లక్ష్యంగా బడ్జెట్‌ను తీర్చిదిద్దారు. ఈ బడ్జెట్ జనాకర్షకంగా ఉండబోదని ప్రధాని బుకాయించినప్పటికీ భారత ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ అసలు సంగతిని ముందే బయటపెట్టారు. ఆర్థిక పటిష్ఠత వైపు సాగుతున్న ప్రయాణానికి ఈ బడ్జెట్‌లో విరామం ఇవ్వాల్సి వస్తుందని అన్యాపదేశంగా వ్యాఖ్యానించారు. గురువారం బడ్జెట్ ప్రసంగంలో అరుణ్ జైట్లీ ఉటంకించిన గణాంకాలు చూస్తే సుబ్రమణియన్ మాటలు అక్షర సత్యాలని అర్థమైంది. "2018-19లో ద్రవ్య లోటు 3 శాతం ఉండాలని తొలుత లక్ష్యంగా పెట్టుకున్నాం. కానీ ఇప్పుడు దానిని 3.3 శాతానికి సవరించాం" అని జైట్లీ వెల్లడించారు. రాజకీయ పటిష్ఠత కోసం ఆర్థిక పటిష్ఠత విషయంలో తాము రాజీ పడ్డామని చెప్పకనే చెప్పారు.

లోక్‌సభ 5కు వాయిదా

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సార్వత్రిక బడ్జెట్‌ను సమర్పించిన వెంటనే లోక్‌సభ సోమవారానికి వాయిదా పడింది. బీజేపీ ఎంపీ చింతామన్ వంగ మంగళవారం మరణించడంతో శుక్రవారం లోక్‌సభ సమావేశం కాదని స్పీకర్ సుమిత్రా మహాజన్ చెప్పారు. "సిట్టింగ్ సభ్యుడు మరణిస్తే సభను వాయిదా వేయడం ఒక ఆనవాయితీగా వస్తోంది. అయితే బడ్జెట్‌ను సమర్పించాల్సి ఉండటంతో రాష్ట్రపతి లోక్‌సభను సమావేశపరిచారని స్పీకర్ తెలిపారు.



బడ్జెట్ పత్రాలను జాగిలాలతో తనిఖీ చేస్తున్న భద్రతాసిబ్బంది

మోదీ జమానా.. రైల్వే కోచ్‌లు, జోన్‌లు



విశాఖకు మరోసారి అన్యాయం

రాష్ట్ర విభజనకు ముందునుంచీ రైల్వేజోన్ కోసం విశాఖవాసులం అడుగుతున్నాం. ఈసారైనా బడ్జెట్‌లో కేంద్రం స్పందిస్తుందని ఆశించాం. ఈ ఒక్కవిషయంలోనే కాదు, మన రాష్ట్రానికి హామీ ఇచ్చిన ఏ సాయాన్నీ మోదీ ప్రభుత్వం అందించడం లేదు.

- డీవీ సూర్యారావు, రిటైర్డు ఉద్యోగి, విశాఖ



మొండి చేయి చూపించారు

కేంద్రం రైల్వేల విషయంలో నవ్యాంధ్రపై తీవ్రమైన వివక్ష చూపింది. అడక్కుండానే ముంబై రైల్వేకు రూ. 10 వేల కోట్లు, బెంగళూరు మెట్రో ప్రాజెక్టుకు రూ. 17 వేలు కోట్లు కేటాయించిన కేంద్రం, మన రాష్ట్రానికి మాత్రం మొండి చేయి చూపింది.

- కేఎస్ లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీ , గుంటూరు.



డిజిటల్ కరెన్సీని అడ్డుకుంటాం

బిట్‌కాయిన్‌కు చట్టబద్ధత లేదు.. బ్లాక్‌చైన్ టెక్నాలజీ ఉపయోగిస్తాం: జైట్లీ



బిట్‌కాయిన్ వంటి డిజిటల్ కరెన్సీలకు దేశంలో అన్ని దారులు మూసేశారు అరుణ్‌జైట్లీ! 'క్రిప్టో కరెన్సీని భారత్ గుర్తించదు. బిట్‌కాయిన్‌కు మన దేశంలో చట్టబద్ధత లేదు. చెల్లింపుల వ్యవస్థలో చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవు' అని జైట్లీ హెచ్చరించారు. ఇటీవల భారత్‌లో బిట్‌కాయిన్ ట్రేడర్లు, ఇన్వెస్టర్లు పెరుగుతున్నారు. ప్రతి పది బిట్‌కాయిన్ లావాదేవీల్లో ఒకటి భారత్‌లోనే జరుగుతున్న నేపథ్యంలో.. క్రిప్టో కరెన్సీ అడ్డుకుంటామని అరుణ్‌జైట్లీ స్పష్టం చేశారు. దేశంలో డిజిటల్ కరెన్సీ అంతానికి పంతం పట్టిన కేంద్రం.. అదే సమయంలో బ్లాక్‌చైన్ టెక్నాలజీ ఉపయోగంపై ఆసక్తిని ప్రదర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది. 'డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు దారిచూపుతూ.. బ్లాక్‌చైన్ టెక్నాలజీ ఉపయోగంపై మార్గాలను ప్రభుత్వం అన్వేషిస్తుంది' అని అరుణ్‌జైట్లీ ప్రకటించారు.

బ్లాక్‌చైన్ టెక్నాలజీ అంటే ఏమిటి?

బ్లాక్ చైన్ అనేది క్రిప్టో కరెన్సీ లావాదేవీలకు సంబంధించి వికేంద్రీకృత ఖాతా పుస్తకం వంటిది! బిల్‌గేట్స్, రిచర్డ్ బ్రాన్సన్‌వంటి వ్యాపార దిగ్గజాలతోబాటు ప్రపంచవ్యాప్తంగా బడా బ్యాంకులు, బీమా కంపెనీలు బ్లాక్‌చైన్ టెక్నాలజీపై ఆసక్తిని ప్రదర్శిస్తున్నాయి. థర్డ్ పార్టీ ప్రమేయం లేకుండా.. వినియోగదారులను, పంపిణీ దారులను బ్లాక్‌చైన్ నేరుగా కలుపుతుంది. ఇందులో ఒక్కసారి డేటా రాస్తే.. ఎవ్వరూ మార్చలేరు. ఇదే బ్లాక్‌చైన్ ప్రత్యేకత! ప్రతి లావాదేవీనీ 'బ్లాక్' అని వ్యవహరిస్తారు. ప్రతి బ్లాక్.. నెట్‌వర్క్‌లోని అందరికీ తెలుస్తుంది. నెట్‌వర్క్‌లోని పార్టీలందరూ.. ఆ బ్లాక్‌ను ఆమోదించాల్సి ఉంటుంది. అప్పుడు మాత్రమే ఆ 'బ్లాక్' లేదా లావాదేవీ నెట్‌వర్క్ చైన్‌లోకి వస్తుంది. ఇదంతా పూర్తయిన తర్వాతే ఇద్దరి మధ్య నగదు బదిలీ లేదా లావాదేవీ పూర్తవుతుంది. బిట్‌కాయిన్ విషయానికే వస్తే, ప్రతి ట్రాన్సాక్షన్ వివరాలనూ బ్లాక్‌చైన్ స్టోర్ చేస్తుంది. ఒకే బిట్‌కాయిన్‌ను ఒకటి కంటే ఎక్కువసార్లు వాడితే టెక్నాలజీ అడ్డుకుంటుంది. అయితే బ్లాక్‌చైన్ బిట్‌కాయిన్ వంటి డిజిటల్ కరెన్సీలకు మాత్రమే సంబంధించిన అంశం కాదు! నగదు, వస్తువులు, సేవలు, ఆస్తులు ఇలా అన్ని లావాదేవీలకూ బ్లాక్‌చైన్ ఉపయోగించవచ్చు. అందరికీ తెలిసే ప్రతి టాన్సాక్షన్ జరుగుతుంది కాబట్టి అవకతవకలు జరగడానికి ఆస్కారం తక్కువ! ఇంటర్నెట్ అందుబాటులో ఉంటే చాలు..ఎవ్వరైనా బ్లాక్‌చైన్ ఉపయోగించవచ్చు.

తెలుగు రాష్ట్రాల్లో ..

గ్లోబల్ ఎజెండా కౌన్సెల్ గణాంకాల ప్రకారం.. ప్రపంచ జీడీపీలో 20 బిలియన్ డాలర్ల లావాదేవీలు బ్లాక్‌చైన్‌లో జరుగుతున్నాయి. భూముల రిజిస్ట్రేషన్లకు సంబంధించి బ్లాక్‌చైన్ ఆధారిత వ్యవస్థను తీసుకురావడానికి ఏపీ ప్రభుత్వం ఇప్పటికే ముందడుగు వేసింది. స్వీడన్‌కు చెందిన 'క్రోమా వే' అనే స్టార్టప్ సహకారంతో.. భూముల అమ్మకాలు-కొనుగోళ్లు, రుణాలు, పెట్టుబడులు, టైటిల్ బదిలీలు పారదర్శకంగా జరిగేలా బ్లాక్‌చైన్ ప్రాజెక్టును చేపట్టింది. తెలంగాణ కూడా డాక్యుమెంటేషన్ వ్యవస్థను డిజిటలైజ్ చేయడానికి చొరవ చూపుతోంది. తాజాగా కేంద్ర ఆర్థిక మంత్రి కూడా తన బడ్జెట్ ప్రసంగంలో బ్లాక్‌చైన్ ఉపయోగిస్తామని ప్రకటించడం.. ఈ టెక్నాలజీకి పెరుగుతున్న ప్రాధాన్యతకు అద్దం పడుతుంది.

సానుకూలంగా స్పందించిన పరిశ్రమ

బిట్‌కాయిన్ వంటి డిజిటల్ కరెన్సీలకు చట్టబద్ధత లేదని ఆర్థికమంత్రి స్పష్టం చేయడం.. బ్లాక్ చైన్ టెక్నాలజీకి కేంద్రం కట్టుబడి ఉందని ప్రకటించడాన్ని పరిశ్రమ వర్గాల స్వాగతించాయి. 'బ్లాక్‌చైన్ టెక్నాలజీని ప్రోత్సహించడం డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు తోడ్పతుంది. దీనివల్ల ఆర్థిక వ్యవస్థలో పారదర్శకతకు మార్గం సుగమం అవుతుంది' అని ఐఏఎంఏఐ అధ్యక్షుడు సుభో రే హర్షం వ్యక్తం చేశారు. అయితే క్రిప్టో కరెన్సీని అడ్డుకోవడం కంటే నియంత్రిస్తే సరిపోయేదని గార్టెర్ కంపెనీ ప్రతినిధి డీడీ మిశ్రా అభిప్రాయపడ్డారు.

నో ఓట్లు
బడ్జెట్ - 2018 BUDGET -2018

పెరిగేవి ఎక్కువ.. తగ్గేవి తక్కువ


న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: బడ్జెట్ అనగానే చాలామంది చూసేది.. 'ఏ వస్తువుల ధరలు పెరుగుతాయి? ఏ వస్తువుల రేట్లు తగ్గనున్నాయి?' అనే! దేశీయ మార్కెట్లకు, దేశీయ ఉత్పత్తికి ఊతమిచ్చే క్రమంలో.. దిగుమతి చేసుకునే పలు వస్తువులపై కస్టమ్స్ డ్యూటీని పెంచుతున్నట్టు ఆర్థిక మంత్రి జైట్లీ చెప్పారు. ఉదాహరణకు.. దిగుమతి అయ్యే మొబైల్‌ఫోన్స్‌పై కస్టమ్స్ డ్యూటీని ప్రస్తుతం ఉన్న 15 శాతం నుంచి 20 శాతానికి పెంచారు. అలాగే.. సిల్క్ దుస్తులపై పన్నును 10 నుంచి 20 శాతానికి, ఎల్‌సీడీ, ఎల్‌ఈడీ టీవీలపై 7.5 శాతం నుంచి 15 శాతానికి పెంచారు. ఇలా చాలా వస్తువులపై కస్టమ్స్ డ్యూటీని పెంచారు. దీంతో ఈసారి పెరిగేవస్తువుల చిట్టా చాంతాడంత ఉండగా.. తగ్గే వస్తువుల లిస్టు వేళ్లమీద లెక్కపెట్టదగినంతే ఉంది. ఇదీ ఆ జాబితా..

పెరిగేవి..




- మూడు చక్రాల సైకిళ్లు, స్కూటర్లు, పెడల్ కార్లు, చక్రాల బొమ్మలు, బొమ్మలు, పజిల్స్ (చిన్నపిల్లలు ఆడుకునే అన్ని ఉత్పత్తులూ)
- క్రీడలు, బయట ఆడే ఆటలకు, స్విమ్మింగ్‌పూల్, ప్యాడింగ్‌పూల్‌లకు సంబంధించిన ఉత్పత్తులన్నీ
- కార్లు, మోటారు సైకిళ్లు
- స్మార్ట్‌వాచ్‌లు/ఒంటిపై ధరించే పరికరాలు
- ఆలివ్, వేరుశనగ సహా వంటలకు వాడే అన్ని రకాల నూనెలు
- కూరగాయలు, పండ్ల రసాలు
- సోయా ప్రొటీన్ మినహా ఇతర ఆహార ఉత్పత్తులు
- దంత శుభ్రతకు సంబంధించిన ఉత్పత్తుల, డెంటల్ ఫ్లాస్
- పెర్‌ఫ్యూమ్‌లు, టాయిలెట్ క్లీనర్లు
- ట్రక్కులు, బస్సులకు వాడే రేడియల్ టైర్లు
- సిగరెట్లు, లైటర్లు, కొవ్వొత్తులు
- సన్‌స్క్రీన్, సన్ ట్యాన్, మానిక్యూర్, పెడిక్యూర్ ఉత్పత్తులు
- షేవింగ్ క్రీములు, ఆఫ్టర్ షేవ్ లోషన్లు, డియోడరెంట్లు, పన్నీరు, రోమాలను తొలగించే క్రీములు, సెంట్లు, ఇతర సుగంధ ఉత్పత్తులు
- వీడియోగేమ్ కన్సోల్స్
- ఎల్‌సీడీ, ఎల్‌ఈడీ టీవీలు
- చేతి గడియారాలు, జేబు గడియారాలు, గడియారాలు
- వజ్రాలు, రంగు రాళ్లు
- ఇమిటేషన్ నగలు
- సిల్కు ఉత్పత్తులు
- మొబైల్ ఫోన్లు
- పరుపులు
- నల్ల కళ్లజోళ్లు
- చెప్పులు, బూట్లు
- గృహోపకరణాలు
- బంగారం, వెండి
- దీపాలు
- గాలిపటాలు
- లగ్జరీ కార్లు, ఎస్‌యూవీలు, అసెంబుల్డ్ వాహనాలు

తగ్గేవి



- ముడి జీడిపప్పు
- సోలార్ ప్యానెళ్లు, మాడ్యూళ్లు తయారుచేయడానికి వాడే సోలార్ టెంపర్డ్ గ్లాస్
- పెట్రోలు, డీజిల్
- కాక్లియర్ ఇంప్లాంట్ల తయారీకి వాడే ముడిపదార్థాలు, విడి భాగాలు

బంగారంపై బాదుడు

▸▸ వెండి, వజ్రాలు, రంగురాళ్లు, గిల్టు నగలపైనా!

▸▸ పెళ్లిళ్ల సీజన్‌పై ప్రభావం.. మధ్యతరగతిపై పెను భారం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: అమ్మాయి పెళ్లి అంటే.. కలిగినంతలో కాసో, రెండు కాసులో బంగారం పెడతారు పుట్టింటివారు! కొడుకు పెళ్లయితే.. కోడలికి నల్ల పూసల గొలుసో, నాంతాడో పెట్టి మహాలక్ష్మిలా ఇంటికి తెచ్చుకుంటారు. అల్లుడికి వెండికంచం, చెంబు లాంటివి సరేసరి!! అవీ లేని నిరుపేదలు ఇమిటేషన్ నగలతో సరిపెట్టుకుంటారు. అయితే.. బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి జైట్లీ బంగారంపై సర్‌చార్జి భారం, మిగతావాటిపై కస్టమ్స్ భారం మోపారు. దిగుమతయ్యే రంగురాళ్లపై కస్టమ్స్ డ్యూటీని 2.5 శాతం నుంచి 5 శాతానికి.. వజ్రాలపై 2.5% నుంచి 5 శాతానికి, గిల్టు నగలపై 15% నుంచి 20 శాతానికి పెంచారు. బంగారంపై 3 శాతం సర్‌చార్జ్ వేశారు. ఈ ప్రభావం రానున్న పెళ్లిళ్ల సీజన్‌పై పడనుందని.. ఆభరణాల కొనుగోళ్లు తగ్గుతాయని, ముఖ్యంగా మధ్యతరగతివారు తమ ఆశలకు ఒకింత కళ్లెం వేసుకోవాల్సిందేనని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. కాగా, బంగారాన్ని ఆస్తిగా పరిగణించే దిశగా ఒక సమగ్రమైన పసిడి విధానాన్ని రూపొందించనున్నట్లు జైట్లీ తన బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు.

ఆ ఫోన్ల ధరలు 3-4% పెంపు!



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: యాపిల్ ఐఫోన్ టెన్.. గూగూల్ పిక్సెల్ ఎక్స్‌ఎల్ 2 లాంటి ఫోన్లు కొనుక్కోవాలని ఉందా? అలాంటి ఆలోచన ఏదైనా ఉంటే వెంటనే కొనేసుకోండి. ఎందుకంటే.. ఈ ఫోన్ల ధరలు త్వరలోనే పెరగనున్నాయి. ఇవే కాదు.. దిగుమతి చేసుకునే ఫోన్లన్నిటిపైనా ఈ బాదుడు తథ్యం. దిగుమతి చేసుకునే మొబైల్స్‌పై కస్టమ్స్ డ్యూటీ రేటును ప్రస్తుతం ఉన్న 15% నుంచి 20 శాతానికి పెంచుతున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తన బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించిన నేపథ్యంలో వాటి రేట్లు ఆ మేరకు పెరగనున్నాయి. నిజానికి.. దిగుమతి చేసుకున్న ఫోన్లపై 10 శాతంగా ఉన్న కస్టమ్స్ డ్యూటీని గత ఏడాది డిసెంబర్‌లోనే ప్రభుత్వం 15 శాతానికి పెంచింది. రెండు నెలలైనా తిరగకుండానే మరో ఐదు శాతం మేర పెంచడం గమనార్హం. అప్పట్లో యాపిల్ సంస్థ తన ఐఫోన్ల ఖరీదును 2.5 శాతం మేర పెంచింది. అయితే.. దేశంలో ప్రస్తుతం అమ్ముడవుతున్న ఫోన్లలో 81 శాతం భారత్‌లోనే తయారవుతున్నాయని.. కాబట్టి కొన్ని ఫోన్ల ధరలు తప్ప అన్నిటివీ పెరగవని ఇండియన్ సెల్యులార్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు పంకజ్ మొహీంద్రు తెలిపారు.

ఫోన్ల చోరీని అరికట్టేందుకు 15 కోట్లతో ట్రాకింగ్ సిస్టమ్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: మొబైల్ ఫోన్ చోరీకి గురైనా, పోగొట్టుకున్నా.. అంతే సంగతులన్న భయం ఇకపై అక్కరలేదు. అందులోని సిమ్‌కార్డును తీసివేసి కొత్త కార్డును వేసినా, ఐఎంఈఐ నంబర్‌ను మార్చినా.. ఆ ఫోన్ పనిచేయకుండా బ్లాక్ చేసేలా ప్రభుత్వమే మొబైల్ ఫోన్ ట్రాకింగ్ సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. సెంట్రల్ ఎక్విప్‌మెంట్స్ ఐడెంటిఫై రిజిస్టర్ (సీఈఐఆర్) పేరుతో టెలికం శాఖ (డీవోటీ) ఆధ్వర్యంలో దీనిని ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం బడ్జెట్‌లో రూ.15 కోట్లు కేటాయించింది. మొబైల్ ఫోన్ చోరీకి గురికావడమన్నది వినియోగదారుడికి ఆర్థికంగా నష్టం కలిగించడం మాత్రమే కాకుండా.. అతని వ్యక్తిగత జీవితానికి, దేశ భద్రతకు కూడా ప్రమాదకరమని ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకే నకిలీ హ్యాండ్‌సెట్‌లను నిరోధించడం, హ్యాండ్‌సెట్‌ల చోరీలను అరికట్టడం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. అన్ని మొబైల్ ఆపరేటర్ల ఐఎంఈఐ డేటాబేస్‌కు సీఈఐఆర్‌ను అనుసంధానించడం ద్వారా చర్యలు తీసుకోనుంది. ఐఎంఈఐ నంబర్‌ను టాంపరింగ్ చేయడాన్ని శిక్షార్హమైన నేరంగా పరిగణించి.. మూడేళ్ల జైలుశిక్ష విధించేలా నిబంధనల్ని డీవోటీ రూపొందించనుంది.



టోల్‌గేట్లలో ఫాస్టాగ్

▸▸ ఈటీసీ వ్యవస్థతో సమయం, ఇంధనం ఆదా

▸▸ త్వరలో కొత్త టోల్ విధానం: అరుణ్‌జైట్లీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: దేశవ్యాప్తంగా టోల్‌గేట్లలో ఎలక్ట్రానిక్ పేమెంట్ విధానాలను విస్తృతం చేస్తామని అరుణ్‌జైట్లీ ప్రకటించారు. టోల్‌ప్లాజాల్లో నగదు చెల్లింపులను 'ఫాస్టాగ్' వంటి ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్ వ్యవస్థతో భర్తీ చేస్తామన్నారు. 2016, డిసెంబరులో దేశవ్యాప్తంగా 60వేలు ఉన్న ఫాస్టాగ్‌ల సంఖ్య ఇప్పుడు 10 లక్షలకు మించిపోయిందని వెల్లడించారు. త్వరలో దేశమంతా సరికొత్త టోల్ విధానాన్ని తీసుకువస్తామని ప్రకటించారు.

ఫాస్టాగ్ ఎలా పనిచేస్తుంది?

ఫాస్టాగ్ వ్యవస్థలో రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ టెక్నాలజీ ఉపయోగిస్తారు. ఈ రేడియో ఫ్రీక్వెన్సీ ట్యాగ్‌నే 'ఫాస్టాగ్' అంటారు. వాహనం విండో స్ర్కీన్‌కి దీన్ని అమరుస్తారు. వాహనం టోల్‌ప్లాజాను చేరగానే అక్కడి ఆర్‌ఎఫ్ఐడి వ్యవస్థ.. వాహనం యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబరును చదివి.. సెంట్రల్ కంప్యూటర్‌కు పంపుతుంది. ఆ రహదారిలో వసూలు చేసే టోల్ రుసుము.. ఫాస్టాగ్‌కు అనుసంధానమైన ప్రీపెయిడ్ అకౌంట్ నుంచి కట్ అవుతుంది. దీనివల్ల టోల్‌గేట్ల వద్ద రద్దీ తగ్గడంతోపాటుటు.. సమయం, ఇంధనం కూడా ఆదా అవుతుంది.





'స్మార్ట్‌సిటీ'లకు 6,169 కోట్లు!

▸▸ గతంతో పోల్చితే 54% పెంపు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: స్మార్ట్‌సిటీల పథకానికి కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు పెరిగాయి. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖకు మొత్తం రూ.41,765 కోట్లు కేటాయించారు. 2017-18తో పోల్చితే 2.82 శాతం పెంచారు. పట్టణాభివృద్ధి; గృహ, పట్టణ పేదరిక నిర్మూలన శాఖలను కలిపి కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ(హెచ్‌యూఏ)గా మార్చారు. ఈ శాఖకు 2017-18లో రూ.40,168 కోట్లు కేటాయించారు. స్మార్ట్‌సిటీల పథకం కింద దేశవ్యాప్తంగా 99 నగరాలను ఎంపిక చేసినట్లు హెచ్‌యూఏ ప్రకటించింది. వీటికి గత బడ్జెట్‌లో 4వేల కోట్లు కేటాయించగా ప్రస్తుతం 6,169 కోట్లు కేటాయించడం విశేషం. స్మార్ట్‌సిటీల పథకంలో భాగంగా రూ.2.04 లక్షల కోట్ల ప్రణాళికా వ్యయ అంచనాతో 99 నగరాలను ఎంపిక చేశారని, ప్రస్తుతం ఆయా నగరాల్లో పలు ప్రాజెక్టులను అమలు చేస్తున్నారని ఆర్థిక మంత్రి జైట్లీ తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. హెచ్‌యూఏకు ఇచ్చిన బడ్జెట్ మొత్తంలో మెట్రో ప్రాజెక్టులు, మాస్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్‌లకు అత్యధికంగా రూ.15000 కోట్లు కేటాయించారు. ఇది గత బడ్జెట్‌తో పోల్చితే 16.66 శాతం తక్కువ. అమృత్ పథకానికి గత ఏడాది 5వేల కోట్లు కేటాయించగా.. ఈసారి దాన్ని 6వేల కోట్లకు పెంచారు. పట్టణ ప్రాంతాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమానికి 8.69 శాతం పెంపుతో రూ.2500 కోట్లు కేటాయించారు. 2022నాటికి దేశవ్యాప్తంగా పట్టణాల్లోని పేదలకు 1.2 కోట్ల ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్న నేపథ్యంలో పీఎంఏవైకు భారీగా కేటాయింపులు ఉంటాయని ఆశించగా.. గతంలో కంటే కేవలం 7.64శాతం పెంచి రూ.6,505 కోట్లు కేటాయించారు. దీనదయాళ్ అంత్యోదయ యోజనకైతే గతంలో కంటే 11.17 శాతం తగ్గించి రూ.310 కోట్లే కేటాయించడం గమనార్హం.

మద్దతు ధర నిర్ణయం అమలుకై ప్రత్యేక వ్యవస్థ

▸▸ రాష్ట్రాలు సరిగా అమలు చేయాలి

▸▸ వృద్ధికి ఊతం.. గ్రామీణం బలోపేతం ఈ బడ్జెట్: ప్రధాని



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: బడ్జెట్ 125 కోట్ల దేశ ప్రజల ఆకాంక్షలకు అద్దం పడుతోందని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. ఇది అభివృద్ధికి ఊతమిస్తుంది. "గ్రామీణ ప్రాంత ప్రజల అవసరాలను తీరుస్తుంది. నవభారత పునాదులను బలోపేతం చేసి ఆ స్వప్నాన్ని సాకారం చేస్తోంది" అని ఆయన బడ్జెట్ సమర్పణ అనంతరం పేర్కొన్నారు. "ఇది సామాన్యుడు, వ్యవసాయదారునికి అనుకూలమైనది. వ్యాపార సౌలభ్యమే కాక జీవన సౌలభ్యానికీ అవకాశం కల్పిస్తోంది. వ్యవసాయం నుంచి మౌలిక సౌకర్యాల కల్పన దాకా- ఆరోగ్యం నుంచి పేద, మధ్య తరగతి ప్రజానీకం అవసరాలు, చిన్న తరహా పరిశ్రమలకు ఊతం, సీనియర్ సిటిజన్లకు ఆసరా, రోడ్లు, డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా.. ఇలా అన్ని వర్గాలకూ సముచిత ప్రాధాన్యం ఇచ్చిన జైట్లీ బృందానికి అభినందనలు" అని మోదీ చెప్పారు. "దేశ ప్రగతికి రైతులెంతో చేశారు. పంటలే కాక పళ్ళు, కూరగాయల విషయంలోనూ రికార్డు దిగుబడులు సాధించారు. అందుకే వారి రాబడి పెంచేందుకు అనేక చర్యలు తీసుకున్నాం. వ్యవసాయానికి ఎన్నడూ లేనంతగా రూ14.5 లక్షల కోట్లు కేటాయించాం. ఇక పంట పెట్టుబడికి ఒకటిన్నర రెట్లు మద్దతు ధర అత్యంత కీలకమైనది. దీనిపై రాష్ట్రాలతో చర్చించి సరిగా అమలయ్యేట్లు చేస్తాం. ఇందుకోసం ఓ వ్యవస్థను ఏర్పాటుచేస్తాం" అని తెలిపారు. "దేశంలో 700 జిల్లాల్లో 7000 బ్లాక్‌లు ఉన్నాయి.. వాటిలోని 22,000 బిజినెస్ సెంటర్ల ఆధునికీకరణపై దృష్టి పెట్టాం. గ్రామాలను అనుసంధానించి, పంటల సాగు, పెట్టుబడి, ఎంఎస్పీల వివరాలు.. అన్నీ తెలుసుకొనే వీలుంటుంది. దీని వల్ల రైతుల ఆదాయమూ పెరుగుతుంది. యువతకు ఉపాధి అవకాశాలూ లభిస్తాయి. 51 లక్షల కొత్త ఇళ్ళు కట్టివ్వాలన్న నిర్ణయం ద్వారా దళితులు, నిమ్న వర్గాల వారు లాభపడతారు. 1.75 లక్షల ఇళ్లకు కరెంటు, 3 కిలోమీటర్ల మేర రోడ్లు, 2 కోట్ల టాయ్‌లెట్లు.. మొదలైనవి గ్రామీణ ప్రాంతాల్లో కొత్త అవకాశాలు సృష్టిస్తాయి. ఆయుష్మాన్ భారత్ ప్రపంచంలోనే అతి పెద్ద ఆరోగ్య రక్షణ పథకం. 24 కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటు భవిష్యత్తులో ప్రజారోగ్యాన్ని ఉద్దేశించి తీసుకున్నదే" అని ఆయన పేర్కొన్నారు. చాలా కాలంగా మధ్య, చిన్న తరహా పరిశ్రమల వారు 30 శాతం పన్ను చెల్లిస్తున్నారని, దాన్ని ఐదు శాతం మేర తగ్గించడం ఓ సాహస నిర్ణయమని మోదీ అభిప్రాయపడ్డారు. ఇది మేకిన్ ఇండియా కార్యక్రమానికి కూడా ఊతమిస్తుందన్నారాయన. "ఆధునిక భారత్ సాకారం కావడానికి, అభివృద్ధి ప్రక్రియలో స్థిరత్వం రావడానికి- మౌలిక సదుపాయాలు కావాలి. అందుకే డిజిటల్ ఇండియాలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కుప్రాధాన్యం ఇచ్చాం. 6 లక్షల కోట్లు కేటాయించాం. దీని వల్ల ఉపాధి అవకాశాలు పెరుగుతాయి" అన్నారు మోదీ.

మోదీ జమానా.. విద్యా రంగం



బడుగుల ఉన్నతిపై దృష్టేది?

ఈసారి బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపులు బాగానే చేశారు. అయితే, దారిద్ర్యరేఖకు దిగువున ఉన్న వర్గాల పిల్లలు ఉన్నతచదువులు అభ్యసించేందుకు కేంద్ర ప్రభుత్వం ఊతమివ్వాల్సి ఉంది. ఆ దిశగా కేటాయింపులు ఉంటే బాగుండేది.

- డీ గౌరీశంకర్, లా విద్యార్థి, ఏయూ, విశాఖ.



ఆవిష్కరణలకు ఊతమిచ్చారు.

విద్యారంగంలో పరిశోధన, అభివృద్ధికి సంబంధించిన అంశాలపై బడ్జెట్‌లో కేంద్రం దృష్టి సారించింది. రాబోయే నాలుగు సంవత్సరాలలో కొంగ్రొత్త ఆవిష్కరణలకు రూ. లక్ష కోట్లను కేటాయించడం సంతోషకరం.

- డాక్టర్ పి.సత్యనారాయణన్, ఎస్ఆర్ఎం వర్శిటీ ప్రెసిడెంట్ విజయవాడ



బడ్జెట్‌లో 'కీ'లకం!

సంక్షేమం...



- 'ఉజ్వల' పథకం కింద దేశవ్యాప్తంగా మహిళలకు 8కోట్ల వంట గ్యాస్ కనెక్షన్లు.
- ప్రతి మూడు లోక్‌సభ నియోజకవర్గాలకు ఒక వైద్య కళాశాల.
- పదికోట్ల పేద కుటుంబాలకు రూ.5 లక్షల ఆరోగ్య బీమా.!
- గ్రామీణ ప్రాంతాల్లో 5లక్షల వైఫై హాట్ స్పాట్‌లు.
- 500 నగరాల్లోని ప్రతి ఇంటికీ నీటిని అందించడమే లక్ష్యంగా 'అమృత్' కార్యక్రమం. 494 నీటి ప్రాజెక్టులపై రూ.19,428 కోట్లు వ్యయం.
- టీబీ రోగులకు పౌష్టికాహార సరఫరా... చికిత్స పొందుతున్న వారికి రూ.600.
- వితంతువులు, అనాథలకు 'సామాజిక భద్రత - రక్షణ' కోసం నిధులు.

వ్యవసాయం



- క్షీర విప్లవం (ఆపరేషన్ ఫ్లడ్) తరహాలో... 'హరిత విప్లవం' (ఆపరేషన్ గ్రీన్)కోసం రూ.500 కోట్లు.
- రబీలో అన్ని పంటలకు పెట్టుబడి వ్యయం కంటే ఒకటిన్నర రెట్లు మద్దతు ధర.
- 2వేల కోట్లతో మార్కెట్ యార్డుల అభివృద్ధి.
- కౌలు రైతులకూ రుణాలు

పన్నులు, లెక్కలు

- బడా కంపెనీలకు వరం... కార్పొరేట్ ట్యాక్స్ 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గింపు.
- సహజమైన 'సంస్కరణ' పథం నుంచి కాస్త పక్కకు తప్పుకొన్న మోదీ సర్కారు. రాబోయే 8రాష్ట్రాల అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ప్రజాకర్షక 'విన్యాసం!'
- షేర్ మార్కెట్‌కు 'మింగుడు' పడని బడ్జెట్! ప్రసంగం సాగుతున్నంతసేపు.. పడుతూ లేస్తూ! చివరికి... సెన్సెక్స్ 58 పాయింట్లు, నిఫ్టీ 10 పాయింట్లు నష్టం.
- ఆదాయపు పన్ను శ్లాబుల్లో మార్పు లేదు! వైద్య, రవాణా భత్యాలపై 40వేలు స్టాండర్డ్ డిడక్షన్‌తో సరి. అదనపు లబ్ధి 14,600పైనే!




- ఆదాయపు పన్నుపై 3శాతం విద్యా సెస్సు తొలగింపు. 4శాతం వైద్య, ఆరోగ్య సెస్సు విధింపు.
- దిగుమతి చేసుకున్న అన్ని వస్తువులపై 10 శాతం సంక్షేమ సెస్సు!
- పెట్రో ధరలపై మార్పులేదు.. తగ్గించిన ఎక్సైజ్ సుంకం, కొత్త రోడ్డు సెస్సుతో సరి!
- రాష్ట్రపతి జీతం రూ.5 లక్షలకు, ఉపరాష్ట్రపతి వేతనం 4లక్షలకు, గవర్నర్ల జీతం 3.5 లక్షలకు పెంపు.
- ఎంపీల భత్యాలు ద్రవ్యోల్బణానికి అనుగుణంగా ఐదేళ్లకు ఒకసారి సవరణ.
- వయోవృద్ధుల ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రూ.50 వేల వరకు పన్ను మినహాయింపు.
- కస్టమ్స్ డ్యూటీ 20 శాతానికి పెంపు... పెరగనున్న మొబైల్ ఫోన్ల ధరలు.
- బిట్ కాయిన్ తరహా క్రిప్టోకరెన్సీ లావాదేవీలపై నియంత్రణకు కఠిన చర్యలు.
- వందకోట్ల టర్నోవర్ దాటి, 'వ్యవసాయ ఉత్పత్తుల' కంపెనీలుగా రిజిస్టర్ అయితే ఐదేళ్లపాటు వందశాతంపన్ను మినహాయింపు.

రైళ్లు, విమానాలు



- రైల్వేలో 1.48 లక్షల కోట్లతో అభివృద్ధి పనులు.
- 'హవాయి చెప్పులు వేసుకునేవారూ విమాన ప్రయాణం' చేసేలా పౌర విమానయాన రంగం అభివృద్ధి... ఏటా వందకోట్ల మంది ప్రయాణించేలా ఏఏఐ ఆధ్వర్యంలోని విమానాశ్రయాల సంఖ్య 124 నుంచి 620కి పెంపు.
- 2019లో 4వేల కిలోమీటర్ల కొత్త రైల్వే ట్రాక్ నిర్మాణ లక్ష్యం.
- క్రమక్రమంగా అన్ని రైళ్లలో వైఫై, సీసీటీవీ, ఇతర ఆధునిక వసతులు.
- రోజుకు 25వేల మందికిపైగా రాకపోకలు సాగించే రైల్వేస్టేషన్లలో ఎస్కలేటర్లు.
- దేశవ్యాప్తంగా 600 ప్రధాన రైల్వే స్టేషన్ల అభివృద్ధి.
- అన్ని రంగాల్లో కొత్త ఉద్యోగుల ఈపీఎఫ్‌లో 12శాతం భరించనున్న కేంద్రం.

విద్య...



- గిరిజన ప్రాంతాల్లో ఏకలవ్య పాఠశాలల ఏర్పాట్లు... మేధో వలసను నియంత్రించేలా ప్రతిభావంతులైన బీటెక్ విద్యార్థులకు ఫెలోషిప్‌లు, ఐఐటీ, ఐఐఎస్సీల్లో అడ్మిషన్లు.
- ఉపాధ్యాయులకు ఉత్తమ శిక్షణ... అందుకోసం, ఇంటెగ్రేటెడ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్.

తలసరి అప్పు రూ.75 వేలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: చెట్టుకు చీడ ఎలాగో మనిషికి అప్పూ అలాగే! విలాసాలు, సౌకర్యాలు లేకపోతేనేమి.. నెత్తిన అప్పులేకుంటే గంజి తాగినా అది అమృతంతో సమానమని అనుకుంటాం. మనదేశం తీరు మాత్రం 'అప్పు చేసి పప్పుకూడు' అన్న చందంగా ఉంది! దేశం ఏటికేడు అప్పుల ఊబిలో కూరుకుపోతోంది. కేర్ కేర్ మంటూ భూమ్మీద పడుతున్న శిశువు నెత్తిన దాదాపుగా రూ.75వేల అప్పు పడుతోంది. అంటే.. ఇది దేశంలో ప్రతి వ్యక్తిపై ఉన్న రుణభారమన్నమాట! వ్యవసాయ రంగంలో స్వయంసమృద్ధి సాధించి, పారిశ్రామిక రంగంలో అభివృద్ధి చెందుతున్న దేశాలతో పోటీపడుతున్న భారత్... అప్పుల భారాన్ని మాత్రం తగ్గించుకోలేకపోతోంది. తాజాగా కేంద్ర బడ్జెట్ గణాంకాల ప్రకారం దేశం మొత్తం రుణం దాదాపు 90లక్షల కోట్లు! భారీ స్థాయిలో ఉన్న ఈ రుణభారం ఒక ఎత్తయితే, ఈ అప్పులు ఏటికేడు పెరుగుతుండడం మరో ఎత్తు! ప్రపంచ ఆర్థికశక్తిగా చైనాతో పోటీ పడుతున్న మనదేశం రుణాలను అదుపు చేసే చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి. కొన్ని ఆర్థిక సంవత్సరాలను మినహాయిస్తే దాదాపుగా ఏటా మనదేశ రుణాల్లో పెరుగుదల.. పెరుగుతున్న రేటులో నమోదవుతోంది. ఇది మన పటిష్టమైన ఆర్థిక వ్యవస్థకు ఇబ్బందులు సృష్టిస్తుందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. 2013-14లో రూ. 56,70,181 కోట్లుగా ఉన్న రుణం.. ఆరేళ్లలోనే 89,58,193 కోట్లకు చేరుకుంది!

సంవత్సరం	మొత్తం అప్పు
2013-14	56,70,181
2014-15	62,78,854
2015-16	68,94,991
2016-17	73,14,991
2017-18	82,32,653
2018-19	89,58,193

(రూ.కోట్లలో)



అప్పుల భారం



నోట్లు ఓట్లు బడ్జెట్ - 2018


సెస్ ద్వారా నిధుల సేకరణ

ఆయుష్మాన్ భారత్ పథకానికి నిధులు సేకరించడం కోసం ఆదాయ పన్ను మీద ఒక శాతం అదనపు సెస్సు వసూలు చేయనున్నారు. ఈ విధంగా 11 వేల కోట్లు వసూలవుతాయని భావిస్తున్నారు. ఇప్పటికే ఆదాయ పన్నుమీద 3 శాతం విద్యా సెస్సు ఉంది. రెండూ కలిపి 4 శాతం 'విద్య, ఆరోగ్య సెస్సు'ను వసూలు చేయనున్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం పట్ల దేశంలోని కార్పొరేట్ కంపెనీలు, ఆసుపత్రులు హర్షం వ్యక్తం చేశాయి.

పేదకు ఆరోగ్య ధీమా..!

- కుటుంబానికి ఏడాదికి 5 లక్షల బీమా.. పది కోట్ల కుటుంబాలకు కవరేజ్
- బడ్జెట్లో కేంద్రం సంచలన పథకం.. దేశంలో లక్షన్నర వెల్‌నెస్ కేంద్రాలు
- ఇంటికి దగ్గర్లో ప్రాథమిక వైద్యం.. అందుబాటులో అత్యవసర మందులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: ఇంట్లో ఎవరికైనా ఏదైనా జరిగి ఆస్పత్రి పాలయితే ఇల్లూ వాకిలీ అమ్ముకోవాల్సిందే. దేశంలో చాలామంది కుటుంబాల పరిస్థితి ఇదే. ఆస్పత్రి గండం గట్టెక్కించే వారెవరైనా దేవుడితో సమానమే. అందుకే తెలుగు రాష్ట్రాలు ఇప్పటికే ఎంత కష్టమైనా ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తున్నాయి. అదే అడుగు జాడల్లో ఇప్పుడు దేశమంతటా యాభై కోట్ల మంది నిరుపేదలకు ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేసేందుకు కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు సన్నద్ధమైంది. గురువారం ఆర్థిక మంత్రి జైట్లీ తన బడ్జెట్ ప్రసంగంలో ప్రపంచంలోకెల్లా అతిపెద్ద వైద్య బీమా పథకాన్ని ఆవిష్కరించారు. కుటుంబానికి ఏడాదికి ఐదు లక్షల చొప్పున బీమా కవరేజ్ అందిస్తామని ప్రకటించారు. దీనికి బడ్జెట్ పరిమితి లేదని చెప్పారు. పేదలు ఆస్పత్రి పాలైతే బిల్లులు చెల్లించేందుకు ఆస్తులు అమ్ముకోవాల్సి వస్తోందని ఈ సందర్భంగా జైట్లీ ప్రస్తావించారు. దేశంలోని 130 మంది కోట్ల మంది జనాభాలో నలభై శాతం మందికి ఈ పథకం వర్తించనుంది. ఇంటికి ఐదుగురు చొప్పున ఈ పథకం కింద లబ్ధి పొందుతారని అంచనా. అందులో కనీసం ముగ్గురు ఓటర్లున్నా 30 కోట్ల మంది ఓటర్లను చేరవచ్చన్నది బీజేపీ సర్కారు యోచన. జైట్లీ ఈ పథకాన్ని ప్రకటించినపుడు బీజేపీ సభ్యులు పెద్ద ఎత్తున బల్లలు చరిచి హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యానికి అయ్యే ఖర్చుకు నాలుగు రెట్ల మొత్తాన్ని ప్రైవేటు ఆస్పత్రులు వసూలు చేస్తున్నాయని తాజా ఆర్థిక సర్వేలో వెల్లడైంది. ప్రైవేటు ఆసుపత్రిలో చేరిన వారంతా సగటున 26 వేలు బిల్లు చెల్లించి బయట పడుతున్నారని తేలింది. ప్రస్తుతం రాష్ట్రీయ స్వస్థ్య బీమా యోజన పథకం కింద కేవలం 30 వేల రూపాయలే బీమా సొమ్ము ఇస్తున్నారు. అదీ రీయింబర్స్‌మెంట్ పద్ధతిలో. దీనికితోడు ఏడాదికి 12 రూపాయల ప్రీమియంతో 2 లక్షల రూపాయల ప్రమాద వైద్య బీమాను అందిస్తున్నారు.



ఆయుష్మాన్ భారత్

2022 కల్లా కొత్త భారత్‌ను నిర్మించే క్రమంలో భాగంగా కేంద్రం 'ఆయుష్మాన్ భారత్' పథకాన్ని ప్రకటించింది. ఇందులో మొదటిది ఐదు లక్షల ఆరోగ్య బీమా అయితే, రెండోది దేశవ్యాప్తంగా లక్షన్నర వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేయడం. ఇందుకు 1200 కోట్లు వెచ్చిస్తారు. ఇంటికి అత్యంత సమీపంలో ప్రాథమిక వైద్యం అందించడమే ఈ పథకం లక్ష్యం. మాతాశిశు ఆరోగ్య సమస్యలు, ఇతర సాధారణ వ్యాధులకు ఇక్కడ చికిత్స చేస్తారు. అత్యవసర మందులు ఉచితంగా అందిస్తారు. జాతీయ వైద్య మిషన్‌లో భాగంగా 2017లోనే ఈ వెల్‌నెస్ సెంటర్లను ప్రకటించారు. వెల్‌నెస్ సెంటర్లలో భారీఎత్తున మహిళలకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ఇందులో ప్రైవేటు సంస్థలు సామాజిక బాధ్యత కింద నిధులు చెల్లిస్తాయి.

24 బోధనాసుపత్రులు


దేశవ్యాప్తంగా 24 జిల్లా స్థాయి ఆసుపత్రులను బోధన ఆసత్రులుగా అప్‌గ్రేడ్ చేయనున్నారు. వాటికి అనుబంధంగా వైద్య కళాశాలలను ఏర్పాటు చేస్తారు. ప్రతీ మూడు లోక్‌సభ నియోజకవర్గాలకు బోధనాసుపత్రి లక్ష్యంగా ఈ ఆసుపత్రులను ఏర్పాటు చేస్తున్నారు. వీటికితోడు దేశమంతటా ఉచిత డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేస్తారు. టీబీ రోగులకు పౌష్టికాహారం అందించేందుకు ఒకరికి నెలకు రూ.500 చొప్పున రూ.600 కోట్లు ఖర్చు పెట్టనున్నారు.

బీ'మాయే'నా?

ఆరేళ్లుగా అమలు కాని ఆరోగ్య బీమా పథకం!

- ఈ బడ్జెట్‌లోనూ అంకెల గారడీయే!
- లబ్ధిదారుల సంఖ్య... బీమా వ్యయం మాత్రమే పెంచారు

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): [illegible]తో మాయ పథకం! ప్రభుత్వాలు మారినా.. పథకం తీరు మాత్రం మారడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి నేటి అధికార బీజేపీ వరకూ ప్రతిసారీ బడ్జెట్‌లో ఈ పథకం ప్రస్తావన తీసుకువస్తూనే ఉన్నా ఆచరణలోకి రావడం లేదు. కాంగ్రెస్ హయాంలో 'రాష్ట్రీయ స్వస్థ బీమా యోజన'గా ఉన్న పథకం కాస్త.. బీజేపీ వచ్చాక 'నేషనల్ హెల్త్ ప్రొటెక్షన్ స్కీమ్'గా మారింది. కానీ అమలులో మాత్రం ఏ మార్పూ లేదు. కేంద్ర ప్రభుత్వం ఈ పథకానికి ఏటా బడ్జెట్‌లో వందల కోట్లు కేటాయిస్తోంది. కానీ ఆ నిధులేమవుతున్నాయో ఎవరికీ అర్థం కావడం లేదు. 2012-13 నుంచి తాజాగా.. గురువారం అరుణ్‌జైట్లీ ప్రవేశపెట్టిన 2018-19 బడ్జెట్ వరకూ ఇదే తంతు.



నిధుల కేటాయింపు ఇలా...

2013లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకానికి రూ.వెయ్యి కోట్లు కేటాయించింది. తర్వాతి ఏడాది రూ.887 కోట్లు, 2015-16 లో రూ.550 కోట్లు కేటాయించింది. తర్వాత అధికారంలోకి వచ్చిన బీజేపీ 2016-17లో లబ్ధిదారుల సంఖ్యను, బీమా వ్యయాన్ని పెంచింది. బడ్జెట్‌ను రూ.1500 కోట్లకు పెంచింది. ఆ తర్వాత ఏడాది కూడా ఇదే స్థాయిలో నిధులు కేటాయించింది. కానీ, పథకం అమలు మాత్రం జరగడం లేదు. ఈ ఏడాది బడ్జెట్‌లో అయితే.. బీమా మొత్తాన్ని, లబ్ధిదారుల సంఖ్యను కూడా భారీగా పెంచింది. పది కోట్ల కుటుంబాల (50 కోట్ల మంది లబ్ధిదారులు)కు రూ.5 లక్షల బీమాను అందిస్తామని ప్రకటించింది. ఆరేళ్ల నుంచి ప్రకటనలకే పరిమితమవుతున్న ఈ పథకం .. ఈ ఏడాదైనా అమలు అవుతుందో లేదో చూడాలి.

ఏపీకి మెడికల్ కాలేజీలు నిల్!

కేంద్ర బడ్జెట్ ఏపీ ఆరోగ్యశాఖను కూడా పూర్తిగా నిరాశ పరిచింది. బడ్జెట్లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 24 మెడికల్ కాలేజీల్లో ఏపీకి ఒక్కటి కూడా కేటాయించలేదు. మరోవైపు మూడు పార్లమెంట్ నియోజకవర్గాలకో ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఏపీలో 25 పార్లమెంట్ నియోజకవర్గాలున్నాయి. దీని ప్రకారం 8 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు అవసరం. కానీ ఏపీలో ఇప్పటికే.. విజయనగరం, పశ్చిమగోదావరి మినహా 11 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఉండడంతో కొత్తవి వచ్చే అవకాశం లేదు. రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన మేరకు కనీసం విజయనగరం, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఒక జిల్లాకైనా మెడికల్ కాలేజీ ప్రకటించి ఉంటే కాస్త న్యాయం జరిగేది.

విద్యాసంస్థలకు అరకొరే!

- గత బడ్జెట్‌తో పోలిస్తే పెంపు రూ.5 కోట్లే
- విభజన విద్యాసంస్థలపై పూర్తి ఉదాసీనత

అమరావతి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): విభజన చట్టం ప్రకారం నవ్యాంధ్రప్రదేశ్‌కు మంజూరైన ప్రతిష్ఠాత్మక జాతీయ విద్యా సంస్థలు, విశ్వవిద్యాలయాలకు 2018-19 సంవత్సరపు కేంద్ర బడ్జెట్‌లో అరకొర కేటాయింపులే దక్కాయి. గత మూడు బడ్జెట్‌ల కంటే ఈసారి భారీగా నిధులు వస్తాయన్న ఆశలు గల్లంతయ్యాయి. బడ్జెట్‌లో చేసిన మొక్కుబడి కేటాయింపుల వల్ల ఆయా ప్రముఖ విద్యాసంస్థల నిర్మాణాలు చేపట్టే పరిస్థితి ఏ మాత్రం లేదు. కేటాయించిన నిధులన్నీ కూడా రికరింగ్ ఖర్చులకే సరిపోతాయి. ఇంత వరకు ఆయాసంస్థల ప్రహరీగోడల నిర్మాణాలే జరుగుతున్నాయి తప్ప, భవనాల నిర్మాణం ప్రారంభం కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఆ సంస్థలన్నింటికీ అవసరమైన భూకేటాయింపులు పూర్తి చేసింది. 2017-18 వార్షిక బడ్జెట్‌తో పోలిస్తే ఈ సంస్థలకు పెంచింది కేవలం రూ.5 కోట్లే. ఏడు విద్యా సంస్థలకు కలిపి మొత్తం రూ.245 కోట్లు కేటాయించింది. ఇందులో ఐదు జాతీయ విద్యా సంస్థలకు రూ.225 కోట్లు, రెండు విశ్వవిద్యాలయాలకు కలిపి రూ.20 కోట్లు చూపింది. ఇందులో ఐఐటీకి(తిరుపతి) రూ.50 కోట్లు, ఐఐఎస్ఈఆర్‌కి(తిరుపతి) రూ.49కోట్లు, ఐఐఎంకి (విశాఖపట్నం) రూ.42 కోట్లు, ఎన్ఐటీ కి(నిట్-తాడేపల్లిగూడెం) రూ.54 కోట్లు, ఐఐఐటీకి (కర్నూలు) రూ.30 కోట్లు, కేంద్రీయ విశ్వవిద్యాలయానికి(అనంతపురం) రూ.10 కోట్లు, గిరిజన విశ్వవిద్యాలయానికి(విజయనగరం) రూ.10 కోట్లు ప్రతిపాదించారు. కాగా, ఏడు జాతీయ విద్యా సంస్థల ప్రాజెక్టు వ్యయం రూ.4,247 కోట్లుగా అంచనా వేశారు. నిజానికి, విభజన చట్టం అమల్లో భాగంగా ఏర్పాటైన జాతీయ విద్యా సంస్థలు, కేంద్రీయ, గిరిజన విశ్వవిద్యాలయాలకు అవసరమయ్యే నిధులను పూర్తిగా కేంద్రమే భరించాలి. భూమిని మాత్రం రాష్ట్ర సర్కారు కేటాయించాల్సి ఉంది. కానీ ఆయా విద్యా సంస్థలకు నిధులను కేటాయించకపోవడంతో, ఎక్కడా భవనాల నిర్మాణం ప్రారంభం కాలేదు. మూడేళ్ల నుంచి బడ్జెట్‌లో కేటాయిస్తున్న నిధులు మూల ధన వ్యయానికి, అంటే జీతభత్యాలకు, తాత్కాలిక అవసరాలకే సరిపోతున్నాయి. రాష్ట్ర నిధులతో ప్రహరీ గోడల నిర్మాణాలు జరుగుతున్నాయి.

ఇళ్లపై మళ్లీ నిరాశే!

అమరావతి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ పక్కా ఇళ్ల విషయంలో మళ్లీ నిరాశే ఎదురయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో అయినా పెద్దఎత్తున ఇళ్లు కేటాయిస్తారని పెట్టుకున్న ఆశలు నెరవేరేలా లేవు. బడ్జెట్‌లో పక్కా ఇళ్ల కేటాయింపుల తీరు నిరాశాజనకంగా ఉంది. 2017-18లో 51 లక్షల గ్రామీణ ఇళ్లు కేటాయిస్తే, ఇప్పుడూ 51 లక్షలే కేటాయించారు. దీంతో రాష్ట్రానికి ఆశించినట్లుగా 2లక్షల ఇళ్లు వచ్చే పరిస్థితి లేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏపీకి 48,058 ఇళ్లు మాత్రమే వచ్చాయి. రాష్ట్రంలో డిమాండ్ ఉన్నందున ఏడాదికి కనీసం 2లక్షలు తగ్గకుండా కేటాయింపులు చేయాలని ప్రభుత్వం పలుమార్లు కోరింది. కేంద్రం గణాంకాల ప్రకారం రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలు 5.85 లక్షల కుటుంబాలే. కానీ వాస్తవంగా 21 లక్షల మంది ఇళ్లు లేనివారున్నారు. గతంలో సాంకేతిక ఇబ్బందుల వల్ల తక్కువ సంఖ్య నమోదైందని, ఇటీవల తాము చేసిన సర్వేను ప్రామాణికంగా తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. 2011 జనగణన ప్రకారం ఇళ్లు లేని కుటుంబాల సంఖ్య ఎక్కువగా ఉన్న రాష్ట్రాలకే తొలి ప్రాధాన్యం ఇస్తారు. ఈ క్రమంలో ఏపీకి పెద్దగా ప్రాధాన్యం లభించదు.

ఆ లోటు.. అలాగే!

- రెవెన్యూ లోటును పట్టించుకోని బడ్జెట్
- రాష్ట్రం ఆశలపై నీళ్లు

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఎదుర్కొంటున్న రెవెన్యూ లోటు సమస్యకు ఈ బడ్జెట్‌లోనూ ఊరట దొరకలేదు. రాష్ట్రం అడిగినంత కాకపోయినా.. కేంద్రం ఇస్తానన్న మొత్తమైనా దక్కుతుందనుకుంటే నిరాశ తప్పలేదు. రూ.16,000 కోట్ల రెవెన్యూ లోటు ఉందని రాష్ట్రం వాదిస్తుంటే.. రూ.7,500 కోట్లు మాత్రమే ఇస్తామని కేంద్రం గతంలో చెప్పింది. ఈ మొత్తంలో ఇంతవరకు రూ.3,000 కోట్ల పైచిలుకు ఇచ్చింది. ఇంకా రావాల్సిన రూ.13,000 కోట్లను ఒకే విడతగా విడుదల చేయాలని రాష్ట్రం కోరింది. అంత మొత్తం ఇవ్వడానికి కేంద్రం ఒప్పుకోలేదు. దీంతో రాష్ట్రమే వెనక్కితగ్గి కేంద్రం అంగీకరించిన రూ.7,500 కోట్లలో ఇంకా రావల్సిన రూ.3,520 కోట్లు విడుదల చేయాలని కోరింది. ప్రస్తుత బడ్జెట్లో ఈ మొత్తమైనా కేటాయిస్తారని రాష్ట్ర ప్రభుత్వం ఆశిస్తే.. కేంద్రం మొండిచేయి చూపింది.

వచ్చే ప్రతి రూపాయిలో 19 పైసలు అప్పు

రూపాయి రాక

1) కార్పొరేట్ పన్ను	19
2) ఆదాయపు పన్ను	16
3) కస్టమ్స్ సుంకం	4
4) కేంద్ర ఎక్సైజ్ సుంకం	8
5) వస్తు సేవల పన్ను (జీఎస్టీ)	23
6) పన్నేతర ఆదాయం	8
7) రుణేతర మూలధన వసూళ్లు	3
8) రుణాల ద్వారా	19

రూపాయి పోక

1) కేంద్ర పథకాలకు	10
2) వడ్డీ చెల్లింపులకు	18
3) రక్షణకు	9
4) సబ్సిడీలకు	9
5) ఆర్థిక సంఘం, ఇతర బదిలీలకు	8
6) కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటా	24
7) కేంద్ర ప్రాయోజిత పథకాలకు	9
8) పింఛన్లు, ఇతర ఖర్చులకు	13

మోదీ జమానా.. దేశభద్రత



ఇంజనీరింగ్ చేసినా.. పనిలేదు

నేను ఇంజనీరింగ్ పూర్తిచేశా. కానీ ఎటువంటి ఉపాధి ఆశ కూడా కనిపించడం లేదు. ఉద్యోగం ఆశలన్నీ అడియాశలవుతున్నాయి. పోనీ కూలిపనులు చేద్దామంటే, అవి కూడా దొరకడం లేదు. ఇలాగైతే ఎలాగో ఏమీ అర్థం కావడం లేదు.

- ఎం.శివ, గాజువాక, విశాఖ




గ్రామీణ నిరుద్యోగంపై గురి ఏది?

ఉపాధి అవకాశాల మెరుగుదల, గ్రామీణ నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కేంద్ర బడ్జెట్‌లో ఎటువంటి ప్రతిపాదనలు చేయలేదు. యంత్రాల వాడకం పెరగడంతో వ్యవసాయ అనుబంధ రంగాలు ఆశించినవిధంగా ఉపాధి అవకాశాలను అందించలేకపోతున్నాయి. దీనిపై బడ్జెట్‌లో ఎలాంటి ఆలోచనలు చేయలేదు.

- భవనం జయరామిరెడ్డి, జాతీయ ఉత్తమ రైతు అవార్డు గ్రహీత , గుంటూరు.



ఉద్యోగులే మంచోళ్లన్నారు. వ్యాపారుల కంటే చాలా బాగా పన్ను చెల్లిస్తున్నారంటూ కితాబిచ్చారు. తీరా వారికి పన్ను పరంగా ఊరట కల్పించే విషయంలో తీవ్రంగా నిరుత్సాహపరిచారు. ఇదీ సూక్ష్మంగా జైట్లీ ఉద్యోగ బడ్జెట్!





రాష్ట్రాల వాటా పంచక ముందున్న స్థూల ఆదాయమిది. ఈ ఏటి కేంద్ర నికర పన్ను ఆదాయమైతే రూ. 14,80,649 కోట్లు.



వేతనజీవుల ఆశలపై నీళ్లు

పన్ను పరిమితి యథాతథం.. శ్లాబులను సవరించని కేంద్రం

- రూ.40 వేల స్టాండర్డ్ డిడక్షన్
- అదీ టీఏ, మెడికల్ అలవెన్సులకు బదులుగా!
- వాటిపై ఇన్నాళ్లూ 34,200 మినహాయింపు
- ఊరట రూ.5800 మేర మాత్రమే
- దానిపైనా విద్యాసుంకం బాదుడు
- విద్యాసెస్సు 3 నుంచి 4 శాతానికి పెంపు
- దీర్ఘకాలిక మూలధన లాభాలపై ఇక పన్ను
- ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌పై 10% డీడీటీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: ఉద్యోగులకు నిరుత్సాహం! ఆదాయ పన్ను పరిమితిని కేంద్రం పెంచుతుందేమో.. అని ఎంతో ఆశగా ఎదురుచూసిన వేతనజీవుల ఆశలపై కేంద్రం నీళ్లజల్లింది!! ఆదాయపన్ను పరిమితిని పెంచట్లేదని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ గురువారం నాటి బడ్జెట్ ప్రసంగంలో తేల్చి చెప్పారు. అయితే.. వ్యాపారులతో పోలిస్తే ఉద్యోగులే భారీగా పన్నుకడుతున్నారు.. అంటూ గణాంకాలతో సహా వివరించి, ఉద్యోగులకు మేమిచ్చే నజరానా.. రూ.40 వేల స్టాండర్డ్ డిడక్షన్ అని ఘనంగా ప్రకటించారు. కానీ.. గంపలాభం చిల్లి తీసిందన్న చందంగా ఉన్నదా పన్ను రాయితీ!! అదెలాగంటే... ఇప్పటికే ఉన్న టీఏ, మెడికల్ రీయింబర్స్‌మెంట్‌ల స్థానంలో స్టాండర్డ్ డిడక్షన్ ప్రవేశపెడుతున్నట్టు జైట్లీ తెలిపారు. ప్రస్తుతం ఉద్యోగులు రూ.19200 వరకూ టీఏ బిల్లులు, రూ.15 వేల వరకూ మెడికల్ బిల్లులను చూపి పన్ను మినహాయింపు పొందే అవకాశం ఉంది. అంటే.. రూ.34,200. దాని స్థానంలో రూ.40 వేల స్టాండర్డ్ డిడక్షన్ అంటే నికరంగా.. రూ.5800 మేర ఊరట లభించినట్లు. గతంలో టీఏ, మెడికల్ బిల్లులను చూపితేనే మినహాయింపు లభించేది. ఇప్పుడు బిల్లులు చూపాల్సిన అవసరం లేకుండానే నేరుగా రూ.40వేల మేర మినహాయింపునిస్తారు. ఈ మొత్తాన్ని వేతనం నుంచి తీసేసి పన్నును లెక్కిస్తారు. ఆ ప్రయోజనమైనా పూర్తిగా అందుతుందా అంటే.. అదీ లేదు. పన్ను చెల్లించదగిన ఆదాయంపై గతంలో ఉన్న విద్యాసుంకాన్ని 3% నుంచి 4 శాతానికి పెంచారు. అంటే.. మిగిలే రూ.5800లో మరికొంత సొమ్మును ఆ రూపేణా ఆదాయపన్ను శాఖకు సమర్పించుకోవాల్సిందేనన్నమాట. ఈ నిర్ణయంతో ప్రభుత్వంపై రూ.8వేల కోట్ల భారం పడనుండగా, 2.5 కోట్ల మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరనుందని జైట్లీ తెలిపారు. పెంచిన విద్యా సుంకంతో కలిపితే గరిష్ఠ పన్ను రేటు గత ఏడాది (35.53) కన్నా.. ఈ ఏడాది (35.88) ఎక్కువగా ఉన్నదని కేపీఎంజీ భాగస్వామి పరిజాద్ సిర్వాలా అన్నారు.

ఇదేం తగ్గింపు?

ఇప్పటికే ఉన్న టీఏ, మెడికల్ బిల్లులకు బదులుగా ప్రకటించిన స్టాండర్డ్ డిడక్షన్.. భారీ మినహాయింపేమీ కాదని డెలాయిట్ ఇండియా సీనియర్ డైరెక్టర్ అలోక్ అగర్వాల్ అన్నారు. ఆర్థిక నిపుణులు చెబుతున్నదాని ప్రకారం.. 60 ఏళ్లలోపు వయసుండి, ఏడాదికి రూ.6 లక్షల వార్షికాదాయం ఉన్నవారికి ఈ స్టాండర్డ్ డిడక్షన్ వల్ల దాదాపు రూ.214 మేర మాత్రమే పన్ను ఆదా అవుతుంది. అలాగే 12 లక్షల వార్షికాదాయం ఉన్నవారికి దక్కే పన్ను ప్రయోజనం.. కేవలం రూ.610. రూ.18 లక్షల వార్షికాదాయం ఉన్నవారికి మిగిలేది రూ.1190.

పన్నుల వాత (రూ.కోట్లలో)

వివరం	2016-17	2017-18	2018-19
మొత్తం పన్ను ఆదాయం	17,15,822	19,46,119	22,71,242
కార్పొరేట్ పన్ను	4,84,924	5,63,745	6,21,000
ఆదాయపు పన్ను	3,64,604	4,41,255	5,29,000
కేంద్ర ఎక్సైజ్ సుంకం	3,82,094	2,76,995	2,59,600
కస్టమ్స్ సుంకం	2,25,370	1,35,242	1,12,500
సేవా పన్ను	2,54,499	79,507	-
జీఎస్టీ	-	4,44,631	7,43,900
ఇతరత్రా	4,331	4,744	5,242

వృద్ధులకు ఊరట

- డిపాజిట్ల వడ్డీ ఆదాయంపై మినహాయింపు 50 వేలకు పెంపు
- 'వయ వందన'లో పెట్టుబడుల పరిమితి 15 లక్షలకు పెంపు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: వేతన జీవులకు ఊరటనివ్వని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ.. వృద్ధ పౌరులపై (సీనియర్ సిటిజన్లు) మాత్రం పలు వరాలు కురిపించారు. ప్రధానంగా బ్యాంకులు, పోస్టాఫీసుల్లోని వారి డిపాజిట్లపై వడ్డీ ద్వారా వచ్చే ఆదాయంపై పన్ను మినహాయింపును ఇప్పుడున్న రూ.10 వేల నుంచి ఒకేసారి ఐదు రెట్లు పెంచారు. అంటే రూ.50 వేల వరకు అలాంటి ఆదాయంపై పన్ను ఉండదు. టీడీఎస్ కట్ చేయరు. అలాగే సెక్షన్ 80డీ కింద ఆరోగ్య బీమా ప్రీమియం/వైద్య వ్యయంపై మినహాయింపు పరిమితిని రూ.30 వేల నుంచి రూ.50 వేలకు పెంచారు. 80 డీడీబీ సెక్షన్ కింద.. కొన్ని రకాల ప్రాణాంతక వ్యాధుల చికిత్స నిమిత్తం చేసే వైద్య వ్యయంపై మినహాయింపు పరిమితినీ రూ.లక్షకు పెంచారు. ఈ పన్ను మినహాయింపులకు తోడు ప్రధానమంత్రి వయ వందన యోజనను 2020 మార్చి వరకు పొడిగిస్తున్నట్లు జైట్లీ ప్రకటించారు. దీనిప్రకారం జీవిత బీమా సంస్థ నుంచి 8 శాతం గ్యారంటీ మొత్తం సీనియర్ సిటిజన్లకు అందుతుందన్నారు. అలాగే ఈ పథకం కింద సీనియర్ సిటిజన్లు పెట్టే పెట్టుబడి పరిమితిని ఇప్పుడున్న రూ.7.5 లక్షల నుంచి రూ.15 లక్షలకు పెంచుతున్నట్లు తెలిపారు. హుందాగా జీవించే హక్కు ప్రతి పౌరుడికీ ఉంది. వృద్ధులకు మరీ ఎక్కువగా ఉంది. ఇన్నాళ్లు మనల్ని జాగ్రత్తగా చూసుకున్న వారి సంరక్షణ మన బాధ్యత. అదే వారికి మనమిచ్చే అత్యున్నత గౌరవం అని జైట్లీ వ్యాఖ్యానించారు. ఈ మినహాయింపుల వల్ల వృద్ధులకు దరిదాపుగా రూ.4 వేల కోట్ల వరకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు.

మహిళలకు మరింత సొమ్ము

కొత్త మహిళా ఉద్యోగుల ఈపీఎఫ్ కాంట్రిబ్యూషన్‌ను మూడేళ్ల పాటు 4శాతం తగ్గించడం వల్ల వారి నికర వేతనం పెరగడంతో పాటు కార్మికశక్తిలో మహిళల భాగస్వామ్యం పెరుగుతుందని ఆర్థిక మంత్రి జైట్లీ అన్నారు. సంప్రదాయ రంగాల్లో ప్రోత్సాహకాలతో కూడిన ఉపాధిని పొందే మహిళలే ఎక్కువగా ఉన్నారని బడ్జెట్ సమర్పణ సందర్భంగా జైట్లీ వ్యాఖ్యానించారు. మహిళల ఈపీఎఫ్ కాంట్రిబ్యూషన్‌ను కుదించడంతో వారి చేతికి అందే వేతనం పెరుగుతుందన్నారు. ప్రభుత్వం తనవంతుగా 12శాతాన్ని జమ చేస్తుండడంతో ఓవరాల్‌గా ఈపీఎఫ్ కాంట్రిబ్యూషన్‌లో తేడా రాదన్నారు. ఈపీఎఫ్ ప్రోత్సాహకాల వల్ల కొత్త ఉద్యోగాలు పెరుగుతాయని ఆయన చెప్పారు. కాగా ప్రస్తుతం భారత్‌లో మహిళా కార్మికుల రేటు 25శాతంగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ రేటు 40శాతంగా ఉంది. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలంటే కార్మికుల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం తప్పనిసరి అని ఆర్థికవేత్తలు స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్తగా చేరే మహిళా ఉద్యోగుల ఈపీఎఫ్ రేటును తొలి మూడేళ్లు 8శాతానికి పరిమితం చేయడం ఈదిశగా ఊతమిచ్చినట్టవుతుందని విశ్లేషకులు అంటున్నారు. ముందుముందు సంప్రదాయ ఉద్యోగ రంగంలో మహిళల భాగస్వామ్యం పెరుగుతుందని విశ్లేషకులు అంటున్నారు.

మరింత బాదుడు..

స్టాక్‌మార్కెట్లలో పెట్టుబడులపై వచ్చే దీర్ఘకాలిక మూలధన లాభాలపై 10% పన్ను విధించారు. ఏడాదికిపైగా స్టాక్‌మార్కెట్లలో ఉన్న షేర్లపై రూ.లక్షకు పైబడి ఆదాయం వస్తే దానిపై 10%పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

- ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌పై 10 శాతం డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ ట్యాక్స్(డీడీటీ) విధించారు. దీంతో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ డివిడెండ్ల రూపంలో ఆదాయంలో కోత పడనుంది.

స్టాండర్డ్ డిడక్షన్ మాయకు ఒక ఉదాహరణ..

- టీఏ, మెడికల్ బిల్లులతో వెసులుబాటు: రూ.34,200
- దాని స్థానంలో ప్రకటించిన స్టాండర్డ్ డిడక్షన్: 40,000
- ఊరట.. కేవలం 5800 రూపాయలు.
- ఒక వ్యక్తి పన్ను ఆదాయం రూ.10 లక్షలు ఉండి 20శాతం శ్లాబులో ఉంటే.. ఆ రూ.5800 మీద అతడికి అయ్యే పన్ను ఆదా.. రూ.1160.
- అదే సమయంలో.. ఎడ్యుకేషన్ సెస్సును 3 నుంచి 4 శాతానికి పెంచారు. 10 లక్షల రూపాయల ఆదాయం ఉన్న వ్యక్తి 20% చొప్పున.. 1,12,500 పన్ను కడతాడు. దానిమీద అదనంగా పెరిగిన ఒక శాతం సెస్సు.. రూ.1125. అంటే.. ఆదా అయిన రూ.1160లో, సెస్సు పేరిట కట్టే రూ.1125 తీసేస్తే.. మిగిలేది.. రూ.35. చివరికి మిగిలేది అదే!!


అధిక పన్ను చెల్లించేది ఉద్యోగులే

ఉద్యోగుల కన్నా వ్యాపారులే ఎక్కువ పన్ను చెల్లిస్తుంటారన్నది అపోహ మాత్రమేనని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ గణాంక సహితంగా వివరించారు. 2016-17 ఆర్థిక సంవత్సరంలో ఉద్యోగులు, వ్యాపారుల నుంచి వసూలైన పన్నుల వివరాలను తెలిపారు.

ఇక దేశవ్యాప్తంగా ఈ-అసెస్‌మెంట్



ఆదాయపన్ను శాఖకు, పన్ను చెల్లింపుదారుల మధ్య సంబంధం తెగిపోనుంది. పన్ను చెల్లింపులన్నీ పారదర్శకంగా, సమర్థవంతంగా జరిగేందుకు 'ఆదాయ పన్ను ఈ-అసెస్‌మెంట్'ను దేశవ్యాప్తంగా అమలు చేయాలని కేంద్రం ప్రభుత్వం నిర్ణయించింది. 2016లో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టి, 2017లో 102 నగరాల్లో ఈ-అసెస్‌మెంట్ అమలు చేశారు. ఈ పద్ధతి మంచి ఫలితం ఇవ్వడంతో దేశవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించామని, దీనికోసం ఆదాయపన్ను చట్టంలో సవరణలు చేయనున్నట్లు బడ్జెట్ ప్రసంగంలో జైట్లీ వెల్లడించారు.



ఐటీ శ్లాబులివీ..	వ్యక్తిగతం 60 ఏళ్లలోపు	వృద్ధులు 60-80 ఏళ్లు	సూపర్ సీనియర్లు 80 ఏళ్ల పైబడి
రూ.2.5 లక్షల వరకు	0	0	0
2.5-3 లక్షల వరకు	5%	0	0
3-5 లక్షల వరకు	5%	5%	0
5-10 లక్షల వరకు	20%	20%	20%
10 లక్షలకు పైబడి	30%	30%	30%

కేంద్రమా ఇదేంటి..?

బడ్జెట్‌పై ఉద్యోగుల తీవ్ర అసంతృప్తి

అమరావతి/హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కేంద్రబడ్జెట్‌పై ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదాయపన్ను విధానంలో సవరణలు ఉంటాయని ఎంతో ఆశగా ఎదురుచూశామని, కానీ నిరాశే ఎదురైందన్నారు. ఆదాయపన్ను శ్లాబ్ మారకపోవడంపై కార్పొరేట్ ఉద్యోగిని హీరాకౌర్ ప్రసాద్ పెదవి విరిచారు. బడ్జెట్ సంతృప్తినిచ్చినా.. ఉద్యోగినిగా నిరాశ చెందానని చెప్పారు. ఆదాయం రెట్టింపైనా.. ఖర్చులూ దాని కన్నా ఎక్కువగానే ఉన్నాయని మరో ఉద్యోగి దేవీదాస్ తెలిపారు. ప్రైవేట్ ఉద్యోగులు పన్నులు చెల్లించడమే తప్ప పొదుపు చేసే పరిస్థితులు లేవని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కృష్ణ అన్నారు. సేవింగ్స్ పెరిగి, పన్నులు తగ్గేలా ప్రభుత్వ నిర్ణయాలు ఉండాలని సూచించారు. వ్యక్తిగత ఆదాయ పన్ను పరిమితి పెంచితే బాగుండేదని వ్యాపారి రాము పేర్కొన్నారు. బడ్జెట్‌లో తెలంగాణకు ఎలాంటి ప్రత్యేక నిధులు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. గత పాలకుల మాదిరిగానే మోదీ సర్కారు కూడా ఉద్యోగులను విస్మరించిందని టీజీఓఏ హైదరాబాద్ అధ్యక్షుడు కృష్ణయాదవ్ ఆరోపించారు. వ్యక్తిగత ఆదాయ పరిమితిని రూ.2.5 లక్షల నుంచి రూ.4 లక్షలకు పెంచి ఉంటే ఉద్యోగులకు ఎంతో వెసులుబాటు కలిగేదని చెప్పారు. ఆదాయపరిమితిని పెంచుతారని ఉద్యోగులు ఎంతగానో ఎదురుచూశారని ఎస్‌బీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం అన్నారు. వచ్చే ఆదాయంలో 40 శాతం పన్ను చెల్లింపులకే సరిపోతుందని వాపోయారు. కేంద్ర ప్రభుత్వ తీరుపై ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. ఆదాయపు పన్నుల చెల్లింపు స్లాబ్ విధానంలో మార్పులు చేస్తారని ఎంతో ఆశించాం. వేతన జీవులను ఈ బడ్జెట్ ఎంతో నిరాశ పరచిందని కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన అధ్యాపకుడు జి.చంద్రశేఖర్ వ్యాఖ్యానించారు. 'చింతపండు కిలో రెండు వందలైంది. సబ్బులు, క్రీములు, నూనెల ధరలను చడీచప్పుడు లేకుండా ప్రతి మూడు నెలలకొకసారి పెంచుతున్నారు. ఈ సమస్యపై కేంద్రం ఈ బడ్జెట్‌లో గట్టి హామీ ఇస్తుందని ఎంతగానో ఎదురు చూశాం.' అని విశాఖకు చెందిన బోని పద్మజ పేర్కొన్నారు. 'రాష్ట్ర విభజనకు ముందునుంచీ రైల్వే జోన్ కోసం విశాఖవాసులం అడుగుతున్నాం. ఈసారైనా బడ్జెట్‌లో కేంద్రం స్పందిస్తుందని ఆశించాం. ఈ ఒక్కవిషయంలోనే కాదు, మన రాష్ట్రానికి హామీ ఇచ్చిన ఏ సాయాన్నీ మోదీ ప్రభుత్వం అందించడం లేదు.' అని విశాఖకు చెందిన రిటైర్డు ఉద్యోగి డీవీ సూర్యారావు తెలిపారు.



ఉద్యోగాలివ్వండి.. ఈపీఎఫ్ మేమిస్తాం!

కొత్త ఉద్యోగాలకు మూడేళ్ల పాటు 12% చెల్లింపు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: కొత్త ఉద్యోగాలివ్వండి.. ఈపీఎఫ్ మేం చెల్లిస్తాం అని కేంద్రం ప్రకటించింది. కొత్త ఉద్యోగులు మూల వేతనాల్లోంచి ఈపీఎఫ్‌కు 12% చెల్లిస్తే.. యాజమాన్యాలు కూడా 12% చెల్లించాలి. అయితే యాజమాన్యాలు చెల్లించాల్సిన 12 శాతాన్ని తామే చెల్లిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు అరుణ్ జైట్లీ గురువారం తన బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. కొత్త ఉద్యోగులకు చెల్లించే 12% ఈపీఎఫ్‌ను ఆయా యాజమాన్యాలకు కేంద్రం మూడేళ్ల పాటు చెల్లిస్తుందని ప్రకటించారు. ఉద్యోగావకాశాలను ప్రోత్సహించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. 2016-17 బడ్జెట్‌లో యాజమాన్యాలు చెల్లించే 8.33 శాతాన్ని తామే చెల్లిస్తామని కేంద్రం ప్రకటించింది. ప్రస్తుత బడ్జెట్‌లో దీన్ని 12 శాతానికి పెంచింది. ప్రస్తుతం మహిళా ఉద్యోగులు తమ మూల వేతనాల్లోంచి 12 శాతాన్ని ఈపీఎఫ్‌కు చెల్లిస్తుండగా.. దాన్ని 8శాతానికి తగ్గించనున్నట్లు వెల్లడించారు. ఇది కూడా మహిళలకు తొలి మూడేళ్లు వర్తిస్తుందన్నారు. యజమాన్యాలు చెల్లించే మొత్తంలో మాత్రం మార్పు ఉండబోదన్నారు. ఈ మేరకు ఉద్యోగుల భవిష్యనిధి చట్టంలో సవరణలు చేస్తామని ప్రకటించారు. ఫలితంగా మహిళలకు మరిన్ని ఉద్యోగావకాశాలు లభిస్తాయని చెప్పారు.

మధ్యతరగతి ఔట్!

ఆన్‌లైన్‌లో వేతనజీవుల ట్వీట్లు.. ఆవేదనకు హాస్యపు పూత

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: మోదీ సర్కారు ప్రస్తుత హయాంలో ఆఖరు బడ్జెట్.. వచ్చే ఏడాది ఎన్నికలు.. కాబట్టి జైట్లీ ఈసారి సంక్షేమ బడ్జెట్ ప్రవేశపెడతారనుకున్న వేతనజీవుల ఆశలు ఆవిరవడంతో వారు తమ బాధను వెలిబుచ్చడానికి సోషల్ మీడియాను ఆశ్రయించారు. మధ్యతరగతి ఆవేదనను, ఆక్రోశాన్ని అద్భుతమైన మీమ్స్ రూపంలో వెలిబుచ్చారు. అందులో మచ్చుకు కొన్ని..



ప్రియమైన ఆర్థిక మంత్రిగారూ..

తీసుకోండి. మా దగ్గరున్న డబ్బు మొత్తం తీసేసుకుని పండగ చేసుకోండి.

- ఈ బడ్జెట్ చూశాక నాకు అర్థమైందంటంటే... ఈ దేశంలో ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా పేదవాళ్లయిపోవడం మంచిది.
- (బడ్జెట్ ప్రసంగాన్ని జైట్లీ కొద్దిసేపు ఇంగ్లిష్‌లో, కొంచెంసేపు హిందీలో ప్రసంగించడంపై) బడ్జెట్ ప్రసంగంలో బేసిసంఖ్యలో ఉన్న పేజీలన్నీ ఇంగ్లిష్‌లో.. సరిసంఖ్యలో ఉన్న పేజీలన్నీ హిందీలో ఉన్నట్టున్నాయి.





ఓట్లు వేసిన మిడిల్ క్లాస్‌ను వదిలి..

మోదీ జమానా.. పరిశ్రమలు



ఊరటనివ్వని పన్నుల స్లాబ్ !

పరిశ్రమలకు, పారిశ్రామికవేత్తలకు ఊతమిచ్చేవిధంగా ఈ బడ్జెట్ ఉంటుందని ఎదురు చూశాం. అయితే ఆ ప్రస్తావనే లేదు. పారిశ్రామికవేత్తలు చెల్లించే పన్నుల స్లాబ్ విధానంలోనూ మార్పులు లేవు. రైల్వే కోచ్ ఏర్పాటు, రైల్వే జోన్‌కు నిధుల కేటాయింపుపైనా చర్చ జరగలేదు.

- ఆర్ సోమశేఖరగౌడ్, పారిశ్రామికవేత్త, ఆదోని, కర్నూలు జిల్లా గృహిణులు



చేనేతకు కోత

కేంద్ర ప్రభుత్వం చేనేతకు మరోమారు మొండిచెయ్యి చూపింది. గతేడాది బడ్జెట్‌లో రూ.609 కోట్లు కేటాయించిన కేంద్రం, ఈసారి రూ.383 కోట్లతో సరిపెట్టింది. ఈ కేటాయింపులను బట్టి చూస్తే, ఒక్కో చేనేత కార్మికుడికి కేవలం రూ.128 లబ్ధి చేకూరనుంది.

- పిల్లలమర్రి బాలకృష్ణ, చేనేత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి, గుంటూరు





'రైల్వే'లోనూ నిరాశే

తెలుగు రాష్ట్రాలకు కేటాయింపులివే


హైదరాబాద్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రైల్వే బడ్జెట్‌లో తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు నిరాశే మిగిలింది. విభజన హామీల్లో ప్రధానమైన కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ఊసులేకుండా జైట్లీ బడ్జెట్ ప్రసంగం సాగింది. దువ్వాడ-రాజమండ్రి-ఒంగోలు-విజయవాడ స్టేషన్ల ఆధునీకరణకు నిధులు కేటాయించారు. తెలంగాణలో 6, ఆంధ్రప్రదేశ్‌లో 15 స్టేషన్లను ఆదర్శ స్టేషన్లుగా తీర్చిదిద్దేందుకు నిధులు కేటాయించారు. ఖమ్మం, వరంగల్, కాజీపేట, మంచిర్యాల స్టేషన్లను ఏ-1 స్టేషన్లుగా అభివృద్ధి చేయనున్నారు. గుంతకల్-బళ్లారి-హాస్పేట లైన్ల విద్యుదీకరణకు నిధులను కేటాయించారు. మరోవైపు రాయనపాడు, గుంతకల్, పలాస,మార్కాపూర్, పాకాల, పానపాకం, నక్కనదొడ్డి, పుల్లంపేట, ఇచ్చాపురం, సాలూరు, కొత్తవలస, లక్కవరపు కోట, ఎస్.కోట, శివలింగాపురం, బొద్దవర, బొర్రా గుహలు, అరకు, సిమిలిగూడ రైల్వే స్టేషన్లలో ప్లాట్‌ఫాంల విస్తరణ పనులకు నిధులు కేటాయించింది. తెలంగాణలోని వనపర్తి, డోర్నకల్, లింగంపల్లి, కాజీపేట, ఆదిలాబాద్, నిజామాబాద్ స్టేషన్లలోనూ, ఏపీలోని రేణిగుంట, ధర్మవరం, రాజమండ్రి, తుని, బేతంచర్ల స్టేషన్లలో ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌లను నిర్మించనున్నారు.

కొత్త లైన్లు ఇవే!

పెద్దపల్లి-లింగంపేట; గుంతకల్-కల్లూరు;నల్గొండ-లింగంపేట;ఓబులవారిపల్లి-వెంకటాపురం; విజయనగరం-స్తంభాలపూర్ మూడో లైన్; నడికుడి-కాళహస్తి; విజయవాడ-గూడూరు మూడో లైను; ఓబులవారిపల్లి-కృష్ణపట్నం; కడప-బెంగళూరు; కాకినాడ-పిఠాపురం; మునీరాబాద్- మహబూబ్‌నగర్; మనోహరాబాద్ (మేడ్చల్)-కొత్తపల్లి(కరీంనగర్); అక్కన్నపేట-మెదక్; భద్రాచలం-సత్తుపల్లి; కాజీపేట-బలార్షా మూడో లైను; నల్లపాడు-గుంతకల్; విజయనగరం-రాయగడ-రాయపూర్;

డబ్లింగ్

దేవరపల్లి-పెనుగొండ - 49 కిలోమీటర్లు



నిధులు ఇవే!

కోటిపల్లి-నర్సాపూర్ లైను నిర్మాణానికి రూ.430 కోట్లు

శ్రీకాళహస్తి-నడికుడి లైనుకు రూ.450 కోట్లు

విజయవాడ-కాజీపేట మూడో లైనుకు రూ.100 కోట్లు

బడ్జెట్ కాదు.. వంకాయ కాదు!

ఆంధ్రప్రదేశ్‌కు ఈ బడ్జెట్ మూడు నామాలు పెట్టింది. ముఖ్యమంత్రి చంద్రబాబు తన స్థాయిని మరిచి తిరగరాని వాళ్ల చుట్టూ తిరిగారు. ఎన్ని చేసినా ఆయన ఆశించిన ఫలితాలు రావడం లేదు. విశాఖకు రైల్వే జోన్ రాదు కానీ.. మా తాడిపత్రికి విమానాశ్రయం వస్తుంది. ఇది బడ్జెట్ కాదు.. వంకాయ కాదు..!

- జేసీ దివాకర్‌రెడ్డి, ఎంపీ, అనంతపురం

కర్ణాటకకే అన్నీ..

జైట్లీ బడ్జెట్ నవ్యాంధ్రకు తీవ్ర నిరాశ మిగిల్చింది. ఏ ఒక్క అంశమూ తేల్చలేదు. కర్ణాటకకు పెద్ద పీట వేశారు. అమరావతితో పాటు పోలవరానికి నిధుల ఊసే ఎత్తక పోవడం దారుణం. విభజన చట్టంలో పొందుపరిచిన అంశాలపై కేంద్ర బడ్జెట్‌లో నీళ్లజల్లారు. ఏపీకి తీరని అన్యాయం జరిగింది.

- కేశినేని నాని, ఎంపీ, విజయవాడ

మా సహనానికీ హద్దుంది!

రాష్ట్రంపై కేంద్రం వైఖరి ఏమిటో బడ్జెట్ ద్వారా స్పష్టంగా అర్థమవుతోంది. సహనానికి కూడా ఒక హద్దు ఉంటుంది. కేంద్రం విషయంలో సీఎం చంద్రబాబు ఎలాంటి నిర్ణయం తీసుకున్నా మేమంతా కట్టుబడి ఉంటాం.

- ముత్తంశెట్టి శ్రీనివాస్, ఎంపీ అనకాపల్లి

రాజీనామాలే శరణ్యం

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి తీరని అన్యాయం జరిగింది. మిత్ర ధర్మాన్ని ఉల్లంఘించి వాడుకొని వదిలేసే విధంగా కేంద్రం వ్యవహరించింది. ఇలాంటి పరిస్థితుల్లో జనం వద్దకు ఏ ముఖం పెట్టుకొని వెళ్లగలం. రాజీనామాలే శరణ్యం.

- రాయపాటి సాంబశివరావు, ఎంపీ, గుంటూరు

బడ్జెట్ నిరాశ పరిచింది

కేంద్ర బడ్జెట్ తీవ్ర నిరాశ కలిగించింది. ఈ బడ్జెట్‌లో ఏపీ ప్రస్తావన లేకపోవడం అన్యాయం. విశాఖ రైల్వే జోన్ ప్రకటనపై నిరాశే మిగిలింది. పునర్విభజన చట్టంపై దృష్టి సారించకపోవడం సరికాదు.

- టి. సుబ్బిరామిరెడ్డి, రాజ్యసభ సభ్యుడు

మోసం గురూ!

అమరావతికి కేటాయింపులు నిల్.. మూడేళ్లుగా 500 కోట్లు చొప్పున కేటాయింపు

- ఈసారి బడ్జెట్‌లో ఆ నిధులూ లేవు
- పోలవరం రీయింబర్స్‌మెంట్‌దీ అదే దారి
- విభజన హామీలు, ప్యాకేజీ ప్రస్తావనే లేదు
- తీవ్ర నిరాశ మిగిల్చిన కేంద్ర బడ్జెట్

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): విభజన చట్టంలో ఇచ్చిన హామీలు.. ప్రత్యేక ప్యాకేజీ పేరుతో చేసిన బాసలు ఉన్నాయి. వాటిలో కొన్నింటినైనా కేంద్రం నెరవేరుస్తుందని ఆశగా ఎదురుచూసిన నవ్యాంధ్ర ప్రజలకు నిరాశే మిగిలింది. విభజన కష్టాలకు ఎదురీదుతున్న కొత్త రాష్ట్రాన్ని ప్రత్యేకంగా చూడటం సంగతి అటుంచితే ఏటా ఇస్తున్న నిధులకూ కేంద్ర బడ్జెట్‌లో కోత పెట్టారు. ప్రత్యేక హోదా స్థానంలో ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీ నిధులకూ దిక్కు లేదు. మొత్తంగా కేంద్ర బడ్జెట్‌పై రాష్ట్ర ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

ఏటా ఇచ్చే 500 కోట్లకూ మొండిచేయి

రాజధాని అమరావతికి ఏటా ఇచ్చే నిధులను కూడా ఈ సారి కేటాయించలేదు. అమరావతి నిర్మాణానికి ఏటా సగటున రూ.500 కోట్లు చొప్పున మూడేళ్లలో రూ.1500 కోట్లు కేటాయించిన కేంద్రం ఈ సారి మరిన్ని నిధులు కేటాయిస్తుందని రాష్ట్రం భావించింది. నిజానికి విభజన హామీ మేరకు అమరావతి నిర్మాణానికి ఐదేళ్లలో రూ.3,500 కోట్లు కేటాయించాల్సి ఉంది. అంటే.. ఇంకా రూ.2వేల కోట్లు రావాల్సి ఉంది. శాసన సభ, హైకోర్టు, సచివాలయ భవనాలు, రాజ్‌భవన్ తదితర భవనాలనిర్మాణాలు ప్రారంభమైన నేపథ్యంలో ఈ బడ్జెట్‌లో కనీసం వెయ్యి కోట్లు కేటాయిస్తారని రాష్ట్ర నేతలు భావించారు. సీఎం చంద్రబాబు ఇటీవల ప్రధాని మోదీకి ఈ విషయం చెప్పినా అమరావతికి కేటాయింపులు జరగలేదు.

పోలవరానికి ఖర్చు చేసిన నిధులేవీ

పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన ఖర్చు అంశం బడ్జెట్ పరిధిలోకి రాదు. పోలవరానికి నిధులను నాబార్డ్ నుంచి రుణంగా ఇచ్చేందుకు అంగీకరించిన కేంద్రం నిధులూ విడుదల చేస్తోంది. అయితే పోలవరంపై రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిన నిధుల్లో కేంద్రం ఇంకా రూ.3,1022 కోట్లు తిరిగి చెల్లించాల్సి ఉంది. బడ్జెట్‌లో ఈ నిధుల ప్రస్తావన ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం ఆశించింది. అసలు పోలవరం ప్రస్తావనే లేకుండా బడ్జెట్ ప్రసంగం ముగిసిపోయింది.

పారిశ్రామిక ప్రోత్సాహకాలు లేవు

కొత్త రాష్ట్రం కావడంతో పరిశ్రమలను ప్రోత్సహించేందుకు రాయితీలకు రూ.1500కోట్లు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటి నుంచో కోరుతోంది. అమరావతిలో పారిశ్రామికాభివృద్ధికి ప్రత్యేక సాయం చేయాలని, అమరావతి ప్రాంతానికి వచ్చే పరిశ్రమల్లో జరిగే ఉత్పత్తులపై పదేళ్లపాటు పన్ను మినహాయింపులు ఇవ్వాలని కోరినా కేంద్రం స్పందించలేదు.

విద్యాసంస్థలకు కంటితుడుపు కేటాయింపులు

పునర్విభజన చట్టంలో పేర్కొన్న జాతీయ విద్యాసంస్థల ఏర్పాటుకు ఈసారీ అరొకర నిధులే దక్కాయి. నూతన రాష్ట్రం ఆవిర్భవించిన ఐదేళ్లలోపు జాతీయ విద్యాసంస్థల ఏర్పాటు పూర్తి కావాల్సి ఉంది. వేలకోట్ల రూపాయల భూమిని రాష్ట్ర ప్రభుత్వమే ఇచ్చింది. ప్రహరీ నిర్మాణానికీ తానే నిధులు కేటాయించింది. భవనాల నిర్మాణం, ఇతర సదుపాయాలకు మాత్రమే కేంద్రం నిధులివ్వాల్సి ఉంది. గత మూడేళ్లలో ఈ విద్యాసంస్థలకు అరకొర కేటాయింపులు చేశారు. ఈసారీ అదే పునరావృతమైంది. తిరుపతి ఐఐటీ ప్రాజెక్టు వ్యయం రూ.700 కోట్లు కేంద్ర ప్రభుత్వమే ఇవ్వాల్సి ఉంది. కానీ ఈ మూడేళ్లలో ఇచ్చింది రూ.68 కోట్లే. 2018, 2019ల్లో రూ.632 కోట్లు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరినా ఈ ఏడాది రూ.50 కోట్లే కేటాయించింది. ఇతర విద్యాసంస్థల విషయంలోనూ ఇదే జరిగింది. మరోవైపు గిరిజన విశ్వవిద్యాలయానికి 2014-17 వరకు ఒక్క రూపాయి ఇవ్వలేదు. స్థలం ఎంపిక చేయలేదంటూ ఆలస్యం చేశారు. చివరకు విజయనగరం జిల్లా రెల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం స్థలసేకరణ చేసి ఇచ్చింది. పనులను ప్రారంభించేందుకు ఒకేసారి పెద్దమొత్తం కేటాయిస్తారనుకున్నా రూ.10 కోట్లే కేటాయించి చేతులు దులుపుకున్నారు.

భర్తీ కాని లోటు! రెవెన్యూ లోటు ప్రస్తావనే లేదు

మూడున్నరేళ్ల నుంచి కేంద్ర, రాష్ట్రాల మధ్య నలుగుతున్న రెవెన్యూలోటుకు ఈ బడ్జెట్‌లోనైనా శుభం కార్డు పడుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. రాష్ట్రం అడిగినంత కాకపోయినా కేంద్రం ఇస్తానన్న మొత్తంలో మిగిలిన మొత్తాన్ని ఈ బడ్జెట్‌లో కేటాయిస్తారని రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఆశించారు. కానీ, కేంద్ర బడ్జెట్‌లో రెవెన్యూలోటు భర్తీకి పైసా కూడా కేటాయించకపోవడం నిరాశ కలిగించే అంశం. తమకు రూ.16 వేల కోట్ల రెవెన్యూలోటు ఉందని రాష్ట్రం వాదిస్తుంటే.. రూ.7,500 కోట్లు మాత్రమే ఇస్తామని కేంద్రం గతంలో చెప్పింది. ఇప్పటి వరకు రూ.3 వేల కోట్లు అందింది. మిగిలిన రూ.13 వేల కోట్లను ఒకేవిడతగా విడుదల చేయాలని రాష్ట్రం కోరింది. కేంద్రం ససేమిరా అనడంతో రూ.7,500 కోట్లలో మిగిలిన రూ.3,520 కోట్లు మంజూరు చేయాలని బడ్జెట్‌కు ముందు రాష్ట్ర ఆర్థిక మంత్రి కేంద్రాన్ని కోరారు. దీనికీ స్పందన కరువైంది.

ఏపీకి నష్టం లేదు: ఎంపీ హరిబాబు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): 'బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు నష్టం జరగలేదు. విభజన చట్టంలో పేర్కొన్న హామీల్లో కేవలం ఐదు మాత్రమే నెరవేర్చాల్సి ఉంది. అందులో గిరిజన, సెంట్రల్ యూనివర్సిటీలకు ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. ఇతర హామీల అమలుకు కేంద్రం కట్టుబడి ఉంది. రైల్వేజోన్ ఏర్పాటుకు సంబంధించిన సాధ్యాసాధ్యాలపై పరిశీలన చేయాలని మాత్రమే చట్టంలో ఉంది. దీనికోసం అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయగా... జోన్ ఏర్పాటు సానుకూలం కాదని తేల్చారు.' అని బీజేపీ ఎంపీ హరిబాబు పేర్కొన్నారు.

ఏపీ ఊసేలేదు: కేంద్ర మంత్రి సుజన

కేంద్ర బడ్జెట్‌పై టీడీపీ ఎంపీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బడ్జెట్ నిరాశాజనకంగా ఉందని, ప్రజలు కూడా ఇదే అభిప్రాయపడుతున్నారని కేంద్రమంత్రి సుజనా చౌదరి అన్నారు. ఢిల్లీలో తన నివాసంలో సహచర ఎంపీలతో కలిసి గురువారం విలేకరులతో మాట్లాడారు. ఏపీపట్ల ప్రత్యేకత చూపలేదని, పెండింగ్ అంశాలను ప్రస్తావించలేదని తెలిపారు. నిధుల సాధనకు కేంద్రంపై ఒత్తిడి తెస్తామని, చర్చలు, సమావేశాల ద్వారా సాధించుకుంటామని స్పష్టం చేశారు. బడ్జెట్‌లో కేటాయింపులు చేయకపోయినా, వివిధ రూపాల్లో ప్రభుత్వం ఇవ్వొచ్చని చెప్పారు. సీఎం చంద్రబాబుతో చర్చించి తదుపరి నిర్ణయం తీసుకుంటామన్నారు.

శివప్రసాద్ మౌన నిరసన

కేంద్రం బడ్జెట్‌పై ఎంపీ శివప్రసాద్ మౌన నిరసన తెలిపారు. విలేకరులు మాట్లాడమని కోరగా...మౌనంగా ఉంటూ సైగలతో వేలును పైకి చూపించారు. ఏది అడిగినా నోటిపై వేలు పెట్టుకున్నారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం: ప్రత్తిపాటి

ఏఎన్‌యూ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి విలేకరులతో మాట్లాడారు. బడ్జెట్ రాష్ట్రానికి నిరాశను మిగిల్చిందన్నారు.

కేంద్ర బడ్జెట్ నిరాశాజనకం: మంత్రి సుజయ్

'కేంద్ర బడ్జెట్‌పై రాష్ట్ర ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. లోటుబడ్జెట్ భర్తీపై వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ కేంద్రం స్పందించకపోవడం బాధాకరం. ముఖ్యమంత్రి తీసుకునే ఎలాంటి నిర్ణయానికైనా తాము కట్టుబడి ఉంటాం.' అని మంత్రి సుజయ్ పేర్కొన్నారు.

ఇది ఓట్ల గారడి బడ్జెట్: రఘువీరా

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది పూర్తిగా ఓట్ల గారడి బడ్జెట్‌గా ఉందని గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలోని చట్టబద్ధమైన ప్రధాన హామీలకు కూడా బడ్జెట్‌లో కేటాయింపుల్లేవని అసహనం వ్యక్తం చేశారు.

రాష్ట్ర ప్రయోజనాలు పట్టవా..!: బొత్స

'మోదీ సర్కారు బడ్జెట్ రాష్ట్ర ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసింది. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల్లో ఉన్న మంత్రుల వైఖరి వల్ల ప్రజలు నష్టపోతున్నారు. విజయనగరం జిల్లా నుంచి కేంద్రమంత్రిగా అశోక్ గజపతిరాజు ఉన్నా జిల్లాకు ఒరిగిందేమి లేదు.' అని వైసీపీ నేత బొత్స వ్యాఖ్యానించారు.

రాజీనామాలకు సిద్ధం!: వైవీ సుబ్బారెడ్డి

'కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగింది. రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు. ప్రత్యేకహోదా గురించి ప్రస్తావించలేదు. హోదా ఇవ్వకుంటే అన్న మాట ప్రకారం రాజీనామా చేయడానికి కట్టుబడి ఉన్నాం.' అని వైసీపీ నేత వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు.

ఇది మోసపూరిత బడ్జెట్: సీపీఐ

ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జనాన్ని ఊరించే రీతిలో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మోసపూరిత బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. బడ్జెట్‌లో ఏపీ విభజన హామీల అమలుకు నిధులు కేటాయించలేదని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

దక్కింది ఇదీ!

ఏపీకి బడ్జెట్‌లో కేటాయింపులు ఇవీ..!

సంస్థ	నిధులు (రూ.కోట్లలో)
సెంట్రల్ యూనివర్సిటీ	10
గిరిజన విశ్వవిద్యాలయం	10
ఐఐటీ	50
ఐఐఎం	42
నిట్	54
ఐఐఎస్ఈఆర్	49
ఐఐఐటీ	30
ఐఐపీఈ	32
ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్	5
విశాఖ ఉక్కు పరిశ్రమ	1400
విశాఖపట్నం పోర్టు ట్రస్ట్	108
డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా	19.62
హిందూస్థాన్ షిప్‌యార్డు	4.84


న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అరకొర నిధులు కేటాయించి మోదీ సర్కార్ చేతులు దులుపుకుంది. విభజన చట్టంలో పేర్కొన్న కొన్ని సంస్థలు, రాష్ట్రంలో కార్యకలాపాలు సాగిస్తున్న కేంద్రీయ సంస్థలకు ప్రతియేటా ఇచ్చే నిధులు మినహా బడ్జెట్‌లో రాష్ట్రానికి పెద్దగా వచ్చింది ఏమీ లేదు. అవి కూడా అరకొరగానే ఉన్నాయి. ఇక విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు తెలుగు రాష్ట్రాల్లో పరిశ్రమల స్థాపనకు ఇవ్వాల్సిన వడ్డీ రాయితీని బడ్జెట్‌లో ప్రకటించింది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు కలిపి దీని కోసం రూ.100 కోట్లు కేటాయించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులకు సంబంధించి బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో నాబార్డు ద్వారా అందే నిధులతో చేపట్టాల్సిన పనులను పేర్కొంది. నూతన రాజధాని అమరావతిలో అత్యాధునిక ఫొరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్) ఏర్పాటుకు కేంద్రం బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. ఈ ప్రాజెక్టు వ్యయం రూ.152 కోట్లు. నేషనల్ సైక్లోన్ రిస్క్ మిటిగేషన్ ప్రాజెక్టు కింద ఎర్లీ వార్నింగ్ డిస్సిమినేషన్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయడానికి కేంద్రం రూ.603.94 కోట్లను కేటాయించింది. కాగా, అమరావతిలో సైన్స్ సిటీ ఏర్పాటుకు నిధులు కేటాయించడంతోపాటు నేషనల్ హైవేస్ యాక్సిడెంట్ రిలీఫ్ సర్వీస్ ప్రాజెక్టు కింద కోటి రూపాయలు కేటాయించింది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా విజయవాడ- రాంచీ కారిడార్‌లో రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.2940 కోట్లను గతేడాదితో పోలిస్తే ఏపీకి కేంద్ర పన్నులు, సుంకాల్లో వాటా దాదాపు రూ.4928.59 కోట్లు పెరిగింది. 2018-19 సంవత్సరానికి రాష్ట్రానికి పన్నులు, సుంకాల్లో దక్కిన వాటా రూ.33,929.84 కోట్లు. గతేడాది పన్నుల వాటాగా రూ.29,001.25 కోట్లు మాత్రమే వచ్చాయి. విదేశీ రుణాలతో చేపట్టే ప్రాజెక్టుకు రుణ సాయంగా కేంద్రం రూ.850 కోట్లు కేటాయించింది.

న్యాయం చేయండి: టీడీపీ

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కేంద్రం బడ్జెట్‌లో ఏపీకీ తీవ్ర అన్యాయం జరిగిందని టీడీపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బడ్జెట్ కేటాయింపులు, ప్రజల స్పందన, తదనంతర పరిణామాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సీనియర్ మంత్రులు, ఉన్నతాధికారులతో గురువారం సాయంత్రం సచివాలయంలో సమీక్ష చేశారు. ఈ సమావేశం ముగిసిన తర్వాత మీడియాతో మాట్లాడిన వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కేంద్రం వైఖరిపై తీవ్ర అభ్యంతరం తెలిపారు. విభజన వల్ల నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయకపోరా అని మూడేళ్లుగా ఆశగా ఎదురు చూస్తూ ఉంటే చివరకు నాలుగో బడ్జెట్‌లో కూడా కేంద్రం నిరాశే మిగిల్చిందని ఆయన వ్యాఖ్యానించారు. బడ్జెట్ తమ అందరికీ బాధ, నిరాశ కలిగించిందని, దీనిపై శుక్రవారం జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలోనూ, శనివారం నిర్వహించే టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలోనూ చర్చించి తుదుపరి కార్యాచరణ నిర్ణయిస్తామని సోమిరెడ్డి తెలిపారు. బీజేపీకి మిత్రపక్షంగా ఉన్నా రాష్ట్ర ప్రయోజనాలపై రాజీ పడేది లేదని, రాష్ట్ర ప్రజల మనోగతం ప్రకారం వెళ్తామని ఆయన పేర్కొన్నారు. విభజనచట్టంలో ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీల మేరకు అమరావతి నిర్మాణం, విశాఖ రైల్వేజోన్, వంటి వాటిపై ఈ బడ్జెట్లో కేంద్రం నుంచి సానుకూల ప్రకటన వస్తుందని ఎదురు చూశామని, కానీ వాటి ఊసే లేకపోవడం తమకు కష్టం కలిగించిందని వ్యాఖ్యానించారు. బడ్జెట్ ఆమోదం పొందేలోపు ఇక్కడ అసంతృప్తిని కేంద్రం గుర్తించి సరిచేసుకుంటే తమకేమీ అభ్యంతరం లేదని, అలా కాకపోతే ఏం చేయాలో తమ కార్యాచరణ తమకు ఉంటుందన్నారు.

అంకెల్లో బడ్జెట్!

బడ్జెట్ అంటేనే అంకెల సమాహారం. మరి ఆ అంకెలను అర్థం చేసుకోవడం ఎలా? అందుకే కేంద్ర బడ్జెట్‌లోని కీలకమైన అంకెల్లో పథకాలకు నేరుగా ఉపయోగపడే సొమ్ము ఎంత? ఇతరత్రా ఖర్చయ్యే అనుత్పాదక మొత్తం ఎంత? ఆ వివరాలు ఇవిగో..



ఇంత అన్యాయమా?

(మొదటిపేజీ తరువాయి)

చిన్నపాటి కేటాయింపులూ చేయలేదు. చట్టబద్ధ హామీలు, పార్లమెంటులో ఇచ్చిన హామీల గురించి కనీసం ప్రస్తావించలేదు. ఈ సర్కారుకు ఇదే పూర్తిస్థాయి బడ్జెట్. ఇప్పుడు కూడా నిర్దిష్ట చర్యలు లేకుంటే... ప్రజలకు ఎలా సమాధానం చెప్పగలం? ఆ హామీలు అసలు కేంద్రానికి గుర్తున్నాయా? నేను అనేకసార్లు ఢిల్లీ చుట్టూ తిరిగి ప్రధాని నుంచి మంత్రుల వరకూ అందరికీ ఈ విషయాలు చెప్పి వచ్చాను. అయినా ఫలితం లేకపోతే తీవ్రమైన బాధ కలుగుతోంది" అని చంద్రబాబు ఆక్రోశించారు. మన కష్టానికి వారి సాయం కూడా జత కలిస్తే నిలబడగలమని మనం ప్రయత్నిస్తున్నామని, కానీ... నిరాశే ఎదురవుతోందని అన్నారు. "ఇంత అన్యాయం జరుగుతున్నప్పుడు మిత్రపక్షమైనప్పటికీ మాట్లాడకుండా ఎలా ఉండగలం!' అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రం విడిపోతే తెలుగు వారికి డిమాండ్ చేసి సాధించుకునే శక్తి తగ్గిపోతుందని తాను మొదటి నుంచీ అనుమానిస్తున్నానని, ఇప్పుడు అదే జరుగుతోందని సీఎం వ్యాఖ్యానించారు. "రాష్ట్రం చిన్నది కావడం వల్లే ఢిల్లీకి మనం కనిపించడం లేదా అనే అనుమానం కలుగుతోంది" అని అన్నారు.

బడ్జెట్‌లో జరిగిన అన్యాయంపై ఏం చేయాలనే అంశంపై ఈ సమావేశంలో చర్చించారు. "దీనిని వదిలిపెట్టేది లేదు. పార్లమెంటులో గట్టిగా పోరాడి ఎంత ఒత్తిడి తేవాలో అంత తెద్దాం. అప్పటికీ ఫలితం కనిపించకపోతే మరేం చేస్తాం! ఒక దండం పెట్టి వచ్చేద్దాం" అని చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. దీంతో కొద్దిసేపు సమావేశ మందిరంలో నిశ్శబ్దం ఆవరించింది. ఆ సమయంలో ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు జోక్యం చేసుకొని... "బడ్జెట్‌పై పార్లమెంటులో చర్చ జరుగుతుంది. దానికి ఆమోదం పొందేవరకూ మార్పుచేర్పులకు అవకాశం ఉంటుంది. అప్పటివరకూ రాష్ట్రం తరఫున ప్రయత్నం చేద్దాం" అని సూచించారు. మరో మంత్రి కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. 'ఈ సమయంలో బీజేపీతో తగాదా పెట్టుకుంటే నియోజకవర్గాల పునర్విభజన జరగదేమో!' అని ఇంకో మంత్రి పేర్కొనగా... "సీట్ల సంఖ్య పెంచకున్నా ఫర్వాలేదు. నాకు కావాల్సింది రాష్ట్రాభివృద్ధే!" అని సీఎం తేల్చి చెప్పారు. కేంద్రంపై పెంచే ఒత్తిడి ఏ స్థాయిలో ఉండాలో కూడా చూసుకోవాలని, పోలవరం పనులకు ఇప్పుడిప్పుడే అడ్డంకులు తొలగి పనులు మొదలవుతున్నాయని... మళ్లీ దానికి సమస్య రాకుండా కూడా చూసుకోవాలని ఒక మంత్రి అభిప్రాయపడ్డారు. దీనితోనూ సీఎం ఏకీభవించలేదు. "ఇవన్నీ ఉన్న మాట నిజమే. కానీ, అన్యాయం జరుగుతున్నప్పుడు గళమెత్తి మాట్లాడకపోతే మనం ప్రజల ముందు దోషిగా నిలబడాల్సి వస్తుంది" అని చంద్రబాబు బదులిచ్చారు. కొన్ని రంగాలకు బడ్జెట్‌లో కేటాయింపులు బాగానే ఉన్నాయని... వ్యవసాయం, ఆరోగ్యానికి పెంచారని ఆర్థిక శాఖ అధికారులు చెప్పారు. దీనిపై చంద్రబాబు స్పందిస్తూ... "దేశం మొత్తంగా చేసే కేటాయింపులు అన్ని రాష్ట్రాలకూ వస్తాయి. నష్టపోయి ఉన్న మన రాష్ట్రానికి ఏం ఇస్తున్నారన్నది మనకు ముఖ్యం! కేంద్ర పథకాల కింద చేసే కేటాయింపుల్లో అనేక సమస్యలు ఉంటాయి. ఆరోగ్య బీమాను రూ.5 లక్షలకు పెంచారు. కానీ, కేంద్రం లెక్కల ప్రకారం పేదరికం జాబితాలో ఉన్న వారికే ఇస్తారు. వారి లెక్కల ప్రకారం ఏపీలో తొమ్మిది శాతం మాత్రమే పేదలు ఉన్నారు. మన లెక్కల ప్రకారం ఎనభై శాతం ఉన్నారు. వారందరికీ మనం ఆరోగ్య బీమా ఇస్తున్నాం' అని ముఖ్యమంత్రి చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాలకు ప్రత్యేకంగా కేటాయింపులు చేయలేదని, శాఖలవారీగా నిధులు ఇచ్చి వాటిని రాష్ట్రాలకు అవసరాలను బట్టి కేటాయింపులు చేస్తున్నారని కొందరు అధికారులు చెప్పారు. ఆ వాదనతో ముఖ్యమంత్రి అంగీకరించలేదు. అదే నిజమైతే అహ్మదాబాద్, ముంబై, బెంగుళూరు వంటి నగరాలకు కొన్ని కేటాయింపులు ఎలా చేశారని ఆయన ప్రశ్నించారు. టీడీపీపై ప్రతిపక్షాల విమర్శల విషయం కూడా చర్చకు ఈ సమావేశంలో వచ్చింది. "రాష్ట్రానికి ఎలా నిధులు రాబట్టాలన్నది మన బాధ. మనల్ని ఎలా తిట్టిపోయాలన్నది వారి ఎజెండా. ప్రజలు అన్నీ చూస్తున్నారు. మన పని మనం నిజాయితీగా చేద్దాం' అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. కేంద్రంపై సీఎంలో ఇంత బాధ, ఆక్రోశం గతంలో ఎప్పుడూ చూడలేదని ఈ సమావేశం తర్వాత ఒక మంత్రి వ్యాఖ్యానించారు. కేంద్ర బడ్జెట్ విశేషాలను చంద్రబాబు గురువారం ఉదయం నుంచి ఎప్పటికప్పుడు సమీక్షించారు. ఉదయం బ్రహ్మకుమారి సమాజం కార్యక్రమానికి వెళ్లిన ఆయన అక్కడ ఉన్నప్పుడే బడ్జెట్ వివరాలు తెప్పించుకుని అధ్యయనం చేశారు.

మోదీ జమానా.. ఉద్యోగుల సంక్షేమం



ఇలా ఇచ్చి, అలా లాగేస్తున్నారు

ఉద్యోగుల ఆశలపై నీళ్లు చల్లారు. ప్రతి సంవత్సరం రెండు నెలల జీతాన్ని ఆదాయపన్ను కింద కడుతున్నాం. ఉద్యోగులకు ఇచ్చినట్టే ఇచ్చి ప్రభుత్వం అన్ని విధాలుగా మా నుంచి లాగేసుకుంటోంది.

-పీ దస్తగిరిబాబు, కర్నూలు జిల్లా అధ్యక్షుడు, పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం



పేదల ఆకాంక్షలకు కొత్త రెక్కలు

ఇది ప్రగతిశీల, అనుకూలమైన భారత్‌కు నిదర్శనమని, గ్రామీణ, పట్టణ ప్రజల మధ్య అంతరాన్ని తగ్గిస్తుంది. రైతులు, మౌలిక సదుపాయాలు, గ్రామీణులు, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధికి సోపానంగా నిలిచిన ఈ బడ్జెట్‌తో పేదల, బలహీన వర్గాల ఆకాంక్షలకు రెక్కలొచ్చాయి.

- అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు








ఆర్భాటమే

మహాభాగ్యం





(మొదటి పేజీ తరువాయి)

ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ తన బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. ప్రపంచంలో ఎక్కడా ఇంత భారీ ఆరోగ్య పథకం లేదని చాటుకున్నారు. దేశంలోని పలు ఆసుపత్రులు, ఆరోగ్య సంస్థలు ఈ ప్రకటనపై హర్షం వ్యక్తం చేశాయి. అయితే కాస్త లోతుకు వెళ్లి చూస్తే...

రెండేళ్ల కిందట 2016-17 బడ్జెట్‌లోనే కేంద్ర ప్రభుత్వం ఒక ఆరోగ్య బీమా పథకాన్ని ప్రకటించింది. (అప్పటి బడ్జెట్‌కు సంబంధించిన వార్త క్లిప్పింగ్ చూడండి) ప్రతి కుటుంబానికి లక్ష రూపాయల ఆరోగ్య బీమా కల్పిస్తామని, వృద్ధులకు అదనంగా రూ.30 వేల మేర కవరేజి ఇస్తామని తెలిపింది. ఇప్పుడు కుటుంబానికి రూ.5 లక్షల ఆరోగ్య బీమా అని, 50 కోట్ల మందికి ప్రయోజనం అని ప్రకటన చేశారు. రెండేళ్ల కిందటే ప్రకటించిన ఆరోగ్య బీమా ఇప్పటికే అమలవుతూ ఉండాలి కదా! మరి అవుతోందా అంటే ఎంత మాత్రం కావడం లేదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్యసేవ పేరిట, తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్య శ్రీ పేరిట ఆరోగ్య బీమా పథకాన్ని తమ సొంత నిధులతో అమలు చేస్తున్నాయి. తాము ప్రకటించిన ఆరోగ్య బీమా పథకం అమలు ఇప్పటికీ ప్రారంభం కాలేదని కేంద్ర ప్రభుత్వం రెండు నెలల కిందటే పార్లమెంటులో అంగీకరించింది. కానీ ఇప్పుడు మరో ఆర్భాటపు ప్రకటన చేసింది. నాడు యూపీ ఎన్నికల దృష్ట్యా ఆరోగ్య బీమా ప్రకటన చేసి అమలు చేయని కేంద్ర సర్కారు, ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా మరోసారి అంతకంటే భారీ ప్రకటన చేసినట్లు కనిపిస్తోంది.



పేదలందరికీ ఆరోగ్య బీమా అంటూ 2016-17 బడ్జెట్‌లో చేసిన ప్రకటన

ఇది అపూర్వ బడ్జెట్

మోదీ, జైట్లీలపై ఆడ్వాణీ ప్రశంసల జల్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1 : మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే ఆడ్వాణీ ప్రశంసల జల్లు కురిపించారు. ఇది అపూర్వ బడ్జెట్ అంటూ కొనియాడారు. ఆర్థికాభివృద్ధికి మానవీయతను జోడించడం తనకు ఆనందం కల్గించిందని ఓ ప్రకటనలో తెలిపారు. 'ప్రజల సంక్షేమంతోబాటు.. అన్ని రంగాల్లో ఈ స్థాయిలో లక్ష్యాలను నిర్దేశించిన బడ్జెట్‌ను గతంలో నేను చూడలేదు' అని ఆడ్వాణీ పేర్కొన్నారు. ప్రధాని మోదీ, ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీలను ఈ సందర్భంగా అభినందనలతో ముంచెత్తారు. పది కోట్ల పేద కుటుంబాలకు.. రూ.5 లక్షల ఆరోగ్య బీమా రక్షణ కల్పిస్తూ తీసుకువచ్చిన 'ఆయుష్మాన్ భారత్' పథకాన్ని ఆయన ప్రస్తుతించారు.

జైట్లీ గారి బడ్జెట్ బండి

బ – బడ్జెట్ అంచనా
స – సవరించిన అంచనా

వివరం	2016-17 (బ.అం)	2017-18 (స.అం)	2017-18 (బ.అం)	2018-19
1) రెవెన్యూ వసూళ్లు	13,74,203	15,15,771	15,05,428	17,25,738
ఎ)పన్ను ఆదాయం	11,01,372	12,27,014	12,69,454	14,80,649
బి) పన్నేతర ఆదాయం	2,72,831	2,88,757	2,35,974	2,45,089
2) మూలధన వసూళ్లు	6,00,991	6,30,964	7,12,322	7,16,475
ఎ) రుణ వసూళ్లు	17,630	11,933	17,473	12,199
బి) ఇతర వసూళ్లు	47,743	72,500	1,00,000	80,000
సి) రుణాలు	5,35,618	5,46,531	5,94,849	6,24,276
3) మొత్తం వసూళ్లు	19,75,194	21,46,735	22,17,750	24,42,213
4) పథకాలకు వ్యయం	8,30,766	9,42,096	9,19,900	10,14,451
5) పథకేతర వ్యయం	11,44,428	12,04,639	12,97,850	14,27,762
6) మొత్తం వ్యయం	19,75,194	21,46,735	22,17,750	24,42,213
7) రెవెన్యూ లోటు	3,16,381	3,21,163	4,38,877	4,16,034
8) ద్రవ్య లోటు	5,35,618	5,46,531	5,94,849	6,24,276

కీలక రంగాలు.. కేటాయింపులు

(రూ. కోట్లలో)

- సాంఘిక సంక్షేమం 44,220
- వ్యవసాయం 63,836
- పరిశ్రమలు 27,956
- గ్రామీణాభివృద్ధి 1,38,097
- పట్టణాభివృద్ధి 41,765
- విద్య 85,010
- ఆరోగ్యం 54,667
- రవాణా 1,34,572

మందు పూసి, మంట పెట్టారు

» పెట్రో ధరలపైనా మాయాజాలం

పెట్రోలియం ఉత్పత్తుల ధరలు కొంతకాలంగా విపరీతంగా పెరుగుతున్నాయి. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తక్కువగా ఉన్నప్పుడు కూడా పెట్రో ధరలు చుక్కలంటుతున్నాయి. అయితే గురువారం నాటి బడ్జెట్లో ఆర్థికమంత్రి జైట్లీ కీలక ప్రకటన చేశారు. "పెట్రోలు, డీజిల్‌పై లీటరుకు రెండు రూపాయల బేసిక్ ఎక్సైజ్ డ్యూటీ తగ్గిస్తున్నాం. మరో రూ.6 అదనపు ఎక్సైజ్ డ్యూటీని తొలగిస్తున్నాం" అని ప్రకటించారు. దీంతో పెట్రో ధరలు తగ్గుతాయని, కాస్తయినా ఊరట లభిస్తుందని అందరూ ఆశించారు. కానీ ఇంతలోనే అసలు గుట్టు బయటపడింది. లీటరుకు రూ.8 చొప్పున 'రహదారి సెస్సు' విధించింది. అంటే ఆ తగ్గింపులు, ఈ పెంపుతో సరి!

ఆదాయపు పిన్న

స్టాండర్డ్ డిడక్షన్ సెస్సుతో సరి

"వ్యాపారులు, ప్రొఫెషనల్స్‌తో పోలిస్తే ఉద్యోగులే ఆదాయపు పన్ను సక్రమంగా, అధికంగా చెల్లిస్తున్నారు. వారికి ఊరట కల్పించాల్సిన అవసరం ఉంది" అని చెప్పిన జైట్లీ వేతన జీవులకు ప్రయాణ, వైద్య భత్యాలపై రూ.40 వేల మేర స్టాండర్డ్ డిడక్షన్ ఇస్తున్నట్లు ప్రకటించారు. ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితి పెంచకపోయినా ఈ మాత్రం రాయితీ ఇచ్చారు కదా అని వేతన జీవులు కొంత ఊరట చెందారు. అయితే ఈ మినహాయింపు కూడా మాయే! ఇప్పటికే ట్రావెల్ అలవెన్స్‌పై రూ.19,600, మెడికల్ అలవెన్స్‌పై రూ.15 వేల వరకు మినహాయింపు ఉంది. అంటే కొత్తగా ఇస్తున్న మినహాయింపు రూ.5,400పై మాత్రమే! అంటే పన్నుకు అర్హమైన ఆదాయంలో నుంచి ఈ మొత్తాన్ని మినహాయించి మిగతా దానిపై పన్ను చెల్లించాలి. తద్వారా కేంద్రం కోల్పోయే ఆదాయం రూ.8 వేల కోట్లు అని అంచనా! అయితే అదే సమయంలో ఆదాయపు పన్నుపై సెస్సును 3 నుంచి 4 శాతానికి పెంచేశారు. ఈ పెంపుతో కేంద్రానికి రూ.11 వేల కోట్లు వస్తాయి. అంటే నికరంగా సర్కారుకు రూ.3 వేల కోట్ల లాభం! ఈ దెబ్బ ఇంతటితో ఆగలేదు. అన్ని రకాల దిగుమతి వస్తువులపై పది శాతం 'సమాజ సంక్షేమ సర్‌చార్జి' ద్వారా వేల కోట్లు సమకూర్చుకోనుంది. ఇదీ మోదీ మాయ!



మద్దతు ధర మతలబు

"రైతు ఉత్పత్తి చేసిన పంటకు అయ్యే ఖర్చుకు 50 శాతం అదనంగా, అంటే ఉత్పత్తి ఖర్చుకు ఒకటిన్నర రెట్లు మద్దతు ధర ఇస్తామని మా మేనిఫెస్టోలో పేర్కొన్నాం. ఆ ప్రకారం ఖరీఫ్‌లో పంటలన్నింటికీ ఒకటిన్నర రెట్ల మద్దతు ధర ఇస్తాం" అని జైట్లీ బడ్జెట్లో ప్రకటించారు. అయితే ఖరీఫ్, రబీలలో కొన్ని పంటలకు ఇప్పటికే ఆ ప్రకారం మద్దతు ధర ఉంది. మిగతా పంటలకు కూడా దానిని వర్తింపజేస్తామన్నది ఆర్థిక మంత్రి మాటల సారాంశం. వాస్తవానికి రైతుకు అవుతున్న పెట్టుబడి వ్యయానికి ఒకటిన్నర రెట్ల మద్దతు ధర ఉంటే దేశవ్యాప్తంగా ఇన్ని రైతు ఆత్మహత్యలు జరిగేవి కావు. పెట్టుబడి వ్యయాన్ని ప్రభుత్వం లెక్కించే విధానమే లోపభూయిష్ఠంగా ఉందన్నది వ్యవసాయ నిపుణులు చెబుతున్న మాట! రైతుకు వాస్తవంగా అయ్యే వ్యయాన్ని లెక్కించి దానిపై ఒకటిన్నర రెట్ల మద్దతు ధరను చెల్లించాలంటే ఇప్పుడున్న మద్దతు ధరను అమాంతం 45 శాతం పెంచాలని వారు తేల్చిచెప్పారు. కానీ కేంద్రం వాస్తవ వ్యయాన్ని లెక్కించకుండా కొన్ని రకాల ఖర్చులను మాత్రమే చూపుతూ దానిపై 50 శాతం అదనంగా మద్దతు ధర నిర్ణయిస్తోంది. వరి, పత్తి పంటలకు ఇప్పటికే ఈ లెక్కన మద్దతు ధర అమలవుతోంది. ఈ లెక్కే సరిగా ఉంటే ఇంతమంది వరి, పత్తి రైతులు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చేదే కాదని, ఇప్పుడు మరికొన్ని పంటలకు ఆ లోపభూయిష్ఠమైన లెక్కను వర్తింపజేయడం వల్ల రైతులకు ఒనగూరే ప్రయోజనం అతి స్వల్పమని వ్యవసాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

బల్ల చరిచిన మోదీ

కార్పొరేట్లకే మేలని విపక్షాల గేలి

- అరుణ్ జైట్లీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ఇది వరుసగా ఐదోసారి. బూడిద రంగు కుర్తా, బ్లాక్ నెహ్రూ కోట్ ధరించి ఆయన లోక్‌సభలోకి అడుగుపెట్టారు.
- 66 ఏళ్ల జైట్లీ తొలి 25 నిమిషాల పాటు నిల్చుని ప్రసంగించారు. తర్వాత కూర్చొని బడ్జెట్‌ను చదివారు. ఆఖర్లో మళ్లీ నిల్చుని ప్రసంగాన్ని పూర్తి చేశారు. ఆయన భార్య సంగీత, కొడుకు రోహన్ గ్యాలరీల్లోంచి వీక్షించారు.
- బడ్జెట్ సమర్పణకు ముందు జైట్లీ సభలో బీజేపీ కురువృద్ధుడు ఎల్‌కే ఆడ్వాణీతో కరచాలనం చేశారు. అలాగే కాంగ్రెస్ సీనియర్‌నేత కమల్‌నాథ్.. జైట్లీ వద్దకు వెళ్లి ఆయనను అభినందించారు. సభలో ఆడ్వాణీ ఉత్సాహంగా కనిపించారు.
- జైట్లీ ప్రసంగిస్తుండగా మధ్య మధ్యలో ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేస్తూ బల్లను చరిచారు. జాతీయ ఆరోగ్యపథకం కింద 10 కోట్ల మంది పేదల ప్రజలకు లబ్ధి కలుగనుందని ఆర్థిక మంత్రి ప్రకటించిన సందర్భంలోనైతే మోదీ మరింత గట్టిగా బల్లను చరిచారు. ఈ పరిణామం బీజేపీ ఎంపీల్లో మరింత ఉత్సాహం నింపింది.
- బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత జైట్లీని సహచర మంత్రులు సుష్మా స్వరాజ్, రంజిత్ సింగ్, నితిన్ గడ్కరీ అభినందించారు. విపక్షాల నుంచి బీజేడీ బహిష్కృత నేత బాయ్‌జయంత మినహా ఎవరూ జైట్లీతో కరచాలనం చేయలేదు.
- బడ్జెట్ ప్రసంగం సాగుతుండగా కాంగ్రెస్ అధినేత రాహుల్.. జ్యోతిరాదిత్య సింధియాతో మాట్లాడుతూ కనిపించారు.
- బడ్జెట్ సందర్భంగా సభకు యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ తంబిదొరై, లోక్‌సభలో కాంగ్రెస్‌పక్షనేత మల్లికార్జున్ ఖర్గే, మాజీ ప్రధాని దేవెగౌడ, ఎస్పీనేత ములాయం సింగ్ యాదవ్ హాజరయ్యారు.
- వినయ్ సహస్రబుద్ధే (బీజేపీ), డీ రాజా (సీపీఐ) సహా పలువురు రాజ్యసభ సభ్యులు లోక్‌సభ గ్యాలరీల్లోంచి బడ్జెట్ ప్రసంగాన్ని వీక్షించారు.
- బడ్జెట్ ప్రసంగంలో జైట్లీ 2022 లక్ష్యంగా పలు పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేస్తామని ప్రకటించగా.. విపక్షనేత ఖర్గే అడ్డుపడ్డారు. జైట్లీ 2019 బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నారా? లేదంటే 2022 బడ్జెట్‌నా? అని ప్రశ్నించారు.
- జైట్లీ తన ప్రసంగంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు పలు ప్రోత్సాహకాలను ప్రకటిస్తుండగా విపక్ష సభ్యులు ఎగతాళిగా కేకలు వేశారు. బీజేపీ ప్రభుత్వ కేటాయింపులన్నీ కార్పొరేట్ కంపెనీలకేనని నినాదాలు చేశారు.
- రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, గవర్నర్ వేతనాల పెంపు ప్రకటన సందర్భంలో పలువురు ఎంపీలు "మా సంగతి ఏమిటి?.. మాకు పెంచరా" అంటూ నినాదాలు చేశారు. జైట్లీ.. వినండి.. వినండి అంటూ సర్ది చెప్పి, ఐదేళ్లకోసారి ఎంపీల వేతనాల పెంపుపై ప్రకటన చేశారు.

మద్దతు ధర డొల్ల.. రైతుల పెదవి విరుపు


హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్లో జైట్లీ ప్రకటించిన మద్దతు ధర మాయ అని రైతులు పెదవి విరుస్తున్నారు. వరి సహా వివిధ పంటలకు కేంద్రం ప్రకటించిన మద్దతు ధరలతో తెలంగాణలో ఏ పంటకూ ఉత్పత్తి ఖర్చు కూడా రాని పరిస్థితి ఉందని స్పష్టం చేస్తున్నారు. రాష్ట్రంలో క్వింటా వరి ఉత్పత్తికి అయ్యే వ్యయం రూ.2202గా ఉందని వ్యవసాయ శాఖ నివేదికలే చెబుతున్నాయి. ఆర్థిక మంత్రి చెప్పిన దాన్నిబట్టి రాష్ట్రంలో ధాన్యం మద్దతు ధర రూ.3,300గా ఉండాలి. కానీ, ప్రస్తుత మద్దతు ధర రూ.1570 మాత్రమే. అలాగే, పత్తి క్వింటా ఉత్పత్తి వ్యయం రూ.6080 వరకూ ఉంది. కానీ, మద్దతు ధర రూ.4320గా ఉంది. ఈ నేపథ్యంలో, ఉత్పత్తి ఖర్చుకు ఒకటిన్నర రెట్లు మద్దతు ధర ఇప్పటికే ఇస్తున్నామన్న ఆర్థిక మంత్రి వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయని రైతు సంఘాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

బడ్జెట్ లక్ష్యం సామాజిక న్యాయం

పథకాల్ని ప్రచారం చేయండి.. బీజేపీ ఎంపీలను కోరిన మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: బీజేపీ ప్రభుత్వ లక్ష్యం సామాజిక న్యాయమని, ఆ దృష్టితోనే బడ్జెట్ ప్రతిపాదనలను రూపొందించామని చెప్పారు ప్రధాని నరేంద్ర మోదీ. ఆయన గురువారం రాత్రి బీజేపీ పార్లమెంట్ సభ్యులనుద్దేశించి మాట్లాడారు. బడ్జెట్ పథకాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన కోరారు. " సబ్‌కా సాథ్ సబ్ కా వికాస్ నినాదం మనది. ఆ దిశగా చూస్తే బడ్జెట్ ప్రతిపాదనలు చరిత్రాత్మకం. మీరు చేయాల్సినది రిబ్బను కటింగులు కాదు.. పథకాల ప్రచారం" అని ఆయన అన్నారు. వచ్చే కొద్ది రోజుల పాటు ప్రజల్లోకి వెళ్ళండి.. సాంకేతికంగా మాట్లాడకండి.. మన పథకాలు ప్రజలకు- ముఖ్యంగా పేద, బలహీన వర్గాలకు, రైతులకు ఎంత లాభదాయకమో చెప్పండి" అని ఆయన నిర్దేశించారు. "ముఖ్యంగా ఆయుష్మాన్ భవ పథకం గురించి- 50 కోట్ల మందికి అది ఎంత ఉపయుక్తమవుతుందో చెప్పండి. అలాగే ఉజ్వల్ యోజన కింద వంటగ్యాస్ పథకం గురించి వివరించండి. సీనియర్ సిటిజన్లకు ఇస్తున్న రాయితీలు చెప్పండి. రైతులకు ఇచ్చే ఒకటిన్నర రెట్ల మద్దతు ధర గురించి వివరించండి" అని మోదీ సూచించారు.

జవాన్‌కు అండదండ



'రక్షణ'కు 2.95 లక్షల కోట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: కేంద్ర బడ్జెట్‌లో రక్షణ రంగానికి కేటాయింపులు కేవలం 7.81 శాతం పెరిగాయి. ఇది స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 1.5 శాతం మాత్రమే. 1962 నుంచి చూస్తే ఇదే అత్యల్పం! ఇటు పాకిస్థాన్, అటు చైనాతో సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో మిలిటరీ ఆధునికీకరణ ప్రాజెక్టులపై ఆశలు, అంచనాలు ఉన్నాయి. వీటిపై పెద్దగా పెరుగుదల లేని బడ్జెట్ కేటాయింపులు నీళ్లు చల్లాయి. వచ్చే ఆర్థిక సంవత్సరానికి రక్షణ శాఖకు రూ.2.95 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించారు. ఇది గత ఏడాది కేటాయించిన రూ.2.74 లక్షల కోట్ల కంటే 7.81 శాతం మాత్రమే ఎక్కువ. ఇక, ఈ మొత్తంలో త్రివిధ దళాలకు కొత్త ఆయుధాలు, విమానాలు, యుద్ధ నౌకలు, ఇతర సామగ్రి కొనుగోలుకు రూ.99,947 కోట్లు కేటాయించారు. రెవెన్యూ ఖర్చును రూ.1,95,947 కోట్లుగా ప్రతిపాదించారు. వీటిదే బడ్జెట్‌లో సింహభాగం అన్నమాట! రక్షణ సిబ్బంది పెన్షన్ల కోసం మరో రూ.1,08,853 కోట్లు ప్రత్యేకంగా కేటాయించారు. మొత్తం బడ్జెట్ రూ.24,42,213 కోట్లు. ఇందులో రక్షణ బడ్జెట్ వాటా 12.10 శాతం. కేంద్ర ప్రభుత్వం దేశంలో రెండు రక్షణ పారిశ్రామిక కారిడార్లను అభివృద్ధి చేయనుండడం ఈ బడ్జెట్‌లో మరో కీలకాంశం.

'వ్యూహాత్మక' దేశాలకు.. సాయం పెంపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: ఒకవైపు చైనా.. మరోవైపు పాక్ నుంచి నిత్యం ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో.. వాటికి చెక్ పెట్టేందుకు 'వ్యూహాత్మక' దేశాలకు చేయూతనిచ్చే బడ్జెట్‌ను మోదీ సర్కారు పెంచింది. విదేశీ వ్యవహారాల శాఖ నేతృత్వంలో ఆయా దేశాల సహాయార్థం గత ఏడాది రూ. 14,798.55 కోట్లు కేటాయించగా.. ఈ సారి రూ. 15,011 కోట్ల కేటాయింపులను అరుణ్‌జైట్లీ ప్రకటించారు. నేపాల్, భూటాన్, మయన్మార్, బంగ్లాదేశ్, శ్రీలంకతోపాటు.. సీషెల్స్, ఆఫ్రికా దేశాలు, ఇరాన్ భారత్‌కు 'వ్యూహాత్మక' ప్రాంతాలుగా ఉన్నాయి. నేపాల్‌కు ఈ సారి 75 శాతం, సీషెల్స్‌కు 50శాతం మేర అధిక నిధులను కేటాయించారు. మయన్మార్‌లోని రాఖినే జిల్లా అభివృద్ధికి రూ. 280 కోట్లు ప్రకటించారు. కాగా.. ఈ శాఖకు ఇతర ఖర్చుల నిమిత్తం రూ. 3,772.6 కోట్లు అందించనున్నారు.

జైట్లీ లెక్కలు తప్పు

బడ్జెట్‌లో మెరుపులను ఎలా సాధ్యం చేస్తారు?

రైతు ఆదాయం రెండింతలు ఎలా అవుతుంది?: మన్మోహన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: సంస్కరణలు అనే పదాన్ని విచ్చలవిడిగా వాడుతూ దాన్ని దుర్వినియోగం చేశారని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో లబ్ధి పొందే అంశాల ఆధారంగా బడ్జెట్ రూపొందించారన్న విమర్శల జోలికి తాను పోనని.. అయితే, జైట్లీ చెప్పిన గణాంకాలు మాత్రం తప్పులతడక అని పేర్కొన్నారు. బడ్జెట్ ప్రసంగంలో చూపించిన మెరుపులను ఎలా సుసాధ్యం చేస్తారని ప్రశ్నించారు. రైతాంగం తాము పండించిన పంటలకు కనీస మద్దతు ధర పొందేలా వచ్చే ఖరీఫ్ నాటికి.. పెట్టుబడికి 50 శాతం అదనపు ఆదాయం వచ్చేలా చూస్తామని జైట్లీ చెబుతున్నారని.. దాన్ని ఎలా సాధిస్తారని ప్రశ్నించారు. 'రైతుల ఆదాయం రెండింతలు ఎలా అవుతుంది? ఈ హామీలను ఎలా నెరవేరుస్తారు?' అని నిలదీశారు.

బీజేపీపై ఐక్యంగా పోరాడుదాం

» విపక్షాలన్నీ ఏకం కావాలి: సోనియా

పార్లమెంటు లోపల, బయట అధికార బీజేపీని ఎదుర్కొనేందుకు ప్రతిపక్షాలన్నీ ఏకం కావాలని సోనియాగాంధీ పిలుపునిచ్చారు. పార్టీల మధ్య విభేదాలున్నా.. దేశ ప్రయోజనాల దృష్ట్యా ఐక్యంగా పోరాడుదామన్నారు. గురువారం 17 ఎన్డీఏ యేతర పార్టీలతో పార్లమెంటు లైబ్రరీ భవన్‌లో సోనియా సమావేశం నిర్వహించారు. దేశంలో రాజ్యాంగ వ్యవస్థల్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం జరుగుతోందని, దానిని అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కాగా, ఈ కీలక భేటీకి బీఎస్పీ గైర్హాజరైంది.

మోదీ జమానా.. సాగు రాయితీలు



గిట్టుబాటు ధర ఇవ్వట్లేదు

పక్క దేశాల్లో వ్యవసాయ రంగానికి 90 శాతం సబ్సిడీ అందిస్తున్నారు. కానీ వ్యవసాయ దేశంగా చెప్పుకొనే మన దేశంలో మాత్రం ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించడం లేదు. కష్టపడి పండించిన పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధరను ప్రకటించట్లేదు.

- ఆలంపల్లి ప్రతాప్‌రెడ్డి, రైతు



సాయం అందట్లేదు

కేంద్రం రైతులకు అందిస్తున్న సబ్సిడీలతో రైతులకు ఆశించిన ప్రయోజనం కలగట్లేదు. ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానం చేస్తే రైతులకు ఎంతో మేలు. ఫసల్ బీమా యోజన ప్రయోజనకరం. కానీ అవగాహన లేక రైతులు దాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు.

- మంజుల, మహిళా రైతు





రైతుకు అండ

ఖర్చు కంటే ఒకటిన్నర రెట్లు మద్దతు ధర

- పంట రుణాలు మరో లక్ష కోట్లు
- కౌలు రైతులకు పంట రుణాలు.. ప్రత్యేక వ్యవస్థ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: "రైతు ఉత్పత్తి చేసిన పంటకు అయ్యే ఖర్చుకు 50 శాతం అదనంగా అంటే, ఉత్పత్తి ఖర్చుకు ఒకటిన్నర రెట్లు మద్దతు ధర ఇస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నాం. రబీలో మెజారిటీ పంటలకు ఇప్పటికే ఖర్చు కంటే ఒకటిన్నర రెట్లు అధికంగా మద్దతు ధర(ఎంఎస్‌పీ) ప్రకటించాం. ఇప్పుడు దీనిని మిగిలిన పంటలకు కూడా అమలు చేయాలని నిర్ణయించాం. ఖరీఫ్‌లో అప్రకటిత పంటలన్నిటికీ మద్దతు ధర ఒకటిన్నర రెట్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. రైతు ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న సర్కారు సంకల్పం దిశగా ఈ చరిత్రాత్మక నిర్ణయం కీలక ముందడుగు" అని బడ్జెట్ ప్రసంగంలో జైట్లీ పేర్కొన్నారు. మత్స్య, ఆక్వాకల్చర్, పశు సంవర్ధక శాఖలకు రూ.10 వేల కోట్లతో రెండు ప్రత్యేక నిధులను ఏర్పాటు చేశారు. "కేవలం మద్దతు ధర కల్పిస్తేనే సరిపోదు. ఆ లబ్ధి రైతుకు చేరాలి. ఒకవేళ, సదరు ఉత్పత్తుల ధర మార్కెట్లో ఎంఎస్‌పీ కంటే తక్కువ ఉంటే, దానిని మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదింపులు జరిపి పంటలకు తగిన ధర కల్పించేందుకు నీతి ఆయోగ్ సమగ్ర వ్యవస్థను తీసుకొస్తుంది" అని వివరించారు. రైతులకు అధిక ఆదాయంపై తాము దృష్టి సారించామని, వ్యవసాయాన్ని పరిశ్రమగా గుర్తిస్తున్నామని, అదే భూమిలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉత్పత్తి సాధించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మరింత మంచి ధర రావాలంటే, పంట వచ్చిన తర్వాత ధరల ఆధారంగా రైతులు నిర్ణయాలు తీసుకోవాలని జైట్లీ చెప్పారు.





మొరాదాబాద్‌లోని పొలాల్లో అరుణ్ జైట్లీ బడ్జెట్ ప్రసంగాన్ని ఆసక్తిగా వింటున్న రైతు, మహిళలు

ఫుడ్ ప్రాసెసింగ్‌కు 1400 కోట్లు

దేశంలో ఫుడ్ ప్రాసెసింగ్ (ఆహార శుద్ధి) 8% చొప్పున పెరుగుతోందని, గత ఏడాది ఈ రంగానికి 715 కోట్లు మాత్రమే కేటాయించామని, ఈ బడ్జెట్లో 1400 కోట్లు కేటాయించామని జైట్లీ తెలిపారు. ప్రత్యేక ఆగ్రో ప్రాసెసింగ్ ఆర్థిక సంస్థలను ఏర్పాటు చేస్తామన్నారు.

- రైతులు ఉత్పత్తి చేసే మిగులు సోలార్ విద్యుత్తును రాష్ట్ర ప్రభుత్వాలు తగిన ధరకు కొనుగోలు చేసేలా నిర్దిష్ట వ్యవస్థను తీసుకొస్తామని చెప్పారు.
- సాగునీటి ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేసేందుకు దీర్ఘకాలిక సాగునీటి నిధిని ఏర్పాటు చేశామని, దీని పరిధిని కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ ప్రాజెక్టులకు కూడా విస్తరిస్తున్నామని చెప్పారు.
- వచ్చే ఆర్థిక సంవత్సరంలో 11 లక్షల కోట్ల పంట రుణాలు ఇవ్వనున్నామని జైట్లీ చెప్పారు. 2014-15లో 8.5 లక్షల కోట్ల రుణాలు ఇస్తే, 2017-18లో 10 లక్షల కోట్లకు పెంచామని, ఇప్పుడు మరో లక్ష కోట్లు పెంచామని తెలిపారు.
- కర్షకులు శ్రమ చిందించడంతో దేశంలో ఈసారి రికార్డు స్థాయిలో దిగుబడులు వచ్చాయని జైట్లీ తెలిపారు.

"శతాబ్దాలుగా వ్యవసాయ ప్రధాన దేశం అని చెబుతున్నాం. కానీ, మన జిల్లాలకు వ్యవసాయంలోనో మరో అంశంలోనో ప్రత్యేకత ఉంది. అయినా, వాటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించలేదు. పారిశ్రామిక రంగంలో అభివృద్ధి చేసినట్లే వ్యవసాయ రంగంలో కూడా మన జిల్లాల్లోని వ్యవసాయ ఉత్పత్తులను గుర్తించి, శాస్త్రీయ పద్ధతిలో క్లస్టర్ ఆధారిత మోడల్‌ను అభివృద్ధి చేయాల్సి ఉంది" అని జైట్లీ తెలిపారు. మనకు 7

ఎగుమతుల విధానం సరళీకరణ

లక్షల కోట్ల వ్యవసాయ ఎగుమతుల సామర్థ్యం ఉందని, ప్రస్తుతం 2 లక్షల కోట్ల ఎగుమతులే చేస్తున్నామని, ఎగుమతులను పెంచడానికి వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల విధానాన్ని సరళీకరిస్తున్నామని జైట్లీ చెప్పారు. దేశంలో ఉన్న 42 మెగా ఫుడ్ పార్కుల్లో అత్యాధునిక పరీక్ష సదుపాయాలు కల్పిస్తామన్నారు.





బడ్జెట్‌పై.. విపక్షాల పెదవి విరుపు

- 'మరణ వాంగ్మూలం': తృణమూల్
- ప్రజల కళ్లకు గంతలు: వామపక్షాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: కేంద్ర బడ్జెట్‌పై విపక్షాలు పెదవి విరిచాయి. ఈ బడ్జెట్‌తో సామాన్యులు, రైతులకు ఒరిగిందేమీ లేదని దుయ్యబట్టాయి. ఢిల్లీ నగరం విషయంలో ఈ బడ్జెట్ 'సవతి తల్లి ప్రేమ'ను తలపించిందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్ అన్నారు. కాగా.. ఈ బడ్జెట్ నిరాశపరిచిందని శివసేన ఎంపీ అర్వింద్ సావంత్ అన్నారు. ఈ బడ్జెట్‌ను 'విధ్వంసకర బడ్జెట్'గా సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ అభివర్ణించారు. అటు.. తృణమూల్ కాంగ్రెస్ నేత డెరెక్ ఓబ్రియాన్ ఈ బడ్జెట్‌ను 'బీజేపీ సర్కారు మరణ వాంగ్మూలం'గా పేర్కొన్నారు. 'ఇదో పెద్ద ఫ్లాప్ బడ్జెట్. పెద్ద బ్లఫ్ బడ్జెట్' అన్నారు. ఎన్సీపీ నేత శరద్‌పవార్ ఈ బడ్జెట్‌తో సామాన్యులకు ఒరిగిందేమీ లేదన్నారు. బడ్జెట్ సాంతం పేదలకు వ్యతిరేకంగా.. పెట్టుబడిదారీ వ్యవస్థకు అనుకూలంగా ఉందని బీఎస్పీ అధినేత్రి మాయావతి అన్నారు. జమిలి, ముందస్తు ఎన్నికల ప్రణాళికలో భాగంగానే.. బడ్జెట్ కేటాయింపులు చేశారని సీపీఎం నేత మహమ్మద్ సలీం ఆరోపించారు. రైతుల ఆదాయాన్ని పెంచే చర్యలేవీ బడ్జెట్‌లో లేవని, సెస్సుల పెంపుతో ప్రజలపై మరింత భారం మోపారని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శించారు. జైట్లీ తన వాక్చాతుర్యాన్ని ప్రదర్శించి, ప్రజల కళ్లకు గంతలు కట్టారని పేర్కొన్నారు. ఇది ఏమాత్రం 'వృద్ధి'కి సంబంధించిన బడ్జెట్ కాదని సీపీఐ నేత డీ రాజా అన్నారు. కాగా.. బీజేపీ, ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థ భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) కూడా బడ్జెట్‌పై పెదవి విరిచింది.


ఇక గ్రామీణ వ్యవసాయ మార్కెట్లు

"ఈ-నామ్‌ను బలోపేతం చేయడమే కాకుండా 585 మార్కెట్ కమిటీలకు విస్తరిస్తామని గత బడ్జెట్‌లో హామీ ఇచ్చాం. ఏడాదిలో 470 మార్కెట్ కమిటీలకే విస్తరించాం. ఈ ఏడాది మార్చినాటికి మిగిలిన మార్కెట్లకూ కనెక్ట్ చేస్తాం. అంతేనా, దేశంలోని 86% చిన్న, సన్నకారు రైతులే. వీరికోసం 22 వేల సంతలను గ్రామీణ వ్యవసాయ మార్కెట్లుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. వీటితోపాటు ఈనామ్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు 2000 కోట్ల కార్పస్ ఫండ్‌తో వ్యవసాయ మార్కెట్ మౌలిక సదుపాయాల నిధిని ప్రారంభిస్తున్నాం. వినియోగదారులకు, బల్క్ కొనుగోలుదారులకు రైతులే నేరుగా అమ్ముకునేలా ఇక్కడ సౌకర్యాలు కల్పిస్తాం" అని జైట్లీ వివరించారు.

150వ జయంతికి 150 కోట్లు!

ఏడాది పాటు మహాత్ముడి జయంత్యుత్సవాలు

న్యూఢిల్లీ: జాతిపిత మహాత్మా గాంధీ 150వ జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దేశవ్యాప్తంగా ఏడాది పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. 2019 అక్టోబరు 2 నుంచి 2020 అక్టోబరు 2 వరకు దేశవ్యాప్తంగా మహాత్ముడి జయంత్యుత్సవాలను నిర్వహిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తన బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. ఏడాది పాటు నిర్వహించనున్న కార్యక్రమాల పర్యవేక్షణకు ప్రధాని అధ్యక్షతన జాతీయ స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కమిటీలో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, గాంధేయవాదులు, మేధావులు, వివిధ రంగాల ప్రముఖులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. దీనికి రూ.150 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు.



ఆపరేషన్ గ్రీన్‌కు 500 కోట్లు

న్యూఢిల్లీ: ఆపరేషన్ ఫ్లడ్ తరహాలో ఆపరేషన్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ తెలిపారు. టమాట, ఉల్లిగడ్డ, వంటి కూరగాయలు పాడవకుండా, నిల్వ ఉండేలా.. ధరల్లో వ్యత్యాసాలు రాకుండా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా శీతల గిడ్డంగుల నిర్మాణం, రవాణా సదుపాయాలు మెరుగుపరుచనున్నారు. రైతు ఉత్పాదక సంఘాలు (ఎఫ్‌పీఓ), అగ్రి లాజిస్టిక్స్, ప్రాసెసింగ్, ప్రొఫెషనల్ మేనేజ్‌మెంట్‌లను ఆపరేషన్ గ్రీన్ ద్వారా ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. దీనికి రూ.500 కోట్లు కేటాయించారు.

ఏం చేసినా పన్నే

- **మీరేం చేస్తున్నారు?** ఉద్యోగం → అయితే ప్రొఫెషనల్ టాక్స్ కట్టాలి
- **మీ వార్షిక ఆదాయమెంత?** రూ. 5 లక్షలపైమాటే.. → ఆదాయ పన్ను కట్టాలి
- **మీదే వ్యాపారం?** సరుకులు, వస్తువులు అమ్ముతాను → జీఎస్‌టీ చెల్లించాల్సిందే
- **వస్తువుల తయారీ ఎక్కడ?** మా ఫ్యాక్టరీలో → ఎక్సైజ్ కాదు జీఎస్టీ కట్టి తీరాలి
- **ఏ ఆఫీస్‌లోనైనా సేవలు పొందారా?** అవును.. → సర్వీస్ ట్యాక్స్ కట్టాలి
- **ఆఫీసో, ఫ్యాక్టరీయో ఉందా?** ఉంది → మునిసిపల్ ట్యాక్స్, ఫైర్ ట్యాక్స్ కట్టాలి
- **రిలీఫ్ కోసం ఎక్కడికెళ్తారు?** సినిమా.. రిసార్టు → అయినా జీఎస్టీ తప్పదు
- **మీరు ఇల్లేమైనా కొన్నారా?** కొన్నాను.. → దీనికీ జీఎస్టీనే
- **లాభాలను ఎలా పంచుతారు?** డివిడెండ్ ఇస్తాం → డివిడెండ్ పంపిణీ పన్ను తప్పనిసరి
- **పన్నులు చెల్లించడంలో జాప్యం చేశారా?** అవును → వడ్డీ, జరిమానా తప్పవు

బడ్జెట్ కేటాయింపులు (రూ. కోట్లలో)

92,679	హోం శాఖ
70,544	జాతీయ రహదారుల సంస్థ
55,000	ఉపాధి హామీ పథకం
30,634	జాతీయ ఆరోగ్య మిషన్
27,505	ప్రధాన మంత్రి ఆవాస్ యోజన
19,000	ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన
13,000	పంటల బీమా పథకం
3200	పేదలకు వంట గ్యాస్ కనెక్షన్లు
4,700	మైనారిటీల అభ్యున్నతి
22,356	తాగునీరు, పారిశుధ్యానికి

మహిళ మురిసె

ఉచిత వంటగ్యాస్ కనెక్షన్లు 8కోట్లకు పెంపు



పార్లమెంట్ వద్ద జైట్లీ భార్య సంగీత

- ఉద్యోగులకు ఊరట.. తొలి మూడేళ్లు ఈపీఎఫ్ చందా 8శాతానికి తగ్గింపు
- సెల్ఫ్‌హెల్ప్ రుణాలు 37 శాతం పెరుగుదల
- ముద్రా రుణాలు 3 లక్షల కోట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: కేంద్ర బడ్జెట్‌లో అన్ని వర్గాల మహిళలపై వరాలజల్లు కురిసింది. ప్రధాని ఉజ్వల్ యోజన పథకం కింద మహిళలకు అందజేసే ఉచిత వంటగ్యాస్ కనెక్షన్లను ఏడాదికి 8 కోట్లకు పెంచారు. ఈ పథకం కింద ప్రస్తుతం 5 కోట్లు ఉచిత వంటగ్యాస్ కనెక్షన్లను అందిస్తున్నారు. అంటే.. ఈ పథకం కింద ఉచిత వంటగ్యాస్ కనెక్షన్లను మరో 3 కోట్లు పెంచినట్టయింది. అలాగే స్వయం ఉపాధిని ప్రోత్సహించే లక్ష్యంతో ముద్ర యోజన కింద రూ.3 లక్షల కోట్ల రుణాలు అందజేసేందుకు బడ్జెట్‌లో ప్రతిపాదించారు. 2015లో ప్రవేశపెట్టిన ఈ పథకంలో 10.38 కోట్ల మంది లబ్ధిదారులకు రూ.4.6 లక్షల కోట్లు రుణంగా ఇచ్చారు. మహిళల స్వయం సహాయక సంఘాలకు అందజేసే రుణాలను గణనీయంగా పెంచారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.42,500 కోట్లుగా ఉన్న మహిళల సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్ రుణాలను 37శాతం పెంచారు. ఈ మేరకు జాతీయ గ్రామీణ జీవనభృతి పథకం కింద సేంద్రియ వ్యవసాయాన్ని చేపట్టేవిధంగా సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌లను ప్రోత్సహించేందుకు వారికి అందజేసే ఈ రుణాలు వచ్చే ఏడాది మార్చినాటికి రూ.75వేల కోట్లకు పెరుగుతాయని ఆర్థికమంత్రి ధీమా వ్యక్తం చేశారు. అటు మహిళా ఉద్యోగులకూ బడ్జెట్ గొప్ప ఊరటనిచ్చింది. అన్నిరంగాల్లో పని చేస్తున్న మహిళలకు ఉపాధికాలంలోని తొలి మూడేళ్లలో ఉద్యోగుల భవిష్యనిధి (ఈపీఎఫ్)కి వారు ఇచ్చే చందాను 12 నుంచి 8శాతానికి తగ్గించారు. అదే సమయంలో కొత్త ఉద్యోగులకు ప్రభుత్వం తొలి మూడేళ్లలో 12శాతాన్ని ఈపీఎఫ్ కాంట్రిబ్యూషన్‌గా చెల్లిస్తుంది. ఆడశిశువుల ప్రయోజనార్థం 2015లో ప్రవేశపెట్టిన 'సుకన్యా సమృద్ధి యోజన' పథకం విజయవంతమైందని మంత్రి జైట్లీ అన్నారు. దేశవ్యాప్తంగా 1.26 కోట్ల ఆడశిశువుల ఖాతాల్లో 19,183 కోట్లు పడ్డాయని చెప్పారు.

సేంద్రియ సాగులో మహిళలకు ప్రోత్సాహం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: సేంద్రియ వ్యవసాయాన్ని కేంద్రం ప్రోత్సహిస్తోందని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. కనీసం వెయ్యి హెక్టార్లలో సేంద్రియ వ్యవసాయాన్ని చేసేందుకు ముందుకొచ్చే రైతు ఉత్పాదక సంఘాలు(ఎఫ్‌పీవో), గ్రామీణ ఉత్పాదక సంఘాలు(వీపీవో)లు సహకారం అందిస్తామని తెలిపారు. అలాగే, జాతీయ గ్రామీణ జీవనోపాధి కార్యక్రమం కింద మహిళా సంఘాలు సేంద్రియ వ్యవసాయం చేస్తే వారికీ ప్రోత్సాహం అందిస్తామని పేర్కొన్నారు. 'అత్యంత ప్రత్యేకమైన ఔషధ, సుగంధ మొక్కల సాగుకు మన పర్యావరణం చక్కగా అనుకూలిస్తుంది. అలాగే చిన్న, కుటీర పరిశ్రమలకు భారత్ నెలవు. వీటిల్లో అత్తరులాంటి ఉత్పత్తులు తయారవుతున్నాయి. అలాంటి వాటి అభివృద్ధికి వ్యవస్థీకృత సాగు, దాని అనుబంధ రంగాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. వీటి అభివృద్ధికి రూ.200కోట్లు కేటాయిస్తున్నాం.' అని అరుణ్‌జైట్లీ తెలిపారు.



మరిన్ని సేవలకు జన్‌ధన్

హైదరాబాద్, ఫిబ్రవరి 1: దేశంలో ప్రతి ఒక్కరికీ బ్యాంకు ఖాతా ఉండాలన్న ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన (పీఎంజేడీవై)ను ఇకపై మరిన్ని సేవలకు వినియోగించనున్నారు. ఈ ఖాతాల ద్వారా ఇప్పటికే సామాజిక పెన్షన్ల పంపిణీ జరుగుతుండగా.. కేంద్ర ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో ప్రకటించిన బీమా పాలసీలకూ ఇకపై వీటిని ఉపయోగించనుంది. అయితే దీనితో సవాళ్లు కూడా ఎదురయ్యే అవకాశం ఉన్నట్లు అంచనా వేశారు. ఈ ఏడాది జనవరి 21వ తేదీ వరకు దేశ వ్యాప్తంగా వివిధ బ్యాంకుల్లో 30.01 కోట్ల జన్‌ధన్ ఖాతాలను తెరిచినట్లు, వీటిలో రూ.73,588 కోట్ల నగదు ఉన్నట్లు ప్రభుత్వ గణాంకాల్లో వెల్లడయింది. కాగా ప్రభుత్వం ప్రవేశపెట్టే యోచనలో ఉన్న మెగా ఆరోగ్య బీమా పథకాన్ని జన్‌ధన్ యోజనకే అనుసంధానించే అవకాశాలున్నాయి. అయితే ఈ బీమా కోసం జన్‌ధన్ ఖాతాల నుంచే ప్రీమియంను మినహాయించుకుంటారు. ఇప్పటికే జన్‌ధన్ ఖాతాదారులతో పాటు రూపే కార్డుల వినియోగదారులకు పలు బీమా పథకాలను వర్తింపజేస్తున్నారు.


వెదురుకు ఎదురు లేని ప్రోత్సాహం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: వెదురు 'పచ్చ బంగారం' అని కేంద్ర ఆర్థిశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ తెలిపారు. అటవీయేతర ప్రాంతాల్లో వెదురును చెట్టుగా పిలవడాన్ని తొలగించామని పేర్కొన్నారు. నేషనల్ బ్యాంబూ మిషన్ ద్వారా వెదురు ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు రూ.1,290 కోట్లను కేటాయించారు. ఇటీవలే అటవీయేతర ప్రాంతాల్లోని వెదురును గిరిజనులు అమ్ముకునేందుకు వీలుగా 1926 నాటి అటవీ చట్టాన్ని కేంద్రం సవరించింది. దీని వల్ల వెదురు ఎగుమతులు పెరిగే అవకాశం ఉంది.

మత్స్య, పశు సంవర్ధక శాఖలకు 10వేల కోట్లు

- జాలర్లకూ కిసాన్ క్రెడిట్ కార్డులు


న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: బడ్జెట్‌లో మత్స్య, పశు సంవర్ధక శాఖలకు రూ.10వేల కోట్లు కేటాయించారు. మత్స్య పరిశ్రమ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి(ఎఫ్ఏఐడీఎఫ్), పశు సంవర్ధక మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి (ఎఫ్ఏఐడీఎఫ్) ద్వారా ఈ నిధులను ఖర్చు చేయనున్నారు. అలాగే, ఇప్పటివరకు రైతులకు మాత్రమే ఇచ్చిన కిసాన్ క్రెడిట్ కార్డులను వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన మత్స్య, పాడి రైతులకూ ఇవ్వనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ తెలిపారు. ఈ కిసాన్ క్రెడిట్‌కార్డులతో చిన్న, మధ్యతరహా మత్స్య, పాడి రైతులు ప్రయోజనం పొందుతారన్నారు.



సంవత్సరం	(రూ.కోట్లలో)
2014-15	2,58,258
2015-16	2,57,801
2016-17	2,04,025
2017-18	2,29,716
2018-19	2,64,336

సబ్సిడీల్లో దేనికెంత?

(రూ.కోట్లలో)



మోదీ జమానా.. మహిళా సంక్షేమం



ధరల నియంత్రణపై ఏదీ హామీ?

చింతపండు కిలో రెండు వందలైంది. సబ్బులు, క్రీములు, నూనెల ధరలను చడీచప్పుడు లేకుండా ప్రతి మూడు నెలలకొకసారి పెంచుతున్నారు. ఈ సమస్యపై కేంద్రం ఈ బడ్జెట్‌లో గట్టి హామీ ఇస్తుందని ఎంతగానో ఎదురుచూశాం.

- బోని పద్మజ, గృహిణి, పెదవాల్తేర్, విశాఖ



శుభసూచికం..

గ్రామీణ, మధ్యతరగతి, పొదుపు గ్రూపు మహిళల సంక్షేమం కోసం రూ.75 కోట్లు మంజూరుచేయడం శుభసూచికం. మహిళకు సంబంధించిన అన్నిరకాల సమస్యలను పరిష్కరించేందుకు వన్‌స్టాప్ క్రైసిస్‌కు ప్రత్యేక బడ్జెట్ కేటాయించడం మంచి నిర్ణయం.

- హేమలతారెడ్డి, న్యాయవాది, కర్నూలు



నో ఓట్లు
బడ్జెట్ - 2018
BUDGET -2018

'కృత్రిమ మేధ'కు జై

- మెషీన్ లెర్నింగ్, రోబోటిక్స్‌లో పెట్టుబడులు
- బడ్జెట్ ప్రసంగంలో అరుణ్‌జైట్లీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: టెక్నాలజీ పరంగా సరికొత్త రంగాలపై మోదీ ప్రభుత్వం దృష్టి సారించింది. రోబోటిక్స్, మెషీన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై పరిశోధనలను ప్రోత్సహిస్తామని అరుణ్‌జైట్లీ ప్రకటించారు. 'కృత్రిమ మేధస్సు వంటి భవిష్యత్ టెక్నాలజీలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఈ రంగాల్లో పరిశోధనలు నిర్వహించడానికి నీతి ఆయోగ్ జాతీయ కార్యక్రమాన్ని చేపడుతుంది' అని తన బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర ఆర్థికమంత్రి పేర్కొన్నారు. దీంతోబాటుగా రోబోటిక్స్, బిగ్ డేటా, క్వాంటమ్ కమ్యూనికేషన్‌వంటి రంగాలపై పరిశోధనలకు కూడా నిధులు సమకూరుస్తామని జైట్లీ తెలిపారు. సైబర్ సెక్యూరిటీకి సంబంధించి కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ త్వరలో కార్యాచరణ మొదలు పెడుతుందనీ, సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కూడా నెలకొల్పుతుందని ప్రకటించారు.

మెషీన్ లెర్నింగ్...

ఎప్పటికప్పుడు స్పష్టమైన ప్రోగ్రామింగ్ సూచనలు చేయక పోయినా.. కంప్యూటర్ వ్యవస్థ తన పనితీరును మెరుగుపరుచుకునే సామర్థ్యం కల్గి ఉండటం నిజంగా అద్భుతం! అది మెషీన్ లెర్నింగ్‌తో సాధ్యం! డేటా నమూనాలను తనకు తానుగా అర్థం చేసుకునే ప్రక్రియే మెషీన్ లెర్నింగ్! అంతే కాదు భవిష్యత్తులో అమ్మకాలు ఎలా ఉంటాయి? చమురు-సహజ వాయువు అన్వేషణకు సంబంధించిన అంచనాలతో బాటు.. ఆరోగ్య రంగంలో కూడా మెషీన్ లెర్నింగ్ కీలకం కాబోతోంది.

ఇంటెలిజెంట్ ఆటోమేషన్:

కృత్రిమ మేధస్సుతో ప్రతి వ్యాపారంలో విప్లవాత్మక మార్పులు ఇప్పటికే కనిపిస్తున్నాయి. డ్రైవర్‌లెస్ వాహనాలు, అత్యాధునిక రోబోలు హల్‌చల్ చేస్తున్నాయి. కంపెనీల సామర్థ్యం, ఉత్పత్తుల్లో నాణ్యత పెరగడానికి రోబోటిక్ ఆటోమేషన్ ఉపయోగపడుతుంది. ఉత్పత్తి రంగంలో మానవ ప్రమేయాన్ని తగ్గిస్తూ..అనేక కంపెనీలు తమ అసెంబ్లీ లైన్, వేర్‌హౌస్, కార్గో ఆపరేషన్లలో రోబోటిక్ టెక్నాలజీని ఉపయోగిస్తున్నాయి. భవిష్యత్ టెక్నాలజీ అంతా కృత్రిమ మేధస్సుతో ముడిపడివుంటుందని భారత ప్రభుత్వం గుర్తించింది. ఆటోమేషన్‌కు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తోడైతే అద్భుతాలు సాధ్యమని నమ్ముతోంది. బడ్జెట్ ప్రసంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ గురించి ఆర్థికమంత్రి ప్రముఖంగా ప్రస్తావించడమే ఇందుకు నిదర్శనం!

బీటెక్ విద్యార్థుల కోసం పీఎంఆర్‌ఎఫ్


ఉన్నత విద్యనభ్యసించాలనుకునే ఇంజనీరింగ్ విద్యార్థులకోసం ప్రధాన్‌మంత్రి రీసెర్చ్ ఫెలో(పీఎంఆర్‌ఎఫ్) పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలనుంచి ప్రతి ఏడాదీ 1000 మంది ఉత్తమ ఇంజనీరింగ్ విద్యార్థులను ఎంపిక చేస్తారు. వారికి ఆకర్షణీయమైన ప్రోత్సాహకమిచ్చి ఐఐటీ, ఐఐఎస్‌సీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో పీహెచ్‌డీ చేసే అవకాశమిస్తారు.

ఏకలవ్య గురుకులాలు

గిరిజనుల విద్యకు కోసం ప్రత్యేకంగా ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలను ప్రారంభించనున్నారు. ఓ ప్రాంతంలో గిరిజనుల జనాభా 50% కంటే ఎక్కువ లేదా కనీసం 20 వేల జనాభా ఉంటే.. ఆ ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేస్తారు కాగా ఈ ఏడాది బడ్జెట్‌లో విద్యారంగానికి రూ.85,010 కోట్లు కేటాయించారు. గతేడాది బడ్జెట్‌లో ఈ కేటాయింపులు రూ.81,869 కోట్లుగా ఉన్నాయి.

లక్ష కోట్ల 'రైజ్'

- నాణ్యమైన విద్య కోసం కొత్త పథకం.. పరిశోధక రంగానికి పెద్ద పీట
- నల్లబోర్డుల స్థానంలో డిజిటల్ బోర్డులు
- టీచర్ల కోసం ఇంటిగ్రేటెడ్ బీఈడీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1:దేశంలోని విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా మోదీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. సర్కారీ స్కూళ్ల పునరుత్తేజానికి రీవైటలైజింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ సిస్టమ్స్ ఇన్ ఎడ్యుకేషన్(ఆర్ఐఎస్ఈ) పథకాన్ని ప్రవేశపెట్టింది. మౌలిక వసతుల కల్పన, సాంకేతికత వినియోగం, ఉపాధ్యాయులకు శిక్షణ వంటి కార్యక్రమాలలో 2022నాటికి లక్ష్యాన్ని చేరుకోవాలని నిర్దేశించుకుంది. దీనికోసం రూ.లక్ష కోట్లు ఖర్చు చేయనున్నారు. ప్రముఖ విద్యాసంస్థల్లోని పరిశోధక విభాగాలను మరింత బలోపేతం చేసేందుకు రైజ్ పథకం తోడ్పడుతుంది. దీనికి నిధుల సమీకరణ సాంకేతికతను వాడుకుంటూ నాణ్యమైన విద్యను అందించడానికి అనేక చర్యలు చేపట్టారు. దేశవ్యాప్తంగా పాఠశాలలను డిజిటైజేషన్ చేస్తారు. దేశంలోని పాఠశాలల్లో నల్లబోర్డులను దశల వారీగా తీసివేసి డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేస్తారు. నాణ్యమైన విద్యను అందించాలంటే ఉపాధ్యాయులలో నైపుణ్యం పెరగాలి. దీనికోసం స్కూళ్లలోనూ, కాలేజీల్లోనూ ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఉపాధ్యాయులకోసం ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సును ప్రారంభించనున్నారు. శిక్షణ పొందని 13 లక్షల మంది టీచర్లకు దీనిద్వారా శిక్షణనిస్తారు. టీచర్లలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచేందుకు దీక్ష వెబ్ పోర్టల్‌ను ఉపయోగించుకోనున్నారు.



జైట్లీ జట్టు!

బృందంలో 'సప్తపది'.. కూర్పులో కొత్త ముఖాలు

ప్రధానమంత్రి మోదీ ఆలోచనలకు అనుగుణంగా ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ చిట్టాపద్దు రూపొందింది. ఇందుకు పకడ్బందీగానే సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని బడ్జెట్‌పై కసరత్తు చేశారు. జైట్లీ బడ్జెట్ టీమ్‌లో ఏడుగురు కీలకపాత్ర పోషించారు. వీరిలో చాలా వరకూ కొత్త ముఖాలే! కేంద్ర ఆర్థికమంత్రిత్వ శాఖలో జైట్లీకి ఇద్దరు సహాయ మంత్రులు ఉన్నారు. ఒకరు తమిళనాడుకు చెందిన పొన్ రాధాకృష్ణన్, రెండో వ్యక్తి యూపీకి చెందిన శివప్రతాప్ శుక్లా. ఈ ఏడాది కొత్తగా చేరిన వ్యక్తుల్లో శుక్లా ఒకరు. ఇక ఆర్థిక నిపుణుల విషయానికి వస్తే.. వారంతా ఆయా రంగాల్లో నిష్ణాతులే!

1 అరవింద్ సుబ్రమణియన్, ముఖ్య ఆర్థిక సలహాదారు

ప్రధాని ఆర్థిక కోటరీలో కీ రోల్ పోషిస్తున్న వ్యక్తి. ఐఐఎం అహ్మదాబాద్, ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్ వర్సిటీలు, అంతర్జాతీయ సంస్థల్లో తరగతులు చెబుతుంటారు. పేదలకు ప్రభుత్వం రాయితీలు అందిస్తున్నా.. అది అందరికీ అందడం లేదని, దీనికి ఇంకో విధానం కావాలని పరితపిస్తుంటారు.

2 హస్‌ముఖ్ అధియా, ఆర్థిక శాఖ కార్యదర్శి

1981 బ్యాచ్‌కు చెందిన గుజరాత్ కేడర్ ఐఏఎస్ అధికారి. గత ఏడాది అక్టోబరులోనే ఆర్థికశాఖ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు కామర్స్‌లో మాస్టర్స్ డిగ్రీ, పబ్లిక్ పాలసీలో డిప్లమో చేశారు. ఆర్థిక విషయాల్లో ప్రధానికి కుడి భుజంగా పేరుంది.

3 రాజీవ్ కుమార్, నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు

ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఎకనామిక్స్‌లో డాక్టరేట్ చేశారు. పథకాల రూపకల్పనలో కీలక వ్యక్తి. ఫిక్కీకి కార్యదర్శిగా, సీఐఐకి ముఖ్య ఆర్థిక సలహాదారుగా పనిచేశారు.

4 నీరజ్‌గుప్త, పెట్టుబడుల ఉపసంహరణశాఖ కార్యదర్శి

ఉత్తరప్రదేశ్ కేడర్‌కు చెందిన 1984 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. 2017-18లో కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ విషయంలో లక్ష్యాన్ని అందుకున్న వ్యక్తి. ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్రం ఆయనకు ఇచ్చిన పెట్టుబడుల ఉపసంహరణల లక్ష్యం రూ.80 వేల కోట్లు.

5 రాజీవ్‌కుమార్, ఆర్థిక సేవల కార్యదర్శి

జార్ఖండ్ కేడర్‌కు చెందిన 1984 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ప్రభుత్వ అధికారుల పనితీరు ఎలా ఉందో ఆన్‌లైన్‌లో పెట్టి మోదీ అనుకున్నట్లుగా పారదర్శక తీసుకొచ్చే పనిలో 2017 ఆగస్టు నుంచీ ఉన్నారు. బ్యాంకులకు ఉద్దీపన ప్యాకేజీలు ప్రకటించడంలో సూచనలు చేస్తున్నారు.

6 అజయ్ నారాయణ్ ఝా, వ్యయ విభాగం కార్యదర్శి

మణిపూర్ కేడర్‌కు చెందిన 1982 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. 2017 అక్టోబరు నుంచి ఆర్థిక శాఖలో వ్యయ విభాగం కార్యదర్శిగా ఉన్నారు. ప్రభుత్వ ఖర్చులు తగ్గించే పనిలో ఈయనది కీలక పాత్ర.

7 సుభాశ్ చంద్రగార్గ్, ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి

రాజస్థాన్ కేడర్‌కు చెందిన 1983 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. వరల్డ్ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్నారు. వివిధ అంశాలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసి విమర్శలు మూటగట్టుకున్నారు. 2017 జూన్ నుంచి ఆర్థిక వ్యవహారాల కార్యదర్శిగా ఉంటున్నారు.


కొత్తగా వచ్చేవి

12000	వ్యాగన్లు
5160	కోచ్‌లు
700	లోకోమోటివ్‌లు
600	మేజర్ రైల్వే స్టేషన్లలో మరిన్ని సౌకర్యాలు
4267	కాపలా లేని రైల్వే క్రాసింగ్‌లు రెండేళ్లలో తొలగింపు
3600	కి.మీ. మేర రైల్వే ట్రాక్ పునరుద్ధరణ

ఆధునిక రైలు

బడ్జెట్‌లో రూ.1.48 లక్షల కోట్లు.. రైల్వేల సామర్థ్యం పెంపే లక్ష్యం

- ప్రయాణికుల రద్దీ 25 వేలుంటే ఎస్కలేటర్లు
- అన్ని స్టేషన్లు, రైళ్లలో వైఫై, సీసీ కెమెరాలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: రైలు ప్రయాణం ఇకపై మరింత సౌకర్యవంతంగా మారనుంది. రైల్వే స్టేషన్‌లో అవతలి ప్లాట్‌ఫారంపై ఉన్న రైలును అందుకునేందుకు మెట్లు ఎక్కి హడావిడిగా పరుగులు తీసే బాధ లేకుండా ఎస్కలేటర్లు అందుబాటులోకి రానున్నాయి. దేశవ్యాప్తంగా 25 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే అన్ని రైల్వే స్టేషన్లలోనూ ఎస్కలేటర్లను ఏర్పాటు చేయాలని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ నిర్ణయించారు. రైల్వేలను ఆధునికీకరించడం.. ప్రయాణికుల భద్రత లక్ష్యంగా ఈసారి రైల్వేకు బడ్జెట్ కేటాయింపులు చేశారు. 2018-19 బడ్జెట్‌లో రైల్వే శాఖకు రూ.1.48 లక్షల కోట్లు కేటాయించారు. గత ఏడాది చేసిన రూ.1.31 లక్షల కోట్ల కేటాయింపుల కన్నా ఇది 13 శాతం అధికం. భారతీయ రైల్వేల సామర్థ్యాన్ని పెంచడానికి బడ్జెట్ కేటాయింపుల్లో అధిక మొత్తాన్ని వెచ్చించనున్నారు. అందులో భాగంగా 18 వేల కిలోమీటర్ల మేర డబ్లింగ్, అవసరమైన చోట మూడు, నాలుగో లైను వేస్తారు. 5 వేల కిలోమీటర్ల మేర గాజ్ కన్వర్షన్ చేస్తారు. దీంతో దేశవ్యాప్తంగా ఉన్న రైల్వే లైన్లు దాదాపు బ్రాడ్ గేజ్‌లోకి మారిపోనున్నాయి. ఈ బడ్జెట్‌లో కొత్తగా ఎలాంటి రైళ్లను ప్రకటించలేదు. అన్ని రైల్వే స్టేషన్లు, ట్రైన్లలో దశలవారీగా వైఫై సౌకర్యాన్ని కల్పించడంతోపాటు ప్రయాణికుల భద్రత కోసం సీసీ టీవీలను ఏర్పాటు చేయనున్నారు. పెరంబూర్ ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీలో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించనున్న రైళ్లను 2018-19 ఆర్థిక సంవత్సరంలోనే పరుగులు తీయించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ గత బడ్జెట్‌లో ప్రారంభించిన రాష్ట్రీయ రైల్ సంరక్ష కోష్‌కు తగిన నిధులు కేటాయించాలని నిర్ణయించారు. రాష్ట్రీయ రైలు సంరక్ష కోష్ ద్వారా రైల్వే ట్రాక్ నిర్వహణపై దృష్టి సారిస్తారు. ఆధునిక టెక్నాలజీని ఉపయోగించుకుని ఫాగ్ సేఫ్, ట్రైన్ ప్రొటెక్షన్ అండ్ వార్నింగ్ సిస్టమ్ వినియోగాన్ని మరింత పెంచాలని నిర్ణయించారు.



గుజరాత్‌కు 2 'గిఫ్ట్'లు

- వడోదరలో ప్రత్యేక రైల్వే యూనివర్సిటీ
- గిఫ్ట్ సిటీలో ఆర్థిక నియంత్రణ సంస్థ

ప్రధాని మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌కు రెండు గుర్తింపులు లభించనున్నాయి. వడోదరలో ప్రత్యేక రైల్వే యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్‌లో ప్రతిపాదించారు. దేశంలో తొలి హైస్పీడ్ ప్రాజెక్టు అయిన ముంబై - అహ్మదాబాద్ బుల్లెట్ రైలు ప్రాజెక్టుకు 2017 సెప్టెంబరు 14న శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన మానవ వనరులను వడోదర యూనివర్సిటీ నుంచి సమకూరుస్తారు. అలాగే.. అంతర్జాతీయ ఆర్థిక సేవా సంస్థ(ఐఎఫ్ఎస్‌సీ)కు ఏకీకృత ఆర్థిక నియంత్రణ సంస్థను గుజరాత్‌లోని గిఫ్ట్(గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్) సిటీలో ఏర్పాటు చేస్తామని ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. దీంతో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ, టెక్నాలజీ, నిపుణులు ఒకే వేదికపైకి వస్తారు.

మేకిన్ ఇండియా రైలు.. ట్రైన్-2018




జైట్లీ బడ్జెట్‌లో ప్రస్తావించిన ట్రైన్-2018, ట్రైన్-2020లో ఎలాంటి సౌకర్యాలు ఉంటాయన్న దానిపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. ఈ రైళ్ల ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఉంటాయి. గంటకు 160 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లేలా వీటిని నిర్మిస్తున్నారు. స్వయంచోదక సెమీ హైస్పీడ్ రైలుగా ఇది రూపొందుతోంది. ఈ రైలులో 16 పూర్తిస్థాయి ఏసీ కోచ్‌లు ఉంటాయి. వాటిలో ప్రయాణికులకు అత్యాధునిక సౌకర్యాలు ఉంటాయి. వీటిని ఇంటర్ సిటీ సూపర్ ఫాస్ట్ రైళ్లుగా నడపాలని భావిస్తున్నారు. ట్రైన్-2018ని ఈ ఏడాదిలోనే అందుబాటులోకి తీసుకురానుండగా, ట్రైన్-2020ని 2020 సంవత్సరంలో అందుబాటులోకి తీసుకురానున్నారు.

అయినవారికి ఆకుల్లో..!



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: అయినవారికి ఆకుల్లో.. కాని వారికి కంచాల్లో అన్నట్లు.. భవిష్యత్ రాజకీయాలను దృష్టిలో పెట్టుకున్న కేంద్ర ప్రభుత్వం.. ఆ మేరకు పలు నగరాలకు బడ్జెట్ కేటాయింపులు చేసింది. ఢిల్లీ నగరానికి కేంద్ర పన్నుల వాటా మొత్తం పెంచాలంటూ పదేపదే కోరుతున్న ఆప్ సర్కారుకు జైట్లీ బడ్జెట్ మొండి చేయి చూపింది. ఈ బడ్జెట్‌లో రూ. 790 కోట్లు కేటాయించింది. అదే సమయంలో.. మహారాష్ట్రలో శివసేన తన జట్టు వీడిన నేపథ్యంలో.. అక్కడ బీజేపీ బలపడేందుకు ముంబై నగరంపై వరాల జల్లులు కురిపించింది. సబర్బన్ రైల్వే వ్యవస్థ విస్తరణకు రూ. 11 వేల కోట్లు కేటాయించింది. అదేవిధంగా నగర రైల్వే నెట్‌వర్క్‌కు రూ. 40వేల కోట్లు కేటాయించనున్నట్లు పేర్కొంది. ఇక కర్ణాటక ఎన్నికల నేపథ్యం బెంగళూరు నగరానికి కలిసివచ్చింది. తాజా బడ్జెట్‌లో ఆ నగరంలో సబర్బన్ రైల్వే ప్రాజెక్టుకు రూ. 17వేల కోట్లు కేటాయించింది.

రాష్ట్రాలకు ఏమిచ్చారు?



జీఎస్టీ వచ్చింది. మరి రాష్ట్రాలకు ఏం ఒరిగింది? కేంద్రం నుంచి వస్తున్న నిధులు, పన్నుల్లో వచ్చే వాటాలో మెరుగుదల ఏమైనా ఉందా? ఒక్కసారి తరచి చూస్తే.. రాష్ట్రాలకు ఇచ్చే వాటా 2017-18 కంటే పెరిగిందన్నది వాస్తవం. 2018-19 బడ్జెట్‌లో రాష్ట్రాలకు రూ.12.69 లక్షల కోట్ల మొత్తం కేటాయించింది. 2017-18 సవరించిన బడ్జెట్ అంచనాతో పోలిస్తే ఇది రూ.1.53 లక్షల కోట్లు అదనం. ఈ పెరుగుదలకు ఏడాది మధ్యలో అమల్లోకి వచ్చిన జీఎస్టీ కూడా కారణమన్నది సుస్పష్టం! ఎందుకంటే రాష్ట్రాలకు కేంద్ర పన్నుల్లో వాటా వరకే చూసినప్పుడు 2018-19కి పెరుగుదల రూ.1.15 లక్షల కోట్లుగా లెక్క తేలింది.

ఆంధ్రజ్యోతి

స్పోర్ట్స్

విజయవాడ • శుక్రవారం 2 ఫిబ్రవరి 2018

5న శ్రీ శాంత్ కేసు విచారణ



న్యూఢిల్లీ: తనపై జీవితకాల నిషేధానికి సంబంధించి క్రికెటర్ శ్రీశాంత్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఈనెల 5న విచారణ జరపనుంది. 2013 స్పాట్‌ఫిక్సింగ్ కుంభకోణంలో శ్రీశాంత్‌పై బీసీసీఐ జీవితకాల నిషేధం విధించిన సంగతి తెలిసిందే. తొలుత ఈ నిషేధాన్ని కొట్టివేసిన కేరళ హైకోర్టు తర్వాత బీసీసీఐ చర్యను సమర్థించింది. దాంతో శ్రీశాంత్ సుప్రీంకోర్టును ఆశ్రయించాడు.

క్రీడా బడ్జెట్ @ రూ. 2196 కోట్లు

● రూ. 258 కోట్లు పెంపు ● సాయ్ నిధులకు కత్తెర




న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌లో ఈసారి క్రీడారంగానికి కేటాయింపులు పెంచారు. గత ఏడాది కంటే రూ.258.2 కోట్లు అదనంగా ఇచ్చారు. ఈ మేరకు పార్లమెంటులో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ గురువారం ప్రవేశపెట్టిన 2018-19 బడ్జెట్‌లో క్రీడాశాఖకు రూ. 2196.36 కోట్లు కేటాయించారు. గత ఏడాది ఇచ్చింది 1938.16 కోట్లే. అయితే భారత క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్)కు కేటాయింపుల్లో రూ. 66.17 కోట్లు కోత విధించడం గమనార్హం. నిరుటి బడ్జెట్‌లో సాయ్‌కి రూ.495.73 కోట్లు ఇవ్వగా..ఈసారి ఆ మొత్తాన్ని 429.56 కోట్లకు తగ్గించారు. కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రాజెక్టు 'ఖేలో ఇండియా'కు ఈ బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఆ ప్రాజెక్టుకు ఏకంగా రూ. 520.09 కోట్లు కేటాయించారు. గత సంవత్సరం బడ్జెట్‌లో 'ఖేలో ఇండియా'కు రూ. 350 కోట్లే ఇచ్చారు. ఈ ఏడాది క్రీడా బడ్జెట్‌లో 'ఖేలో ఇండియా' 23.67 శాతం కేటాయింపులతో సింహభాగం ఆక్రమించింది. వాస్తవంగా..జాతీయ క్రీడా అభివృద్ధి కార్యక్రమంలో 'ఖేలో ఇండియా' ఓ భాగం. ఈ కార్యక్రమానికి ఈ బడ్జెట్‌లో రూ. 1262.79 కోట్లు కేటాయించారు. నిరుటి బడ్జెట్‌లో దీనికి రూ. 1047.19 కోట్లు అందజేశారు. ఇక జమ్మూ కశ్మీర్‌లో క్రీడా సదుపాయాల అభివృద్ధికి కేటాయించే మొత్తాన్ని ఈదఫా గణనీయంగా కుదించారు. గతసారి రూ. 75 కోట్లు ఇస్తే ఈదఫా దానిని రూ.50 కోట్లకు తగ్గించారు. కామన్వెల్త్, ఆసియా క్రీడలకు సన్నద్ధమవుతున్న అథ్లెట్లకు ఎలాంటి సాయాన్నీ ఈ బడ్జెట్‌లో జైట్లీ ప్రత్యేకంగా ప్రకటించలేదు. వివిధ జాతీయ క్రీడా సమాఖ్యల (ఎన్ఎస్ఎఫ్)కు ఇచ్చే బడ్జెట్‌ను రూ. 41.82కోట్ల మేర పెంచారు. నిరుడు ఎన్ఎస్ఎఫ్‌లకు 302.18 కోట్లు కేటాయిస్తే ఈదఫా రూ. 342 కోట్లు ఇచ్చారు. జాతీయ క్రీడా అభివృద్ధి నిధి (ఎన్ఎస్‌డీఎఫ్) బడ్జెట్‌ను గత ఏడాది మాదిరే రూ. రెండు కోట్లుగా ఉంచారు. అలాగే వరల్డ్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ బడ్జెట్ రూ.కోటిలో ఎలాంటి మార్పూ లేదు. క్రీడాకారులకు ఇచ్చే ప్రోత్సాహకాల బడ్జెట్‌ను రూ. 18.13 కోట్లనుంచి రూ. 23 కోట్లకు పెంచారు. క్రీడల్లో మానవ వనరుల అభివృద్ధి విభాగం కేటాయింపుల్లో 50 శాతం కోత పెట్టారు. దానిని రూ. రూ. 10 కోట్లనుంచి రూ.ఐదు కోట్లకు తగ్గించారు.

మేరీకోమ్ గోల్డెన్ పంచ్

● శ్యామ్‌కు రజతం
● ఇండియా ఓపెన్ బాక్సింగ్




శ్యామ్

న్యూఢిల్లీ. ఇండియా ఓపెన్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత స్టార్ ప్లేయర్ ఎమ్‌సీ మేరీకోమ్ పసిడి పంచ్ విసిరింది. గురువారం ముగిసిన మెగా టోర్నీలో మేరీ సహా మహిళా బాక్సర్లు ఐదు బంగారు పతకాలతో మెరిశారు. అయితే, పురుషుల విభాగంలో క్యూబా, ఉజ్బెకిస్థాన్ బాక్సర్ల హవా నడిచింది. మహిళల 48 కిలోల విభాగం తుదిపోరులో మేరీకోమ్ 4-1తో ఫిలిపినో జోసీని చిత్తుగా ఓడించింది. ప్రపంచ మాజీ చాంపియన్ ఎల్ సరితా దేవి మాత్రం రజతంతో సరిపెట్టింది. 60 కిలోల ఫైనల్లో చివరి వరకూ పోరాడిన ఆమె 2-3తో మిరా పెట్కోనన్ (ఫిన్లాండ్) చేతిలో ఓడిపోయింది. ఇక, పురుషుల 91 కిలోల విభాగంలో సంజీత్ స్వర్ణం సాధించాడు. మనీష్ కౌశిక్ రింగ్‌లోకి దిగకుండానే పసిడి గెలిచాడు. 60 కిలోల ఫైనల్లో గాయం కారణంగా ప్రత్యర్థి పోటీ నుంచి తప్పుకోవడంతో అతనికి వాకోవర్ లభించింది. కాగా, తెలుగు బాక్సర్ కాకర్ల శ్యామ్ కుమార్ (49 కి), ఆసియా క్రీడల కాంస్య విజేత సతీష్ కుమార్ (+91)రజతానికి పరిమితమయ్యారు. ఫైనల్లో భారత్‌కే చెందిన అమిత్ 4-1 స్కోరు తేడాతో శ్యామ్‌ను ఓడించి స్వర్ణ పతకం అందుకున్నాడు. ఈ టోర్నీలో స్వర్ణ పతక విజేతకు లక్షా 60 వేలు, రజతానికి 96 వేలు, కాంస్యానికి 32 వేల నగదు లభించింది.

ఇక గ్రిడ్ గాళ్స్ పరేడ్ ఉండదు..!



లండన్: ఫార్ములా వన్ గ్రాండ్ ప్రీ ఆరంభం సందర్భంగా గ్రిడ్ గాళ్స్‌తో పరేడ్‌కు ముగింపు పలికారు. రేస్ ఆరంభానికి ముందు గ్రిడ్‌లో డ్రైవర్లతో నిలబడి, వారి నేమ్ బోర్డ్‌లతో మోడల్స్ పరేడ్ చేసేవారు. ఆధునిక సమాజంలో వస్తున్న మార్పుల నేపథ్యంలో అమ్మాయిలను అంగడి బొమ్మలుగా చూపించడంపై అనేక వర్గాల నుంచి విమర్శలు ఎదురవుతున్నాయి. అందుకే కాలం చెల్లిన ఈ ఐడియాకు ఎఫ్-1 నిర్వాహకులు ఫుల్‌స్టాప్ పెట్టారు. మార్చి 25తో ఆరంభమయ్యే కొత్త సీజన్ నుంచి అన్ని రేస్‌లకూ ఇదే పద్ధతిని పాటించనున్నారు.

డర్బన్‌లో దంచేశారు

శతక్కొట్టిన విరాట్



ఇప్పటిదాకా డర్బన్‌లో ఆడిన ఏడు వన్డేల్లో ఒక్కటీ నెగ్గని భారత జట్టు ఎట్టకేలకు గర్జించింది. కింగ్స్‌మీడ్ మైదానంలో 270 పరుగుల లక్ష్యమా..? కష్టమే అన్న విశ్లేషకుల అంచనాలను టీమిండియా పటాపంచలు చేసింది. అటు విరాట్ కోహ్లీ (112), ఇటు అజింక్యా రహానె (79) తమ బ్యాట్లను యథేచ్ఛగా ఝుళిపించడంతో పరుగుల వరద పారింది. ఈ స్టేడియంలో ఇదే అత్యధిక లక్ష్యఛేదన కావడం విశేషం. అంతకుముందు పేసర్లకు అనుకూలిస్తుందనుకున్న ఈ పిచ్‌పై అనూహ్యంగా భారత స్పిన్నర్లు కుల్దీప్, చాహల్ రాజ్యమేలారు. అయితే 134 పరుగులకే ఐదు వికెట్లు పడినా కెప్టెన్ డుప్లెసిస్ ఒంటరి పోరాటంతో శతకం బాది దక్షిణాఫ్రికాకు గౌరవప్రదమైన స్కోరు అందించాడు. ఈ విజయంతో ఆరు వన్డేల సిరీస్‌లో భారత్ 1-0తో ముందంజ వేసింది.

33
వన్డేల్లో కోహ్లీ సెంచరీల సంఖ్య

ఛేజింగ్‌లో విరాట్ శతకాలు
20

విరాట్ కోహ్లీ	
బంతులు	119
ఫోర్లు	10
పరుగులు	112

● రాణించిన రహానె ● భారత్‌దే తొలి వన్డే
● అదరగొట్టిన బౌలర్లు ● డుప్లెసిస్ సెంచరీ వృథా


రహానె (79)


డుప్లెసిస్ (120)


చాహల్ కుల్దీప్

డర్బన్: సొంత గడ్డపై వరుసగా 17 మ్యాచ్‌లు నెగ్గిన జోష్‌లో ఉన్న దక్షిణాఫ్రికాకు టీమిండియా దిమ్మతిరిగే షాక్ ఇచ్చింది. అలాగే ఇక్కడి కింగ్స్‌మీడ్ మైదానంలో తమ చెత్త రికార్డును సవరించుకుంటూ తొలి విజయాన్ని అందుకుంది. విరాట్ కోహ్లీ (119 బంతుల్లో 10 ఫోర్లతో 112) శతకానికి తోడు రహానె (86 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 79) క్లాస్ ఇన్నింగ్స్ జత కలవడంతో గురువారం జరిగిన తొలి మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో భారత్ నెగ్గింది. దీంతో ఆరు వన్డేల సిరీస్‌లో 1-0తో ఆధిక్యం అందుకుంది. రెండో వన్డే 4న జరుగుతుంది. టాస్ నెగ్గి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 8 వికెట్లకు 269 పరుగులు చేసింది. డుప్లెసిస్ (112 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్సర్లతో 120) శతకం సాధించగా మోరిస్ (43 బంతుల్లో 4 ఫోర్లు, ఓ సిక్స్‌తో 37), డికాక్ (49 బంతుల్లో 4 ఫోర్లతో 34) రాణించారు. కుల్దీప్ యాదవ్‌కు మూడు, చాహల్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత బరిలోకి దిగిన భారత్ 45.3 ఓవర్లలో 4 వికెట్లకు 270 పరుగులు చేసింది. ధవన్ (35), రోహిత్ (20) ఫర్వాలేదనిపించారు. శతక వీరుడు విరాట్ కోహ్లీకి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

కోహ్లీ, రహానె జోరు..

లక్ష్యం కోసం బరిలోకి దిగిన భారత్ తమ ఇన్నింగ్స్‌ను ధాటిగానే ఆరంభించింది. మూడో ఓవర్‌లో రోహిత్ సిక్స్ బాదగా ఆ తర్వాత ఓవర్‌లో ఓపెనర్లు చెరో ఫోర్ సాధించారు. అయితే ఏడో ఓవర్‌లో రోహిత్ నిర్లక్ష్యపు షాట్‌తో గల్లీలో క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ధవన్, కోహ్లీ అడపాదడపా బౌండరీలు బాదుతూ కుదురుకుంటున్న దశలో మరో షాక్ తగిలింది. 13వ ఓవర్‌లో ధవన్ ప్యాడ్‌కు తగిలిన బంతి పక్కనే ఉన్న మార్క్రమ్ దగ్గరకు వెళ్లగా నాన్ స్ట్రయికర్‌లో ఉన్న కోహ్లీ పరుగు కోసం ప్రయత్నించి హాఫ్ క్రీజు దాటాడు. దీంతో లేని పరుగు కోసం ధవన్ కూడా పరిగెత్తాల్సి వచ్చి సులువుగా రనౌట్ అయ్యాడు. వన్డేల్లో ఇప్పటిదాకా అతడు రనౌట్ అయిన రెండుసార్లూ అవతలివైపు కోహ్లీనే ఉండడం గమనార్హం. అయితే కోహ్లీ, రహానె స్ట్రయికింగ్‌ను రొటేట్ చేసుకుంటూ ప్రత్యర్థి బౌలర్లపై ఆధిపత్యం చూపారు. చెత్త బంతులను బౌండరీలకు తరలించడంతో పాటు ఎక్కువగా సింగిల్స్ తీస్తూ రన్‌రేట్ పడకుండా చూశారు. 32వ ఓవర్‌లో భారీ సిక్స్ బాదిన రహానె 59 బంతుల్లో అర్ధ సెంచరీ చేశాడు. 39వ ఓవర్‌లో తను సిక్స్, ఫోర్‌తో విరుచుకుపడ్డాడు. ఇక ఆఖర్లో చెలరేగిన కోహ్లీ 105 బంతుల్లో వన్డేల్లో 33వ సెంచరీ సాధించగా ఛేదనలో ఇది 20వది. 43వ ఓవర్‌లో రహానె వెనుదిరగ్గా మూడో వికెట్‌కు 189 పరుగులు జత చేరాయి. 45వ ఓవర్‌లో కోహ్లీ కూడా అవుటైనా అప్పటికే జట్టు విజయం ఖాయమైంది.

డుప్లెసిస్ ఒంటరి పోరు..

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ అంతా భారత బౌలర్లకు కెప్టెన్ డుప్లెసిస్ మధ్య సాగింది. వరుస విరామాల్లో ఇతర ఆటగాళ్లు పెవిలియన్‌కు చేరుతున్నా తను అద్భుత పోరాటాన్ని కనబర్చాడు. ఎనిమిదో ఓవర్‌లో క్రీజులోకి వచ్చిన తను జట్టు ఇన్నింగ్స్ భుజాన వేసుకుని ఆఖరి ఓవర్‌లో వెనుదిరిగాడు. ఎనిమిదో ఓవర్‌లో ఆమ్లా (16)ను బుమ్రా ఎల్బీ చేయడంతో జట్టు తొలి వికెట్ పడింది. అంతకు ముందు ఏడో ఓవర్ రెండో బంతికి ఆమ్లా ఆడిన షాట్‌ను బౌండరీ లైన్ దగ్గర అడ్డుకునేందుకు కోహ్లీ డైవ్ చేసి గాయపడ్డాడు. ఆ ఓవర్ తర్వాత పెవిలియన్‌కు వెళ్లి చికిత్స తీసుకుని ఆమ్లా అవుట్ కాగానే మైదానంలోకి వచ్చాడు. మరోవైపు డుప్లెసిస్ మాత్రం దూకుడు ప్రదర్శించాడు. భువీ వేసిన తొమ్మిదో ఓవర్‌లో వరుసగా మూడు ఫోర్లు బాదాడు. అలాగే పాండ్యా వేసిన 14వ ఓవర్‌లోనూ మూడు ఫోర్లతో స్కోరును పెంచాడు.

తిప్పేశారు..

అయితే లెగ్ స్పిన్నర్లు చాహల్, కుల్దీప్ రాకతో సఫారీల వికెట్ల పతనం ప్రారంభమైంది. స్వల్ప వ్యవధిలోనే చాహల్.. డికాక్, మార్క్రమ్ (9)ను పెవిలియన్‌కు చేర్చాడు. ఆ తర్వాత చెలరేగిన కుల్దీప్ వరుస ఓవర్లలో డుమిని (12), మిల్లర్ (7)లను అవుట్ చేయడంతో 134 పరుగులకు ఐదు వికెట్లు కోల్పోయింది. అయితే ఈదశలో డుప్లెసిస్‌కు మోరిస్ అండగా నిలిచాడు. వీరిద్దరు నెమ్మదిగా ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టారు. ఈక్రమంలో 54 బంతుల్లో డుప్లెసిస్ అర్ధసెంచరీ పూర్తి చేశాడు. 41వ ఓవర్‌లో సిక్స్‌తో జోరు చూపించిన మోరిస్‌ను కుల్దీప్ చక్కటి బంతితో బౌల్డ్ చేశాడు. దీంతో ఆరో వికెట్‌కు 74 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆఖర్లో విజృంభించిన డుప్లెసిస్ 101 బంతుల్లో శతకం పూర్తి చేసుకున్నాడు. 48వ ఓవర్‌లో డుప్లెసిస్ క్యాచ్‌ను రహానె పట్టేందుకు ప్రయత్నించలేదు. ఆ తర్వాత రెండు సిక్సర్లతో స్కోరును పరిగెత్తించి ఆఖరి ఓవర్ తొలి బంతికి అతను అవుటయ్యాడు. ఏడో వికెట్‌కు ఫెలుక్వాయో (27 నాటౌట్)తో కలిసి డుప్లెసిస్ 54 పరుగులు జోడించాడు.

స్కోరుబోర్డు

దక్షిణాఫ్రికా: డికాక్ (ఎల్బీ) చాహల్ 34, ఆమ్లా (ఎల్బీ) బుమ్రా 16, డుప్లెసిస్ (సి) పాండ్యా (బి) భువనేశ్వర్ 120, మార్క్రమ్ (సి) పాండ్యా (బి) చాహల్ 9, డుమిని (బి) కుల్దీప్ 12, మిల్లర్ (సి) కోహ్లీ (బి) కుల్దీప్ 7, మోరిస్ (బి) కుల్దీప్ 37, ఫెలుక్వాయో (నాటౌట్) 27, రబాడ (రనౌట్) 1, మోర్కెల్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు 6, మొత్తం: 50 ఓవర్లలో 8 వికెట్లకు 269; వికెట్ల పతనం:** 1-30, 2-83, 3-103, 4-122, 5-134, 6-208, 7-264, 8-268; **బౌలింగ్:** భువనేశ్వర్ 10-1-71-1, బుమ్రా 10-0-56-1, పాండ్యా 7-0-41-0, చాహల్ 10-0-45-2, కుల్దీప్ 10-0-34-3, కేదార్ 3-0-19-0.

భారత్: రోహిత్ (సి) డికాక్ (బి) మోర్కెల్ 20, ధవన్ (రనౌట్) 35, కోహ్లీ (సి) రబాడ (బి) ఫెలుక్వాయో 112, రహానె (సి) ఇమ్రాన్ (బి) ఫెలుక్వాయో 79, పాండ్యా (నాటౌట్) 3, ధోనీ (నాటౌట్) 4, **ఎక్స్‌ట్రాలు: 17, మొత్తం: 45.3 ఓవర్లలో 4 వికెట్లకు 270; వికెట్లపతనం:** 1-33, 2-67, 3-256, 4-262; **బౌలింగ్:** మోర్నీ మోర్కెల్ 7-0-35-1, రబాడ 9.3-0-48-0, మోరిస్ 7-0-52-0, ఇమ్రాన్ తాహిర్ 10-0-51-0, ఫెలుక్వాయో 8-0-42-2, డుమిని 2-0-16-0, మార్క్రమ్ 2-0-20-0.

క్వార్టర్స్‌లో సింధు, సైనా

ఇండియా ఓపెన్ నుంచి శ్రీకాంత్ ఔట్



న్యూఢిల్లీ : ఇండియా ఓపెన్‌లో భారత షట్లర్లు పీవీ సింధు, మాజీ విజేత సైనా నెహ్వాల్, పారుపల్లి కశ్యప్, సమీర్ వర్మ క్వార్టర్‌ఫైనల్‌కు చేరారు. మిక్స్‌డ్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్, అశ్వినీ పొన్నప్ప కూడా చివరి ఎనిమిదిమందిలో ప్రవేశించారు. కాగా, పురుషుల సింగిల్స్‌లో భారత ఫేవరెట్ కిడాంబి శ్రీకాంత్ ప్రీక్వార్టర్స్‌లో కంగుతిన్నాడు. రెండోరౌండ్లో శ్రీకాంత్ 19-21, 17-21తో మలేసియా క్వాలిఫయర్ ఇస్కందర్ జుల్కర్నైన్ చేతిలో చిత్తయ్యాడు. మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ సింధు 21-10, 21-14తో లిండా జెచిరి (బల్గేరియా)ని ఓడించగా.. మరో మ్యాచ్‌లో సైనా 21-12, 21-11 లిన్ జార్స్‌ఫెల్డ్ (డెన్మార్క్)ను చిత్తు చేసింది. ఇక, కశ్యప్ ఎట్టకేలకు ఓ ప్రధాన ఈవెంట్‌లో క్వార్టర్స్‌కు చేరాడు. సహచరుడు శ్రేయాన్స్ జైస్వాల్‌తో జరిగిన హోరాహోరీ పోరులో 21-19, 19-21, 21-12తో కశ్యప్ గెలుపొందాడు. సమీర్ 21-18, 19-21, 21-17తో సుగియార్తో (ఇండోనేసియా)పై నెగ్గాడు. సాత్విక్- అశ్వినీ పొన్నప్ప ద్వయం 21-16, 15-21, 23-21తో మూడోసీడ్ మలేసియా జోడీ తాన్ కియాన్-లాయ్ పీని కంగుతినిపించింది. మిక్స్‌డ్‌లో ప్రణవ్-సిక్కిరెడ్డి జోడీ, పురుషుల డబుల్స్‌లో మను-సుమిత్ జంట క్వార్టర్స్‌లో ప్రవేశించింది.

ప్రత్యర్థి మొహాన నీళ్లు కొట్టాడు!



లండన్: తన వ్యక్తిగత జీవితంపై వ్యాఖ్యలు చేసిన ప్రత్యర్థి ఫిల్ లొగ్రీకో మొహాన నీళ్లుకొట్టాడు బ్రిటీష్ బాక్సర్ అమీర్‌ఖాన్. కెనడా బాక్సర్ ఫిల్-అమీర్‌ఖాన్‌ల నడుమ ఏప్రిల్ 21న లివర్‌పూల్‌లో బౌట్ జరగనున్న సందర్భంగా జరిగిన మీడియా సమావేశంలో..'రింగ్‌లోనే కాదు వెలుపలా అమీర్‌ఖాన్ ఓడిపోతున్నాడు' అని ఫిల్ ఎద్దేవా చేశాడు. అంతే..ఆగ్రహించిన అమీర్‌ఖాన్ టేబుల్‌పై ఉన్న వాటర్ బాటిల్ తీసుకొని ఫిల్ మొహాన నీళ్లు కొట్టాడు.

అథ్లెటిక్స్ విజేతలు బెంగుళూరు, చెన్నై



బెంగళూరు జట్టు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన జాతీయస్థాయి సివిల్ సర్వీస్ ఉద్యోగుల అథ్లెటిక్స్ పోటీలలో మహిళల విభాగంలో బెంగుళూరు, పురుషుల విభాగంలో చెన్నై జట్లు చాంపియన్లుగా నిలిచాయి. మూడు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో నిత్యశ్రీ (బెంగుళూరు), అనురూప్ జాన్ (బెంగుళూరు) ఉత్తమ అథ్లెట్లుగా నిలిచారు.

ధనంజయ అజేయ శతకం

శ్రీలంక 187/1 ● బంగ్లా తొలి ఇన్నింగ్స్ 513

చిట్టగాంగ్: బంగ్లాదేశ్, శ్రీలంక జట్ల మధ్య జరుగుతున్న తొలి టెస్టులో బ్యాట్స్‌మెన్ హవా సాగుతోంది. ధనంజయ డిసిల్వ (104 బ్యాటింగ్) అజేయ శతకం సాధించడంతో రెండో రోజు గురువారం శ్రీలంక తమ తొలి ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టానికి 48 ఓవర్లలో 187 పరుగులు చేసింది. ఓపెనర్ కుశాల్ మెండిస్ (83 బ్యాటింగ్) అర్ధ సెంచరీ సాధించాడు. సున్నాకే తొలి వికెట్ పడినప్పటికీ వీరిద్దరు బంగ్లా బౌలర్లపై పూర్తి ఆధిపత్యం చూపుతూ పరుగులు సాధించారు. అంతకుముందు బంగ్లా తమ తొలి ఇన్నింగ్స్‌లో 513 పరుగుల భారీ స్కోరు చేసింది. మోమినుల్ హక్ (176) త్వరగానే అవుట్ కాగా మహ్మదుల్లా (83 నాటౌట్) రాణించాడు. లక్మల్, హెరాత్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107
Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి
నవ్య 1
కుటుంబ కదంబం
శుక్రవారం • 2 ఫిబ్రవరి 2018

ఇప్పుడు చాలావరకు మల్టీపర్పస్ ఫ్యాషన్ ట్రెండ్ నడుస్తోంది. ఆ ప్యాటర్న్‌లోకే వస్తాయి షార్ట్ కుర్తీలు. వేసుకునే విధానాన్ని బట్టి వీటి రూపు మారిపోతుంది. ఇక్కడ ఫోటోల్లో కనిపిస్తున్న షార్ట్ కుర్తీలనే చూడండి... లెగ్గిన్స్, జీన్స్, స్కర్ట్స్ మీద వేసుకోవచ్చు. లేదా నడుముకు ఒక స్టయిలిష్ బెల్ట్ పెట్టుకుని ఈ షార్ట్ కుర్తీలతో ఇండో వెస్ట్రన్ లుక్‌లోకి మారిపోవచ్చు. ఇక ఆ చాయిస్ మీదే!

సొగసు

షార్ట్ & క్యూట్



ఎంత ఆధునికంగా ఉండాలనుకునే వాళ్లైనా... ప్రకృతిని తోడు పెట్టుకుని వెళ్లాల్సిందే. అందుకు బెస్ట్ ఎగ్జాంపుల్ ఈ కుర్తీ. అక్కడక్కడా పక్షులు, కొన్ని కొమ్మలు, మరి కొన్ని రెమ్మలు చేరి... లేత రంగులో ఉన్న టాప్‌కి క్యూట్ లుక్ తెచ్చాయి.

హాఫ్ వైట్ రంగు మీద గులాబీలు పూస్తే ఈ కుర్తీపై ఉన్న డిజైనంత అందంగా ఉంటుంది. కుర్తీ అంతటా లేత గులాబీ, గోధుమ రంగు గీతలు, ఆకుపచ్చని లతలు, రంగు పూలు చేరి కొత్తందాన్ని తెచ్చాయి.

ఈ డ్రస్ చూడగానే స్కర్ట్‌లా అనిపిస్తుంది. కానీ ఇది కూడా షార్ట్ కుర్తీనే. ఈ కుర్తీ టాప్‌లో మిలటరీ గ్రీన్‌తో, నడుము దగ్గర నుంచి నలుపు రంగుతో డిఫరెంట్‌గా ఉంది.

ఈ డ్రస్ చూశాక చెక్స్ ఫ్యాషన్ పాతదని అనగలరా? ఎవర్‌గ్రీన్ కాంబినేషన్ బ్లాక్ అండ్ వైట్ తోడవ్వడంతో ఫ్రెష్‌లుక్‌తో ఉందీ కుర్తీ. ఈ డ్రస్ వేసుకుంటే సింపుల్, ఎలిగెంట్ లుక్ రావడం ఖాయం.

నీలం రంగుని చూడగానే తాజాదనపు భావన కలుగుతుంది. దానికితోడు ఆ రంగు మీద గులాబీ, లేత ఎరుపు, తెలుపు రంగుల్లో పూబాలలు చేరితే... అది వెరీవెరీ స్పెషల్ అయిపోవడం ఖాయం కదా!.


సౌజన్యం: www.saanvariclothing.com

కౌన్సెలింగ్ కార్నర్

అతనే భర్త అనుకున్నా..!

మేడమ్... నేను ఒక మధ్యతరగతి అమ్మాయిని. కొత్తవాళ్ళతో స్నేహం చేయడం, సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండడం నాకిష్టం. అలాగే ఒకసారి ఒక అబ్బాయికి ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపాను. అతను బాగా మాట్లాడాడు. అతని మాటతీరు తెగ నచ్చేసింది. తర్వాత ఫోన్ చేసి తన ప్రేమ ప్రకటించాడు. నేను కూడా సరే అన్నా. అప్పటి నుంచీ ఇద్దరం గంటల తరబడి చాటింగ్, ఫోన్ కాల్స్ చేసుకునేవాళ్లం. వేరు వేరు ఊళ్ళల్లో ఉండడం వల్ల కలవాలనుకున్నాం. అనుకోని కారణాల వల్ల కలవలేకపోయాం. దాంతో తొందరపడి, అతణ్ణి అపార్థం చేసుకున్నా. నా మాటలకు అతను బాధపడి దూరమయ్యాడు. కానీ నేను మర్చిపోలేక పోయాను. చివరకు ఎలాగో మళ్ళీ కలిశాం. కానీ ఇప్పుడు మాట్లాడడం లేదు. అతణ్ణే భర్తగా భావిస్తున్నాను. పిచ్చిపిచ్చి ఆలోచనలు వస్తున్నాయి. దయచేసి నాకో సలహా ఇవ్వండి.

- మాలిని



ఇంజినీరింగ్ చదివానంటున్నావు కానీ లోకజ్ఞానం అస్సలు ఉన్నట్టు అనిపించడం లేదు. లేకపోతే ఎవరితోనే ఫేసుబుక్ పరిచయం, మొదటే ప్రేమ, సరే అనడం వింతగా లేదూ! కొద్దిగా ఆలోచించు తల్లీ! ఒక డ్రెస్ కొనడానికో, కోర్సులో చేరడానికో ఎంతో ఆలోచిస్తామే! మరి జీవిత భాగస్వామి విషయంలో ఇంత అమాయకంగా ఉంటారా... ఎవరైనా? నీ ప్రేమను తప్పు పట్టడం లేదు. కానీ అది అర్హుల కోసమేనా అన్నది ప్రశ్న. నిజంగానే అంత ధైర్యం, ప్రేమ ఉంటే ఇంట్లో వారికి చెప్పాల్సింది. మళ్ళీ వాళ్ళకు తెలియడం ఇష్టం లేదు. కొన్నాళ్ళు ప్రేమకు బ్రేక్ ఇచ్చి కెరీర్ పైన దృష్టి పెట్టు. అప్పుడు తెలుస్తుంది నీ ప్రేమ ఎంతో! అప్పటికీ ఇలాగే ఉంటే అమ్మానాన్నలకు చెప్పు. వాళ్లే చూసుకుంటారు!

• కె.శోభ, ఫ్యామిలీ కౌన్సెలర్, హార్ట్ టు హార్ట్,
shobhas292@gmail.com

బ్యూటీ కేర్

చర్మ సంరక్షణ కోసం...



మీ చర్మ గుణం ఎలాంటిదైనా తేమను అందించాలి. లేదంటే పెళుసుగా మారుతుంది. చర్మానికి తేమ కోసం...

❖ జిడ్డు చర్మం అయితే చిటికెడు కర్పూరం, టేబుల్ స్పూన్ తేనె కలిపిన మిశ్రమాన్ని చర్మంపైన మృదువుగా రాసి ఐదు నిమిషాల తరువాత కడగండి. దీనివల్ల చర్మం సహజంగా తేమను సంతరించుకుంటుంది. రక్త ప్రసరణ పెరుగుతుంది.

❖ పొడి చర్మం అయితే టేబుల్ స్పూన్ తేనెలో కొంచెం బాదం నూనెను కలిపి రాస్తే మంచి ఫలితం ఉంటుంది.

ట్రెండ్

అక్షరాభ్యాసానికి యాప్‌లు!

చదువంటే మారాం చేసే పిల్లలు ఆటలంటే ఆసక్తి చూపుతారు. కథల రూపంలో పదాలను చెబితే చెవొగ్గి వింటారు. అందుకే చదువుని చిన్న పిల్లల కోసం ఆటల రూపంలోకి మార్చి, కొన్ని యాప్‌లను తయారుచేశారు. వీటి ద్వారా బుజ్జాయిలకు ఇంటిదగ్గరే అక్షరాభ్యాసం చేయొచ్చు.

వర్డ్ బ్ర్యూయరీ యాప్!

వాడుకలో ఉన్న పదాలతో నేర్చుకోవటం ద్వారా కొత్త భాషను సులభంగా ఒంటబట్టించుకోగలం. అలాగే తాజా సంఘటనలతో ముడిపడిన పదాలను మెదడు సులభంగా గుర్తుంచుకుంటుంది. "వర్డ్ బ్ర్యూయరీ యాప్" చేసే పని కూడా ఇదే. ప్రపంచవ్యాప్తంగా ఉండే వార్తాపత్రికల్లోని వార్తలను స్కాన్ చేసి ఆయా పదాల కలయికతో ఏర్పడిన వాక్యాలను చూపుతుంది. ఉచితంగా అందించే సేవలు ఉన్నా అవి పరిమితమే.

ఎబీసీవైఎ


ఐదేళ్ల లోపు పిల్లల కోసం ఈ వెబ్‌సైట్‌ను రూపొందించారు. ఇందులో 300కుపైగా చదువుకు సంబంధించిన ఆటలున్నాయి. ఇవి పూర్తిగా ఉచితం. యాప్ వెర్షన్లు అందుబాటులో ఉన్నాయి.

పీబీఎస్ కిడ్స్

పిల్లలకు చదువంటే బోర్ కొట్టకుండా, విద్యతో పాటు వినోదాన్ని కలిగించేలా ఇందులో ఆటలుంటాయి. అక్షరాలను, సంఖ్యలను జతపరచటం ద్వారా పిల్లలు త్వరగా నేర్చుకుంటారు.

ఆల్ఫాబెట్ ఆంటిక్స్

పిల్లలు అక్షరాలతో ఆడుకోవటాన్ని సాధన చేసేందుకు బ్రిటిష్ కౌన్సిల్ అందుబాటులోకి తెచ్చిన వెబ్‌సైట్ ఇది. ఇందులో ఈజీ, మీడియం, హార్డ్ మూడు స్థాయిలుంటాయి. కోతి బొమ్మ చెప్పిన పదాలను పిల్లలు గుర్తిస్తే కోతి చెట్టుపైకి గెంతుతుంది. తప్పు పదాన్ని ఎంపిక చేస్తే ఒక్కో మెట్టు కిందకు దిగుతుంది.



టిగ్లీ చెఫ్ అడిషన్

సంఖ్యలు, వాటిని కలపటం గురించి ఈ యాప్ వివరిస్తుంది. తొలుత పిల్లలు వాటిని లెక్కించి పాత్రలో వేస్తారు. ఆ అక్షరాలతో చేయితిరిగిన వంటవాడిలా పిల్లలు రకరకాల వంటలు వండుతారు.

ఆ గుణాలు అనర్థం!

నవజీవనవేదం

శ్రీకృష్ణపరమాత్మ 'దైవాసురసంపత్ ద్విభాగయోగం'లో దైవీగుణాల పట్టిక చెప్పాక ఇప్పుడు అసురీ గుణాలు చెబుతున్నాడు. దైవీగుణాలు మనలో ఉండేలా చూసుకోవాలి. అసురీ గుణాలు మనలో ఉండకుండా చూసుకోవాలి.

దంభో దర్పోభిమానశ్చ క్రోధః పారుష్యమేవ చ!
అజ్ఞానంచాభిజాతస్య పార్థ సంపదమాసురీమ్!!

అర్జునా! పుట్టిన వాడికి కొన్ని అసుర లక్షణాలు కూడా ఉంటాయి. అవి పరిహరించకపోతే జీవితంలో ఎప్పుడూ ఆనందంగా ఉండలేడు. వాడు దెబ్బతింటాడు అందర్నీ దెబ్బతీస్తాడు. వాడు చెడిపోతాడు, అందరినీ చెడగొడతాడు. వాడు బాధపడతాడు, అందరినీ బాధపెడతాడు. దంభః అంటే దాంబికం. అదే డాంబికం అయింది. తరువాత డాబు అయింది. అంటే ప్రదర్శించడం మీద ఆసక్తి ఎక్కువ. పెళ్లిరోజని, పుట్టిన రోజని లక్షలు ఖర్చు చేస్తున్న వారు ఉన్నారు. అదంతా డాంబికమే. దర్పః అంటే గర్వం. డబ్బుతో ప్రదర్శించేది దంభం, అధికారంతో ప్రదర్శించేది దర్పం. ఇది అసురీ గుణం. ఇవ్వాళ కుటుంబాలకు దంభం, రాజకీయాలకు దర్పం ప్రధాన శత్రువు అయిపోయింది. అలాగే దురభిమానాలు పెరిగిపోతున్నాయి. అభిమానం ఎప్పుడూ మంచితనాన్ని బట్టి, ధర్మాన్ని బట్టి ఉండాలి. క్రోధం అస్సలు పనికిరాదు. పారుష్యం రెండు రకాలు. వాక్పారుష్యం, దండపారుష్యం. ఉపాధ్యాయులు ఈ విషయం గమనించాలి. పూర్వం పిల్లలు పాఠం అప్పజెప్పకపోతే మాస్టారు చెవి మెలేసేవారు. చెవి తమ్మె చివర జ్ఞాపకశక్తికి సంబంధించిన నాడీ కొన ఉంటుంది. మెలేయడం వల్ల అది ఉత్తేజితమై పాఠం గుర్తుకొచ్చేది. పూర్వం దండనలో కూడా ఔచిత్యం ఉండేది. ఇప్పుడేమో చితక్కొట్టేస్తున్నారు. పిల్లలకు వాతలొచ్చేసి బోలెడు గొడవలవుతున్నాయి. ఒకప్పుడు ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దేవారు. ఇప్పుడు పేపర్లు దిద్దడమే. తీర్చడం లేదు.

యువతరం ప్రధానంగా వ్యామోహానికి లోనై ఎలా చెడిపోతున్నారో, దానికి పరిష్కారం ఏమిటో ధూర్జటి 'శ్రీకాళహస్తీశ్వరశతకం'లో ఇలా చెబుతున్నాడు.

తమ నేత్రద్యుతి దామెచూడ సుఖమై తాదాత్మ్యమున్నూర్పగా
విమలమ్ము ల్కమ లాభముల్జిత లసద్విద్యుల్లతా లాస్యముల్
సుమనోబాణ జయప్రదమ్ములనుచున్
చూచున్ జనంబూనిహా
రిమృగాక్షీ నివహమ్ము కన్నుగవలన్ శ్రీకాళహస్తీశ్వరా!

విద్యాభ్యాసంలో ప్రవేశించగానే ప్రేమలో పడిపోతున్నారు. పల్లెటూళ్లో చదివినప్పుడు ర్యాంకులొస్తాయి. 600 మార్కులకు 550 వస్తాయి. పట్టణంలో కాలేజీలో చేరగానే చెడిపోతారు. దీనికి పరిష్కారం చెబుతున్నాడు ధూర్జటి. ఒక్కసారి కళ్లు మూసుకో ఓ యువకా! నీ కళ్లలో నుంచి వచ్చే కాంతిని నువ్వే చూడు. ఎంత అందంగా ఉంటుందో! ఆ కళ్లు కమల్లాలా ఉన్నాయని నువ్వు ఊహించుకుంటున్నావు అంతే! అడవాళ్ల కళ్లను చూచి, చూచి ఆ మాయలో పడిపోతున్నారు. భార్యాభర్తల మధ్య కూడా ప్రేమ ఉండాలే తప్ప వ్యామోహం ఉండకూడదు. ధనుర్దాసుది కూడా భార్యపట్ల వ్యామోహమే. వ్యామోహం కాకపోతే భార్యను వదిలి వెళ్లే వాడు కాదు కదా!



● డా. గరికిపాటి నరసింహారావు

జీవితాన్ని నేర్పేది పిల్లలే!

పిల్లలు మన జీవితంలోకి రాగానే మనం వారికి అన్నీ నేర్పించాలని తెగ తాపత్రయ పడుతూ ఉంటాము. నిజానికి మనం వారికి నేర్పించేది ఏమైనా ఉందా, లేక మనమే వారి దగ్గర నేర్చుకోవాలా?

ఒక శిశువు తమ జీవితంలోకి ప్రవేశించగానే, చాలామంది, 'ఇక మనం బోధించే సమయం వచ్చింది' అని అనుకుంటారు. ఒక శిశువు మీ జీవితంలోకి ప్రవేశిస్తే, మీరు మరచిపోయిన జీవితాన్ని తిరిగి నేర్చుకునే సమయం వచ్చినట్లు అర్థం. మీరొక చెక్క బొమ్మలాగా అయిపోయారు. అప్పుడు, ఈ బుజ్జి ఆనందాల మూట మీ జీవితంలోకి ప్రవేశించింది. ఇప్పుడు, తెలియకుండానే, మీరు నవ్వటం మొదలుపెట్టారు. పాడటం మొదలు పెట్టారు. సోఫాల క్రింద పాపాయితో బాటు పాకసాగారు. పాపాయి వల్లనే, జీవితం జీవితంలాగా ఉంది. మీ వల్ల కాదు. జీవితం విషయం తీసుకుంటే, మిమ్మల్ని, మీ పాపాయిని పోల్చి చూద్దాం. 24 గంటల్లో, ఎవరు ఎక్కువ ఉల్లాసభరితంగా ఉన్నారు? మీ పాపాయి! అవునా? మరి జీవితం గురించి ఎవరిని సంప్రతించాలి? మీ పాపాయినే కదా! కాబట్టి, అది మీరు జీవితాన్ని నేర్చుకునే సమయం. జీవితాన్ని బోధించే సమయం కాదు.

పిల్లలు ఆనందపు మూటలు

మీరు పిల్లలను పెంచే అవసరం లేదు. వారు తమంత తాము ఆనందపు మూటలు. మీ ప్రభావం మీ పిల్లల మీద పెద్దగా ఉండకుండా చూసుకోండి. ఇక వారు హాయిగా ఉంటారు. మీ పిల్లవాని చుట్టూ ప్రేమాదరణలతో నిండిన వాతావరణాన్ని సృష్టించండి. వారు చక్కగా పెరుగుతారు. ఇది మీ తోటలో ఒక మొక్కను పెంచటం వంటిదే. వాతావరణం సరిగ్గా ఉండేటట్లు మీరు చూసుకుంటే చాలు. మొక్క తన సంపూర్ణ సామర్థ్యంతో పెరుగుతుంది. ప్రతిరోజూ, అదే పనిగా మీరు దాని జోలికి పోతూ ఉంటే కనుక, అది పెరగనే పెరగదు.

కాబట్టి, మీరు మీ పిల్లవాణ్ణి చక్కగా పెంచాలనుకుంటే, మొట్టమొదటి విషయం- మీరు ఆనందంగా ఉండి తీరాలి. ప్రస్తుతం, మీ అంతట మీరు ఎలా ఆనందంగా ఉండాలో మీకు తెలియదు. ఆందోళన, కోపం, భయం, ఆదుర్దా, అసూయ- వీటిపై ప్రతిరోజూ మీ ఇంట్లో ఒక ప్రదర్శన జరుగుతూ ఉంది.


సద్గురువాణి

మీ పిల్లవాని ముందు ఈ విషయాలే ప్రదర్శితమవుతూ ఉన్నాయి. అప్పుడు అతడు అవే నేర్చుకుంటాడు. మీ పిల్లవాణ్ణి చక్కగా పెంచాలనే ఉద్దేశ్యం మీకు నిజంగా ఉంటే, ముందు మీ తీరును మార్చుకోవాలి. పరివర్తన చెందే సామర్థ్యం మీకు లేకపోతే, ఇక మీ పిల్లవాణ్ణి పెంచటం అనే ప్రశ్నకు తావెక్కడుంది?

అలాంటి వాతావరణం కల్పించాలి

పిల్లవాణ్ణి ప్రేమ పూర్వకంగా పెంచటం అంటే అతనికి అడిగినదల్లా ఇవ్వటమే అని చాలా మంది అనుకుంటారు. మీ పిల్లవాణ్ణి కొంచెం విజ్ఞతతో గమనించండి. అతడు అడిగినదల్లా తెచ్చి ఇవ్వటం ఒట్టి మూర్ఖత్వమే! అని అప్పుడు మీకు తెలుస్తుంది. దానికి మీరు 'ప్రేమ' అని పేరు పెట్టారు.

మీరు చేయవలసిందంతా, ఇంట్లో ప్రేమాదరణలతో నిండిన వాతావరణాన్ని కల్పించటమే. అదొక్కటే మీ పని. ఆ ఒక్కటీ ఖచ్చితంగా చూసుకోండి. కోపంగా ఉండటం అంటే ఏమిటో, దీనంగా ఉండటం అంటే ఏమిటో, భంగపడటం అంటే ఏమిటో, మీ పిల్లలు ఎప్పటికీ చూడకూడదు. మీ ఇల్లు ప్రేమానందాలతో నిండి ఉండేలా చూడండి. ఇక వారు అద్భుతంగా పెరుగుతారు. మీ పని అలాంటి వాతావరణాన్ని కల్పించటమే. మీ అనవసరపు సోదినంతా వాళ్ళకు బోధించటం కాదు. మీరు వాళ్ళ జోలికి వెళ్ళకుండా ఉండేలా చూసుకుంటే చాలు. వాళ్ళు చక్కగా ఉంటారు. ఎటువంటి పరిస్థితులలో పడవేసినా, వాళ్ళు ఉల్లాసవంతంగా జీవించగలగాలి. ఆ రకంగా వాళ్ళను పెంచండి. వాళ్ళు పెరగవలసిన తీరు అదే. అవునా, కాదా?



● సద్గురు జగ్గీ వాసుదేవ్

ధర్మపథం

సోమరితనమే శత్రువు



చేయి దాటిపోయిన సంపద ఎప్పుడో ఓసారి తిరిగి రావచ్చు. కానీ, దాటిపోయిన సమయం తిరిగి రావడం అసంభవం, అసాధ్యం. పోయిన రాజ్యం తిరిగి సాధించుకున్న రాజులున్నారు. పోగొట్టుకున్న ధనరాసుల్ని తిరిగి సంపాదించుకున్న వారూ ఉన్నారు. కానీ నిర్లక్ష్యం చేసి పోగొట్టుకున్న కాలాన్ని తిరిగి తెచ్చుకున్నవారు ఒక్కరంటే ఒక్కరు లేరు.

అందుకే కాలం కంటే విలువైనది లేదంటారు. కాలం ఒక ప్రవాహం. ప్రవాహం వెనక్కి రానట్టే కాలం కూడా రాదు. అది నశించదు. 'కాలం' అంటేనే లయం కానిది, నశించనిది అని అర్థం.

బుద్ధుడు కాలానికీ, శ్రద్ధకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చాడు. కాలహరణం చేసే సోమరిపోతుల్ని మందలించాడు. బుద్ధుడు ఇతర జన్మల్ని, పునర్జన్మల్ని నమ్మలేదు. 'ప్రస్తుతం ఉనికిలో ఉన్న ఈ జన్మను వృథా చేసుకోవద్దు' అనే సందేశాన్ని ఎన్నో ప్రబోధాల ద్వారా చెప్పాడు. దీనికి మహాధనుని కథే మంచి ఉదాహరణ.

మహాధనుడు వారణాసిలో పేరుపొందిన పెద్ద వ్యాపారి. ఆయన దేశ విదేశాలు తిరిగి వ్యాపారం సాగించేవాడు. ఒకసారి శ్రావస్తి నగరంలో గొప్ప ఉత్సవాలు జరుగుతున్నాయనే వార్త తెలిసింది. వంద బళ్ళమీద రక రకాల సరుకులు తీసుకొని బయలుదేరి వెళ్ళాడు. దాదాపు శ్రావస్తి సమీపానికి చేరాడు. శ్రావస్తిని ఆనుకొని ప్రవహిస్తున్న నదిని అవి దాటవలసి ఉంది. ఆ నదికి ఒక్కసారిగా వరద నీరు వచ్చిపడింది. వారం రోజుల వరకూ వరద తగ్గలేదు. వరద తగ్గేసరికి ఉత్సవాలు ముగిశాయి. అతనికి అనారోగ్యం పట్టుకుంది.

వెనుతిరిగిపోవడం కంటే ఎన్ని రోజులైనా ఇక్కడే ఉండి సరుకుల్ని అమ్మి, సొమ్ము చేసుకోవాలనే ధ్యాసలో పడిపోయాడు. రోజురోజుకూ ఆరోగ్యం క్షీణించింది. సరుకులు సగం కూడా అమ్ముడుపోకుండానే మరణించాడు.

ఈ విషయం బుద్ధునికి తెలిసింది. తన భిక్షువుల్ని పిలిచాడు. సమయ పాలన పాటించని సోమరి భిక్షువుల్ని మరీ ముఖ్యంగా పిలిపించి, ఇలా చెప్పాడు.

"భిక్షువులారా! చూశారా! మహాధనుడు ఉత్సవం కోసం వచ్చాడు. కానీ అవరోధం ఎదురవడంతో- అనారోగ్యాన్ని లెక్క చేయకుండా, ఇంటికి పోకుండా చాన్నాళ్ళు ఇక్కడే ఉన్నాడు. సరుకంతా అమ్ముకుపోవాలనుకున్నాడు. వెనక్కి పోలేకపోయాడు. మనం కూడా అంతే. మన కర్తవ్యం ఒకటుంది. అదే నిర్వాణం. దాన్ని సాధించడానికి ఎన్నో అవరోధాలుంటాయి. అవరోధాలు ఎప్పుడైనా, ఏ రూపంలోనైనా రావచ్చు. మృత్యువు వెన్నంటి వెంటాడుతూ ఉంటుంది. 'వర్షాకాలంలో అక్కడుంటాను, వేసవిలో ఇక్కడుంటాను' అని ముందే చేసుకున్న నిర్ణయాలు అమలు కావచ్చు, కాకపోవచ్చు. నిద్రలో మునిగి ఉన్న ఊరు వరదపాలైనట్లు- నిర్లిప్తత వల్ల మనం గమ్యాన్ని చేరుకోలేం. ఏ క్షణంలోనైనా వచ్చే మృత్యువు నుండి ఎవ్వరూ కాచి, కాపాడలేరు.

ఏతమత్థవసం ఇత్వా
పండితో సీలసంపుతో
నిబ్బాన గమనం మగ్గం
ఖిప్పమేవ విసోధయే!

ఈ విషయం ఎరిగి జాగరూకులై మసలుకొనేవారే ప్రాజ్ఞులు, సచ్చరిత్రులు. వారే ఉత్తమోత్తమమైన నిర్వాణ పథాన్ని చేరుకోగలరు. కాబట్టి నిర్లక్ష్యం, సోమరితనం- రెండూ మార్గ సాధనకు శత్రువులే! మహాధనుని మరణం నుండి మనం నేర్చుకోవాల్సింది ఇదే!" అని చెప్పాడు.

సోమరి భిక్షువులకు జ్ఞానోదయం అయింది. శ్రద్ధతో ధ్యానం చేసి, ప్రాజ్ఞులై అనతికాలంలోనే ఉన్నత స్థితికి చేరారు.

● బొర్రా గోవర్ధన్





ఆంధ్రజ్యోతి

నవ్య నివేదన



దర్శనం

శిలారూపంలో
ప్రహ్లాద వరదుడు

పశ్చిమ గోదావరి జిల్లా ఐ.ఎస్.జగన్నాథపురం...
అంతగా ప్రాచుర్యం లేని ఈ గ్రామం ఈ మధ్య హటాత్తుగా వార్తల్లోకి ఎక్కింది. సినీ ప్రముఖులు కొందరు ఈ గ్రామంలోని ఆలయంలో 'యాగాలు' జరిపించారంటూ కథనాలు వెలువడ్డాయి. ఇంతకీ ఏమిటా ఆలయం? దాని చరిత్ర ఏమిటి? ప్రాశస్త్యం ఎలాంటిది?

ఐ.ఎస్. జగన్నాథపురం గ్రామం పశ్చిమ గోదావరి జిల్లా ద్వారకా తిరుమల మండలంలో ఉంది. అక్కడి సుందరగిరిపై పూజలందుకుంటున్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి స్వయంభువుగా వెలిసినట్టు పెద్దలు చెబుతారు. స్థానికంగా ప్రాచుర్యంలో ఉన్న స్థలపురాణం ప్రకారం-

పూర్వం గౌతమ మహర్షి వంశంలోని వాడైన మతంగ మహర్షి ప్రజల కష్టాలను తీర్చాలన్న అభీష్టంతో ఇక్కడి కొండపై శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కోసం తపస్సు చేశాడు. ఆ తపస్సుకు మెచ్చి ప్రత్యక్షమైన స్వామివారితో ఈ గుట్టపైనే ఉండి ప్రజల బాధలను తీర్చమని మతంగ మహర్షి ప్రార్థించాడు. ఈ రూపంలో ఇక్కడ ఉండడం సాధ్యపడదని, కాబట్టి తన తేజస్సును ఈ శిలలో నిక్షిప్తం చేస్తున్నాననీ, తన రూపాన్ని ఆ శిలలో దర్శించి, భక్తులు తరించవచ్చునీ చెప్పి స్వామి అంతర్ధానమయ్యారు.

కొన్నేళ్ళ కిందట ఆవులు, గొర్రెలు కాస్తున్నవారికి ఈ శిలారూపం దర్శనమిచ్చింది. ఈ విషయాన్ని వారు లక్ష్మీపురం గ్రామానికి చెందిన కొచ్చెర్లకోట లక్ష్మీనరసింహమూర్తికి తెలియజేశారు. ఆయన స్వామివారికి పూజాది కార్యక్రమాలు చేపట్టారు. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి దేవాలయ పునరుద్ధరణకు 1972 మే 30న అప్పటి దేవాదాయ శాఖ మంత్రి శంకుస్థాపన చేసి, నిర్మాణ కార్యక్రమం చేపట్టారు. 1995లో హైదరాబాద్ సుదర్శన సిద్ధి పీఠానికి చెందిన వి.వి.శ్రీధర్ గురూజీ ఛాయా అథర్వణ వేద పద్ధతిలో తాంత్రిక ప్రయోగ యుక్తాన్ని నిర్వర్తించారు. ఏకాక్షర గణపతి, మహాలక్ష్మి, పంచముఖ ఆంజనేయస్వామి, సర్ప, వేంకటేశ్వర విగ్రహ ప్రతిష్ఠ, గోపుర పంచ కలశ స్థాపన జరిపించారు. 2006లో ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానం ఈ ఆలయాన్ని దత్తత తీసుకుంది. అప్పటి నుండి దేవాలయంలో నిత్య పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు.

యాగాల్లో సినీ ప్రముఖులు

మతంగ మహర్షికి స్వామివారు ప్రత్యక్షమైన రోజు మాఘ శుద్ధ ఏకాదశి (భీష్మ ఏకాదశి) ప్రతి సంవత్సరం ఆ రోజున స్వామివారి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామనీ, మాఘ శుద్ధ పౌర్ణమి వరకూ కల్యాణోత్సవాలు జరుపుతున్నామనీ ఆలయ ప్రధాన అర్చకుడు కోడూరి శివకుమార్ శర్మ తెలిపారు. ప్రతియేటా మహా శివరాత్రి ముందు రోజున లక్ష్మీ గణపతి హోమం, మహా శివరాత్రినాడు లక్ష్మీ సుదర్శన యాగం నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఇంతకుముందు ఈ యాగాల్లో ప్రముఖ నటులు పవన్‌కళ్యాణ్, సునీల్, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, నిర్మాత రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారని చెప్పారు. సినీ ప్రముఖులతోపాటు ప్రజాప్రతినిధులు కూడా యాగాలు చేయించుకుంటూ ఉంటారని ఆలయ వర్గాలు వెల్లడించాయి.

● లక్ష్మణ్ సింగ్, ద్వారకా తిరుమల

ఎలా వెళ్ళాలి?

ద్వారకాతిరుమల పుణ్య క్షేత్రానికి 18 కిలోమీటర్లు, జంగారెడ్డిగూడెం నుంచి 14 కిలోమీటర్లు, కొయ్యలగూడెం నుండి 21 కిలోమీటర్ల దూరంలో ఐ.ఎస్.జగన్నాథపురం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి దేవాలయం ఉంది. ఆయా ప్రాంతాలనుంచి బస్సు సౌకర్యం ఉంది. రైళ్ళలో విజయవాడ మీదుగా వచ్చేవారు ఏలూరు (సుమారు 55 కిలోమీటర్లు), విశాఖపట్నం నుంచి వచ్చేవారు రాజమండ్రి (సుమారు 57 కిలోమీటర్లు) స్టేషన్లలో దిగి రోడ్డు మార్గంలో చేరుకోవచ్చు.

దర్శన సమయాలు: ఉదయం 7 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 3 నుండి రాత్రి 7 గంటల వరకు

పూజా వివరాలు: ప్రతీ ఏకాదశి నాడు ప్రత్యేక పూజలతోపాటు అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయి. కార్తీకమాసం నెల రోజులపాటు భక్తుల సహాయంతో అన్నదానం నిర్వహిస్తారు.



ప్రదక్షిణలతో కోర్కెలు ఫలిస్తాయి

శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారిని దర్శించుకుని 11 ప్రదక్షిణలు చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తులు విశ్వసిస్తారు. కోరికలు తీరిన అనంతరం స్వామివారికి పాల పొంగలి ప్రసాదం నైవేద్యంగా సమర్పిస్తారు.

- కోడూరి ఈశ్వరకుమార్ శర్మ, ప్రధాన అర్చకుడు



అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం

లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం. ఆలయం ముందు భాగాన ప్రదక్షిణ మండపం నిర్మాణ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

- వేండ్ర త్రినాథరావు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి

సంధ్యాదీపాలు

భారతీయ సాంస్కృతిక, ఆధ్యాత్మిక అంశాలను లోతుగా చర్చించిన వ్యాస సంకలనం 'సంధ్యాదీపాలు'. వివిధ పత్రికల్లో ప్రచురితమైన తన వ్యాసాలను నల్లగొండ జిల్లా చండూరుకు చెందిన సాహితీ మేఖల సంస్థ, కర్నూలు జిల్లా జూలేపల్లెకి చెందిన శ్రీ షిరిడీసాయిబాబా ట్రస్ట్‌ల సహకారంతో రచయిత సుబ్రహ్మణ్యశాస్త్రి సంకలనంగా వెలువరించారు. తెలుగుతోపాటు సంస్కృత వ్యాసాలు కూడా ఇందులో చోటు చేసుకున్నాయి. 'మతం అవసరమా? కాదా?', 'పుట్టినరోజు పండుగను ఎలా చేసుకోవాలి?',

వ్యాస పీఠం




'మహాభారతంలో వైజ్ఞానికాంశాలు'లాంటి ఆసక్తికరమైన చర్చనీయాంశాలు, 'ప్రశాంతంగా జీవించడం ఎలా?' లాంటి జీవన వికాసానికి దారిచూపే రచనలు, వివిధ దేవతలపై ఆధ్యాత్మిక వ్యాసాలు, శాస్త్రీయ, వేదాంత, వ్యాకరణ, సాహితీ విమర్శలతో అంశాలతో కూడిన రచనలు ఈ సంపుటిలో చోటు చేసుకున్నాయి. ఎంపిక చేసుకున్న ప్రతి విషయం మీదా మంచి పరిశీలన, అవగాహనతో రచయిత చేసిన విశ్లేషణలు చదువరులను ఆలరిస్తాయి.

సంధ్యాదీపాలు
(భారతీయ సంస్కృతి వ్యాసములు)
డాక్టర్ నిష్ఠల సుబ్రహ్మణ్యశాస్త్రి
పేజీలు: 235, వెల: వంద రూపాయలు
ప్రతులకు: ఫోన్ నెంబర్: 9949849583

శ్రీభగవాన్ అద్భుత లీలలు

ఆధ్యాత్మికంగా ఉన్నతులైన వారికి కొన్ని సిద్ధులు కలగడం, వారి సమక్షంలో కొన్ని అద్భుతకార్యాలు జరగడం మామూలే. శ్రీరమణులు తన భక్తులను పదే పదే హెచ్చరించేవారు. ఇటువంటి శక్తుల కోసం ప్రయత్నించ వద్దనీ, వారి లక్ష్యమెప్పుడూ ఆత్మసాక్షాత్కారం వైపు ఉండాలీ అని. అయినా వారి సమక్షంలో కొన్ని అద్భుతాలు జరిగేవి. వీటిని ఆటోమేటిక్ డివైన్ యాక్షన్స్ అని ఇంగ్లీషులో వర్ణించేవారు. సామాన్యులమైన మనకి ఇవి ఎంతో ఆసక్తిదాయకంగా ఉంటాయి. అందువల్ల రెండు మూడింటిని ఇక్కడ చెప్పుకుందాం.



శ్రీరమణ కథామృతం

ఒక ఉదంతాన్ని శ్రీరమణులే స్వయంగా ఇలా వర్ణించారు.

"ఒక సాయంత్రం పక్షవాతంతో బాధపడుతున్న వానికి చేతుల్లోకి ఎత్తుకుని హాలులోకి తీసుకొచ్చారు. నేను అతనిని మామూలుగానే చూచాను. ఒక అరగంట తరువాత ఆ మనిషి కొద్దిగా కష్టపడుతూ లేచి సాష్టాంగ నమస్కారం చేశాడు. తరువాత నా చేతికొక నోట్‌బుక్‌ని ఇచ్చారు. అందులో అతని జాతకరీత్యా పక్షవాతం వస్తుందనీ, పడిపోయిన కాళ్లూ చేతులూ ఒక మహాత్ముని దర్శనం వల్ల, కృప వల్ల తిరిగి వస్తాయని ఉంది. నాకెంతో కృతజ్ఞత తెల్పి హాలులో నుంచి తనంతట తానే నడిచి వెళ్లిపోయాడు. అందరం ఆశ్చర్యపోయాం. నేను కావాలని అతనికేమి చేయలేదు. జ్ఞానికి సంకల్పం అంటూ ఏమీ ఉండదు"

● పింగళి సూర్యసుందరం

విశ్వాసమే మహాబలం

ఆరాధించడానికి ఆలయమనేదే లేని ఆదిమకాలంలో అబ్రహాము దేవుణ్ణి ఆరాధించిన విధానం అందరికీ ఆదర్శప్రాయమైనది. కల్దీయుల దేశమైన ఊరు అనే ప్రాంతంలో అన్యుల మధ్య నివసిస్తున్న అబ్రహామును దేవుడు తన ప్రతినిధిగా ఎన్నుకున్నాడు. ఆ దేశం వదలి తాను చూపించే దేశానికి వెళ్లమని ఆదేశించాడు. అందుకు అబ్రహాము దేవునికి సంపూర్ణ విధేయత చూపించాడు. ఏ దేశానికి వెళుతున్నాడో కూడా తెలియని పరిస్థితుల్లో ఆయన పూర్తి భారాన్ని దేవునిపైన వేశాడు. ఆయనకు స్వాస్థ్యంగా ఇవ్వడానికి నిశ్చయించిన కనానుకు అంటే ఈనాటి ఇశ్రాయేలు దేశానికి వెళ్లాడు. అందుకు ఎన్నో శ్రమలకోర్చాడు. కానీ దేవుని అత్యధిక దీవెనలకు పాత్రుడై విశ్వాసులకే జనకుడయ్యాడు.

సుదీర్ఘమైన 'విశ్వాసయాత్ర' అనేది తొలి అడుగైన విధేయతతోనే ఆరంభమవుతుంది. తానింతవరకూ ఎరుగని దేవుని ఆజ్ఞను అబ్రహాము అంతగా విశ్వసించడమే విశ్వాసులకు జనకుడిగా దేవుడు ఆయన్ను ఏర్పరిచేందుకు అబ్రహాముకున్న ప్రథమ అర్హత. అతని మనసులో ఎన్ని ప్రశ్నలు, మరెన్నో సంశయాలు ఉన్నా అతని విశ్వాసమే వాటన్నిటికీ జవాబు అయింది. హేతువాదం, తర్కశాస్త్రం, లౌకిక జ్ఞానం వాటిన్నటికీ అతీతమైనది విశ్వాసం!! నెల కూడా నిండని పసిపాప తన తల్లి స్పర్శను ఎలా కనుగొంటుంది? విశ్వాసంతోనే! ప్రపంచంలో మరే శాస్త్రమూ ఆ మర్మాన్ని వివరించేలేదు. ఒకసారి ఒక విమానం భయంకరమైన కుదుపులకు లోనై విపరీతంగా ఊగిపోతుంటే ప్రయాణికులంతా భీతిల్లి ఏడుస్తున్నారు. హాహాకారాలు చేస్తున్నారట. ఆరేళ్ల ఒక పాప మాత్రం నిశ్చితంగా తన కామిక్‌బుక్ చదువుకొంటూంటే పక్కాయన 'నీకు భయమనిపించడం లేదా?' అనడిగాడట. 'నాకేం భయం లేదు. ఈ విమానాన్ని నడుపుతున్నాయన అంటే పైలట్ మా నాన్న! నన్ను సురక్షితంగా ఇంటికి చేర్చుతానన్నాడు' అని ఆ పాప అన్నదట! అదే విశ్వాసం! దేవుని విశ్వాసులు బలపడాలన్నా, ఎదగాలన్నా ఆ దేవుడెవరో అర్థం కావాలి. ఆయన్ను అర్థం చేసుకోవాలన్న ఆకలి అందుకు దోహదపడే విశ్వాసం మనకుండాలి. విశ్వాసంలో ఎదిగే కొద్దీ ఆయన దేవుడిగా కాక, ఏం చేసినా మన మంచికే చేసే పరలోకపు తండ్రిగా అర్థమవుతాడు. దేవుడు పరలోకంలోని మన నాన్నగారుగా అర్థమయ్యే కొద్దీ ఆయన చర్యలు, మాటలు మనకు మరింత స్పష్టమవుతూ ఉంటాయి. అబ్రహాము జీవితంలో అదే జరిగింది. అతని 70 ఏళ్ల జీవితంలో ఆరంభమైన విశ్వాసయాత్ర అడుగడుగునా అద్భుతాలు, అనూహ్యమైన ఆనందాన్నిచ్చే ఘడియలతో సాగింది.

● సుశీల్ సందేశ్



దైవ సందేశం

మీకు తెలుసా?



భారతంలో అష్టాదశ పర్వాలు

పంచమ వేదంగా పేరుపొందిన మహాభారతంలో 18 పర్వాలు (అధ్యాయాలు) ఉన్నాయి.

అవి: 1. ఆది పర్వం 2 సభా పర్వం 3. అరణ్య పర్వం 4. విరాట పర్వం 5. ఉద్యోగ పర్వం 6. భీష్మ పర్వం 7. ద్రోణ పర్వం 8. కర్ణ పర్వం 9. శల్య పర్వం 10. సౌప్తిక పర్వం 11. స్త్రీ పర్వం 12. శాంతి పర్వం 13. అనుశాసనిక పర్వం 14. అశ్వమేధ పర్వం 15. ఆశ్రమవాస పర్వం 16. మౌసల పర్వం 17. మహాప్రస్థానిక పర్వం 18. స్వర్గారోహణ పర్వం



ధర్మ సందేహం

నిద్ర లేవగానే చేతులు రుద్దుకొని, కళ్ళకు అద్దుకోవాలంటారు ఎందుకని?

నిద్ర పోయినపుడు శరీరం దాదాపుగా అచేనవావస్థలో ఉంటుంది. నిద్రలేచినప్పుడు దేహమంతా ఉత్సాహరహితంగా ఉంటుంది. కాబట్టి లేచిన వెంటనే చేతులను రుద్దుకొని కళ్ళకు అద్దుకోవాలని పెద్దలు చెబుతారు. రాపిడి వల్ల చేతులు వెచ్చబడతాయి. ఆ చేతులను కళ్లకు అద్దుకుంటే ఆ వేడి కళ్ళ ద్వారా శరీరం అంతటా వ్యాపిస్తుందనీ, కళ్ళకు కూడా నిద్ర మత్తు వదులుతుందనీ చెబుతారు. ఇది కేవలం నమ్మకమే కాదు, దీనిలో శాస్త్రీయత కూడా కొంత కనిపిస్తుంది.

దానం దైవ ప్రసన్నత కోసమే!



సందేశం

"ప్రతి ముస్లిం సదఖా (దానం చెయ్యడం) తప్పనిసరి" అని మహా ప్రవక్త ఒకసారి చెప్పారు. "ఒకవేళ అతనికి స్థోమత లేనట్టయితే ఏం చెయ్యాలి"? అని ప్రియ సహచరులు ప్రశ్నించగా, "అతను కూలి పని చెయ్యాలి. తద్వారా వచ్చిన వేతనంతో అతను తినాలి, అవసరార్థులకూ తినిపించాలి" అని సమాధానమిచ్చారు.

"ఒకవేళ అతను కూలి పని కూడా చేయగలిగే శక్తి లేనివాడైతే ఎలా?" అని శిష్యులు సందేహపడగా, "అతను దుఃఖితులకూ, అవసరార్థులకూ సేవ చేయాలి. ఒకవేళ అదీ చెయ్యలేకపోతే మంచిని గురించి ప్రబోధించాలి. అదీ చేయలేకుంటే, చెడు పనుల నుంచి తనను తాను కాపాడుకోవాలి. ఇది కూడా సదఖా (దానం)గానే పరిగణన పొందుతుంది" అని ఆయన ఉపదేశించారు.

"ఒక మంచి మాట పలకడం, చెడు నుంచి వారించడం కూడా దానమే. దారి తప్పిన బాటసారికి దారి చూపడం కూడా దానమే. ఒక అంధుడి చెయ్యి పట్టుకొని మార్గదర్శకత్వం వహించడం కూడా దానమే. దారిలో ఉన్న ముల్లును, రాయిని తొలగించడం కూడా దానమే. తన బొక్కెనలోని నీటిని తోటి సోదరుడి కడవలో పోయడం కూడా దానమే" అని మహా ప్రవక్త తెలియజేశారు. (తిర్మిజీ)

"ఎవరికయినా ఏదైనా మేలు చేస్తే దానిని పదేపదే జ్ఞాపకం చేయడం, ఉపకారాన్ని చాటడం ఎంతమాత్రం వాంఛనీయం కాదు. మీ మేలు పొందినవారి నుండి మీరు ధన్యవాదాలను కూడా ఆశించకూడదు. మీ సత్కార్యంలో ప్రదర్శనాభావం కూడా ఉండకూడదు. తత్కారణంగా మీరు చేసిన సత్కార్యం వ్యర్థమయ్యే ప్రమాదం ఉంది"- మహా ప్రవక్త మహమ్మద్‌కు అందిన రెండవ వహీ (దివ్యవాణి)లో ఈ విధంగా తాకీదు చేయడం జరిగింది.

అధికంగా పొందాలన్న ఆశతో ఉపకాపం చేయకు. (అల్‌ముద్దస్సిర్:6)

సర్వసాధారణమైన రీతిలో ముస్లింలకు ఈ విధంగా తాఖీదు ఇవ్వడం జరిగింది.

"విశ్వాసులారా! ప్రజల మెప్పు కోసం ప్రదర్శనా భావంతో తమ సంపదను ఖర్చు పెడుతూ, దైవాన్నీ, అంతిమ దినాన్నీ విశ్వసించని వారి మాదిరిగా మీరు మీ ఉపకారాన్ని చాటుకుంటూ, (గ్రహీతలను) బాధిస్తూ మీ దానధర్మాలను వృథా చేసుకోకండి." (అంతిమ దివ్య ఖుర్‌ఆన్ 2:264)

"ఇలాంటి దానం కన్నా ఒక మామూలు సత్కార్యం మిన్న" అని మహాప్రవక్త చాటి చెప్పారు.

"ఉపకారాన్ని చాటుకుంటూ గ్రహీత మనసును నొప్పించటం కన్నా ఒక మంచి మాట పలకటం, మన్నించటం ఎంతో మిన్న." (అంతిమ దివ్య ఖుర్‌ఆన్ 2:263)

"దైవ ప్రసన్నతను చూరగొనడానికీ, తమ మనసులు నిమ్మళించడానికీ సంపదను ఖర్చుపెట్టేవారి ఉపమానం ఎత్తయిన ప్రదేశంలో ఉన్న తోట వంటిది." (అంతిమ దివ్య ఖుర్‌ఆన్ 2:265)

దాన ధర్మాలు స్థిరచిత్తంతో, దృఢ సంకల్పంతో చేయాలి. కేవలం దైవ ప్రసన్నతను పొందడానికి మాత్రమే చేయాలి. అలాంటి సద్బుద్ధిని ప్రసాదించుగాక!

● మహమ్మద్ వహీదుద్దీన్

డైలీ సుడోకు - 94

	7	2				8		
5			3					6
				1				
	1			6	7	5		
	5	3				6	4	
		9	5	2			8	
				9				
4					8			1
		1				3	5	

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 93 సమాధానం





ఢీ అంటే ఢీ అనే పాత్రల్లో...


మోహన్‌బాబు

హీరోగా పరిచయమై, విలన్ పాత్రలకు మారి ఓ ట్రెండ్ సృష్టించి, మళ్లీ హీరో అయిన నటుడు డాక్టర్ మోహన్‌బాబు అటువంటి వ్యక్తి ఓ సినిమాలో హీరోగా, విలన్‌గా నటించడం ఆసక్తికరమే. ఢీ అంటే ఢీ అనే ఆ పాత్రల్ని 'గాయత్రి' చిత్రంలో ఆయన అద్భుతంగా పోషించినట్లు యూనిట్ వర్గాలు తెలిపాయి. 'ఇటీవల విడుదలైన ట్రైలర్‌కు అద్భుతమైన స్పందన వస్తోంది. పాలిష్డ్ విలన్‌గా నటించిన మోహన్‌బాబు ఇంటెన్స్ లుక్, పవర్‌ఫుల్ డైలాగులు కలిగిన ట్రైలర్‌తో సినిమా మీద అంచనాలు పెరిగాయి. వాటికి తగ్గట్లుగానే సినిమా ఉంటుంది. తండ్రీకూతుళ్ల అనుబంధాన్ని చక్కగా ఆవిష్కరించిన చిత్రమది. సెన్సార్ పూర్తయింది. మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 9న విడుదల చేస్తాం' అని యూనిట్ వర్గాలు తెలిపాయి. విష్ణు, శ్రియ జంటగా నటించిన ఈ చిత్రానికి మదన్ రామిగాని దర్శకత్వం వహించారు.

పరిశ్రమను దోచుకుంటున్నారు

"సినిమా ప్రతిఫలం నిర్మాతలకు దక్కకుండా ఎక్కడి నుంచో వచ్చిన డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లకు దక్కుతుంది. అన్యాయంగా పరిశ్రమను దోచుకుంటున్నారు. ఈస్ట్ ఇండియా కంపెనీలాగా తయారై అధికంగా డబ్బు గుంజుతున్నారని తెలుగు చలనచిత్ర వాణిజ్యమండలి కార్యవర్గం అభిప్రాయపడింది. డిజిటల్ మాధ్యమాలైన 'క్యూబ్', యు.ఎఫ్.ఓ విధివిధానాలపై దక్షిణాదికి చెందిన నాలుగు సినిమా పరిశ్రమలకు సంబంధించిన నిర్మాతల మండలి, చాంబర్ అధ్యక్షులు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లపై తీసుకుంటోన్న ఏకపక్ష నిర్ణయా ల గురించి బుధవారం హైదరాబాద్‌లోని తెలుగు ఫిల్మ్ చాంబర్‌లో సమావేశమయ్యారు. తక్కువ ధరకు సర్వీస్ అందిస్తున్న డిజిటల్ ప్రొవైడర్లను కొందరు అడ్డుకుంటున్నారని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారంలోగా డిజిటల్ ప్రొవైడర్లతో సమావేశం ఏర్పాటు చేసి ధరల తగ్గింపు ఇతరత్ర విషయాలు చర్చించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వారంలోపు సమస్యకు పరిష్కా రం లభించకపోతే.. మార్చి 1 నుంచి ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలోని థియేటర్లు మూసివేసేలా నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పి.కిరణ్, సురేశ్‌బాబు, తమిళ నిర్మాతలసంఘం అధ్యక్షుడు విశాల్, కేరళ ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు కె.విజయ్‌కుమార్, కర్ణాటకచాంబర్ అధ్యక్షుడు ఎన్.ఎం.సురేశ్ పాల్గొన్నారు.



నేనున్నానని..

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన సాయిధరమ్ తేజ్


నరేశ్ యాదవ్‌తో సాయిధరమ్ తేజ్

సినిమాల్లోనే కాదు నిజ జీవితంలోనూ హీరోనని యువ నటుడు సాయి ధరమ్ తేజ్ నిరూపించుకున్నారు. ఓ వికలాంగ క్రీడాకారుడి కష్టాలు తీర్చేందుకు స్వయంగా ముందుకొచ్చారు. బ్యాంకాక్‌లో జరిగే అంతర్జాతీయ సిట్టింగ్ వాలీబాల్ చాంపియన్‌షిప్‌నకు ఎంపికైన సూర్యాపేటకు చెందిన పారా అథ్లెట్ నరేశ్ యాదవ్ ఈ టోర్నీకి వెళ్లేందుకు డబ్బు లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఆంధ్రజ్యోతి ద్వారా తెలుసుకున్నారు. నరేశ్ కష్టాలను తెలుపుతూ 'సాయం చేస్తే సత్తా చాటుతా' అనే శీర్షికతో మంగళవారం హైదరాబాద్ ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాన్ని చూసి సాయి స్పందించారు. వెంటనే నరేష్‌కు సాయం చేసేందుకు ముందుకొచ్చారు. ఆంధ్రజ్యోతి ద్వారా నరేశ్‌ను గురువారం కలిశారు. టోర్నీలో పాల్గొనేందుకు అవసరమైన లక్ష రూపాయల చెక్‌ను అతనికి అందజేశారు. ఈ సందర్భంగా నరేష్ యోగ క్షేమాలు, కుటుంబ నేపథ్యం, భవిష్యత్ లక్ష్యాలను గురించి ఆరాతీశారు. ఓవైపు చదువు కొనసాగిస్తూనే.. వాలీబాల్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ మూడు క్రీడల్లో రాణిస్తున్న అతణ్ణి అభినందించారు. తాను జేఎన్‌టీయూలో ఎంటెక్ బయో ఇన్ఫర్మాటిక్స్ చదువుతున్నానని చెప్పగా.. బయోలజీ అంటే తనకు కూడా ఇష్టమని సాయి అన్నారు. రాష్ట్రంలో, దేశంలో పారా అథ్లెట్ల పరిస్థితి ఎలా ఉన్నదని అడిగి తెలుసుకున్నారు. ఇక, టోక్యో పారాలింపిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించాలని తాను లక్ష్యంగా పెట్టుకున్నట్టు నరేశ్ తెలిపారు. ఇలాగే ముందుకెళ్తూ దేశానికి మంచి పేరు తీసుకురావాలని సూచించిన సాయిధరమ్ తనకు సాధ్యమైన సాయం చేస్తానని హామీ ఇచ్చారు. బ్యాంకాక్ టోర్నీకి వెళ్లొచ్చిన తర్వాత మరోసారి తనను కలవాలని నరేష్‌కు చెప్పారు. మంచి మనసుతో తనకు సాయం చేసిన సాయిధరమ్‌కు నరేష్ కృతజ్ఞతలు తెలిపారు.

వయసు పెరుగుతోందంతే!

- రకుల్‌ప్రీత్ సింగ్

"మీ సక్సెస్ ఫార్ములా ఏంటి' అని ఎన్నో సందర్భాల్లో ఎంతోమంది అడుగుతుంటారు. ఆ మాట వినగానే నాకైతే నవ్వొస్తుంది. నా ఎదుగుదలకు సక్సెస్ మంత్రానో, ఫార్ములానో ఉందని నేననుకోను" అని చెబుతోంది రకుల్‌ప్రీత్ సింగ్. 'స్పైడర్' తర్వాత తెలుగులో మరో సినిమాకు సైన్ చెయ్యని ఈ అమ్మడు తమిళ, హిందీ భాషల్లో మాత్రం బిజీగా ఉంది. సిద్దార్థ్ మల్హోత్ర సరసన ఆమె నటించిన 'అయ్యారీ' చిత్రం ఈ నెల 9న విడుదలకు సిద్ధమవుతోంది. అజయ్ దేవగణ్‌తో ఓ సినిమా, తమిళంలో సూర్య సరసన ఓ సినిమా అంగీకరించింది. రకుల్ మాట్లాడుతూ "పరిశ్రమలో నేను నడుచుకునే తీరు, కష్టపడేతత్వం, అంకిత భావంతో పని చెయ్యడం ఇవే నా సక్సెస్‌కు కారణం. కథానాయికగా ఒక్కో మెట్టు ఎక్కడానికి ఫార్ములా ఏమీ లేదు" అని తెలిపింది. ఐదేళ్ల తర్వాత రకుల్ ఏంటి అన్న ప్రశ్నకు "ఐదేళ్ల తర్వాత నా వయసు పెరుగుతుంది. అంతే కానీ పరిశ్రమను మాత్రం వదలను. నా మనస్తత్వం, చేసే పనిలో ఏ మార్పు ఉండదు. కాకపోతే.. వచ్చే ఐదేళ్లలో అయినా నా డ్రీమ్‌రోల్ దక్కుతుందని ఆశిస్తున్నా" అని రకుల్ సమాధానమిచ్చారు.





నాని మరో స్టెప్ పైకి వెళ్లాలి!

- రాజమౌళి


ఈషా, అనుష్క, నిత్యామీనన్, కీరవాణి, రాజమౌళి, ప్రశాంత్ వర్మ, నాని, కాజల్

"నాని సినిమా అనగానే కచ్చితంగా విజయం సాధిస్తుందనే భావన అందరిలోనూ ఉంది. దీన్ని దాటి అతను మరో మెట్టు పైకి వెళ్లాలని ఆకాంక్షిస్తున్నాను. రెజీనా లుక్ చూడగానే అందులో అందం, ఆకర్షణ, బోల్డ్‌నెస్ ఆకట్టుకున్నాయి. ఈ అమ్మాయి మరే సినిమా చేయదా? అనే అనుమానం కూడా వచ్చింది. ఈ చిత్రంలో నటించిన వారందరినీ గమనిస్తే చాలా ఆసక్తిగా అనిపించింది. ట్రైలర్ చూడగానే సినిమా మీద మరింత ఆసక్తి పెరిగింది. సినిమా సూపర్ హిట్ అవుతుంది" అని ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి అన్నారు. ఆయన ముఖ్య అతిథిగా బుధవారం సాయంత్రం 'అ!' ప్రీ రిలీజ్ వేడుక హైదరాబాద్‌లో జరిగింది. వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై నాని రూపొందిస్తున్న చిత్రమిది. కాజల్, రెజీనా, ఈషా, శ్రీనివాస్ అవసరాల, నిత్యా మీనన్, మురళీశర్మ, ప్రియదర్శి కీలక పాత్రధారులు. ప్రశాంత్ వర్మ దర్శకుడు. ప్రశాంతి త్రిపురనేని నిర్మాత. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎం.ఎం.కీరవాణి మాట్లాడుతూ "వాల్‌పోస్టర్ సినిమా అనే పేరే నాకు బాగా నచ్చింది" అని అన్నారు. ఇందులోని 11 పాత్రలూ సినిమాపై ఆసక్తిని పెంచేవే అని అనుష్క అన్నారు. నాని మాట్లాడుతూ "మనందరిలోనూ ఉన్న తిక్కను సంతృప్తిపరిచే చిత్రమిది. 'అ!'ను నిర్మించడం వల్ల నాకు మన నిర్మాతల మీద గౌరవం మరింతగా పెరిగింది. ప్రశాంత్ కథ చెప్పగానే కొత్తగా అనిపించి నిర్మించాను. ప్రతి పాత్రా ఆసక్తికరంగా ఉంటుంది. నేను సినిమా చేస్తున్నానని తెలియగానే రవితేజగారు ఫోన్ చేసి 'ఏంటబ్బాయ్.. మనిద్దరం కలిసి నిర్మిద్దామా' అని అన్నారు. ఇలాంటి కొత్త ఆలోచనకు వాయిస్ ఓవర్ ఇచ్చి ఆయన ఎంకరేజ్ చేసినందుకు ఆనందంగా ఉంది. దర్శకుడికి ఇది తొలి చిత్రమంటే ఎవరూ నమ్మరు. ఇలాంటి దర్శకుడిని పరిచయం చేస్తున్నందుకు ఆనందిస్తున్నాను" అని అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "నానిగారు నా పనిలో ఎక్కడా ఇన్వాల్వ్ కాలేదు. బెటర్‌మెంట్ కోసం కొన్ని సలహాలిచ్చారు. నిజాయతీతో కూడిన చిత్రమిది. ఈనెల 16న విడుదల చేస్తాం" అని తెలిపారు. నటీనటులతో పాటు 'అ!' సాంకేతిక నిపుణులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


జితిన్ రమేశ్, శ్రుతీయుగల్

మానవ సంబంధాల కోసం...

సూపర్‌గుడ్ ఫిల్మ్స్ ఆర్.బి.చౌదరి తనయుడు జితిన్ రమేశ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'ఒక్కటే లైఫ్'. 'హ్యాండిల్ విత్ కేర్' అన్నది ఉపశీర్షిక. శ్రుతీయుగల్ కథానాయిక. సుమన్ కీలక పాత్రలో కనిపిస్తారు. వెంకటేశ్వర ఫిల్మ్స్ పతాకంపై నారాయణ్‌రామ్ నిర్మించారు. ఎం.వెంకట్ దర్శకుడు. ఆయన మాట్లాడుతూ "టెక్నాలజీ పేరుతో పరుగులెడుతున్న నేటితరం మానవ సంబంధాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్న కథాంశంతో రూపొందించిన చిత్రమిది. ఇందులో ప్రతి పాత్రకు ప్రాముఖ్యం ఉంటుంది" అని తెలిపారు. "చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో సినిమాను విడుదల చేస్తాం" అని నిర్మాత చెప్పారు.

రోజులు... క్షణాలు...లెక్కపెట్టుకుంటున్నా!


దిశా పటానీ

ఈ రోజుతో కలిపి అక్షరాల యాభై ఎనిమిది రోజులు... హిందీ చిత్రం 'బాఘీ-2' ప్రేక్షకుల ముందుకు రావడానికి! ఇందులో జాకీ ష్రాఫ్ హీరో. పూరి జగన్నాథ్ తీసిన 'లోఫర్'లో వరుణ్‌తేజ్‌కి జోడీగా నటించిన దిశా పటానీ హీరోయిన్. బీటౌన్‌లో జాకీ, దిశాలు ప్రేమలో ఉన్నారనే టాక్ ఎప్పట్నుంచో చక్కర్లు కొడుతోంది. అందువల్ల, ఈ చిత్రంలో వీళ్లిద్దరి కెమిస్ట్రీ ఎలా ఉంటుందోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ ఆసక్తికి మార్చి 30తో తెర పడుతుంది. ఆ రోజున చిత్రాన్ని విడుదల చేస్తున్నట్టు సాజిద్ నడియావాలా ప్రకటించారు. వెంటనే "మార్చి 30 ఎప్పుడు వస్తుందా? అని రోజులు, క్షణాలు లెక్కపెట్టుకుంటున్నాను" అని దిశా పటానీ పేర్కొన్నారు. ఇక్కడ క్షణాలు అనడానికి ఒక కారణం ఉంది. తెలుగులో మంచి విజయం సాధించిన 'క్షణం'కి హిందీ రీమేక్ ఈ 'బాఘీ-2'. జాకీ ష్రాఫ్ ఏ చిత్రం చేసినా ఆయన జిమ్నాస్టిక్, కరాటే స్కిల్స్ తెరపై చూపించడానికి వీలుగా యాక్షన్‌తో నింపేస్తారనే పేరుంది. ఈ చిత్రం పోస్టర్లు కూడా అందుకు తగ్గట్టుగా ఉన్నాయి.